

విరోధి సం.
చైత్రము

భారతి

సంపుటము 26
సంచిక 4

హరదత్తుడు శివకాంచికి చేరుట

●

శ్రీ ముదిగొండ నాగవీరయ్యశాస్త్రి

కమలకోమల (హరదత్తుని తల్లి)—

ఏకరసాలనాథుఁడు మహేశుఁడు నీజనకుం డతండు సు
శ్లోకుఁడు సర్వదేవచయశోకహరుండు హరుండు రాక్షసా
స్తోకమహాగ్నిసంశమనతోయదమూర్తి సమస్తలోకర
క్షాకరదివ్యవైభవవిహారుఁ డెఱుంగుము పుత్రకా! యిఁకన్.

అట్టి హరుని కుమారుఁడవౌట నీవు - పరగెదవు హరదత్తుఁడన భాసురాహ్వయంబుచే; నిందు మన ముండుటగును గొంత-కాల మాపయి నెటకేనిఁ గదలవచ్చు.

అనిన బాలుం డిట్లనియె:

ఏడ నుండును మాతండ్రి! యేకచూత-నాథుఁ డెఱుఁగంగఁ జెప్పవే? జననీ! రయముగ
నాదుజాడకు రాఁడే మనాదరంబొ? - నీపయినిఁ గోపమో నాదు పాప మొక్కొ?

అనినంతఁ గమలకోమల యిట్లనియె:

అల శివకాంచికానగరహాటకహర్మ్యమనోజ్ఞగేహమం
దలఘుఁడు దా వసించు నతఁ డందఱియట్టులఁ గాదు పుత్ర! ని

శ్చలహృదయుండు సంతతిలసత్తరసారసశోభిరాముఁ డా
విలసదనూనయోగపదవీపరిభాసితుఁ డిఁక వచ్చునే!

ఘనుఁడు దయామయుం డఖిలకారణకారణమూర్తి లోకపా
వనమహిమాతిశోభితవిభాసితపుణ్యకథాప్రపంచముం
డనుఁ డఖిలాబ్జజాండవితతప్రకరాయతమంగళావహుం
డనఘుఁడు ధన్యవైభవుఁ డనన్యవిరాజితశీలుఁ డారయన్.

సనకసనందనాదిమునిచంద్రములున్ శతపత్రపత్రలో
చనవనజోద్భవాదిసురసత్తములున్ గనఁజాలకుండు రా
యనఘుని దివ్యమంగళమహాద్భుతశోభవిగ్రహంబు నీ
మనుజులు గాంతు రెట్టులు కుమార ? మదిన్ దలపోయు మున్నటిన్.

అనను—

తనను ద్రిశుద్ధిగఁ గొల్చెడు - ఘనభక్తశిఖామణులకుఁ గారుణ్యముతో
ననువుగ దర్శనభాగ్యం-బును జేకూర్పంగఁగలఁడు పుత్రా ! వినుమా !

అనుడుఁ గుమారుండు మరల దల్లి కిట్లనియె:

చూడఁగఁ గోరినాఁడను ద్రిశుద్ధిగ నమ్ముము నమ్మ మమ్మరో !
నేఁ డిదె పోయి చూచెదను నిర్జరమాన్యుని లోకధన్యునిన్
జోడిగ నాత్మకీయజనభూషితసన్నిధి నందె యుండు నీ
వాడకుమా నిషేధవచనావళినిన్ జననీ ! నమస్కృతుల్.

అని హుటాహుటి నడిచి గేహంబు విడిచి - యేమి చెప్పిన మానక యేగుచుండ.
నంత బాలుని గనుచుఁ దదంబ సుతుని - వెంట నేగుచునుండె బల్ వేగిరము
లేగ చనిమెడుజాడల నేగుచున్న - మొదవుపోలికఁ గొమరుఁడు పోవుజాడ
లరసి యాతురయై పోవు నట్టి యాయ - కను గనుంగొని యిట్లనుకొనిరి జను::
కొమరునితో నేడకో పోవుచుండె నీయమ్మ యిదేటి కిట్లనెడువారు
సంతసంబునఁ గాదు చాల యాతురయయి యరుగునట్టుల దోఁచు ననెడువారు
కారణం బేదియో కలిగియుండును మన మరయంగ శక్యమా యనెడువారు
వీరి వారింప నెవ్వారు రా రేలకో ఆత్మీయజనము లంచ నెడువారు
మనము వారింప వీర లీ చనుట దక్క - యాగ నేరరు వృథ యిది యనెడువారు
ఏమి యగుదురొ వీ రిఁక నెటుఁగఁజాల-మంచు నుడివెడువార లై రా యహమున

అంతటఁ గొంత సేపటికి యాయమతల్లియుఁ దండ్రి యన్నలున్
వింతగ నా యుదంతమును వే విని చింత యొనర్చి సుంతఁ దా
మంత మనంబుఁ ద్రిప్పి యెటు లో నటు లో నని యంతకన్నఁ దా
మెంతయుఁ జేయఁగాఁ దగిన దేదియు లే దని యుండి రిమ్ముగన్.

అంత—

చనిచని బాలుఁడు శివకంచినిఁ జేరఁగఁ బోయి యందు శ్రీసహకారే
శనిలయహర్మ్యం బరయుచుఁ - గనియెన్ గన్నులు గలట్టి కలిమి యమరఁగాన్.

కాంచి యాలయమునఁ బ్రవేశించి యంచి - తాదరంబునఁ గక్ష్యాంతరాళిఁ గడచి
యటనటన్ బరివారదేవాళిఁ జూచి - గర్భగేహంబుఁ దఱిసెఁ జొక్కపుబుడుతఁడు

వాని వెంబడి వదలక వచ్చుచున్న - కమలకోమల యార్తమై కంటిచూపు
దప్పనీ కాత్మజాతునిఁ దాను గనుచు - గర్భగేహంబుఁ డాసె నిగరపు బ్రేమ.

అపుడు మధ్యందినపుటర్చ నంతరించు - టను జగత్ప్రభునకు భోగ మొనరఁజేసి
యర్చకులు ద్వారబంధంబు లమరఁగూర్చి - చనిరి స్వాయతనముల కానమయమందు.

వాటముగ బంధితములౌ కవాటములను - గాంచి బాలుఁడు ద్రోయఁగఁ గదలకుండె
నంత నాతండు ముష్టిప్రహారములను - సలుప బంధము లూడెను దలుపులకును.

('హరదత్తవిజయము' నుండి)



ఉణాదిసూత్రకారుడు

శ్రీ తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి

వార్తికకారు డను వరరుచి-కాత్యాయనునే ఉణాదిసూత్రకారు డని క్రీ. శ. ౧౪వ శతాబ్దిలోని విమలసరస్వతి యను వైయాకరణుడు వ్రాసినాడు. తన రూపమాలలో "తాభ్యా మన్యత్రోణాదయః" (౩-౪-౭౫) అను పాణినీయసూత్రవ్యాఖ్యలో నిట్లు వివరించినాడు: "సంప్రదానాపాదానాభ్యా మన్యస్మి న్నర్థే స్యుః. లక్ష్యానుసరణోన్నేయా అనుబన్ధా ఉణాదిషు బహులోక్త్యాత్ర ప్రసాధ్యాని శేషకార్యాంతరాణిచ. ఉణాదిస్ఫుటీకరణాయ వరరుచినా పృథగేవ సూత్రాణి ప్రణీతాని; తద్యథా—కృవాపాజి మిస్వదిసాధ్యశూభ్య ఉణ్". దీనినిబట్టి విమలసరస్వతి మతమున కాత్యాయనవరరుచియే ఉణాదిసూత్రకారు డని స్పష్టము.

డాక్టర్ కున్హన్‌రాజాగారి మతమున పాణినియే ఉణాదిసూత్రకారుడు. (ప్రక్రియాసర్వస్వభూమిక; *Indian Culture, January* ౧౯౩౮, ౩౪౫ పుట చూడవలెను.) కాని, ప్రక్రియాసర్వస్వాంతర్గత-ఉణాదిఖండశేషమున నారాయణభట్టు ఇట్లు చెప్పినాడు:

"నాప్తం ప్రాప దుణాదిశాస్త్ర మియతా
  శబ్దా ననుక్త్వా వలో
ధాతుప్రత్యయరూపతః ప్రవిభజేత్
  కార్యాత్ కిదాదీన్ వదేత్
రూఢాః సాధవ ఏవ తేచ శకటా
  పత్యాదిభి ర్ధాతుజాః
సర్వేఽపి త్యుదితం తతో బహుల మి
  త్యూచే స్వయం పాణినిః".

పాశ్చాత్యపండితులలోగూడ కొందరు పాణినియే ఉణాదిసూత్రకారు డన్నారు. కారణము లేకపోలేదు. ఔణాదికసూత్రములలో బహుస్థానములలో టి, ఘు, ఘ— ఇత్యాది పాణినీయసంజ్ఞలును, కొంతవరకు పాణినీయానుబంధములును గానవచ్చును. ఒకానొక పాణినీయసూత్రమును గ్రహించి కాత్యాయనుడు "ఉణాదిప్రతిషేధ శ్చ" (౭-౨-౪౭) అన్నాడు. పతంజలి వాక్యములగూడ నిట్టివి కలవు: (౨-౩-౫౦; ౪-౪-౧౩; ౭-౨-౪౭; ౭-౩-౫౯) పాణిని ఉణాదిసూత్రకారుడు కానిచో "ఉణాదిప్రతిషేధ శ్చ", "ఉణాదీనాంచ ప్రతిషేధో వక్తవ్యః" ఇత్యాదివాక్యములు ఏ విధముగా సంగతము లగు నని కొందరు కొంద రన్నారు. శిశుపాలవధములో—

"నిపాతితసుహృత్ స్వామి
  పితృవ్యభ్రాతృమాతులమ్
పాణినీయ మివాలోకి
  ధీరై స్తత్ సమరాజిరమ్".

అను (౧౯-౭౫) శ్లోకమున, "నప్తృ నేష్టృ త్వష్టృ హోతృ పోతృ భ్రాతృ జామాతృ మాతృ పితృ దుహితృ" (౨౬౦) అను ఔణాదికసూత్రనిష్పన్న భ్రాతృశబ్దసన్నివేశముద్వారా మాఘకవి పాణినినే ఉణాదిసూత్రకారునిగా గమనించినట్లు తోచును. పై జెప్పిన కారణము లన్నిటివలన కొందరు పాణినియే ఉణాదిసూత్రకారు డన్నారు.

నామమాత్రధాతుజత్వప్రతిపాదన చేయుటకై ఆగ్రహాతిశయమును గాంచి శాకటాయనుడే ఉణాదిసూత్రకారు డని అనేకు లన్నారు. నారాయణభట్టు కూడ నిట్లే లిఖించినాడు.

శాకటాయనుడు వ్యుత్పత్తివాది యగుటచే ననేక శబ్దములకు ప్రకృతిప్రత్యయవిభాగమును జూపుటకై ఔణాదిసూత్రరచన చేయుట సహజమే. ఆయన ఊహన పరామర్శముకూడ చూపినాడు.

శాకటాయనీయవ్యాకరణమున ఉణాదిప్రకరణములో సూత్రారూఢములుకాని శబ్దము లన్నిటి విషయమున ఊహనవ్యవస్థ జరిగిన దని దీనివలన నుపపన్నమగును. నాగేశభట్టుకూడ "ఏవంచ కృవాపేత్యుణాదిసూత్రాణి శాకటాయనస్యేతి సూచితమ్. ధాతుజం నామేతి నిరుక్త ఆహ నిరుక్తకారః శాకటాయనశ్చ వ్యాకరణే" (ఉద్ద్యోత. ౩-౩-౧) అని లిఖించినాడు.

పాణిని ఉణాదిసూత్రకారు డనుట సంగతము కాదు. అష్టాధ్యాయిలో ఏ శబ్దములను అవ్యుత్పన్నము లని గ్రహించినాడో ఆ శబ్దము లన్నిటికిని ఉణాదిసూత్రములలో వ్యుత్పత్తి కానవచ్చుచున్నది. కంస-పరశ్వాదిశబ్దము లిందుల కుదాహరణములు. ఒక వ్యక్తియే ఉభయసూత్రప్రణేత యగుచో, సూత్రకారు డొక

రాని కంసశబ్దము వ్యుత్పన్న ప్రాతిపదిక మనియు, అన్య స్థానమున అవ్యుత్పన్న ప్రాతిపదిక మనియు ఎట్లు చెప్ప గలుగును? శిశుపాలవధమున మాఘుడు పాణినీయశబ్దము ప్రయోగించినను, "పాణినే రిదం పాణినీయమ్, తే నాభ్యుపగమాత్, వకు లేన కృతత్వాత్" అని వ్యాఖ్యానించవలెను. నైయాసికజినేంద్రబుద్ధికి వ్యాఖ్య సమ్మతమే. స్వసూత్రమున ఉణాదిప్రతిషేధము విహితముయినను నిరుక్తమునకు వ్యాకరణమునకు విరోధపరిహారార్థము పాణినిముని గార్గ్యునివలె ఒక్కమారుగా ఉణాదిశాస్త్రప్రత్యాఖ్యానము చేయలేదు. "ఉణాదయో బహులమ్", "భూతేఽపి దృశ్యన్తే", "ధవిమ్యతి గమ్యాదయః", "భీమాదయోఽపాదానే", "తాభ్యా మన్యత్రోణాదయః" అను సూత్రములవలన పాణినిచే ఉణాదిశాస్త్ర మభ్యుపగత మగుటనుబట్టి శిశుపాలవధకావ్యములోని పాణినీయశబ్దము పై యర్థమునందే ప్రయుక్త మనిపించును.

కాత్యాయనుడుకూడ ఉణాదిసూత్రకారు డనుట సంగతము కాదు. "తత్రోణాదిప్రతిషేధః" (౭-౧-౨) అని పాణినీయసూత్రమునకు కాత్యాయనుడు వార్తికము చేసినాడు. ఆచార్యప్రవృత్తిని గ్రహించియే ఆత డిట్లు పలికినాడు. ఇది సత్య మగుచో "శమేః ఖః", "వణో ఢః" అను రెండు ఉణాదిసూత్రములను జూచియే పాణినికిట్టి ప్రవృత్తి కలిగిన దనియు, కాత్యాయనుడు దానిని స్వీకరించె ననియు చెప్పవచ్చును. ఉణాదిసూత్రములు పాణినికాలమున నున్నచో కాత్యాయనుడు తత్ప్రణేత యగుటకు వీలులేదు. ఉభయుల నడుమ బహుశతాబ్దుల వ్యవధాన మున్నది. ఋక్తంత్రభూమికలో అధ్యాపక సూర్యకాంతమహాశయు డిట్లు వ్రాసినాడు :

"The list of Unadis was first drawn up by Panini on the basis of Sakatayana, and was afterwards modified and connected by Katyayana. The extent of changes introduced by Katyayana into the text was so great that ultimately popular tradition came to credit him with its sole authorship".

దీనివలన మూడుమతములవారికిని సామంజస్యము సమకూడినది. కాని ప్రబలప్రమాణమువలననే గాని యీ వాక్యములను చరమసిద్ధాంతముగా గ్రహింప వలనుపడదు. ప్రాచీన-ఉణాదిసూత్రములను తన కాలమున కుపయోగించునట్లు వరరుచి కాత్యాయనుడు సంస్కరించుట కేవలము విచిత్రము కాదు.

ఈ స్థితిలో శాకటాయనుడే ఉణాదిసూత్రకారు డని భావింపవచ్చును. ఆయనకు పూర్వము ఉణాదిసూత్రము లున్నవా యని అనుమానించుట సంగతము కాదు. ఉణాదిప్రకరణములో "కపః చాక్రవర్మణస్య" (౩-౧౪౪) అను సూత్రము కలదు. ఉజ్జ్వలదత్తుడు "కృపాపే రేవ చాక్రవర్మణ స్యాచార్యస్య మతేన కపప్రత్యయః సంప్రసారణంచ. కుపాపః సవీవ. స్వరేతు విశేషః" అని వ్రాసినాడు. శాకటాయనునకు పూర్వమే వ్యుత్పత్తివాదుల ప్రబలసంప్రదాయ ముండె ననియు, తన్మతమును సూత్రాదులను ఉపజీవ్యము చేసి శాకటాయనుడు ఉణాదిసూత్రరచన చేసె ననియు దీనివలన నుపపన్న మగుచున్నది.

ఆయనతరువాతగూడ ఉణాదిసూత్రము లనేకము ప్రణీతము లయ్యె నని కొంద రనుచున్నారు : "దీవ్యతే ర్నుట్ చ" (౩-౧౪౦), "స్తనో దీర్ఘశ్చ" ఇత్యాదుల నుదాహరించుచున్నారు. ఇందు తొలి సూత్రముపై వ్యాఖ్యలో ఉజ్జ్వలదత్తుడు "దీవ్యతేః. అస్మా ద్దారన్ ప్రత్యయస్య నుడాగమశ్చ. దీనారః సువర్ణాభరణమ్. సూత్ర మిదం సూతీవృత్తౌ దేవవృత్తౌచ న దృశ్యతే" అనియు, రెండవసూత్రవృత్తిలో "ఏతత్సూత్రం పతీవృత్తౌ న దృశ్యతే... అతోఽనార్ష మిద మితి లక్ష్యతే" అనియు చెప్పినాడు. "ఇషి మది ముది......"ఇత్యాది సూత్రము పాశ్చాత్యపండితుల మతమున బహుప్రాచీనము కాదు.

Theodar Aufrecht, Monier Williams మహాశయులు లాటిన్, పారస్యాదిభాషలనుండి కొన్ని కొన్ని శబ్దములు సంస్కృతభాషలోనికి స్వీకరించుటకై అనేక ఉణాదికసూత్రములు ప్రణీతము లయ్యె నన్నారు. లాటిన్ భాషనుండి ముద్రార్థకమై దేనారియస్ (*denarius*) శబ్దము సంస్కృతభాషలో చేర్చుటకై 'దీవ్యతే ర్నుట్ చ' అను సూత్రము ఉజ్జ్వలదత్తునకు కొంతపూర్వము రచిత మయియుండు ననియు, పారస్యభాషనుండి సూర్యార్థకమైన మిహిర శబ్దమును స్వీకరించుటకై "ఇషి మది ముది...మిహి ముహి...కంషిభ్యః కిరచ్" (౧-౫౨) అను సూత్రమున మిహిధాతువును ప్రక్షేపము చేసి, కిరచ్ప్రత్యయము ద్వారా సూర్యార్థమున మిహిరశబ్దము వ్యుత్పాదితమైన దనియు వ్రాసినారు.

పాశ్చాత్యులు బాగుగా నాలోచించి చెప్పలే దని కొందర న్నారు. "దీఙ్ క్షయే" "మిహ సేచనే" అని పాణినీయధాతుపాఠమున నున్నవి. నారక్, కిరచ్-ఈ రెండు ప్రత్యయములు. బహుప్రాచీనకాలమునుండియు వ్యవహృతము లగుచున్నవి. హరివంశమున వ్యాసుడు దీనారశబ్దము ప్రయోగించినాడు. చంద్రగుప్తుని లిపి సాంచిలో దొరకినది. అందు దీనారశబ్ద మున్నది. పూర్వకాలమున సంస్కృతభాషలో దీనారము భూషణార్థమునను, అర్వాచీనకాలమున ముద్రార్థములోను వ్యవహృతము. లాటిన్ భాషలోని దీనారియస్ శబ్దము భూషణార్థమున నెన్నడును ప్రయుక్తము కాలేదు; ఆ భాషలో కేవలముద్రార్థకమే. కాబట్టి దీనారశబ్దము సంస్కృతమునుండి లాటిన్‌లోనికి దీనారియస్ రూపమున ప్రవేశించిన దని చెప్పవచ్చును.

సూర్యుడు జలము నాకర్షించి మేఘముద్వారా భూసేచనము చేయు నని చిరకాలమునుండియు తెలిసిన విషయమే. కుమారసంభవకావ్యమున కాళిదాసు "రవిపీతజలా తపాత్యయే పున రోఘేన హి యుజ్యతే నదీ" అని చెప్పినాడు. జలసేకార్థము మిహిర మేఘశబ్దములు రెండును చిరప్రచలితములు. "మేహయతి సేచయతి జలేన భూమి మితి మిహిరో మేఘో వా" అని ప్రాచీను లన్నారు. మార్కండేయపురాణములోగూడ మిహిరశబ్దము—

"భవతి మిరాసవపానమదాత్
భవతి విలోహితవిగ్రహాత్
మిహిరవిభాసి యతః సురతారాం
త్రిభువనభావనభానికరైః" (౧౦౪-౪)

అని కానవచ్చుచున్నది.

బహుప్రాచీనకాలమున ఉత్తరభరతఖండమున మిహిరేశ్వరనామకశివలింగము ప్రతిష్ఠితము. మిహిరశబ్దము విదేశీయభాషాసముత్పన్న మయినచో దానిని ఋషులు ప్రయోగింపరు. ఈ శబ్దముద్వారా దేవతానామకరణముకూడ సంభవింపదు. పిక, నేమ, తామరస, సత, క్లోమ ప్రభృతిశబ్దములవలెనే మిహిరశబ్దముగూడ మీమాంసకమ్లేచ్ఛప్రసిద్ధపదార్థప్రామాణ్యాధికరణమున చేరియుండును.

పారస్యభాషలో ఘర్మమునకు గరేమ్, క్రతువుకు క్రతు, సోమమునకు హోమ్, అసురునకు అహుర రూపములు కలవు. ఈ విదేశీయశబ్దము లన్నిటికిని సంస్కృతము మూల మని సర్వవాదిసమ్మతము. వ్యాసాదిప్రయుక్తదీనారశబ్దమును, మిహిరశబ్దమును గూర్చి ఆ పాశ్చాత్యవిద్వాంసు లట్లు వ్రాయుట యెందులకో!

"క్రియ ఇకన్" (౨-౮౩) క్రయికః అని శాకటాయను డన్నాడు. కాని అష్టాధ్యాయిలో "వస్నక్రయవిక్రయాట్ ఠన్" (౪-౪-౧౩) సూత్రముద్వారా క్రయికశబ్దవ్యుత్పత్తి దర్శితము. దీనినిబట్టి కొందరు ప్రథమోక్తసూత్రము శాకటాయనకర్తృకము కా దని "అనార్ష మిదం సూత్రమ్" అన్నారు. ఇది చింతనీయము. ప్రక్రియాసర్వస్వములోని ఉణాదిఖండమునందలి "అజి పణి వని పతి ఖనిభ్యః [ఇకన్]" సూత్రవ్యాఖ్యలో నారాయణభట్టు—

"యే తద్ధితాదిభిః సిద్ధాః
క్రయికాః పణికాదయః
తే వ్యుత్పత్తేః బాహువిస్త్యం
వక్తుముక్తా మహర్షిణా."

అని చెప్పినాడు. ఔణాదికప్రత్యయాంతక్రయికాదిశబ్దములను జూచినను, పాణిని ప్రకారాంతరమున వానికి వ్యుత్పత్తిమాత్రము చూపినా డని దీనివలన నుపపన్నమగును. ఇయ్యది అస్వాభావికము కాదు. పికశబ్దమునుగూర్చి "అపి కాయతి శబ్దాయతే ఇతి పికః" అని చెప్పినారు. భాగురిమతమున అపిలోని అకారలోపముద్వారా, "ఆత శ్చోపసర్గే(కః)" అను పాణినీయసూత్రముద్వారా పికశబ్దవ్యుత్పత్తి నిర్ణీత మయినది. అట్లయ్యును భోజుని సరస్వతీకంఠాభరణమున "అలికలిదలిపులికృశిస్పృశిపిశ్రుషిభ్యః కికన్" అని సూత్రితము. దండనాథుడు "పికః కోకిలః" అని చెప్పినాడు. ఇట్టి వస్తుగతిని జూచి ప్రక్రియాసర్వస్వములోని ఉక్తిని సమర్థింపనగును.

ఉణాదిప్రకరణమున "కృపావాజిమిస్వాదిసాధ్యశూభ్య ఉణ్" అని ప్రథమసూత్రము. ఈ సూత్రమువల్లను, ణకారానుబంధకృత్ప్రత్యయము పరమం దుండగా ఆకారాంతధాతువునకు యకారాగమము నియమిత మగుట వలనను, వాధాతువునకు ఉత్తర ఉణ్ ప్రత్యయము చేర్చి వాయుశబ్దము సాధిత మయియుండును. పాణిని "అజేః వ్యఘఞపోః" (౨-౪-౫౬), "వా యౌ" (౨-౪-౫౭) అనియు సూత్రీకరించినాడు. కావున ల్యుట్ ప్రత్యయము పరమం దుండగా అజధాతుస్థానమున వికల్పముగా వీ ఆదేశ మగును. 'ప్రాజనో దండః,' 'ప్రవయణో దండః'. కాని, స్థలవిశేషమును గమనించి వికల్పమునకు ప్రతిషేధపూర్వకముగా పతంజలి యిట్లు

చెప్పినాడు: "న తర్హి ఇదానీ మిదం వాయో ఇతి వక్తవ్యమ్? వక్తవ్యంచ. కిం ప్రయోజనమ్? నేయం విభాషా. కిం తర్హి? ఆదేశోఽయం విధీయతే. వా ఇత్యేతస్య యాదేశో భవత్యజేః యో పరతః. వాయు రితి" దీనిని గాంచి పండిత మాధవకృష్ణశర్మ 'కృవాపాజి...' సూత్రము కేవలము పాణినిది కాదని, పతంజలితరువాత ప్రణీత మన్నాడు. ఈసూత్రము పాణిని పతంజలులకు పూర్వమం దుండెనేని ఇట్టి సూత్రముగాని భాష్యముగాని పుట్టియుండ దన్నాడు. (*A volume of Studies in Indology, pp. 395*). ఆయన సిద్ధాంత మెట్లున్నను, ౩-౩-౧ సూత్రోద్ద్యోతములో నాగేశభట్టు స్పష్టముగా "ఏవంచ కృవాపేత్యాద్యుణాది సూత్రాణి శాకటాయనస్యేతి సూచితమ్" అన్నాడు. కావున ఉణాదిప్రకరణప్రథమసూత్రము నాగేశమతమున శాకటాయనప్రణీతము; అందుచే పాణినికిని పూర్వవర్తి.

జయాదిత్యుని మతమున వాయోసూత్రమునుండి వాయుశబ్దము నిష్పన్నము కాలేదు. యు శబ్దము ద్వారా ల్యుట్ గృహీతమగుటయే కారణము. అందుచే కాశికలో నిట్లున్నది: "పూర్వేణ నిత్యే ప్రాప్తే వికల్ప ఉచ్యతే. యు ఇతి ల్యుటో గ్రహణమ్. యో పరభూతే అజే ర్వా వీ ఇ త్యయ మాదేశో భవతి. ప్రవయణో దండః, ప్రాజనో దండః; ప్రవయణ మానయ, ప్రాజన మానయ" (౨-౪-౫౭). ఈ సిద్ధాంతము చాంద్రమతము సంపూర్ణముగా నామోదింపలేదు. "అజేః వ్యయుఘఞ్ క్యప్సు" (౫-౪-౭౪) అను సూత్రవృత్తిలో చంద్రగోమి "కథం ప్రవయణమ్? వీధాత్వంతరమ్" అన్నాడు. ఉభయమతములు సంపూర్ణముగా భాష్యమనోదితములు కావు. ఈ విరుద్ధవిషయములకు సామంజస్యము సంపాదించుటకును, భాష్యహృదయమును వ్యక్తీకరించుటకును భాషావృత్తిలో పురుషోత్తమదేవుడు "అజే ర్ల్యుటి వీ భావో వా స్యాత్ - ప్రాజనో దండః, ప్రవయణో వే త్యేకః సూత్రార్థః. ఔణాదికే యో పరే అజే ర్వ్యాదేశః స్యాత్, వాయు రిత్యపరః సూత్రార్థః" (౨-౪-౫౭) అని వ్రాసినాడు. వాయుశబ్దమునకు వా, అజ్ అను రెండు ప్రకృతులు కానవచ్చుచున్నవి. వీనికి పరమున క్రమముగా ఉణ్, యు అను ఔణాదికప్రత్యయము లగును. కావున వాధాతువునకు ఉత్తరమున ఉణ్ ప్రత్యయ మగుటతో వాయుశబ్ద మగును; అజ్ ధాతువునకు పరమందు యుప్రత్యయము చేర్చినతో ప్రకృతివాభావప్రాప్తివలన వాయుశబ్ద మేర్పడును. ఏకశబ్దమునకు రెండు ప్రకృతు లుండుట విచిత్రము కాదు. బర్హక, నిబర్హకశబ్దము లిందుల కుదాహరణము. ఈ రెండుశబ్దములు బృహ, బృంహధాతువులనుండి నిష్పన్నము కావచ్చును; బృహిధాతువునుండి యైనను కావచ్చును. (పా. ౬-౪-౨౪) అందులకే కలాప వ్యాకరణములోని "బృంహేః స్వరేఽనిటివా" అను కృత్సూత్రముపై 'చైత్రకూటీ' నామకవృత్తిలో వరరుచి "బృంహాబృహో ర్యథా పాఠాః" అన్నాడు. ఇట్టి స్థితిలో, అజ్ ధాతువునుండి వాయుశబ్దవ్యుత్పత్తిని జూపు ప్రసంగమున 'కృవాపాజి...'సూత్రము నుల్లేఖింపనంతమాత్రమున అది పాణినిపతంజలులకు తర్వాత నుద్భవించిన దనుట సంగతము కా దనిపించును. చాంద్రములోని ఉణాదిసూత్రపాఠమున 'కృవాపాజి...' సూత్రము కానబడుచున్నను, ప్రదీపమున 'వా యౌ' సూత్రవ్యాఖ్యలో కైయటాచార్యుడు ఈ సూత్రము నుల్లేఖింపలేదు. అందుచే నీసూత్రము కైయటాచార్య పరవర్తి యనవచ్చునా? పైజెప్పిన కారణసమూహము వలన ప్రాత్నికుల సిద్ధాంతము నంగీకరింప వలనుపడదు.

మ్లేచ్ఛసమాజమునుండి పిక, నేమ, తామరస, సత, క్లోమక శబ్దములును, పత్త్రప్రభృతిశబ్దములును సంస్కృతభాషలోనికి దీసికొనుటచే ప్రాచీనవ్యాకరణములలో వాని వ్యుత్పత్తి సూత్రారూఢము కాలే దని కొందరనుచున్నారు. పికాదిశబ్దములు మ్లేచ్ఛసమాజమునుండి సంగృహీతము లనుటయు యుక్తియుక్తము కాదు. "చోదితం తు ప్రతీయే తావిరోధాత్ ప్రమాణేన" (౧-౩-౧౦) అను జైమినీయ సూత్రముపై భాష్యములో శబరస్వామి యిట్లు చెప్పినాడు: "అథ యాన్ శబ్దా నార్యా న కస్మింశ్చి దర్థే ఆచరన్తి మ్లేచ్ఛాస్తు కస్మింశ్చిత్ ప్రయుంజతే యథా పిక, నేమ, సత, తామరసాదిశబ్దా — స్తేషు సందేహః. కిం నిగమనిరుక్తవ్యాకరణవశేన ధాతుతోఽర్థః కల్పయితవ్య ఉత యత్ర ఆచరన్తి స శబ్దార్థ ఇతి." కుమారిలభట్టు కూడ తంత్రవార్తికములో నిట్లు చెప్పినాడు:

"యే శబ్దా న ప్రసిద్ధాః స్యు
రార్యావర్తనివాసినామ్
తేషాం మ్లేచ్ఛప్రసిద్ధోఽర్థో
గ్రాహ్యో నేతి విచిన్త్యతే.
నిరుక్తవ్యాక్రియాద్వారా
ప్రసిద్ధిః కిం బలీయసీ
సముదాయప్రసిద్ధి ర్వా
మ్లేచ్ఛసైన్యాథ వా భవేత్."

కావున పికాదిశబ్దములు పూర్వము లేవనుట సంగతము కాదు. ఈ శబ్దము లన్నియు వేదమున గానవచ్చును. మీమాంసాన్యాయప్రకాశమున "యథః కల్ప్యః సకల్పపూర్వక ఇతి న్యాయేన సంసారస్యానాదిత్వాత్ ఈశ్వరో గతకల్పీయం వేదం స్మృత్వోపదిశతి" అని యున్నది. కావున పికాదిశబ్దములు చిరకాలము నుండియు గలవు. అయినను మ్లేచ్ఛులు ఈ శబ్దము లన్నిటిని వేరే యర్థములందు ప్రయోగించిరో ఆయా యర్థములు ఆర్యప్రసిద్ధికి అవిరుద్ధము లగుటవలన సంస్కృతి భాషలోనికి గ్రహించినారు. పూర్వకాలమున "పిబతి మధునీతి పికో భృంగః" అను నిరుక్తివలన పికశబ్దము భ్రమరమున రూఢ మయ్యెను. కాని ఆ శబ్దము మ్లేచ్ఛులలో కోకిలార్థమున ప్రయుక్తము. ఆర్యులకు దాన విప్రతిపత్తి లేకుండుటచే వారు కోకిలార్థము నే గ్రహించినారు. కాలక్రమమున పికశబ్దము భ్రమరార్థమును కోలుపోయినది. ఇట్టి పరత్యాగ మస్వాభావికము కాదు. పాణినిసంప్రదాయములోని ప్రామాణికులు గూడ "అప్రయోగః ప్రయోగాన్యత్వాత్" అన్నారు. కొనుకటిరోజులలో నేమశబ్దమునకు కాల మని యర్థము. కాని దానిని మ్లేచ్ఛులు అర్ధ మనునర్థమున ప్రయోగించుచుండిరి. కావుననే కాతంత్రోణాదిగణసూత్రమున దుర్గసింహుడు "నయతీతి నేమః కాలః" (౧-౫౩) అన్నాడు. పాణినీయులు "నయతే పృథక్ క్రియతే సముదాయా దితి నేమోఽర్థమ్" (ప్రక్రియాసర్వస్వము, ఉణాదిఖండము, ౧-౧౩౦) అని చెప్పినారు. ఏమర్థము నం దైన నుండుగాక; అనాదికాలమునుండి పికాదిశబ్దప్రయోగ మున్నచో ప్రాచీనవ్యాకరణములలో వాని వ్యుత్పత్తి సూత్రారూఢ మేల కాలేదు? తామరసశబ్దమునుగూర్చి సరస్వతీకంఠాభరణమున "వేతసతామరసపారసాదయః" (౨-౩-౧౭౪) అను సూత్ర మున్నది. దండనాథుడు "వేతసాదయో ఽసచ్ప్రత్యయాన్తా నిపాత్యన్తే" అని పలికినాడు. 'వత' మనగా దారుమయపాత్రము, నాక వేతసపాత్రము కావచ్చును. దీని విషయమై సూత్ర మేమియు లేకుండుటచే ఊహ చేయవలసి వచ్చినది. ద్వేసతి, ద్వయసతి అని సతము పూర్వము ద్విద్వయశబ్దములతో మిళితమయియుండును. దీని యర్థము ***in two places equal, having the same length above and below the navel* (Monier Williams)**. క్లోమశబ్దమునుగూర్చి సరస్వతీకంఠాభరణమున, "వ్యోమన్ రోమన్ లోమన్ క్లోమన్ హేమన్ నేమన్ సామన్ లలామన్ ఆత్మన్ యత్మన్ పత్మన్ సాత్మన్ వర్త్మన్ సీమన్ బ్రహ్మన్నితి (మనిన్)" (౨-౧-౨౮౫) అను సూత్రము గోచరించును. దీనిపై దండనాథుడు "వ్యోమాదయో మనిన్ప్రత్యయాన్తా నిపాత్యన్తే... క్లామ్యతీతి క్లోమా శరీరాభ్యంతరావయవః." అని చెప్పినాడు. క్లోమ అనగా ఊపిరితిత్తి. ఈ సూత్రమునకు పాఠాంతరము కలదు. అందు క్లోమశబ్దము కానరాదు. ప్రక్రియాసర్వస్వోద్ధృతమగు "నామన్ సోమన్ సామన్ హోమన్ రోమన్ లోమన్ వ్యోమన్ విధర్మన్ ధ్యామన్ పాప్మన్" (౮-౧౬౮) అను సూత్రముపై వ్యాఖ్యలో నారాయణభట్టు "క్లోమన్ లలామన్ యత్మన్ వర్ష్మన్ న్నితిచ భోజోక్తాః" అని పలికినాడు. పాణినీయగణఉణాది ప్రకరణసూత్రపాఠము "నామన్ సీమన్ వ్యోమన్ రోమన్ లోమన్ పాప్మన్ ధ్యామన్" (సిద్ధాంతకౌముదీ, ౬౦౦) అని యున్నది. పద్మార్థమున పత్మశబ్దమును భారతీయార్యులు స్వీకరించినట్లు తోచదు. క్షుద్రయవద్వీపనామకవాలిద్వీపపండితులు "అత్రిసుహూ స్పృస్పృక్షితుభాయా పది యక్షి జీభ్యో మన్" (ప్రక్రియా సర్వస్వ ౧-౧౩౦) సూత్రములోని పద్ధాతుస్థానే పత్ ధాతువు పఠించి "పతతి భృంగో ఽస్మిన్నితి పత్మం కమలమ్" అన్నారు. భారతీయార్యులలో పత్మశబ్దప్రచారము లేదు. అందుచేతనే ఈ సూత్రవ్యాఖ్యలో నారాయణభట్టు ఇట్లు చెప్పినాడు: "పద్యతే గమ్యతే భృంగైః పద్మం కమలమ్.

పద్మం హి పద్యతే ఉక్తం న పతే ర్మాధవాదిభిః
స్పృష్టో దకార శ్చేదానీం తకారో క్తి రతో భ్రమః"

ఈ శ్లోకమున మాధవశబ్దముద్వారా సాయణాచార్యప్రణీతమాధవీయధాతువృత్తినామకగ్రంథ ముద్దిష్టమయియుండును; కానిచో అమరకోశమాధవీయటీకాకారుడు మాధవపండితు డయినను లక్షితు డు కావచ్చును. కమలార్థమున పత్మశబ్దము కాక పద్మశబ్దమే యేల కావలె నన్నచో "విచిత్రా హి లోకే శబ్దానాం ప్రవృత్తిః" అనవలసియుండును. "తత్ర శబ్దార్థసంబంధం పౌరుషేయం ప్రచక్షతే"అని శాలినాథుడుకూడ పలికినాడు (ప్రకరణపంజిక).

శాకటాయనుని ఉణాదిసూత్రముల నాధారము చేసికొని వివిధసంప్రదాయములవారు ఔణాదికగ్రంథములు రచించినారు:

(౧) పాణినీయసంప్రదాయమువారి ఉణాది ప్రకరణము. భట్టోజిదీక్షితుడు ఇందుండి ౭౫౯ సూత్రసన్ని వేశపూర్వకముగా వృత్తి రచించినాడు. ఇంచుమించుగా ఆయనసమకాలికుడగు నారాయణభట్టు

ప్రక్రియాసర్వస్వగ్రంథమును క్రీ. శ. ౧౬౧౬ లో రచించినాడు. ఇందలి ఉణాదిఖండమున పాణిని సూత్రప్రయోగపూర్వక-డౌణాదికశబ్దసాధన ప్రదర్శితము. "కృపావాజి..."సూత్రముద్వారా వాయుశబ్దసాధనలో "ఆతో యుక్..."సూత్రప్రయోగము కలదు. ఉణాదిశాస్త్రగతములైన కొన్ని కొన్ని శబ్దములకు అర్థాన్వయము చేయుట కష్టము. అందులకే నారాయణుని ప్రక్రియాసర్వస్వమున తొలుతనే యిట్లున్నది:

"క్వచిత్ సుయోజ్యా ధాత్వర్థాః
క్వా ప్యయోజ్యా ఉణాదిషు
క్వచిత్ కథంచిద్ యోజ్యాః స్యుః
రత్యన్తే తత్ర తే...
అర్థం వినాపి ధాతూక్తిః
వ్యుత్పత్త్యవశ్యకాత్ కృతా
కృత్తద్ధితాదిసిద్ధాశ్చ
స్వసిద్ధాశ్చ పునః క్వచిత్.

ఉచ్యన్తేఽత్రహి పూర్వేషాం
మతభేదా విలుప్తయే
వ్యుత్పత్తిశ్చ బహుత్వేన
శబ్దానందేహసిద్ధయే".

ఇంతియే కాక తృతీయసూత్రవ్యాఖ్యలో నిట్లున్నది:

"అస్మాద్ధాతో రియం సంజ్ఞా
సాధ్యేతి మునిశాసనే
కిం కుర్మోఽర్థాన్వయః కశ్చి
ల్లబ్ధశ్చేత్ కృతినో వయమ్.

పదపద్యాపి యత్కించి
దుక్త్వా వ్యుత్పాద్య మిత్యదః
టీకాసర్వస్వకారాది
వచనం శరణం హి నః".

దీనిపై డాక్టర్ వటకృష్ణఘోష ఇట్లు వ్రాసినాడు:

"Narayana's dissatisfaction with the Unadi was much greater in this respect, as is clear from his remarkable statement at the beginning of the work అస్మాద్ధాతో రియం సంజ్ఞా........."*(Indian Culture, June 1938).*

ఇది చింతనీయము. శ్లోకాన్వయ మిట్లుండవలెను. అస్మాద్ధాతో రియం సంజ్ఞా సాధ్యేతి మునిశాసనే, కశ్చి దర్థాన్వయశ్చే ల్లబ్ధః వయం కృతినః (పండితాః), [అన్యథా] కిం కుర్మః ? (న తత్ర పండితా వయ మిత్యర్థః). కావున పురుషగర్హణమే శ్లోకలక్ష్యము; శాస్త్రగర్హణము కాదు. ప్రక్రియాసర్వస్వమునకు పూర్వమే ఉణాదిసూత్రములపై శ్వేతవనవాసి 'శ్వేతవనవృత్తి' రచించినాడు. ఆయనకు పూర్వము మాణిక్యదేవుడు 'ఉణాదిసూత్రవృత్తిదశపాదీ' అను గ్రంథము రచించినాడు. అతనికి పూర్వము ఉజ్జ్వలదత్తుడు వృత్తి చేసినాడు. ఇందులో ౭౫౦ ఉణాదిసూత్రములు వ్యాఖ్యాతములు, ఉదాహృతములు నయినవి. ఈ సూత్రము లన్నియును పంచపాదములలో విభక్తములగుటచే గ్రంథమునకు 'పంచపాది' యను నామాంతరము కలిగినది. కేవలము ఉణాదులపై లిఖితమైన దని 'పంచపాది'యందు సూత్రములు విపులముగా వ్యాఖ్యాతము లగుట సత్యమే. కాని భట్టోజివృత్తియందు వైదిక శబ్దముల స్వరగతవైశిష్ట్యము పరిలక్షిత మయియుండును. సంపూర్ణస్వరోపదేశము తప్ప ఉణాదిసూత్రవ్యాఖ్య అసంపూర్ణ మైయుండును.

అందులకే ప్రక్రియాసర్వస్వమున తొలుతనే నారాయణభట్టు—

"ధాత్వర్థ మాత్రత్య భవ త్త్వణాదికా
ఉణాద్యధీనా నిగమేఽపిచ స్వరాః
అతః కృదిత్యగత మప్యణాదికం
ధాతోః పరం ధాన్దసతోఽపరం బ్రువే."

అన్నాడు.

క్షపణకవృత్తి (౧-౧౬౯) గోవర్ధనీయవృత్తి (౨-౧౦౭, ౩-౪౦, ౪-౨౦; ౬౯...), దేవవృత్తి (౨-౨౩, ౩-౧ ౨౯, ౭౬...), నగ్నవృత్తి (౪-౬౬) ప్రాచీనవృత్తి (౨-౩౨), సతీవృత్తి (౩-౨౫), సూతీవృత్తి (౩-౧౪౦) ఇత్యాది ప్రాచీనవృత్తులను ఉజ్జ్వలదత్తుడు పేర్కొన్నాడు. గదసింహుని ఉణాదివృత్తికి క్షపణకవృత్తి యని ప్రసిద్ధి. దేవవృత్తి యనగా పురుషోత్తమదేవుని ఉణాదివృత్తి. నగ్నవృత్తి పూజ్యపాద దేవనందిప్రణీతము కావచ్చును.

(౨) కొందరుల ఇంద్రగోమిప్రణీత-ఐంద్రవ్యాకరణమున ఉణాది సూత్రము లనేకము లున్నవి; గ్రంథముతో గూడ నవి లోపించినవి. కౌమారుల ఉణాదిప్రకరణమున ఇంద్రగోమిసూత్రము లెన్నో ప్రవేశించియుండవచ్చును.

(౩) కౌమారుల ఔణాదికసూత్రము శర్వవర్మప్రణీతము కాదు. ఈ సూత్రము లన్నియు వృత్తికారు డగు దుర్గసింహుడు రచించినా డని తంజావూరులో ప్రవాదము కలదు. బౌద్ధుల ఐంద్రవ్యాకరణమునుండి యివి యన్నియు కలాపమున ప్రవేశించిన వనియు, దుర్గసింహుడు వానిపై వృత్తి రచించినా డనియు కొంద రన్నారు. వృత్తిప్రారంభములో—

"నమస్కృత్య గిరం (శివం) భూరి
శబ్దసంతానకారణమ్
ఉణాదయోఽభిధాస్యన్తే
బాలవ్యుత్పత్తిహేతవే."

అనియు, గ్రంథమధ్యమున—

"శబ్దాత్మికా యా త్రిజగ ద్బిభర్తి
స్ఫురద్విచిత్రార్థసుధాం స్రవన్తీ
యా బుద్ధి రీడ్యా హృదయే సదైవ
ముఖేచ సా మే వశమస్తు నిత్యమ్."

అనియు, గ్రంథాంతమున—

"శబ్దానా మానంత్యాన్
వ్యుత్పత్తిః దృశ్యతే యేషామ్
తేషాం విజ్ఞైః కార్యా
మృగ్యా ధాతో స్తతః ప్రత్యయా న్తాత్."

అనియు కానవచ్చుచున్నవి.

'The Unadi Sutras of the Katantra School with the Vritti of Durgasimha'—Edited by Dr. T. R. Chintamani—అను గ్రంథమున ప్రథమశ్లోకము, ద్వితీయ, తృతీయశ్లోకాంశములును గానవచ్చును. ఉపాధ్యాయసర్వస్వప్రణేత సర్వధరఉపాధ్యాయుడు దుర్గసింహుని వృత్తికి ప్రథమ టీకాకారుడు.

(౪) బౌద్ధాచార్యుడు చంద్రగోమి చాంద్ర వ్యాకరణపరిశిష్టరూపమున , ఔణాదికసూత్రపాఠ మొకటి రచించినాడు. ఇందు ౩౨౭ సూత్రములు మూడు పాదములలో విభక్తమయినవి. ఈ గ్రంథమున కొన్ని శాకటాయనసూత్రములుకూడ రచితములయినవి. దీని కన్నిటికిని ప్రథమవృత్తికారుడు ధర్మదాసాచార్యు డని తోచును.

(౫) జైనాచార్యపూజ్యపాదదేవనందివిరచితము లయిన ఉణాదిసూత్రములు లభింపలేదు. ఆయన పాణినీయ-ఉణాదిసూత్రములకు వృత్తి రచించియుండును. దీనినే కొందరు 'నగ్నవృత్తి' అన్నారు.

(౬) నానావిధప్రాచీనగ్రంథముల నాధారము చేసికొని జైనాచార్యఅభినవశాకటాయనుడు పాదచతుష్టయాత్మకమైన ఉణాదిసూత్రగ్రంథము చేసినాడు. దీనిలో మహర్షి శాకటాయనసూత్రచిహ్నము లేవియు లేవని కొంద రన్నారు. డాక్టర్ శ్రీపాద కృష్ణ బెల్వాల్కర్ ఇట్లు వ్రాసినాడు: *"One expects to find in the Unadi Sutras at least traces of the Ancient Sakatayana and his works, but he is sure to be disappointed in his expectations." A descriptive catalogue of the Sanskrit MSS. in the collections of the A. S. B.* అను గ్రంథములో (పుట ౫౪) మ. మ. హరప్రసాదశాస్త్రి ఇట్లు వ్రాసినాడు: *"...the quotations in Panini from Sakatayana are to be found in 'Sakatayana's work published from Madras. Even Burnell who tries to show it to be a forgery, and a clumsy forgery too, is constrained to admit—these coincidences prove that our existing treatise is based on the original work."*

(౭) ప్రాచీనశాకటాయనునివలెనే ధారాధిపతి భోజుడు ఉణాదుల శాస్త్రీయత్వమును విశేషభావమున గ్రహించినాడు. ఆయన సరస్వతీకంఠాభరణమున వివిధశాకటాయనీయసూత్రపాఠాంతరములు కలవు; అందు నూతనసూత్రములుకూడ నున్నవి. నారాయణదండనాథుడు ఈ గ్రంథమునకు 'హృదయహారిణీ' నామకవృత్తి రచించినాడు. ప్రక్రియాసర్వస్వమందలి ఉణాదిఖండమున 'వర్ణానీతి' తరువాత గ్రంథకార నారాయణభట్టు—

"ఉక్తేషు ప్రత్యయే ష్వేవ
ప్రకృత్యాధిక్యగోచరాః
భోజోక్తయః పురా ప్రోక్తా
అవశిష్టా నథ బ్రువే"

అను శ్లోకము చెప్పి, "కాయః కిః" అను భోజరాజీయసూత్రమునకు వివరణపూర్వకముగా "ఇతి భోజోక్తాః" అన్నాడు. నారాయణభట్టుమతమున ఈసూత్రములన్నియు భోజోక్తము లని దీనివలన తెలుచున్నది. భోజదేవు డేదో ప్రాచీనగ్రంథమునుండి వీనిని సంగ్రహించె నని తోచుచున్నది. ఈ సూత్రములు భోజప్రణీతములే యైనచో దండనాథుడు వానినిగూర్చి చెప్పియుండును.

(౮) పాణినీయసూత్రముల నాధారముచేసికొని సంక్షిప్తసారము ప్రణీత మయినను ఔణాదికసూత్ర సందర్భమున క్రమదీశ్వరుడు మహర్షి శాకటాయనునే విశేషముగా ననుసరించినాడు. అందుచేతనే క్రమదీశ్వరీయ-ఉణాదిపాదశేషమున తదంగీభూత 'కృచ్ఛే షోఽవ్యయపాదొ' నామకమయిన ఉపపాదము కాన వచ్చుచున్నది. దీనిపై 'రసవతీ' వృత్తి యున్నది. కాని గోయీచంద్రుని టీక యేమియు లేదు.

(౯) హేమచంద్రు డొక ఉణాదిసూత్ర పాఠము రచించినాడు. ఇందు ౯౬౦ సూత్రములు కలవు. అభినవశాకటాయనీయ - ఉణాదిసూత్రము నాధారము చేసికొని యీ సూత్రరచన జరిగినది.

(౧౦) సారస్వతసంప్రదాయమున అనుభూతి స్వరూపాచార్యుని సారస్వతప్రక్రియలోను, రామాశ్రముని సిద్ధాంతచంద్రికయందును, నానావిధ-ఔణాదికశబ్దవ్యుత్పత్తి దర్శిత మయినది. సారస్వతప్రక్రియలో కొన్ని ఔణాదికసూత్రములు ఉపదేశప్రధానపూర్వకముగా నిట్లు చెప్పియున్నది:

"సంజ్ఞాసు ధాతురూపాణి
  ప్రత్యయాశ్చ తతః పరే
కార్యా ద్విద్యా దనూబంధ
  మేత చ్ఛాస్త్ర ముణాదిషు.
ఉణాదయోఽపరిమితా
  యేషు సంఖ్యా న గమ్యతే
ప్రయోగ మనుసృ త్యైద్ధా
  ప్రయోక్తవ్యా స్తత స్తతః."

(౧౧) ముగ్ధబోధమున బోపదేవుడు ఉణాది సంబంధిసూత్ర మేదియు రచింపలేదు. కాని అష్టాధ్యాయిలోని "ఉణాదయో బహులమ్" (3-3-౧) అను సూత్రతాత్పర్యము అతని "నామ్న్యేస్యేతిక్ ష" (౧౦౦౪) అను సూత్రమున ప్రవేశించినది. దీనిని జూచి ఉణాదికోశకారుడు పండితరామశర్మ కొన్ని ఉణాదిసూత్రములు చేసినాడు. ఉణాదికోశము ముగ్ధబోధసంప్రదాయగ్రంథము. రామతర్కవాగీసుడు దీని సంస్కర్త. *A descriptive catalogue of the Sanskrit MSS. of the A S. B.* గ్రంథమున (పుట ౮౩) హరప్రసాదశాస్త్రి యిట్లు వ్రాసెను: *"Rama Sarma wrote an Unadi Kosa in verse to which Ramatarkavageesa appended a Commentary. Rama Sarma's Kosa was from Panini, Katyayana and Patanjali. He lays the foundation of his commentary on the Sutra of Mugdhabodha* 'నామ్ని అస్యే తిక్ ష'; *so this is a Kosa of the Panini School which has been suited to the Mugdhabodha School by Tarkavageesa* (I. O. Catalogue 874).

(౧౨) ప్రథమపద్మనాభదత్తుని పృషోదరా వృత్తి నాధారము చేసికొని, సుపద్మకారు డగు పద్మనాభదత్తుడు ౧౮౦ ఉణాదిసూత్రములను, వానిపై వృత్తిని రచించినాడు. సుపద్మమునకృత్ప్రకరణానంతరము ఇది ఉణాదిప్రకరణ మని అభిహిత మయినది. దీనిపై విష్ణుమిశ్రుని టీక కలదు. పద్మనాభుని ససూత్ర-ఉణాదివృత్తిని అవలంబనముగా చేసికొని రామగోవింద చక్రవర్తి 'శబ్దాబ్ధితరి' రచించినాడు. ఇది ఉణాది కోశవిశేషము.

(౧౩) శ్రీ జీవగోస్వామిప్రణీత హరినామామృతవ్యాకరణమున కృదంతప్రకరణమునందుమ ఔణాదికశబ్దసాధుత్వ మభ్యుపగత మగుచున్నది. అందు "గమిగామ్యాదయస్తు భవిష్యతి సాధవః" (౧౯౯), "ఉణాదయో బహులమ్" (3౬౬) ఇత్యాదిసూత్రములు కలవు. కృదంతప్రకరణప్రారంభమున—

"ధాతుం సర్వ ముపాదాయ
  సర్వం రూపం కరోతి యః
కృత్ స ఏవేతి విఖ్యాత్య
  తద్ధర్మా కృత్ ప్రకాశ్యతే".

అను శ్లోకానంతరము కృత్ప్రసంగమునందే సూత్రకారుడు ఔణాదికశబ్దసాధుత్వమును నిరూపించినాడు.

(౧౪) ప్రయోగరత్నమాలలో పురుషోత్తమ విద్యావాగీసుడు కృద్విన్యాసీయసూత్రమధ్యమునందే ఔణాదికసూత్రసన్నివేశము కావించినాడు. అతని కృద్విన్యాసమున "గమ్యాదయః సాధవః స్యు రిణాదినస్తా భవిష్యతి", "ఉణాదయః స్యు ర్బహులమ్", "క్రాదే రుక్", "భీమాదయోఽపాదానే స్యుః" ఇత్యాది సూత్రము లున్నవి.

నన్నయ్యగారి ప్రసన్నకథా కలితార్థయుక్తి

ఋశ్యశృంగుని కథ

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

ఇదివఱకే కథయొక్క యాత్మతత్త్వమును పట్టుకొని కథాకథనవైఖరి నన్నయ్యగారియందు మారుచుండునని వ్రాసితిని. శర్మిష్ఠాశౌనకోపాఖ్యానములు రెండును చెప్పెడి తీరు, శిల్పపద్ధతి యెట్లు విశిష్టమైనదో నిరూపించితిని. ఆపద్ధతి యా రెండుకథలయందే కలదు.

పీఠికలో భిన్నకథలు భిన్నవైఖరులుగా చెప్పబడునని వ్రాయుచు ఋషుల కథలు చెప్పెడి తీరే వేరని వచింపబడినది.

ఆ ఋషుల కథలలోగూడ ఋష్యశృంగుని కథ చెప్పిన పద్ధతి వేరు.

నన్నయ్యగారు కథయొక్క యాయువుపట్టు పట్టుకొని దానిని ప్రసన్నముచేయుటకే ప్రయత్నించును. కథాంశములయం దెక్కడో అక్కడ నొక చమత్కారసన్నివేశ ముండవచ్చును. తదపేక్షయా ప్రధానార్థవిషయమును భంగించడు. అంగవిషయము అంగిని మ్రింగదు. మ్రింగినచో రసభంగము.

ఋష్యశృంగుని కథ యెందఱకు తెలియును? ఈకథలోని పరమార్థమేమి? ఆయన యున్నచోట వర్షములు కురియును. అంగదేశములలో వర్షములు లేవు. ఆయన యంగదేశములకు రావలయును. అతడు తండ్రివద్ద నాశ్రమపదమున నున్నాడు. తపస్వి. అతడు లోకము నెఱుంగడు. స్త్రీపురుషభేదము నెఱుంగడు. ఈ భేదము లేనిది యాశ్రమపదము. ఈ భేదము కలది పట్టణము. ఆ స్థితిలో నుండి యీ స్థితిలోనికి రావలయును. అది యాత్మనిష్ఠ. ఇది శరీరనిష్ఠ. ఇంద్రియప్రవృత్తి యగోచరమగుచో నాత్మప్రవృత్తి. తదభావమందు ప్రవృత్తి. లోకవృత్త మెఱుగనివానికి శరీరగతమైన వాంఛలు రేకెత్తినచో ప్రవృత్తి గలుగును. ప్రవృత్తి గలవానిని ప్రబోధించినచో నింద్రియప్రవృత్తి చెడి యాత్మజ్ఞానము కుదురును.

ఎప్పుడును జ్ఞానవిషయము ప్రబోధము. ఇంతకంటె నదివఱకు తెలియనిదానిని తెలిసికొనుట ప్రబోధమని చెప్పవచ్చును.

ఋష్యశృంగునకు శరీరగతమైన యింద్రియప్రమాథనము తెలియని విషయము. ఇంద్రియములు నిద్రాణములై వసంతర్తువునందు వృక్షములవలె తత్స్పర్శచేత లతాదులవలె ప్రబుద్ధములై పుష్పించును. పూర్వమందనవగతమైన యీ వికాస మాకస్మికముగా సంభవించును. ఒక రసాలము శిశిరాంతమున క్రొత్తచివురు తొడిగి వసంతుడు తాకినచో పులకితాంతరంగవీథియై పూవుగా పగులుటకు సమ్ముఖమైన కిసలయాగ్రస్థితక్షారకమృదుతమ సన్నివేశసహితమైయుండును. అపుడు వసంతర్తువు వచ్చి యిట్లె తాకును. క్షారక ముద్భిన్నమగును. క్షారకము కోరకమై, ప్రసవమై, ఫలమై పరిణమించును. ఈపరిణామేందిరకు తత్క్షారకస్ఫూర్తి ప్రథమదశాప్రబోధము.

ఆ రసాలవృక్ష మెటువంటిదో యౌవనోదయకాలమందలి పురుషుని శరీరము నటువంటిదియే.

ప్రవృత్త్యభిముఖమై స్త్రీవాంఛాగోపనము గలిగి యనధిగతతద్వ్యాంధమై తాకినచో కందునట్లుండును. నిత్యముగా లోకమునందే యుండు పురుషులకు, యౌవనోదయాత్పూర్వమే నిత్యము లోకములో నుండుటచేత చూచుచుండుటచేత తద్భావము యౌవనోదయసమకాలముగ భావించును. చాలమందియందు శరీరవికాసమునకంటె పూర్వమే మనోవికాసము జరుగును. లోకస్థితులైనవారి కింతే. ఆశ్రమస్థితుడై, స్త్రీదర్శన మెట్టిదో తెలియక, కాంతాస్వరూప మెరుగక, కాంతాత్వస్థితి యెరుగక యున్న ఋష్యశృంగునియందు తద్గతమనోభావమే లేదు. యౌవనదశను పొందిన శరీరాణువులయందు వికసనదశాభిముఖమై యీసృజనహేతుశక్తి నిండి నిబిడియున్నది. రసాలమునందు శిశిరాంతమునందు వికసనశక్తి వసంతర్తుస్పర్శచేత ప్రబోధింపబడినట్లు, ప్రబోధింపబడుటకు ప్రతీక్ష చేయుచున్నట్లు ఋష్యశృంగునియందు నీయౌవనదశాపరిపాకవేళ తచ్ఛరీరగతసృజనాభిముఖశక్తి కాంతాస్పర్శ వాంఛించి ప్రబోధము పొందుటకు నభిముఖమై యున్నది.

ఈ స్థితిలో ఋష్యశృంగు డున్నాడు. కాంతాస్పర్శ యాయనకు ప్రబోధము కల్పించును. అతనికి యౌవనరహస్యము ప్రబోధింపబడవలయును. అంగదేశపు రాజు పంపించిన వారకాంత లతనికి నా ప్రబోధమును కల్పించిరి.

"మునిముందట కందుక న
ర్తనమ్మృదుగీతములయందు దన కౌశల మె
ల్లను జూపి విరచితాలిం
గనలై మునిపతికి ముదము గావించె మదిన్.

ఇట్లు ఋష్యశృంగుం బ్రబోధించి"—

ఇది నన్నయ్యగారు వ్రాసినది. ఋష్యశృంగునకు వారు స్త్రీ లని తెలియదు. వారి యాలింగనాదులచేత తనయందు ప్రబోధితమై యుద్బుద్ధమైన శక్తి యేమో తనకే తెలియదు. తత్స్వరూపఫలావగతి లేని యొకశక్తి తనయం దున్నదని ఋష్యశృంగుడు గ్రహించెను. అతడు గ్రహించుటయు కాదేమో? ఈ ప్రబోధము వలన వాని శరీరము తన్మహోవిషయాభిముఖమై ప్రజ్వలించెను.

ఋష్యశృంగానయనకథాభాగములో నిది ప్రథమఘట్టము.

కాని యంగరాజు పంపించిన వారకాంతల యీ ప్రయత్నమునకు ప్రతికారియైన ప్రయత్నము ఋష్యశృంగుని తండ్రియైనవిభాండకునియందు ప్రతిష్ఠితమై యున్నది. వారకాంతలు చేసిన ప్రబోధము ప్రవృత్త్యభిముఖమై యున్నది. ఇచట ప్రబోధశబ్దము తత్పూర్వము తెలియని యౌవనశక్తి తెలిసికొనుటకు సంబంధించినది. తత్పూర్వము నిద్రాణమైయున్న యీ శక్తి యిపుడు ప్రబోధము పొందినది. ఈ ప్రబోధశబ్ద మానిద్రనుండి యాశక్తి ప్రబోధింపబడుటమాత్రమే ప్పును. ఇది నిజమైన ప్రబోధము కాదు. నిజమైన ప్రబోధ మాత్మవిషయము. లోకప్రవృత్తియందు మగ్నమైన చిత్తము నాత్మజ్ఞానము పొందునటుల చేయుట నిజమైన ప్రబోధము. ఈ శబ్ద మీ రెండుస్థలములయందు చిత్రముగా నడుచుచున్నది. వారకాంత లతనిని తొలుత ప్రబోధించిరి. తండ్రి యా శరీరజ్ఞానమును నివర్తింపజేసి యాత్మజ్ఞానమును ప్రవర్తింపజేయుటకు కొడుకును మరల ప్రబోధించెను. "తపస్వుల తపంబులకు విఘ్నంబులు సేయ ననేకరూపులై రాక్షసులు వనంబునం గ్రుమ్మరుచుండుదురు. తజ్జనదత్తంబులైన పానీయంబు లపేయంబు లతిసుగంధులైన కుసుమంబులు మునులకు వర్జనీయంబు లని కొడుకుం బ్రబోధించి యప్పటియట్ల వన్యఫలంబులం దేర నరిగిన"—ఈరీతిగా వారకాంతల ప్రబోధము జరిగెను. ఆ ప్రబోధము వట్టి యౌవనదశాగతదేహేంద్రియజ్ఞానసంబంధి. ఋషి చేసిన ప్రబోధము యాథార్థ్యసంబంధి. నిజమునకు వారకాంతలు చేసినది ప్రబోధము కాదు. ఋష్యశృంగుని స్త్రీగతవాంఛాసర్వవిరహితవిచిత్రశపన్నహితమనోవృత్తియే యది ప్రబోధ మని చెప్పుటకు వీలైనది. తండ్రిచేత మరల ప్రతిష్ఠింపబడిన ప్రబోధము చెడినచో నది వికార మగును.

లోకమునందు సర్వజనులకు యౌవనోదయవేళ వికారమే సంభవించును. లోకము నిత్యము తద్వికార

మునందే నిక్షిప్తమైయుండి తద్వైకృతభావపాంతత్వమే నిత్యానుభూతివిషయముగా నున్నది.

ఆధ్యాత్మికప్రవృత్తియొక్క వైకృతస్వరూప మీ లోకము. దీనినుండి జ్ఞానము సంపాదించుటకు లోకము ప్రబోధితము కావలయును. ఋష్యశృంగుని యందట్లు కాక జన్మచేత, పెంపకముచేత, చుట్టునున్న పరిస్థితులచేత శరీరగతవాంఛావిక్రియాపేతమైన స్థితి యున్నది. అది యున్నదని యెరుగడు. ఆ జ్ఞానము ప్రబుద్ధము చేయబడినది. తండ్రి మరల దానిని ప్రతిష్ఠించినాడు.

ఇపుడు వారకాంతలకు మరల క్లిష్టదశ ప్రాప్తించినది. అతనిని మరల ప్రబోధింపవలయునా? ప్రబోధ మిదివరకే జరిగినది. ఇప్పుడు ప్రబోధింప నక్కరలేదు. ఏమి చేయవలయును?

వైకృతము చేయవలయును.

"చనుదెంచి తరుణి మునినం
దను చిత్తంబునకు వైకృతము జేసె విలా
సినుల సహోలాప, సహా
సన సహాయానములు బంధసమములు కావే?"

ఈరీతిగా కథలో నున్న పరమార్థము పూర్తి జేయబడినది. మొదటి రెండు ప్రబోధములు గద్య నిబంధితములై యీ వైకృతము పద్యనిబంధితమైనది. ఆయన రచన యట్టిది.

ఈ ఋష్యశృంగకథలో నీ మూడు విషయముల మీదనే కథ యాధారపడియున్న దని పరమేశ్వరశిల్పి యైన నన్నయ్యగారికి తెలియును. ఆయన యీ విషయమును దర్శించెను. ఈకథ యంతయు —

౧. వారకాంత యిట్లు ఋష్యశృంగుం బ్రబోధించి;

౨. విభాండకుడు కొడుకుం బ్రబోధించి;

౩. తరుణి మునినందను చిత్తంబునకు వైకృతంబు సేసె.

ఈ మూడింటిమీద నాధారపడియున్నది. ఈ రహస్యమును నన్నయ్యగారు నిరూపించి యీ కథాతత్త్వమిదియని తెలిసికొని యీవిషయత్రయపరిజ్ఞానమే యీ కథలో రహస్యమై యది విస్మృతమైనప్పుడే కథాప్రసన్నత కలుగు నని తెలిసికొనిన ద్రష్ట.

ఇంక ఇట్లు విస్మృతమైన మహావిషయమును పాఠకునకు ప్రసన్న మెట్లు చేసెనో, యీ రహస్య మెట్లు ప్రసన్నమైనదో వ్రాసెదను.

ఇట్లు ప్రబోధ ప్రబోధవైకృతములు అను మూడు దశలు గల యీ కథారహస్యము మూడుదశల సుచిత రీతిని పరిపోషించుటచేత కథాప్రసన్నత కలుగును. ఇందు ప్రథమతృతీయదశలు సామాన్యములు. వారకాంత తన చాకచక్యముచేత యౌవనదశావిర్భావము గల ఋష్యశృంగుని మనస్సునందు తద్భావము కలిగించుటలో నధికవిశేషము లేదు. అవిజ్ఞాతయౌవన భావముగలవానియందైనను, విజ్ఞాతయౌవనభావము కల వానియందైనను దాని ప్రయత్న మొక్కరీతిగనే యుండును. ఒక్కటియే భేదము. పూర్వమే తెలిసిన వానిని వ్యామోహింపజేసినచో వాడు నైతికముగా కూడ భ్రష్టు డగును. ఋష్యశృంగునియందు నైతికమైన జారుపాటు లేదు. ఈ వారకాంత ఆ పని చేయదు. ఆమెకు రాజదండభీతి కలదు. అందుచేత వతనియందు స్త్రీవిషయికవాంఛాంకురము కలిగించుటయే యామె కార్యము. అట్లు చేసినది. అట్లు చేయుటలో లౌకిక విషయపరిజ్ఞాత్రియైన యామె తెలివితేటలు కన్పించవచ్చును. ఆమె తన యాశ్రమమునకు రాగా నితడామెను ఋషి యనుకొని కృష్ణమృగచర్మకృతకుశాసనమునం దుండగా బనిచి దాని కతిథిపూజ సేయ నున్న నామె యిట్లనియె:

"మాయాశ్రమ మిందుఁ గూర్
న్యాయనిధీ మూడు యోజనమ్ములు కలదే
బోయెద నీవును విజయుం
జేయుమ యందులకు చెలిమిసేయుము నాతోఁ
అట్లైన నీచేత సత్కారమ్ము కొందును."

అది వచ్చుచునే యీ నియమము చేసినది. తన్ను చూచి మొదటనే ఋష్యశృంగు డిట్టి సుందరాకారు మునిసుతుని జూడలే దన్నాడు. అనుటయే కాక

వాని యాశ్చర్యము, సాభిముఖ్యము నామె గుర్తించినది. ఈ యాభిముఖ్యమును పురస్కరించుకొని ముని ముందట కందుకనర్తనాదులు చేసినది. 'మునిముందట' యన్న శబ్దములో రహస్యార్థము గలదు. అభినయము సేయునపుడు సాత్త్వికభావాదులు నేత్రచాలనహస్త విన్యాసాదులు పురస్థపురుషసముద్దిష్టములుగ భావింప జేయుట గలదు. దానిచేత ఋష్యశృంగు డెంతయు కదలిపోవును. ఆలింగన మవధిప్రాయ మైనది. ప్రబోధము జరిగినది.

ఈ ప్రబోధముయొక్క లక్షణ మెట్టిది? దాని స్వభావ మెట్టిది? ఆ వారకాంతయందు ఋష్యశృంగుడు రమించలేదు. యౌవనవంతుడైన పురుషుని యందలి యేభావము స్త్రీవాంఛాసముల్లసితమై ప్రబుద్ధమగునో తాదృగ్గుణవిశిష్టమైన భావమే యతనియందు జాగృతమైనది. తావన్మాత్రమే యీ ప్రబోధము.

అది తావన్మాత్ర మగుటనే ఋష్యశృంగుడు తండ్రితో జెప్పను. అత డగ్నిహోత్రంబు వేల్వక విపరీతబుద్ధియై యుండెను. విపరీత మనగా వ్యతిరిక్తము. దేనికి వ్యతిరిక్తము? గృహస్థాశ్రమమందుగూడ నగ్నిహోత్రముగూడ గలదు. అతని యప్పటి భావము బ్రహ్మచర్యాగ్నికి వ్యతిరేకముగా నున్నది.

ఆ వారకాంత ఋషికుమారు డనుకొని దానిని తండ్రితో వర్ణించుచున్నాడు. "కాంచనవర్ణుడు కడు రూపవంతుడు. కమ్మని కెపలతో ఘనములగుచు ననయంబు వట్రువలగు రెండు పెంపెమ్ము లురమున విలసిల్లుచుండ" దాని రొమ్ముమీద రెండు జడలు వ్రేలాడుచున్నవి. అది రెండు జడలు వేసికొని, రెండు జడలు రెండు భుజములమీద నుండి రొమ్ముమీద వ్రేలాడునట్లు వేసికొన్నది. ఇచ్చటనున్న శబ్దములను చక్కగా విచారించినగాని యీ యర్థము తెలియదు.

పూర్వకాలమున రజస్వలయు, విప్రలబ్ధయు నేకవేణీధరలు. మన పురాణములయందలి స్త్రీపురుషులు చాలామంది యౌత్తరాహులు. ఈ ద్విజటలక్షణము పాంచాలదేశమునందు నేటికి కన్పించుచున్నది. ఆ బ్రహ్మచారిది కలహంసకూజితకలనాదము. వాని వదనమ్ముకలవ సుగంధము వెల్వడుచున్నది. వానిది పుంస్కోకిలాలాపచారువైన మాట.

ఆ వారకాంత సహజమైన కంఠస్వర మట్టులుండగా కర్పూరాదిసుగంధద్రవ్యమిళితతాంబూలచర్వణము చేసి మాటాడినది.

ఈ ఋషికుమారునకు స్త్రీకంఠములోని పంచమ స్వరము విచిత్రముగా వినిపించినది. అతనిలోని యౌవనభావమునకు కాంతాకంఠగతపంచమస్వరము ప్రబోధహేతు వైనది. ఇది యొక విచిత్రమైన సృష్టి రహస్యము. మహర్షివంటి కవియే దీనిని చెప్పగలడు.

వాడు కట్టిన చీరలు మృదులములు. వాని బృహత్కటిభాగమున నొక్క కనకపట్టము వెలుగును.

బృహత్కటి యన్న శబ్దమును ఋష్యశృంగు డెట్లు వాడెను? దానిని చూచినప్పటినుండి దాని నడుముసన్ననితనమే వాని హృదయములో హత్తుకొన్నది. "నడచునపుడు అన్నువనడుమును వడకంగా" అని మొదటనే చెప్పినాడు. అహో! యౌవనావిర్భావము గలిగిన పురుషుని చిత్తవృత్తియందు రమణీయ స్త్రీమూర్తిముద్ర. పృథుకుచములు. బృహత్కటి. అన్నువనడుము. సార్వకాలికముగా శిల్పసమూహ మారాధించుచున్న మూర్తిరమణీయత.

మరియు వానియొక్క తనువునయం దుద్భవమై యొక సౌరభము విలసిల్లును.

అది వారకాంత పద్మినీజాతిస్త్రీ కాకపోవచ్చును. కాదు. మరి యీ సౌరభ మెట్టిది? పవనసమీరితమధు సంభవవివిధప్రసవసౌరభముబోలి ఆమె శరీరమునిండ నత్తరులు వ్రాసికొన్నది. కాని యీ సౌరభము మహర్షియైన యతని యౌవనవాంఛలో తా నెరుగక జీవునియందు సంగృహీతములైన సర్వసంస్కారాంతర్గతపద్మినీజాతిస్త్రీభావనావిషయమున నుపకరించినది.

అది కందుకక్రీడ చేసినది. వాతావధూతమైన శాలవృక్షమువలె నున్నది. శాలలతవలె లేదు. ఆ వార

కాంత వయసున చిన్నదయ్యు నది ప్రౌఢయే. ముగ్ధ కాదు. బాలయై ముగ్ధయైనచో నాప్రబోధమే జరుగదు.

వాడు నన్ను కౌగిలించుకొని మొగముదగ్గర మొగము పెట్టి యొక మృదుశబ్దము జేసెను. 'ఆ బ్రహ్మచారిముఖ మంబురుహాసమంబు!'

ఓహో! కవిసమయములలోని పరమరహస్యములు నన్నయ్యగారు సమర్థించుచున్నారా? అది మృదుశబ్దము చేసె నట. ఈ మాట యెట్టిదనగా? దాని కంఠరావము పుంస్కోకిలారావ మనునట్టిది. ఈ చేసిన మృదుశబ్దము మణితము. మణితము రతిదశాపరమసోపానవిశిష్టము. ఆ పరమవిషయమే వాని యీదృశమైన ప్రబోధమునకు కారణ మగును.

వాడు తన చేతి పుష్పముల చల్లగా నవి యవి యళిప్రకరనిషేవన మొప్పున్న యది. ఇవ్వనకుసుమము లట్లు గావు, వరగంధంబులు.

ఈ ఋష్యశృంగుడు వట్టి ఋషికుమారుడు కాడు. ప్రకృతిపరిశీలనాపటుబుద్ధి. తామరపువ్వులో తుమ్మెద వ్రాలుట చూచినవాడు. అడవిలో మకరందమునకు తిరుగు తేంట్ల పద్ధతి తెలిసినవాడు. మధుసంగ్రహణమునకై తేంట్లు ఏ పుష్పగుచ్ఛములమీదను గుమ్ములుగా వ్రాలవు. ఈ వారకాంత చల్లిన పూవుల మీద గుమ్ములుగా వ్రాలినవి. ఈ రీతిగా వస్తుతత్త్వ పరిశీలన చేసెడి బుద్ధి యతని కున్నది. ఇది భావుక లక్షణము. ఈలక్షణాతిశయము కలవాడు గనుకనే యీ ప్రబోధమునకు స్థానభూతు డైనాడు. నన్నయ్యగారు తీర్చిన ఋష్యశృంగు డిట్టివాడు.

ఈ పువ్వులు నిజమైన పువ్వులా, కాదా? అయినచో నంత హఠాత్తుగా తేంట్లు మూగవు: రాలిన పూవుమీద తేటి వ్రాలదు. అందుచేత నివి పుష్పాకృతిగా చేయబడిన భక్ష్యములు. అవి యెట్టివో చెప్పలేము. ఇట్లని యూహింపక తప్పకవచ్చినది.

ఇది యతనికి జరిగిన ప్రబోధము. లైంగిక జ్ఞానము లేకుండ లైంగికజ్ఞానాభిముఖమైన యొక మనఃప్రవృత్తి. ఈ ప్రవృత్తి మహర్షియైన నన్నయ్యకే తెలియును. భావుకమైన లోకము గ్రహించవచ్చును. అనుభూతి బహిర్విషయము కాదు. ఊహాగమ్యము. ఊహోచితము.

ఇట్టిది ప్రబోధమును తొలగించుటకు తండ్రి మరల ప్రబోధించెను.

అతడెట్లు తొలగించెను? రాక్షసులు తపంబులకు విఘ్నంబులు సేయుదురు. ఈ యడవిలో వారు తిరుగుచుందురు. తద్వృత్తములు వర్జనీయంబులు.

తపస్సనగా నేమి? మహర్షు లనగా నెట్టివారు? తపస్సు దేవతాలక్షణము. దాని కెదురుతీర్చినది రాక్షస లక్షణము. ఇది సర్వవేదమునందు ప్రకటితమైన యర్థమే. తపోవిఘ్నకారులు రాక్షసులు; అన్న మాట చాలును ఋషికుమారునకు.

మూడవ దశ చాల సులభము. తండ్రిచేత ప్రబోధింపబడిన యతని చిత్తమునకు వారకాంత వైకృతము గలిగించెను. అంతే. ఋషికుమారుడు తండ్రితో చెప్పకుండ వెడలిపోయెను. అరే! ఏమి యీ యౌవనదశావికారప్రాభవము? ఋష్యశృంగునియంతివాడుకూడ తండ్రితో చెప్పకుండ వెళ్లిపోయెను. ఎంత దుర్దమమైనది యీ వికారము!

నన్నయగారీ కథలో చేసిన మహార్థము లివి. ఋష్యశృంగుని తీసికొని యౌవనవికారస్వరూపమును నిర్ణయించెను. ఈ మహార్థము ప్రసన్నమగుచున్నది.

అప్పాజి

[గేయ నాటిక]

'సంపత్'

[కోటబురుజులో—కారాగారములో ఒక గది. తిమ్మరసు, తలవరి, చండాలురు ప్రవేశము.]

తిమ్మరసు

లోహశూలము లెఱ్ఱగా కాచి సిద్ధముగ
తెర వెనుక నిలబడుడు; గట్టిగా నేలపై
నేను పదఘట్టనము చేసినప్పుడు వచ్చి,
బంధింపు డీ స్తంభమునకు నాతోనుండు
బాలకుని. అప్రమత్తత చూపి, జాగ్రత్త
కనిపెట్టుకొనియుండు డిక పొండు మీపనికి.

తలవరి

ప్రభుశాసనమంచు దీని భావించెదము.

తిమ్మరసు

తగనిసంశయములివి! మీరు భయపడవలదు.
రాజాజ్ఞగా దీని పాలింపు డికపొండు.

[తలవరి, చండాలురు నిష్క్రమణము]

పసికుఱ్ఱ! రావయ్య! చెప్పవలె నీ కొకటి.

[కృష్ణదేవరాయలు ప్రవేశము]

కృష్ణదేవరాయలు

ఓ అమాత్యా! నీకు నాగమాంబాసుతుడు
ప్రణమిల్లుచున్నాడు.

తిమ్మరసు

శుభమస్తు యువరాజ!

కృష్ణదేవరాయలు

యువరాజు!—రాజభోగీణమగు పట్టమును
కట్టుకొన నర్హుడగు యువరాజు—బంధితుడు
నీయెదుట! అయ్యో! నీ భ్రూరేఖపై విషా
దచ్ఛాయ లలముకొన్న వదేల?

తిమ్మరసు

ఇది ఏమి,
హర్షనిర్భరమూర్తి నాకావిచారమ్ము?

కృష్ణదేవరాయలు

ఔనవును. నే వినా లోకమున ఎవ్వరు వి
పన్నులే లేరేమొ! ఐన నే నెఱుగుదును
కర్ణాటదేశమున, ఊరకే వేడుకకు
హేమంతనిశలవలె నాయెదుట దీనముగ
దీర్ఘముఖములు పెట్టు అరసులను. చెప్పెదను
మావిరూపాక్షదేవుని యాన; క్రూరకా
రాగారబంధమే లేకున్న, ఊరూర,
ఇంటింట యాచించుకొనినైన సుఖపడెద
బ్రతుకులో నవవసంతోత్సవము నింపుకొని.
చెరసాలలోకూడ అంతఃపురమ్మువలె
ఆనందపడగలను-విషసర్పమై రాజు
ఇంతకన్నను హింస కెత్తులెత్తకయున్న.
భయము నా కత డనిన; ఆతనికి నే ననిన.
నరసరాయల పుత్రు డగుట నా దోషమా?
కాదు, నిజముగ, కాదు; ఎంత నిర్భాగ్యుడనొ
నీకొడుకుగా నైన పుట్టనైతిని నేను.
మనసారగా నన్ను ప్రేమించుచున్నచో
నీకడుపుపంటగా భావించి ఒకసారి
నీగుండె కద్దుకొని నా కొక్క ముద్దిమ్ము.

తిమ్మరసు (స్వగతము)

పలుకరించిన ఇతని ఈ అమాయకతతో

ఉన్నిద్ర మగునేమొ నాలోని సుప్తమగు
అనుకంప. ఇక విలంబించుటయె అనుచితము.

కృష్ణదేవరాయలు

నీ కనారోగ్యమ్ము లేదుకద ? నీరసిం
చితి వేమి ? నిజముగా నీ కిప్పు డల్పమగు
ఏ శిరోవేదనయొ వచ్చుటయె వాంఛింతు.
రేయెల్ల నీశిరసు చెంతనే కూర్చుండ
నోచుకొని ఉపచారములు చేయుటకునైన.
నీయందు నా కెంత అనురాగ మున్నదో
నాయందు నీ కంత అభిమాన మున్నదా !

తిమ్మరసు (స్వగతము)

(నామనసు కరగించి కైవసము చేసికొను
చున్న వీతని పల్కు లిక తడయగా రాదు)—
రాజాజ్ఞ చూడు మిది.

[రాజశాసనము చూపును.]

(ఇది ఏమి నాకనుల
క్రూరహింసావ్యసనసంతాళనక్షమము
లగు నశ్రుబిందువులు! నేనింక త్వరపడెద.
లేకున్న నాలోని వజ్రసంకల్ప మిది
రాలిపోవును బాష్పకణములైకరగి)—
చదువగలవా దాని ? లిపి బాగుగా లేద ?

కృష్ణదేవరాయలు

చాల బాగుగ నున్న దీ రాతుసక్రియకు!
తప్తలోహపు శూలముల గ్రుచ్చి నాకనులు
కాల్చి పెకలించుమని నీకు రాజాజ్ఞ ఇది.

తిమ్మరసు

ఔనోయి ! పసికందు ! ఔను, ఇది రాజాజ్ఞ.

కృష్ణదేవరాయలు

పాలింతువా దాని ?

తిమ్మరసు

పాలించెదను దాని.

కృష్ణదేవరాయలు

నీ హృదయ మట్టిదా ? ఆనాడు తలబ్రద్ద
లైపోవు, ఆ శిరోవేదనాసమయమున
నీతలకు కట్టితిని నాఉత్తరీయమును,
నాకు ప్రియతమమైనదాని,—జ్ఞాపకముగా
నొక్క హొయసలరాజకన్య ఇచ్చినదాని—
దానినిమ్మని మరల నిన్నడుగనే లేదు.
ఆ అపరరాత్రిలో, ఆనాడు నారెండు
హస్తముల నీశిరము నెమ్మదిగ నెమ్మదిగ
నొత్తుచును ఉపచారవచనములుపలుకుచును,
వేదనాభారమున అతికఠోరములైన
నిశ్చలముహూర్తములు క్షణికములుగా జేసి,
నీబాధ పంచుకొని సుఖపెట్టజూచితిని.
"కలికమును వేయనా", "బాధగా నున్నదా"
అనిఅడిగి, నీలోని తీవ్రవేదన నెల్ల
జోకొట్టు మాటలను వెదకి ఓదార్చితిని.
ఒక రాచబిడ్డ నీ కుపచారములు చేసె !
కపటమని, కల్లయని, కైతవప్రేమ యని,
శంకింతువో ఏమొ ! పాపపుణ్యము నీది.
నీచేతి మీదుగా నడచుటయె దైవేచ్ఛ
యైనచో కానిమ్ము ! నాకనులు నిజముగా
తీసెదవ ! అప్పటికి, ఇప్పటికి, ఎప్పటికి
నీమెడల ఒక కుటిలభ్రూభంగమైన ఎఱు
గని కనులు తీసెదవ!—

తిమ్మరసు

వాగ్దాన మిచ్చితిని.
ఇది చేసి వత్తునని; తప్తశూలములతో
పొడిచి కన్నులు తీయుమని నాకు రాజాజ్ఞ.

కృష్ణదేవరాయలు

లోహయుగమున కాని చేయ రెవ్వరు దీని.
ఎఱ్ఱగా నున్న ఈ ఇనుపకొఱ్ఱులు కూడ
నన్ను దరియగ వచ్చినపుడు నా కన్నీట
తడిసి, తమ కోపాగ్ని చల్లారి, నాకనులు.

పొడిచికాల్చెదు క్రూరహింసాగ్నితమయందు
ధరియించినందులకు సిగ్గుపడి, నిష్కృతికి
త్రుప్పుపట్టుచు రాలి ఖిలమగును. కాలాయ
సముకంటె నీగుండె కఠినమగునగ్రజమా!
"తిమ్మరసు నీకనులు తీయు"నని దేవతలు
చెప్పినను, నమ్మియుండను నేను—ప్రత్యక్ష
ముగ నెదుట ఈమాట నీనోట వినకున్న,

తిమ్మరసు

రండిరా ముందరికి.

[పదఘట్టనము చేయును.]

[తలవరి, చండాలురు మరల ప్రవేశము: పాశము
లతో, తప్తశూలములతో, ఇంక నితరములతో]

కానిండు నాయాజ్ఞ.

కృష్ణదేవరాయలు

రక్షింపు! రక్షింపుమో అమాత్యా నన్ను!
ఈ క్రూరకింకరుల ఉగ్రమగు చూపుకో
ఆః! ఆరిపోయినవి నాకనులు.

తిమ్మరసు

శూలములు
నా కిచ్చి, కానిండు, బంధింపు డాతనిని.

కృష్ణదేవరాయలు

అంత ఉగ్రుడవగుట ఎందులకు! నేను పెన
కువలేక స్వాధీన మయ్యెదను; ఒక శిలా
ప్రతిమవలె పడియుండెదను; వీరిచే
నన్ను బంధింపనీయకుము-అదె నాకుపది వేలు.
ముందు నామాట విని ఈ భయంకరమూర్తు
లనుతొలగిపొమ్మనుము. అవలికిపొమ్మనుము.
కట్టు కదలను నేన, వెనుబడను, కిమ్మనను;
చూడ నా శూలములవంకైన కోపమున.
వీరి నావల గెంటివేయు మంతే చాలు.
చిత్రవధ కానిమ్ము, నీవు చేసినదాని
సహియింతు;—క్షమియింతు.

తిమ్మరసు

తెరవెనుక కేగండి.
మమ్మిద్దరను వదలి; చాటుగానుండండి.

తలవరి

ఇది మా అదృష్టమే! ఈ పనికి దూరముగ
నుండుటయె మాకు సమ్మతము.

[తలవరి, చండాలురు నిష్క్రమణము.]

కృష్ణదేవరాయలు

ఆః! ఆ స్తబ్ధం
ధువునొకని దూషించి పంపితినె! అతడు బయ
టికి కరకు; లోన నవనీతమే! మరల ర
మ్మను మతని; ఆ కృపాళుని కరుణ నీకఠిన
పాషాణహృదయమును కదలించికరగించు
నో ఏమొ!

తిమ్మరసు

రా, రమ్ము, సంసిద్ధపడు మింక

కృష్ణదేవరాయలు

వేరె మార్గము లేద?

తిమ్మరసు

లేదు, నయనోత్పాట
నము తప్ప మరి యొకటి.

కృష్ణదేవరాయలు

అబ్బబ్బ—దారుణము!
ఒక బెడ్డ, ఒక నలుసు, ఒక ధూళికణ మేదొ
నీ కనులలో పడిన — పరమాణువైకూడ
సంక్షోభ హేతువై ఎంత యాతన పెట్టు
నో—నీవు మనసులో భావించిచూచినచొ
నీ క్రూరసంకల్ప మిది ఎంత దారుణము!

తిమ్మరసు

వాగ్దాన మిది యేన? ఇంక నీనాలుకను
కట్టివేయుము చాలు.

కృష్ణదేవరాయలు

ఓ మహామంత్రీ!—
రెండు కన్నులకోస మెన్ని నాలుకలతో
వాదించి చెప్పినను ధర్మమే అగునేమొ!
నన్ను మాటాడనీ;—మాటాడనీ మంత్రి!
అంత నీ కిష్టముగ నున్నచో నా నాల్క—
కోసివేయుము నీవు; నాకనులుదక్కించి.
కృపచూపి నేత్రదానము నిమ్ము; దేనికిని
కొరగాకపోయినను నిన్ను చూచుటకైన.
అదిగో! ఆ శూలములు చల్లారిపోయినవి.
హాని చేయవు నన్ను.

తిమ్మరసు

వెఱ్ఱివాడా! మరల
కొలిమిలో నెఱకావి ఎక్కించగలనోయి!

కృష్ణదేవరాయలు

లోకపావకుడైన అగ్ని, తన కనుచితము,
క్షుద్రమును, విపరీతమైనట్టి క్రియకు విని
యోగింప, అనుతాపమున క్రుంగి, చల్లబడి
నా డదిగో! ఆ చిచ్చులో చూడుమీ ర్ష్యకను
పించదే! వైకుంఠపవనములు ఊదివే
సినవేమొ వానిదగు తీక్ష్ణప్రతాపమును.
గుండెపై పడిచి పశ్చాత్తాపమనుపానుగు.

తిమ్మరసు

వాని నుష్ణాన ఊది రగిలింపగలనోయి.

కృష్ణదేవరాయలు

నీ ఉద్యమము చూచి, సిగ్గుతో వైవర్ణ్య
మునుపొంది, ఇంగలము కోపమున కెంపెక్కు.
ఒకవేళ నీకనుల నిప్పునెరసులు చిమ్మి
ప్రతిఘటించునో యేమొ! నాపై ప్రయోగించు
మారణద్రవ్యములు కర్తవ్యతాపరా
ఙ్ముఖములై కనుపించు; ఒక నీకుమాత్రమే
ఏ కోశమున లేదు నిప్పునకు, ఇనుమునకు,
విఖ్యాత హింసోపకరణముల కున్నట్టి
కనికరము నా మీద!

తిమ్మరసు

కాదోయి నామీద
మచ్చుమందును చల్లి, పిచ్చివానినిచేసి
తుద కిట్లు వదలితివి. నామనసు మార్చితివి.
మీ అన్న నవనిధులు తెచ్చి ఇచ్చిన నేను
నీ కనులు తాక నిక. ఆంధ్రతమోహృదయ
నమ్మోహనములైన నీ కనులు తీయ నిక.

కృష్ణదేవరాయలు

నయనదాతా! ఇప్పు డచ్చముగ తిమ్మరసు
వలె నీవు కన్పించుచున్నావు. ఇంతవర
కును ఏదో ప్రచ్ఛన్నమూర్తివలె తోచితివి.

తిమ్మరసు

చాలు. సెల, నిక పోయివచ్చెదను. ప్రభువు కే
మాత్రమును తెలియరాదీ గుట్టు. ఈ గూఢ
చారులకు కంట కలికము వేసి పంపెదను,
మిథ్యాప్రచారములతో నింపి. నా చిన్ని
గారాల కూసు నిక వజ్రకవచము వేసి
రక్షించెదను నేను.

కృష్ణదేవరాయలు

ప్రాణదాతా! మనవి.
నాతండ్రివలె నీవు పూజ్యపాదుడ వైతి
విక నాకు. నిన్ను నే నప్పాజి అననిమ్ము
నామనసు తృప్తికై.

తిమ్మరసు

ఓయి వత్సా! శుభము.
[అని ముద్దు పెట్టుకొనును]
మెల్లగా ర మ్మింక నావెనుక. మనశత్రు
సంతరణ సేతువును నిర్మించుకొనవలెను.

కృష్ణదేవరాయలు

ధన్యుడను. అప్పాజి, నిజముగా ధన్యుడను.

['King John' అన్న షేక్స్పియర్ నాటకంలోని Prince Arthur Hubert సంవాదసన్నివేశము వంటిదే కృష్ణదేవరాయల జీవితంలోకూడ ఉన్నట్లు అను శ్రుతంగా ఒక ప్రథ ఉన్నది. ఈ రెంటిని సమన్వయించు కొని ఈ దృశ్యఖండం వ్రాశాను. —సంపత్]

బంగారునకు మెఱుగు-
శృంగారనైషధము

●

శ్రీ గడియారము వేంకటశేషశాస్త్రి

అంటే, సంస్కృతనైషధకావ్యము బంగారమని, తెలుగుశృంగారనైషధము దానికి మెఱుగనీ భావం. సంస్కృతకావ్యకర్త శ్రీహర్షుడు. నాగానందాదికృతికర్త హర్షుడు మఱొకడు. శ్రీహర్షుడు కాశ్మీరనృపసభాకమలహేళి - ఉద్దండపండితుడు. ప్రౌఢబంధబంధురముగా నైషధకావ్యమును రచించినాడు. ఈ నైషధ మాంధ్రీకరించినవాడే శ్రీనాథుడు. ఇతడు బ్రాహ్మీదత్తవరప్రసాదుడు, కవిసార్వభౌముడు. శ్రీనాథుడన్నాడు గదా - "పనివడి నారికేళఫలపాకమునన్ జవిరైన భట్టహర్షుని కవితాను గుంభములు సోమరిపోతులు కొందరయ్యలౌ నని కొనియాడ నేరరు" అని. అంటే అది అంత ప్రౌఢకావ్య మట. ఆ సోమరిపోతులను కనికరిస్తూ అంటాడు —"అది యట్టిద; లేజవరాలు చెక్కు గీటిన వసవల్చు బాలకుడు డెందమునన్ గలగంగ నేర్చునే!" వసి బాలురక్రింద జమకట్టి, సోమరిపోతు లంటే అన్నాడు కాని శ్రీనాథుడు కమ్మని పూలదండలతో విసరికొట్టినాడు. ఆ మహాకవు లిరువురు రచించిన కావ్యముల తారతమ్యమే యీ ప్రసంగవిషయము. సంస్కృతకవి "శృంగారభంగ్యా" రచించితి నన్నాడు. తెలుగుకవి "శృంగారనైషధ" మని పేరే పెట్టుకొన్నాడు. ఈ శృంగారరసతరంగము లెట్టివో చూతము.

ఆంధ్రానువాదము చేయుటలో తా ననుసరించిన రీతిని శ్రీనాథు డిట్లు చెప్పినాడు: "శబ్దం బనుసరించియు, అభిప్రాయంబు గుర్తించియు, భావం బుపలక్షించియు, రసంబు పోషించియు, అలంకారంబు భూషించియు, ఔచిత్యం బాదరించియు, అనౌచిత్యంబు పరిహరించియు మాతృకానుసారంబుగా చెప్పబడినది" అని. అట్లే తన మాట చెల్లించుకొన్నాడు కూడ. కావునసే ఈ యనరచన సంస్కృతనాటకాంధ్రీకరణములవలె మూలమున కంత చేరువ గాక, భారతాదులవలె దూరము గాక తల్లివెంట నడుచు తరుణివలె ఒయ్యారముగా నడిచినది. ఈ యనువాదములో మూలమున ౨౮ వందల గ్రంథము తెనుగున ౧౩ వందలకు దిగినది. రసవద్ఘట్టముల శోషించి, తక్కినవానిని కుదించి యిష్టమువచ్చినవానిని ఏరికొన్నాడు. వనవర్ణనము ౩౦ శ్లోకములకు ౬ పద్యములు, మన్మథదూషణ కలా శ్లోకములకు ౯ పద్యములు, పురవర్ణన ౩౩ శ్లోకములకు ౬ పద్యములు—ఇట్లే కావ్యమంతయు సంగ్రహించినాడు. కొన్నిచోట్ల ౩, ౪ శ్లోకములు తీసికొని వాని హృదయమును తన భావనతో కలిపి, చిక్కని పద్యము లల్లును. మరికొన్నిచోట్ల ౧ శ్లోకమున కొకపాదముగా సీసపద్యమునడక తూగించును. వేఱొక కొన్నిచోట్ల, ఒకశ్లోకమున కొక సమాసముగా పెద్దవచన మల్లి కొంత గ్రంథమును దాటును. ఈ సంగ్రహములో ఇతివృత్తముతో వర్ణనాంశములు జడయల్లికతో మొగ్గల కూర్పువలె మిక్కిలి యందగించినవి.

గ్రంథభారమును సంగ్రహించుటయే గాక, కథాసన్నివేశములనుకూడ బాగుగ సంస్కరించినాడు. దమయంతీస్వయంవరమునకు ఇంద్రుడు పయనింపగా, శచీ రంభాదులు తకతకలాడినట్లు మూలము. తెలుగున శచీదేవికిమాత్రము ఆ గొడవయే తెలియదు. మూలమున త్రిభువనస్త్రీలు, త్రిమూర్తుల భార్యలు నలుని గుణరూపములతో ముగ్ధలు కాగా తెలుగున ఆ త్రిమూ

ర్తల భార్యలకు ఆ వార్తయే చేరినట్లు లేదు. సంస్కృత దమయంతి దేవదూతయగు నలునకు రాగా లేచి, తన సింహాసన మాయన కిచ్చినది. తెలుగుదమయంతి సఖీ జనంబుచే కనకాసనమును వెట్టించినది. ఇట్లే దమయంతి వలచిన వార్త హంస చెప్పినపుడును, ఇంద్రాదులు మొదట నలుని చూచినపుడును, నలుడు నలుడుగా దమయంతియెదుట నిలబడినపుడును, మఱియు పెక్కుసన్నివేశముల ఉచితసంస్కారములు చేయబడినవి.

శ్రీనాథుడు చేసిన భావార్థరసపాత్రోచిత సంస్కారముకూడ మిక్కిలి హృద్యమైనది. చూడండి:-

"భైమీపదస్పర్శకృతార్థరథ్యా
సేయం పురీత్యుత్కలికాకుల స్సన్"

దీనికి తెలుగు :

"దమయంతీసుకుమారపాదకమల
  ద్వంద్వార్పణాధన్యతకు
ట్టిమహార్హశ్లాఘ్యంబగు పట్టణం బిపుడు గం
  టిఁ గంటినం చెంతయుఁ
బ్రమదం బందె."

శ్రీహర్షుడు తన దమయంతిని రాచబాటలవెంట కాలినడక నడిపింపగా 'రాచకన్నె అట్లు నడచునా?' యని శ్రీనాథుడు తన దమయంతిని సౌధములో చప్పట నేల నడిపించినాడు. అంతే కాదు. ఆమె 'సుకుమార పాదకమలద్వంద్వము' కలది యన్నాడు. శ్రీహర్షుని దమయంతివి, పాపము, వట్టి పాదములు! అందుకే తెలుగు నలుడు "కంటిఁ గంటి నం చెంతయుఁ బ్రమదం బందె"నాడు.

"లిపిర్న దైవీ సుపఠా భువీతి
తుభ్యం మయి ప్రేరితవాచకస్య"

దేవలిపి భూలోకమువారు చదువలే రని, ప్రేమలేఖ వ్రాయక ఇంద్రుడు నన్ను పంపినా డమ్మా అంటుంది శ్రీహర్షుని ఇంద్రదూతిక. శ్రీనాథుని ఇంద్రదూతికమాట వినండి:

"చంచలనేత్ర! దివ్యలిపి
  సంతతి భూజనముల్ పఠింపలే
రంచును మానెగాని, నఖ
  రాగ్రమునన్ లిఖియించి నీకు పు
త్తెంచు జుమీ మహేంద్రుడు మ
  దీయకరంబున దేవతావనీ
కాంచనకేతకీ కుసుమ
  గర్భదళంబున కార్యపద్ధతుల్."

ఆ మొదటి దూతిక ఉన్నది ఉన్నట్లుగా ఒక మాట చెప్పినది. ఈరెండవదో, ఉన్నవి లేనివి కల్పించుకొని, మా నందనోద్యానము బంగారు మొగలిచెండ్లు నాజూకైన గర్భదళాలు ఇంద్రుడు కొనగోర వ్రాసే కట్టలు కట్టలు వలపుకమ్మలు. ఓహో! పూరించి పూరించి మనసుకు గిలిగింత పెట్టుతుంది. ఏమైన ఈ తెలుగుదూతిక మిక్కిలి మాటకారి.

"సతీవ్రతై స్తీవ్ర మిమంతు మంతు
మంతర్వ్యరం వజ్రిణి మార్జితాస్మి"

ఇంద్రుని యాజ్ఞను ఆ మహాపరాధమును పతివ్రతావ్రతచర్యలతో తీర్చుకొందును. దీనికి తెలుగు—

"స్వర్పతిచిత్తవృత్తి కలు
  షత్వము నందునో యన్ భియంబు నా
కేర్పడలేదు; విన్ము దివి
  జేశ్వరదూతిక! సప్తతంతు భా
గార్పణ మాచరించి, కర
  మాదరణంబున, నేను - రాజకం
దర్పుడు నైషధాధిపుడు
  తన్ను సపాస్తి యొనర్ప గల్గుటన్"

శ్రీహర్షుని దమయంతి తా నపరాధము చేసితి నని, దానితో ఇంద్రుడు కోపించు నని అంగీకరించి, ఆ తప్పును సతీవ్రతములతో తీర్చుకొందు నని బదులు చెప్పినది. శ్రీనాథుని దమయంతి ఆ అపరాధభయము నాకు లేనే లే దంటుంది. "నేను, మారాజు యజ్ఞములు చేసి హవిర్భాగము లప్పగింపగలము. సంతోషపెట్ట గలము" అని ధీమాగా చెప్పుతుంది. ఆమె నోములు, వ్రతాలు ఒంటరిగానైనా చేస్తా నంటే, ఈమెగారో

తాను, తన రాజకందర్పుడు ముచ్చటగా యజ్ఞవేదికపై కూర్చోవడం, హోమాలు చేయడం, దానాలు యివ్వడం ఆ వైభవమంతా అప్పుడే అనుభవిస్తున్నట్టు గంభీరంగా చెప్తుంది. తన మాటల్లో తాను నలరాజునే తప్పక పెండ్లాడుదు నని, ఇంద్రుడు హవిర్భాగాలు తీసికోవల సిందే గాని భోగాలు కోరగూడ దని, ఆయన ఉపాస్యుడే గాని వరణీయుడు కా డనీ ధ్వనింపజేస్తుంది. ఏమైనా శ్రీనాథుని దమయంతి పరమోదాత్త, ప్రగల్భకూడ.

"గిర శ్రుతా పీవ తవ శ్రవస్సుధా
శ్లథా ఒభవన్నామ్ని తు న శ్రుతిస్పృహా!
పిపాసుతా శాంతి ముపైతి వారిజా
న జాతు దుగ్ధాత్ మధు నోధికా దపి"

—"మధురమైన నీ మాటలు విన్నాను. అయిన నీ పేరు వినుటయందు నా ఆశ తీరలేదు. నీటికొరకు పుట్టిన దప్పి పాలవలన గాని, తేనెవలనగాని ఎన్నడు తీరదు గదా!" అని శ్రీహర్షుని దమయంతి నలునితో అంటుంది. ఇక శ్రీనాథుని దమయంతిమాట వినండి:

"అధికతరులైనగాని దిశాధిపతులు
కౌతుకము నాకు నీవంశకథలయందె
దప్పిగొన్నట్టివారి కా దప్పి రదీ
సలిలపూరంబు హితవో! ఆజ్యంబు హితవో!"

ఇచ్చట "దిక్పతులు గొప్పవారైనా, నాకు నీయందే మక్కువ యెక్కువ" అనియే ఇరువురి హృదయముకూడ. అయినను, దానిని రుజువు చేసికొనుటలో శ్రీహర్షుని దృష్టాంతము బలహీనము. ఎందుకంటే పాలతో, తేనెతో దప్పి పూర్తిగ తీరకపోయినను కొంత ఉపశమింపవచ్చు. కనుకనే శ్రీనాథుడు దానిని తొలగించినాడు. నేతివలన దప్పి యెక్కువగును కాని, తగ్గదను లోకజ్ఞత జూపినాడు. ఇంతే గాక, పూర్వార్థమున భావగాంభీర్యముకూడ గొప్పది. మీ అందచందములబట్టి గాక, వంశప్రతిష్ఠలనుబట్టికూడ నీయందు మక్కువ గల దను దమయంతిభావమును తోపించును. 'అయినగాని' అను పదము "నీవంశకథలతో పోల్చి చూచినచో దిశాధిపతు లేమంత ఎక్కువవారు!" అను భావమును ధ్వనింపజేయును. 'తరులు - వంశకథలు' అను పదములు, దిక్పతులు తరువులవలె బహుముఖములుగా ప్రాకునట్టి ప్రవర్తనము కలవా రనియు, తాత్కాలికమధురఫలములనే యియ్యగలవా రనియు, నలవంశకథలు అట్టివి గాక వెదుళ్లవలె చక్కని పెరుగుదల కలవై, లోకోత్తరములైన దివ్యమణులను పుట్టించునవనియు ధ్వనిపరంపర అనురణనములు చేయుచున్నవి. ఈ ఔచితీనిర్వహణము గ్రంథములో పెక్కుచోట్ల కనపడును.

సంస్కృతశ్లోకముల తెలుగున నడిపించునపుడు కూడ శ్రీనాథుని లేఖిని కదముద్రొక్కుచు పోవును. అతని రచనలో సాధారణముగా సంస్కృతాంధ్రములు ఎత్తునకెత్తు పడుచుండును. "సవిసంగంబున తాప మొందిన శచీప్రాణేశు కెంగేలికిన్" అను పద్యము చదువండి. ఒకప్పుడు అన్ని సంస్కృతములే సుందరపదబంధురములుగ బారులుదీరి కూర్చుండును. "కమలేందీవరషండమండితలసత్ కాసారసీవారతిన్" అను పద్యము చదువండి. మరియొకప్పుడు అచ్చతెనుగులే విచ్చిన విరజాజులై పంది ళ్లెక్కి పరిమళించును. "కబరికాభరముపై కన్నె గేదంగిపై-" అను పద్యం చదువండి. శ్రీనాథుని సీసపద్యములవడిక ఆంధ్రసారస్వతమున అపూర్వము, అద్వితీయము. ఆయన సీసపద్యపాదములు కావ్యములో అందందు గంధసింధురములై కదలిపోవుచుండును. మూలమునకన్న శృంగారనైషధమున ఈ తెలుగుపద్యగద్యరచన మిక్కిలి హృద్యమైనది.

తర్కాలంకారశాస్త్రపాండిత్యప్రతిభాసర్వస్వసారముగా సముద్భూతమైన శ్రీహర్షుని నైషధకావ్యము సారస్వతసముద్రమునుండి లేచివచ్చిన చింతామణియే గాని అమృతభాండ మనలేము. అది చింతామణీమంత్రచింతనఫల మగుటయే కారణ మేమో! కావుననే ప్రౌఢాలంకారబంధురమైన ఆ నైషధకావ్యము ఆంధ్రీకరించుటకు ఏ కవిగండరగండనికిని గుండె చాలినది కాదు. కాని శ్రీనాథుని కా సాహసము మెండు. దానికి తగిన కండబలముకూడ అతనికి నిండుగా కలదు. కనుకనే ఈ అనువాదములో ఆత డెన్ని పోకడలో పోయి, సర్వాలంకారసుందరముగ సంతరించి 'నైషధం

విద్యదోషధం' అనిపించుకొన్నాడు. మూలములోని అలంకారములను చాలవరకట్లే అచ్చున పోసినాడు. కొన్ని విడిలించి వేరుపరచినాడు. మఱి కొన్నింటికి క్రొత్త యందములు కూర్చినాడు. తనవే కొన్ని తయారుచేయడమో, ఉన్నవానిని ఉపేక్షించడమో జరుగకపోలేదు. అభిరుచినిబట్టి, ఔచితినిబట్టి సొంతముగా, స్వతంత్రముగా తన తెలుగుపలుకుబడితో కావ్యమును సరసరసాయనము చేయుటయే అతని నిర్వాహము. ఈ సందర్భమున 'పత్రములమీద మూగిన భ్రమరకులము', 'హాటకకలశంబులకును', 'దమయంతీ కిలికించిత', 'సౌరభము లేనియట్టి పుష్పంబువోలె', 'అంకిలిలేక యుప్పు డరుణారుణపల్లవనిర్గతంబులై' అను పద్యములను మచ్చునకు మూలముతో పోల్చి చూడవచ్చును. వివరణవిస్తరణములు తీరికగా చేయవలసిన పనులు. ప్రత్యేకముగా శ్లేషాలంకారమును తెలుగున సాధించుటలో కవిసార్వభౌముని కౌశల మద్వితీయము. గ్రంథములో అందందు వచ్చునవియే గాక పంచనళిలో ఇంద్రాగ్నియమ వరుణులకు, నలునకు శబ్దార్థములను సాధించిన కూర్పు మిక్కిలి రమ్యము. అందులో 'ఈతండె నలుడు - ఈతం డెన లు డు ' అని తెలుగు మర్యాదతో విరిచి మూలమునకు మెఱుగు పెట్టినాడు. సంస్కృతమున 'రాజపాణిగ్రహణాభిలాషం' అను దానిని 'రాజుం బాణిగ్రహణంబున వశీకరింపగోరెదొ' అని తెలుగుసేయుచు, దానికి 'అందని మ్రాకులపండ్ల గోయం దలంచెదొ' అను తెలుగు సామెతను జోడించి మూలములో లేని భావస్ఫూర్తి కలిగించినాడు. జతు కాష్ఠలవంటి సంస్కృతశ్లేషలలో "చేతో నలంకామయతే" వంటివానిని విడిచినా, "రాజసంసదిహాస్యతాం" వంటివానిని సాధింప యత్నించినాడు. "ధవదాపత్యతపఃఫలస్తనీం" అనుదానికి మూలములో లేని శ్లేష కల్పించినాడు.

"అనలసంబంధవాంఛ నా కగునయేని -
అనలసంబంధవాంఛ నా కగును జుమ్మ"

ఇట్టి చమత్కారములు శ్రీనాథుడు మెఱుగు పెట్టుటలో యెన్నియేని కలవు.

ఒక భావము చిత్రీకరించి సాక్షాత్కరింప చేయుటలో శ్రీనాథుని భావనాశక్తి అసాధారణమైనది. ఈయనువాదమునగూడ మూలములో ఒక సందర్భమున విడివిడిగా పడియున్న కొన్ని శ్లోకములు యేరుకొని వాని కొక రూపమిచ్చి ప్రాణము పోసి, మన కన్నులయెదుట సాక్షాత్కరింపజేయును. దేవతల వరింప కున్న వారివలన కీడు కలుగునని దేవదూత నలుడు దమయంతిని భయపెట్టగా, ఆమె కన్నులనిండ నీరు కార్చుచు వలవల యేడ్చినది. ఈ యేడ్పు మూలములో అక్కడక్కడ ఒక్కొక్క శ్లోకముగా పడియుండగ, శ్రీనాథుడు వాని చేరుకొని దండగూర్చి, "నిండిన ఆ నీళ్లు శ్రావణమేఘ మని, అది కాటుకతో కలసి చెక్కులపై జారగా నేత్రపద్మములకు కాడలవలె ఉన్న వని, రొమ్ముపైకి జారగా తామర మొగ్గలపై తుమ్మెదలవలె బారాడుచున్న వని, ఇంకను క్రిందికి జారి, ముత్యాలమాలికలో ఇంద్రనీలములవలె మెఱసిన వని" ఆ దృశ్యమును మన కన్నులకు గట్టి ఆ కన్నీటితో మన ఱెప్పలు తడుపును. ఇట్టి రసవద్ఘట్టము లెన్నో శృంగారనైషధమున గలవు.

శ్రీనాథుని శృంగారరసికత్వమును ఆయన కావ్యములలో, చాటువులలో చవిచూడనివా రుండరు. ఆయన తన రచనలలో అందునందు శృంగార రసరంజితములైన మాటలలో, చేతలలో సమయము చూచుకొని విసరిపోవుచుండును. కేవలానువాదమైన ఈ శృంగారనైషధమునకూడ ఆ రసికతాచిహ్నములు తరుణీయుంగములందువలె అందందు చూడవచ్చును. గమనించండి:

"స్మరవాత్స్యాయనకూచిమారకృత శాస్త్రగ్రంథసందర్భముల్
పరిశీలించినవాడ, దంపతుల కుత్పాదింతు సారస్యముల్"
అని హంస దమయంతితో చెప్పుచున్నది.

"పదియారేడుల పూవుబోండ్ల నుసుపుం
బాలిండ్ల కాఠిన్యసం
పదలో రాత్రులు మల్లసాము మదనో
న్మాదంబునం జేయుచున్"

తాను, తన రాజకందర్పుడు ముచ్చటగా యజ్ఞవేదికపై కూర్చోవడం, హోమాలు చేయడం, దానాలు యివ్వడం ఆ వైభవమంతా అప్పుడే అనుభవిస్తున్నట్టు గంభీరంగా చెప్తుంది. తన మాటల్లో తాను నలరాజునే తప్పక పెండ్లాడుదు నని, ఇంద్రుడు హవిర్భాగాలు తీసికోవల సిందే గాని భోగాలు కోరగూడ దని, ఆయన ఉపాస్యుడే గాని వరణీయుడు కా డనీ ధ్వనింపజేస్తుంది. ఏమైనా శ్రీనాథుని దమయంతి పరమోదాత్త, ప్రగల్భకూడ.

"గిర శ్రుతా పీవ తవ శ్రవస్సుధాః
శ్లథా ఽభవన్నాస్మి తు న శ్రుతిస్పృహా!
పిపాసుతా శాంతి ముపైతి వారిజా
న జాతు దుగ్ధాత్ మధు నోఽధికా దపి"

—"మధురమైన నీ మాటలు విన్నాను. అయిన నీ పేరు వినుటయందు నా ఆశ తీరలేదు. నీటికొరకు పుట్టిన దప్పి పాలవలన గాని, తేనెవలనగాని ఎన్నడు తీరదు గదా!" అని శ్రీహర్షుని దమయంతి నలునితో అంటుంది. ఇక శ్రీనాథుని దమయంతిమాట వినండి:

"అధికతరులైనగాని దిశాధిపతులు
కౌతుకము నాకు నీవంశకథలయందె
దప్పిగొన్నట్టివారి కా దప్పి రదీ
సలిలపూరంబు హితవో! అజ్యంబు హితవో!"

ఇచ్చట "దిక్పతులు గొప్పవారైనా, నాకు నీయందే మక్కువ యెక్కువ" అనియే ఇరువురి హృదయముకూడ. అయినను, దానిని రుజువు చేసికొనుటలో శ్రీహర్షుని దృష్టాంతము బలహీనము. ఎందుకంటే పాలతో, తేనెతో దప్పి పూర్తిగ తీరకపోయినను కొంత ఉపశమింపవచ్చు. కనుకనే శ్రీనాథుడు దానిని తొలగించినాడు. నేతివలన దప్పి యెక్కువగును కాని, తగ్గదను లోకజ్ఞత జూపినాడు. ఇంతే గాక, పూర్వార్ధమున భావగాంభీర్యముకూడ గొప్పది. మీ అందచందములబట్టి గాక, వంశప్రతిష్ఠలనుబట్టికూడ నీయందు మక్కువ గల దను దమయంతిభావమును తోపించును. 'అయినగాని' అను పదము "నీవంశకథలతో పోల్చి చూచినచో దిశాధిపతు లేమంత ఎక్కువ వారు?" అను భావమును ధ్వనింపజేయును. 'తరులు-వంశకథలు' అను పదములు, దిక్పతులు తరువులవలె బహుముఖములుగా ప్రాకునట్టి ప్రవర్తనము కలవా రనియు, తాత్కాలికమధురఫలములనే యియ్యగలవా రనియు, నలవంశకథలు అట్టివి గాక వెదుళ్లవలె చక్కని పెరుగుదల కలవై, తేజోవంతములైన దివ్యమణులను పుట్టించునవియు ధ్వనిపరంపర అనురణనములు చేయుచున్నవి. ఈ ఔచితీనిర్వహణము గ్రంథములో పెక్కుచోట్ల కనపడును.

సంస్కృతశ్లోకమును తెలుగున నడిపించునపుడు కూడ శ్రీనాథుని లేఖిని కదముత్రొక్కుచు పోవును. అతని రచనలో సాధారణముగా సంస్కృతాంధ్రములు ఎత్తుకెత్తు పడుచుండును. "పవిసంగంబున తాప మొందిన శచీప్రాణేశు కెంగేలికిన్" అను పద్యము చదువండి. ఒకప్పుడు అన్ని సంస్కృతములే సుందరపదబంధురములుగ బారులుదీరి కూర్చుండును. "కమలేందీవరషండమండితలసత్ కాసారసీవారతిన్" అను పద్యము చదువండి. మరియొకప్పుడు అచ్చతెనుగులే విచ్చిన విరజాజులై పంది క్రొక్కి పరిమళించును. "కబరికా భరముపై కన్నె గేదంగిపై-" అను పద్యం చదువండి. శ్రీనాథుని సీసపద్యములవరకు ఆంధ్రసారస్వతమున అపూర్వము, అద్వితీయము. ఆయన సీసపద్యపాదములు కావ్యములో అందందు గంధసింధురములై కదలిపోవుచుండును. మూలమునకన్న శృంగారనైషధమున ఈ తెలుగుపద్యగద్యరచన మిక్కిలి హృద్యమైనది.

తర్కాలంకారశాస్త్రపాండిత్యప్రతిభాసర్వ సారముగా సముద్భూతమైన శ్రీహర్షుని నైషధకావ్యము సారస్వతసముద్రమునుండి లేచివచ్చిన చింతామణియే గాని అమృతభాండ మనలేము. అది చింతామణీమంత్ర చింతనఫల మగుటయే కారణ మేమో! కావుననే ప్రౌఢాలంకారబంధురమైన ఆ నైషధకావ్యము ఆంధ్రీకరించుటకు ఏ కవిగండరగండనికిని గుండె చాలినది కాదు. కాని శ్రీనాథుని కా సాహసము మెండు, దానికి తగిన కండబలముకూడ అతనికి నిండుగా కలదు. కనుకనే ఈ అనువాదములో అతడెన్ని పోకడలో పోయి, సర్వాలంకారసుందరముగ సంతరించి 'నైషధం

విద్వదౌషధం' అనిపించుకొన్నాడు. మూలములోని అలంకారములను చాలవరకు అచ్చున పోసినాడు. కొన్ని విదిలించి వేరుపరచినాడు. మరి కొన్నింటికి క్రొత్త యందములు కూర్చినాడు. తనవే కొన్ని తయారుచేయడమో, ఉన్నవానిని ఉపేక్షించడమో జరుగకపోలేదు. అభిరుచినిబట్టి, ఔచితినిబట్టి సొంతముగా, స్వతంత్రముగా తన తెలుగుపలుకుబడిలో కావ్యమును సరసరసాయనము చేయుటయే అతని నిర్వాహము. ఈ సందర్భమున 'పత్రములమీద మూగిన భ్రమరకులము', 'హాటకకలశంబులకును', 'దమయంతీ కిలికించిత', 'సౌరభము లేనియట్టి పుష్పంబువోలె', 'అంకిలిలేక యప్పు డరుణారుణపల్లవనిర్గతంబులై' అను పద్యములను మచ్చునకు మూలముతో పోల్చి చూడవచ్చును. వివరణవిస్తరణములు తీరికగా చేయవలసిన పనులు. ప్రత్యేకముగా శ్లేషాలంకారమును తెలుగున సాధించుటలో కవిసార్వభౌముని కౌశల మద్వితీయము. గ్రంథములో అందందు వచ్చునవియే గాక పంచనళిలో ఇంద్రాగ్ని యమ వరుణులకు, నలునకు రెండర్థములను సాధించిన కూర్పు మిక్కిలి రమ్యము. అందులో 'ఈతండ నలుడు - ఈతం డనలుడు' అని తెలుగు మర్యాదతో విరిచి మూలమునకు మెఱుగు పెట్టినాడు. సంస్కృతమున 'రాజపాణిగ్రహణాభిలాషం' అను దానిని 'రాజుం బాణిగ్రహణంబున వశీకరింపగోరెద' అని తెలుగుసేయుచు, దానికి 'అందని మ్రాకులపండ్ల గోయం దలంచెద' అను తెలుగు సామెతను జోడించి మూలములో లేని భావస్ఫూర్తి కలిగించినాడు. జతు కాప్తలవంటి సంస్కృతశ్లేషలలో "చేతోనలంకామయతే" వంటివానిని విడిచినా, "రాజసంసది హాస్యతాం" వంటివానిని సాధింప యత్నించినాడు. "ధనదాపత్యతపఃఫల స్తనీం" అనుదానికి మూలములో లేని శ్లేష కల్పించినాడు.

"అనలసంబంధవాంఛ నా కగునయేని -
అనలసంబంధవాంఛ నా కగును జుమ్ము"

ఇట్టి చమత్కారములు శ్రీనాథుడు మెఱుగు పెట్టుటలో యెన్నియేని కలవు.

ఒక భావము చిత్రీకరించి సాక్షాత్కరింప జేయుటలో శ్రీనాథుని భావనాశక్తి అసాధారణమైనది. ఈయనువాదమునగూడ మూలములో ఒక సందర్భమున విడివిడిగా పడియున్న కొన్ని శ్లోకములు చేరుకొని వాని కొక రూపమిచ్చి ప్రాణము పోసి, మన కన్నులయెదుట పొడసూపజేయును. దేవతల వరింపకున్న వారివలన కీడు కలుగు నని దేవదూత నలుడు దమయంతిని భయపెట్టగా, ఆమె కన్నులనిండ నీరు కార్చుచు వలవల యేడ్చినది. ఈ యేడ్పు మూలములో అక్కడక్కడ ఒక్కొక్క శ్లోకముగా పడియుండగ, శ్రీనాథుడు వాని చేరుకొని దండగూర్చి, "నిండిన ఆ నీళ్లు శ్రావణమేఘ మని, అది కాటుకతో కలసి చెక్కులపై జారగా నేత్రపద్మములకు తూడలవలె ఉన్న వని, రొమ్ముపైకి జారగా తామరమొగ్గలపై తుమ్మెదలవలె పారాడుచున్న వని, ఇంకను క్రిందికి జారి, ముత్యాలమాలికలో ఇంద్రనీలములవలె మెఱసిన వని" ఆ దృశ్యమును మన కన్నులకు గట్టి ఆ కన్నీటితో మన రెప్పలు తడుపును. ఇట్టి రసవద్ఘట్టము లెన్నో శృంగారనైషధమున గలవు.

శ్రీనాథుని శృంగారరసికత్వమును ఆయన కావ్యములలో, చాటువులలో చవిచూడనివా రుండరు. ఆయన తన రచనలలో అందునందు శృంగార రసరంజితములైన మాటలలో, చేతలలో సమయము చూచుకొని విసరిపోవుచుండును. కేవలానువాదమైన ఈ శృంగారనైషధమునకూడ ఆ రసికతాచిహ్నములు తరుణీయంగములందువలె అందందు చూడవచ్చును. గమనించండి:

"స్మరవాత్స్యాయనకూచిమారకృత శా
స్త్రగ్రంథసందర్భముల్
పరిశీలించినవాడ, దంపతుల కు
త్పాదింతు పారవశ్యముల్"

అని హంస దమయంతితో చెప్పుచున్నది.

"పదియారేడుల పూవుబోండ్ల ననుభుం
బాలిండ్ల కాఠిన్యసం
పదతో రాత్రులు మల్లుసాము మదనో
న్మాదంబునన్ జేయుచున్"

దినములు గడిపినారట. నలుని పెండ్లికి వచ్చిన చుట్టపక్కములు—

"సితభాను డాచార్యచికురాకుచోడిపై
కన్నుసైచిన కన్నె కలువ మరులు"

గోడలపై చిత్తరువుగా వ్రాసినారట.

"శపథంబు జేసెదన్, ననవిలుకాని పాదవలి నంబులపై, రతిచన్నుదోయిపై" నలుని దప్ప అన్యుని వరింప నని దమయంతి శపథము చేస్తుంది. ఈ శృంగార ప్రబంధమంతయు మూలములో లేని శ్రీనాథుని రసికత. ఇది ఈ కావ్యమున ఆయా సందర్భములబట్టి అంతట పుష్పించినది. భావరూపచేష్టాదులను వాని అంగోపాంగములతో కవులు వర్ణింతురు. కాని రహస్యాంగములను, వాని కార్యకలాపములను రహస్యము గనే ఉంచుటయో, వ్యంగ్యరీతి సుకుమారముగ భావకుకు అందించుటయో ఉదాత్తరీతి. ఈ రీతిని కొందరనుసరింపరు. అనుసరించినను కొందరు దాని చవి నాస్వాదింపలేరు. మన శ్రీనాథుడే కాదు; శ్రీహర్షుడుకూడ ఊరకయుండడే. వీరిరువురు "యేదే నొక్క మనోహరాంగకమును" వర్ణించుటే కాదు. దానిని అద్దములో తొంగిచూచుటకు కూడ వెనుదీయ లేదు. బహుశః ఆనాటి రసికత అట్టి దనుకోవచ్చు.

దాని కేమిగాని, శ్రీనాథుని యాంధ్రానువాదమునకు దీటు తెలుగులో 'సహి ప్రతి' అంటే సాహసము కాదు. మూలభావమును చక్కగ మెదుపుకొని దానిని తెలుగుపక్కితో, తెలుగుజాతీయతతో, తెలుగు నుడికారముతో తనదే యొక పలుకుబడి, తనదే యొక ఒరవడిగా పద్యమును హృద్యముగ నడిపించును. ఈ పద్యము చూడండి:

'నీవు మాట తప్పెద వేమో' అని హంస దమయంతి నడుగుచున్నది.

"ఇప్పటి నీ తలంపు తెలి
గిట్టిద యౌ; ఇటమీద చెప్ప దే
చొప్పున నుండునో; నిజము
సుద్ది యొఱుంగము గాని, యుగ్మలీ!
చెప్పెడి దేమి! బాలికల
చిత్తము లంబుతరంగలోలముల్
తప్పనో తాకునో కుసుమ
ధన్వుని తూపులు దైవికంబుగన్".

సందర్భోచితముగ పద్యము నడుపుటలో అతని యెత్తుగడయే వేరు. ఇంద్రుని దూతిక దమయంతి దగ్గరకు వచ్చి—

"అవధారు దేవి దివ్యకిరీటకోటి సం
ఘానితవికచమందారదామ
సందోహమకరందబిందుధారాధౌత
సందీప్తచరణారవిందుడైన
సంక్రందనుండు నా స్వామి.........."

అని యొక పెద్దసమాసము చెప్పి—

"నన్నా యింద్రుగారాబుసంచారిగా నెఱుంగు" మని సంభాషణ మొదలుపెట్టుచున్నది. ఇట్టి సన్నివేశమే ఇంద్రుడు నలుని పలుకరించుచున్నాడు.

"అన్న! ఎవ్వరివాడ వయ్య? సేమమె నీకు? నైషధుం డను బుద్ధి నాకు వడమె" ఇంద్రుడు - దూతి వారి తారతమ్యమే పలుకరించుటలోను కలదు.

హంస నలుని ప్రార్థించు విధము చూడండి:

"తల్లి మదేకపుత్రిక! పెద్ద! కన్నులు గాన విప్పుడు! మూడుకాళ్ల ముసలి".

నలుడు హంసను ప్రోత్సహించి సాగనంపు విధము :


"హంసమ్మ, కార్యమ్ము సాధింపుము. పునస్సమాగమం బయ్యెడు, నీవు వచ్చువంతకు ఇచ్చోటన యుండుదుం జుమీ చూతము గదా నీగమనవేగంబు!"

శ్రీనాథుని తెలుగుపక్కిలో ఎన్నో విశేషములు చూడవచ్చు. చిన్న సంస్కృతపదము తెలుగులో ఎంత భావమునో పాదుగజేసి వుంటుంది. "స్మితం" అని వుంటే "కన్నుగొనలందు తొలంగక మందహాసముల్" అంటాడు. "లబ్ధా మివ" అనుదానిని, "అర చేతికి వచ్చినట్లు" అంటాడు. "భూతపతి" అనుదానిని "అదరు లుమిసెడి కొలువిదయ్యంబు వీడ" అని చూపుతాడు. సందర్భస్ఫూర్తితో శ్లోకికానివచ్చు

జాతీయము లివి. "కనిరొ నొడలెల్ల కన్నులై మనుజ విభుని"—"దరహాసము లెప్పల నప్పళించుచున్"- "అవగింజలు తాటికాయంత చేసి"— ఈ జాతిలోనే సామెతలు—"తారు గర్దిన పదివేలు తమకు గలుగు—" "నిండుబండికిన్ చేట భరంబె."— అనుకరణములు. "క్రంగన గంటపై కొడుపు వ్రాలుట,—కంచు గీచిన తెఱంగున ఎలుంగించి" శ్రీనాథుడే సంతరించుకొన్న జాను తెనుంగులు—"ఖండతుమ్మెద పదువులు", "పూటకాపు", "వినుకలివలపు", "వాలిక మించు కన్గొనలు". తామరతంపరలైన ఈ తెలుగుపలుకుబడినుడికారము లన్నియు శ్రీనాథుని కావ్యోద్యానమున పూలజొంపములై కుసుమించి గుబాళించుచుండును. కోయల గుంపులై 'కువకువ' కూయుచుండును.

శ్రీనాథుడు సంస్కృతకావ్యము ననువదించుచున్నను, తన తెనుగుసంప్రదాయములను మఱచిపోలేదు. పలుకుబడియంతయు తెలుగువారి దొంటయే గాదు - పెండ్లికార్యమునుగూడ తెలుగుయింటనే జరిపినాడు. దమయంతిని పెండ్లికూతు జేసి, కాళ్లకు పారాణి బూసి, కాళ్లకు మట్టియలు, చెవులకు వడిశెజ్జపు తాటంకములు పెట్టి, చేతికి గన్నెరకొమ్మ నిప్పించినాడు. సరే, నలుడూ పెండ్లికొడుకైనాడు. ఎదురుకోలు, పెండ్లిచవికె, మధుపర్కాలు, పాణిగ్రహణాదులు అన్నీ జరిగినవి. వేడుకలు, వినోదాలు, బువ్వపు బంతులు, పిండివంటల రకాలు, వడ్డనలు - అన్నీ అచ్చంగా తెలుగువారింటివే. ఈ పెండ్లికావ్యంతో తన కావ్యాన్ని అర్థతః శబ్దతః తెలుగుకావ్యమే చేసి తెలుగుభాషకు విజయధ్వజ మెత్తినాడు శ్రీనాథుడు. శృంగారరంగాలు తీర్చిన ఆ కలము చేతనే అనుష్ఠానాలూ, ఔపాసనాలూ, ఈశ్వరార్చనలూ వర్ణించి ఆహా యనిపించినాడు. ఇవన్నీ ఒక యెత్తు. కలిపురుషుడు ప్రవేశించే ఘట్టం అది ఒకటే ఒకయెత్తు. నిజంగా అది ఒక ఉత్తమభావఖండం. అన్వయవ్యతిరేకములతో దాన్ని అర్థంచేసుకుంటే, ఈ కావ్యములో ఈనాటిజనులకు "ముఖ్యంగా అక్కరకు వచ్చేది" అనే అనిపిస్తుంది. ఆ ఖండములో మూలం నిమిత్తమాత్రమే. శబ్దం, అర్థం, భావం పలుకుబడి అంతా తెలుగుపొలంలో పండిన కమ్మనిపంట. శృంగారనైషధాన్ని బంగారమునకు మెఱుగు అనడం కంటే, ఆ బంగారానికి రూప మిచ్చి ప్రాణం పోసి పరిమళింప చేయడ మంటే బాగుంటుంది. ఆ కవిబ్రహ్మకు జోహార్లు!*

* ఆలిండియా రేడియో—మద్రాసుకేంద్రము వారి అనుమతిని.



ఏకోదరులు

శ్రీ నిష్ఠల సోమయాజులు

న్యాయాధిపతి తీర్పు చెప్పడానికని లేచి నిలబడ్డాడు. కోర్టులో ఉన్నవాళ్లమంతా మా స్థానాలనుండి లేచేం. న్యాయస్థానమంతా క్రిక్కిరిసి ఉంది. ఒక్కసారి అందరి ముఖాలూ పరీక్షించేను. అందరి దృష్టులూ న్యాయపతివైపు కేంద్రీకరింపబడి ఉన్నాయి. తీర్పునిమిత్తమై ఆతురతతో చూస్తూ నిలుచున్న ఆ సమూహంవైపు చూడ్డానికి నా కెందుకో అయిష్టత కలిగింది. ఒక ప్రాణి చావు బ్రతుకులు ఆ క్షణంలో వెల్లడవుతాయి. దానిగురించి యింతమందికి ఆతురత ఎందు కనిపించింది. అది మానవప్రకృతి. 'అంచేత దానిగురించి ఆలోచించడం అవివేకం' అని న్యాయపతివైపు చూచేను. 'అపరాధినేరం సక్రమంగా విచారించబడి ఆ అపరాధానికి ఫలితంగా ఉరిశిక్ష విధించడమయినది. అతని ఆత్మకు పరమేశ్వరుడు శాంతి చేకూర్చుగాక!' అన్న పలుకులు ఆ నిశ్శబ్దాన్ని ఛేదించుకుంటూ వచ్చేయి. కోర్టు ముగిసింది. న్యాయపతి నిశ్చలహృదయంతో తన విధ్యుక్తధర్మం నెరవేర్చే నన్న ఆత్మశాంతితో స్థానం దిగి వెళ్లిపోయేడు. అరనిమిషంలో న్యాయస్థానం జనశూన్యమయింది. కాని డాక్టర్ శాంతిసాగర్ విచారవదనంతో ముఖంమీద ఉన్న చెమటబిందువులను తుడుచుకుంటూ తల వంచి నిలుచున్నాడు. ఆ వైద్యవిజ్ఞానశాస్త్రజ్ఞుని అక్కడ చూచేసరికి నా కాశ్చర్యం కలిగింది. డెబ్బదిఏళ్ల ముదుసలి ఒక సామాన్యఅపరాధివిచారణ చూడ్డానికి వచ్చేడంటే చాలా ఆశ్చర్యం కలుగకమానదు. నేను ఆయనవైపు చూస్తూ నిలబడ్డాను. 'సార్జెంట్, నే నొకసారి బందీని చూడాలి. వీలుందా?' అన్నారు శాంతిసాగరులు. ఆ మహాత్ముని కోరిక నిరాకరించడానికి ఎవరికి శక్తి ఉంది? సార్జెంటు ఆయనకు నమస్కారం చేసి 'ఇలా దయచేయండి' అన్నాడు. సార్జెంటు త్రోవ చూపిస్తూ ఉంటే నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ ఆ గంభీరుడు నడుస్తున్నాడు. ఆ పండువెంద్రుకల ముదుసలికి అపరాధిపై యింత అభిమాన మెందుకు కలగాలి? అన్న ప్రశ్న నన్ను కదిలించి నా కుతూహలం రేకెత్తించింది. మహామహులు సైతము యీయనసింహద్వారమువద్ద కావలికాచుకొని ఆయనదర్శనార్థమై పడిగాపులై ఉంటారే, అటువంటి మహాశయుడు తను స్వయంగా ఒక సామాన్యబందీని చూడ్డానికని అంత ఎందుకు కుతూహలపడుతున్నాడని పరిపరివిధాల నా ఆలోచనలు పోతున్నాయి. వారిద్దరూ ద్వారం దాటారు. ఒక్కసారిగా నాకూ ఆయనవెంబడి వెళ్లాలనిపించి రెండడుగుల్లో వారిని కలుసుకున్నాను. నేను రావడానికి వీల్లేదని సార్జెంటు వినయపూర్వకంగా చెప్పేడు. నేను చేసేది లేక న్యాయస్థానంపైకి వచ్చి శాంతిసాగరుల రాకకై వీక్షిస్తూ నిలుచున్నాను. అపరాధిని పోలీసులారీలో ఉంచేరు. సాగరులు లారీదగ్గరగా వెళ్లి అపరాధి ముఖంలోకి చూచి తన మృదుహస్తాలతో అతని భుజం తట్టేరు. బందీ తన అపారమైన కృతజ్ఞతను వెల్లడిద్దామని కాబోలు ఆయనను ఆలింగనము చేసుకుందా మనుకున్నాడు. కాని చేతులు శృంఖలాలతో బంధింపబడ్డాయి. అతని ముఖం విషణ్ణమైంది. ఒక నమస్కారం చేసేడు. సాగరులు నెమ్మదిగా ముఖం అవతలవైపుకు త్రిప్పి మెల్లగా అడుగులు వేసుకుంటూ కారులోకి వెళ్లి కూర్చున్నారు. పోలీసులారీ శరవేగంతో కోర్టువెనకవైపునుండి వెళ్లిపోయింది. ప్రక్కనించి గంభీరంగా పోతూ ఉన్న శాంతిసాగరుల కారును చూస్తూ నిలుచున్నాను. కారు మలుపు తిరిగి రాజబాటమీదకు పోయింది. ఇక నేను ప్రపంచంలో

పడ్డా. ఆనాడు సేకరించిన వార్తలు నా పత్రికా సంపాదకులకు అందజేయాలి. ఆ ఆతురతతో ఆఫీసుకు చేరుకున్నా.

౨

నేను 'శాంతిభవనము' చేరుకునేసరికి రాత్రి పదిగంటలు కొట్టేయి. మెల్లగా అడుగులు వేసుకుంటూ గార్డెనుదాటి పోర్టికోలోకి వచ్చి నిలుచున్నా. 'శాంతిభవనం' పేరుకు తగినట్టు ప్రశాంతంగా ఉంది. నా అలికిడికి ఎవరూ పైకి రాలేదు. శాంతిసాగరుల 'స్టడీరూమ్' నుండిమాత్రం కిటికీ ద్వారా వెల్తురు ప్రసరిస్తూ ఉంది. శాంతిసాగరులు ఏదో పనిచేస్తూ ఉన్నారని అనుకున్నా. కాని లోపలికి వెళ్ళడానికి ముందుగా కబురుచెయ్యవలసుంది. కాని నాకు నౌకరూ అక్కడ కనపడలేదు. నాకు ఆతురత ఎక్కువై హాల్లోకి వెళ్లేను. కొంచెం కునుకుపాట్లు పడుతున్నా.లోటమాలి నా కాలిచప్పుడు విని తొందరగా వచ్చి 'ఎవరువా'రని ప్రశ్నించేడు. నేను శాంతిసాగర్లను చూడడానికి వచ్చేనని చెప్పేను. అతడు చాలరాత్రి అయిందికాబట్టి ఇప్పుడు ఆయనను చూడడానికి వీ ల్లేదు, మర్నాడు రమ్మన మన్నాడు. 'అలా కాదు, నువ్వు వెళ్లి యీ విజిటింగుకార్డు యియ్యి' అన్నాను నౌకరుతో. 'ఇప్పుడు లాభం లేదు. రేపు ఉదయం రండి' అన్నాడు మూర్ఖంగా. అతని మూర్ఖత్వానికి నాకు విసుగు కలిగి కోపంగా అన్నాను: 'నేను ఆయనను యిప్పుడు చూడక తీరదు' అని. నా మాటలు యింకా పూర్తి అయినవో లేవో శాంతిసాగరులు తన గది గుమ్మందగ్గర నిలుచుని 'రఘూ, నన్ను చూడ్డానికి వచ్చినవారితో అంత ప్రసంగం ఎందుకు? ఆయనను లోపలికి రానీ' అన్నారు. నేను ఆయనకు వినయపూర్వకంగా నమస్కారం చేసేను.రఘూ,"బాబుగారిని యీ సమయంలో ఆయాసపెట్టడం యిష్టం లేక మిమ్మల్ని రేపు రమ్మన్నానుకాని మరొక ఉద్దేశంచేత కాదు" అని వంగి నమస్కారం చేసి పోర్టికోలోకి వెళ్లిపోయేడు.

నేను శాంతిసాగర్ల 'స్టడీరూమ్'లోకి వెళ్లి ఆయన కెదురుగా నిలుచున్నాను.

'మీ రెవరు? మీకు నే నేమైనా సహాయం చెయ్యగలనా?' అన్నారు నా ముఖంలోకి చూస్తూ. 'నా పేరు శిరీష్. నేను 'హెరాల్డు' పత్రిక చీఫ్ రిపోర్టరును. మీదగ్గర ఒకవిషయమై తెలుసుకుందా మని వచ్చేను. నా కోరిక మన్నించి నాకు సహాయంచేస్తా రని తలుస్తాను' అన్నాను. ఆయన నా మాటలు పూర్తిగా అయేవరకూ విని తల ఊపుతూ 'పత్రికలకు నే సహాయం చేయగల సమర్థుడను కా ననుకొంటాను. కాని నే చేయగల సహాయ మేదైనా ఉంటే తప్పక చేస్తాను. విషయం చెప్పండి' అన్నారు. అని, ఆయన ఒక సోఫామీద కూర్చుని నన్ను ఎదురుగా ఉన్న మరొక సోఫాలో కూర్చోమన్నారు. ఆ మహానీయుని ఆదరణ, సౌజన్యం నన్ను ఆకర్షించి ఆనందింపజేసేయి.

'మీరు చెప్పవలసిన విషయం సావధానంగా చెప్పండి' అన్నారు ఆయన.

'దీనానాథునికి యివాళ ఉరిశిక్ష విధించడమైంది. అతనిగురించి మీ కేమైనా తెలుసునేమో అడుగుదా మని వచ్చేను' అన్నాను—ఆయనముఖం తదేకదీక్షతో చూస్తూ. ఆయన నిశ్చలు డనీ, గంభీరు డనీ అప్పుడు తెలుసుకున్నాను.

'దీనానాథుని గురించి మీ కేమని చెప్పను. అతడు త్రికరణశుద్ధిగా నమ్మిన ఒక రాజకీయసూత్రానికి బలి అయ్యాడు. ప్రభుత్వంపై జరిగిన దురాచారాలకు అతనే కారణభూతు డని న్యాయస్థానంలో విచారించబడి ఉరిశిక్ష విధించబడ్డాడు. కాని అతడు మాత్రం అమాయకుడు, నిర్దోషి. ఒక నైతికఆదర్శానికి తన జీవితాన్ని నేడు బలి యిస్తున్నాడు. న్యాయస్థానం ధర్మాన్ని ప్రసాదించలేకపోయింది. ఇంతకన్న అతనిగురించి నేనుమాత్రం ఏమని చెప్పగలను?' అన్నారు శాంతిసాగరులు. ఆయనమాటలు స్పష్టంగా విచారాన్ని తెలియపరుస్తున్నాయి. సమయంకాబట్టి నేను వెంటనే అన్నా—'మహానీయుల కంతకన్నా ఎక్కువ తెలుసు. అతని జీవితచరిత్రనుగురించి మిమ్ము ప్రశ్నింపవచ్చేను. మిమ్ము కోర్టు ముగిసినతరువాత బందీతో మాట్లాడుతున్నప్పుడు బందీనిగురించి ప్రశ్నించి

నప్పుడు నేను మీ ప్రక్కనే ఉన్నాను. మీ విచార వదనం నన్ను ఎందుకో కలతపెట్టి నా కుతూహలాన్ని పురికొల్పింది. అతని జీవితచరిత్ర మీదగ్గరనుండి తెలుసుకుందా మని'.

శాంతిసాగర్లు మౌనంతో అంతా విని అన్నారు. 'జాను శరీఫ్ మహాశయా. అపరాధిజీవితచరిత్ర ఒక విచిత్రగాథ. అంతకంటే విచిత్రమైంది అతని అపరాధవిచారణ. నీ కా చరిత్ర వినా లని కుతూహలంగా ఉందా?' అన్నారు. ఔ నన్నట్టు త లూపేను.

ఆయన కూర్చున్న స్థలంనుంచి లేచి ఎదురుగా ఉన్న డ్రాయరునుంచి ఒక పెద్ద తోలుసంచీ పైకి తీసేరు. నాకు ఉత్సాహం ఎక్కు వయింది. ఆయన ఎంత నెమ్మదిగా ఉన్నా రో నాలో అంత ఆతురత ఎక్కు వయింది. ఆయన ఒక ఉల్లిపొరకాగితంలో చుట్టబడిన ఛాయాచిత్రం తీసి నా ముందర పెట్టి పరిశీలించ మన్నారు. నా కేమీ అర్థం కాలేదు. ఇంకొక ఛాయాచిత్రం తీసి నా కిచ్చేరు. రెండిటిని చూచేను. కాని నా కేమీకూడా పోలుపోలేదు. ఆయన నా ముఖంలోకి చూచి 'మీ రేమీ యీ విషయం గ్రహించలే రని నాకు తెలుసు. ఇక మీకు విషయంగురించి చెప్తున్నా' అన్నారు. ఆయన యిటూ అటూ పచార్లు చేయడం ప్రారంభించేరు. ఆ నిశ్శబ్దానికి నేను భంగం కలిగించదలుచుకోలేదు. నా పుస్తకం పెన్సిలు చేత్తో పట్టుకుని ఆయననోటినుండి వచ్చేమాటకు క్షణం ఒక యుగంగా లెక్కిస్తూ కూర్చున్నాను. శాంతిసాగర్లు చెప్పడం ప్రారంభించేరు.

3

ఈ రోజునకు సరిగ్గా ముప్ఫైయైదుసంవత్సరముల క్రిందట నా వార్డులో కూర్చుని ఏదో దీర్ఘాలోచనలో ఉన్నాను. రాత్రి పండ్రెండుగంటలు వినిపించేయి. నే నలా ఆలోచనలో ఉండగా వార్డునర్సు ఆతురతతో పరుగెత్తి వచ్చింది. ఆమె భయం, ఆతురత చూచి ఎవరైనా రోగి మరణించేడేమో అని ఆమె ముఖంలోకి చూస్తూ ఆమె చెప్పబోయేదాని కని ఎదురు చూస్తున్నా. 'డాక్టర్, మీరు త్వరగా రావాలి. మొన్న హాస్పిటల్ ప్రవేశించిన అనాథయువతి చాలా బాధపడుతూంది. ఆమె ఒక కవలపిల్లల జంటను ప్రసవించింది. కాని యింకా నొప్పులబాధ తగ్గలేదు. మా కేం చెయ్యడానికీ పాలుపోవటం లేదు' అని గుక్కతిప్పకుండా చెప్పింది. మరి మారు పలుక్కుండా ఆమెదగ్గరకు తీసుకువెళ్లమన్నా. నేను ఆమె ప్రక్కదగ్గరకు వెళ్లకమునుపే ఆమె యింకొక మగశిసువును ప్రసవించి అంత్యనిశ్వాసాన్ని విడిచింది. ఆమె కింక నా ఉపయోగం లేదు. ఆమెప్రక్కవైపు చూసేను. ముగ్గురు మగశిసువులు 'క్యావు' మని ఏడుస్తున్నారు. వారి జన్మ ప్రారంభదశలోనే వారి భావి సూచించబడిందా అనిపించింది. నర్సువైపు తిరిగి అడిగేను 'ఈ పిల్లల తండ్రి ఎవ?' రని. 'ఆమెపతి మాసందినములక్రిందట మరణించేడుట' అంది నా ప్రశ్నకు ప్రత్యుత్తరంగా. తిరిగి ఆ శిసుత్రయంవైపు చూచేను. గుక్క త్రిప్పకుండా వారలా ఏడుస్తూనే ఉన్నారు. ఆ మాతాపితృవిహీనులను చూస్తూ ఉంటే నా కదేమో ఒక జాలి కలిగింది. ఇంక ఆ బిడ్డల రక్షణ ప్రభుత్వం ధరించాలి. కాని ప్రభుత్వం ధరిస్తుందా? ధరించదు. ఇం కప్పుడు ఆలోచించి ప్రయోజనము లే దని ఆ తల్లియొక్క మృతశరీరాన్ని మార్చ్యురీకి తీసుకువెళ్లమని చెప్పి ఆ ముగ్గురు శిసువులను స్టీఫెనర్సు ఆదరణలో ఉంచమని నా డైరీ వ్రాసేందు కని తిరిగి నా వార్డుకు చేరుకున్నాను.

ఆ మరునాడు ఉదయం గతరాత్రి నే చూచిన సంగతి నంతా ఆలోచించుకుంటున్నాను. నా కెందుకో ఒక తీరని అభిమానం, ప్రేమ కలిగేయి ఆ శిసువుల మీద. మొదట ఉద్భవించిన కవలజంటమీదకంటే మూడవశిసువుమీద నా కెందుకో అవ్యాజమైన ప్రేమ కలిగింది. ఇప్పుడు ఆ విషయంగురించి ఊహిస్తే బహుశా ఆ ఆఖరుశిసువు ఏకాకి అనిన్నీ, ఆ కవల జంట ఒకరికి ఒకరు సహాయభూతు లవుతా రనీ అనిపించడంవల్ల ఆ మూడవశిసువు భావిని జాగ్రత్తగా గమనించాలని అనుకున్నాను. ముగ్గురూ అరనిమిషం తేడాలో ఒకే ఒక మాతృగర్భాన్ని జన్మించేరు. అంచేత ఆ ముగ్గురిభావి ఏవిధంగా ఉంటుందో చూద్దా మని

కుతూహలం ఎక్కువైంది. వారి నడవడి, ప్రకృతి ఏ విధంగా మారుతాయో చూద్దామన్న వాంఛ ప్రబలమవడంచేత ఆ ముగ్గురు శిశువుల పోషణ నా దృష్టిలోంచి పోకుండా చేద్దామన్న ఉద్దేశంతో ఆ బిడ్డలను ఎవరి సంరక్షణక్రింద ఉంచుదామా అన్న తలంపు నా కెక్కువయింది. నా ఆంతరంగికమిత్రు లెవ్వరిదగ్గరైనా ఉంచుదామా అనిపించింది. కాని ఆ ఉద్దేశం బాగులే దనిపించింది. నా ఆలోచన లేమీ పాలుపోవటంలేదు. ఇంతలో స్టేఫ్‌నర్సు నాదగ్గరకువచ్చింది.

ఆమెవైపు ప్రశ్నపూర్వకంగా చూచేను. 'డాక్టర్, లేడీ మహమ్మదీబీగమ్ ప్రసవించింది. కాని మృతశిశు వవడంవల్ల ఆమెకు తెలివి వచ్చినతరువాత ఏమని చెప్పాలో బోధపడటం లేదు. మీరు ఆమెను ఓదార్చడానికి రావలసి ఉంటుంది' అంది ఆమె.

'సర్ మహమ్మద్ ఎక్కడ ఉన్నా' రని నే ప్రశ్నించేను.

'ఆయన ఆమెగదిగుమ్మంవద్ద విచారంగా కూర్చున్నారు' అంది.

నన్నాయనదగ్గరకు అక్షణమే తీసుకుని వెళ్ళమన్నాను. సర్ మహమ్మద్ చాలా దీనంగా నావైపు చూచేడు. లేకలేక అతనికి యీ సంతానం కలిగింది. కాని ఆ మృతసంతానం మరింత హృదయవేదన కలిగించిం దాయనకు. నేను సర్ మహమ్మద్‌ను ఏకాంతంగా మాట్లాడవలసి ఉంటుం దని పిలుచుకొని తీసుకువెళ్ళేను. 'సర్ మహమ్మద్, మిమ్మల్లను యీ సమయంలో ఓదార్చవలసినవాడను కాను. కాని బీగమ్ విషయం మీ రాలోచించవలసుంది. ఆమె కింకా తెలివి రాలేదు. ఆమె యీ మృతశిశువునుగురించి విన్నట్టయితే చాలా దుఃఖిస్తుంది. కాబట్టి నిన్న నే ఒక అనాథయువతి ముగ్గురు శిశువులను ప్రసవించింది. ఒక శిశువును ఆమెప్రక్కలో పరుండబెట్టడానికి మీ అనుజ్ఞ ఉంటే మా కభ్యంతరము లేదు' అన్నాను. సర్ మహమ్మద్ నావైపు చూచేరు. ఆ చూపుల్లో ఒక ఉత్సాహం, ఒక శాంతం కనిపించేయి. వెంటనే స్టేఫ్‌నర్సుతో ఒక శిశువును తీసుకొనివచ్చి ఆమె ప్రక్క నుంచమన్నా. ఆమె కవలజంటలో ఒక శిశువును మహమ్మదీబీగముదగ్గర ఉంచింది. ఆ మహమ్మదీయదంపతుల ఆనందం నేను చెప్పలేను. వారి ఆనందంలో నా ఉత్సాహంకూడా కలిసింది అని చెప్పక తప్పదు. నా ప్రయత్నాల్లో ఒక సోపానాన్ని ఎక్కేను. తక్కిన యిరువురు శిశువులను ఏమిచెయ్యనా అన్న ప్రశ్న ప్రబలమైంది. నే నీ ఆలోచనలో ఉన్నప్పుడు హోలీవర్జిన్ కాన్వెంటు ఫాదర్ ఏండ్రూస్ కాన్వెంటులో పిల్లలకు కొంతమందికి సుస్తీ చేసింది చికిత్స చెయ్యమని అడగడానికి వచ్చేడు. 'ఫాదర్ ఏండ్రూస్, నేను మిమ్మల్లను ఒక కోరిక కోరవలసుంది. దానిని మన్నిస్తారా?' అన్నాను. ఏండ్రూస్ నవ్వుతూ అన్నాడు 'డాక్టర్, ఇవాళ మీరు చాలావింతగా మాట్లాడుతున్నారు. మీరు అడక్క అడక్క అడిగిన కోరికనే మన్నించలేనంత కృతఘ్నుడను కాను. కాని నా వశంలో ఉన్నదైతే నేనే చెయ్యగలను' అన్నాడు.

'ఫాదర్, మీకు మీ శరీరసంతానం లేకపోయినా, అనేకఅనాథబాలబాలికలకు మీరు పితృసమానులు. కాబట్టి మిమ్ము నే నడిగే కోరికకూడా ఒక అనాథశిశువుగురించే' అన్నాను.

'డాక్టర్, దాని కింత అలస్యం చేయవలసిన అగత్యం లేదు' అన్నారు ఫాదర్ ఏండ్రూస్.

స్టేఫ్‌నర్సుకు కబురు చేసేను, రెండవ కవలజంటలో శిశువును తీసుకురమ్మని. ఆమె ఆ శిశువును ఫాదర్ ఏండ్రూస్ చేతి కిచ్చేను. చిరునవ్వు నవ్వుతూ అన్నాడు ఫాదర్—'డాక్టర్, యీ శిశువు ఒక ఉన్నతపదవికి వస్తాడు!' ఏండ్రూస్ వెళ్ళిపోయేడు. రెండవసోపానం ఆరోహించేను. ఇక మూడవశిశువు సమస్య మిగిలిపోయింది.

ఆ రోజుకు ఆ సమస్య తేలలేదు. మర్నాడు మామూలుగా హాస్పిటలుకు చేరుకున్నాను. ఒకసారి వార్డంతా యిన్స్పెక్ట్‌చేద్దామని స్టెతస్కోప్ తీసుకుని బయలుదేరేను. మామూలుప్రకారం పేషెంట్సులందరి రోగసమాచారాలు కనుక్కుందా మని బయలుదేరేను. పదిగజాలదూరం ఇంకా వెళ్ళకమునుపే 'బాబూ, డాక్టరుబాబూ' అన్న పిలుపుతో వెనక్కి చూచేను.

నన్ను పిలిచినతను జలోదరంతో బాధపడుతున్న ఒక రైతు. అతడు బ్రతికే విధానం లేదు. కాని మానవ ప్రయత్నం ఎంత ఉందో అంతా మేము చెయ్యవలసిన వాళ్ల మేను. అతణ్ణి చూచినదగ్గరనుండి నా కతనిమీద జాలి వేసింది. అతడు మూడవసారి వివాహం చేసుకున్నాడు; పై యిద్దరుభార్యలు పోవడంచేత. అతని భార్య వయస్సు ఇరవై సంవత్సరాలకు మించి ఉండదు. పాపం చాల అమాయకురాలు. ఆమెను చూచినప్పుడల్లా ఆమె భవిష్యత్తంతా ఒక నిస్పృహే కదా అనిపిస్తూ ఉండేది. ఎంత ధనం ఉంటే ఏమి ప్రయోజనం? 'డాక్టరుబాబూ, లచ్చిని మీరు చూచేరా?' అన్నాడు ఆ పెద్దరైతు. చూచే నన్నట్లుగా తలూపేను. లచ్చి అతని మూడవభార్య. 'బాబూ, నేను ముమ్మారు వివాహం చేసుకున్నా నాకు సంతానం లేదు. ఇంక నేను మహా బ్రతికితే రెండు వారాలో, లేక మూడు వారాలో! తర్వాత నన్నామాయదారిరోగం బ్రతుక నీదు. లచ్చిని చూస్తే నా కడుపు తరుక్కుపోతూంది' అన్నాడు రైతు ఆయాసంతో. అతని మాటలకు నా హృదయం కరగింది. పాపం లచ్చిజీవితం చాలా దుర్భరం. అతణ్ణి ఓదారుద్దామని ఏదో చెప్పబోయేను.

'ఒద్దు డాక్టరుబాబూ, నన్ను ఓదారుద్దామని ప్రయత్నం చెయ్యకండి; నేను పిచ్చివాణ్ణి కాను, మీ తియ్యనిమాటలు వినడానికి. ఆ పరమేశ్వరుని ఆజ్ఞ అయింది, ఇక యిహలోకంనుంచి రమ్మని. నిన్నంతా లచ్చి నర్సమ్మతో మాట్లాడుతూంది. ఎవరో ఒక అనాథస్త్రీ ముగ్గురు శిశువులను ప్రసవించి మరణించిందట. అందులో యిద్దరిని అప్పుడే ఎవరో గొప్పవారికి మీరు యిచ్చేరట. మూడవపిల్లవాడిని మాత్రం తన కియ్యమని అడుగుతూంది. బాబూ, లచ్చి అమాయకురాలు. బిడ్డను వెయ్యికన్నులతో చూచుకుంటుంది. నా కులం నిలబెట్టినవాళ్లవుతారు. ఆ శిశువును మాకు ప్రసాదించరూ?' అని నా గడ్డం పట్టుకున్నాడు. నా ఆనందానికి పరిమితి లేదు. మూడవశిశువును లచ్చి ఒళ్లో పెట్టేను. లచ్చి ఆనందంతో హిమగిరిశిఖరం ఎక్కింది. ఆ రాత్రే రైతు మరణించేడు. కాని లచ్చి ఏమీకూడా చలించలేదు. ఆమె అప్పుడే మాతృవేదికను చేరుకుంది. నేను మూడవ సోపానం ఎక్కడమయింది.

శాంతిసాగరులు పచారుచేయడం మాని మరోక సారి ఛాయాచిత్రంవైపు చూచేరు. నేను వడివడిగా నా ఉచ్ఛ్వాసనిశ్వాసాల్ని తీసుకుంటున్నాను శాంతి సాగరులు తిరిగి ప్రారంభించేలోపుగా.

౪

శరీఫ్ మహాశయా, యీ విధంగా ఆ ముగ్గురు శిశువుల పోషణ మూడుమతాలకు అర్పించేను. నేను వారి నలా ఇంకొకరి పోషణలో వదలినప్పటికీ తరచు చూస్తూనే ఉన్నాను. వారందరిలో నాకు పరిచయం ఎక్కువ యీ మూడవశిశువుతో. లచ్చి కుర్రవాడిని పెంచి పెద్దవాడిని చేసింది. ఆరవ ప్రాణంక్రింద చూచి పెంచుకొంది ఆ అనాథశిశువును. అతడు అనాథశిశువైనా లచ్చిమాత్రం అతడికి దీనానాథుడని నామకరణం చేసింది. పేరుకు తగినట్టుగానే అతడు సంచరించెను. నేను మాసానికి ఒక పర్యాయం వారి గ్రామం వెళ్తూ ఉండేవాణ్ణి. లచ్చి పొలంలో కూలీల చేత పని చేయిస్తూ ఉంటే గుడ్డఉయ్యాలలో కూర్చుని నవ్వుతూ ఉన్నవాడు అపరాధిని ఎరుగుదును. ప్రక్కరైతుల పిల్లలతో గూటీబిళ్ల ఆటలు ఆడుతున్నప్పుడు ఎరుగుదును. పొలంలోకి పోయి కూలీలకు ఏతాం ఏ విధంగా తొక్కేదీ నేర్పిన విధం ఎరుగుదును. కుప్పనూర్పులదగ్గర రాత్రింబవళ్లు కూర్చుని కూలీలతోబాటు తనూ కామందైనప్పటికీ సామాన్య పని చేసే రోజుల్లో ఎరుగుదును. లచ్చి వివాహంచేసుకోమని నిర్బంధించినప్పుడు నాదగ్గరకు వచ్చి, 'డాక్టరుబాబూ, నేను మా అమ్మకు వ్యతిరేకం చెప్పలేను. నాకు వివాహం చేసుకుందా మని లేదు. నాలో ఏదో ఒక వాణి నన్ను యింకొక పనికి నీవు నియమింపబడ్డప్పుడు నవ్వేలా సంసారంలో యిరుక్కుంటావు' అని చెప్పినట్లు తన మానసంలో ఉండి నాకు పూనగ్రుచ్చినట్లు చెప్పిన రోజులనుండి ఎరుగుదును. లచ్చి ఆకస్మికమరణం నాడు నేను వచ్చి ఆమెను చూచేవరకు మృతశరీరాన్ని దహనం చెయ్యకుండా ఆపినరోజున అతడి ధైర్యస్థైర్యాలను ఎరుగుదును. శరీఫ్ మహాశయా, అప

రాధి సామాన్యప్రజ అవగాహనచేసుకునేటటువంటి వ్యక్తి కాదు అన్నారు శాంతిసాగరులు, ఒక్కొక్క మాటా తమ హృదయభారం వెల్లడింపజేస్తూ.

లచ్చి మరణం అతని హృదయంలో ఒక తీరని మార్పు కలిగించింది. లచ్చిని అపరిమితంగా ప్రేమించేడతడు. ఆ ప్రేమైకవస్తువు తన్ను విడిచినప్పుడు అతని హృదయం ఒక్కసారిగా చలించింది. కాని దీనానాథుడు మహత్తరమైన శక్తిమంతుడు. జీవితం మొదటనుండి అతడు ఒక ఆధ్యాత్మికకర్మతత్త్వానికి అంకితం చెయ్యడంమూలాన లచ్చిమరణం అతడు చూచినప్పటికీ నిశ్చలుడై తన నైతికఆదర్శానికి జీవితం బలిగా యివ్వడానికి సంసిద్ధుడయ్యేడు. లచ్చి చనిపోయిన మరునాడు అతడు నాదగ్గరకు వచ్చి అన్నాడు: 'డాక్టరుమహాశయా, నేను ఒకే ఒక వస్తువును మొదటినుండి ప్రేమించడంవల్ల ఆ వస్తువు యొక్క ఆకస్మిక నాశనం నన్ను పిరికివాడుగాను, అవివేకిగాను చేసింది. అంచేత అన్నివస్తువులను ప్రేమించడం ఉత్తమమని తోస్తుంది. సర్వమానవప్రేమ ముందు మానవునికి దుఃఖం ప్రాప్తించదు అనుకుంటాను. అంచేత నేటినుండి నా నైతికగమ్యం మార్చుకుంటాను' అన్నాడు. అతని మనోభీష్టము అప్పుడే గ్రహించేను.

శాంతిసాగరులు తలను కొంచెం వంకించేరు, ఏదో దీర్ఘాలోచనలో ఉన్నట్లు. నాకు ఆశ్చర్యం కలిగింది ఆయనమాటలు వింటూఉంటే. దేశమంతటా ఒక మహావిజ్ఞానశాస్త్రజ్ఞుని అని పేరుబడ్డ శాంతిసాగర్ల జీవితంలో రెండవముఖంకూడా ఉందా అన్న సంగతి ప్రపంచానికి తెలియదు. మహాత్ముల జీవితాలన్నింటికీ ఒక వెలుగు నిచ్చేది యిటువంటి వ్యక్తిగతసుహృద్భావమే అన్న మాటల్లో సత్యం నేను శాంతిసాగర్లకు దీనానాథునిమీద ఉండే అవ్యాజప్రేమే నిరూపిస్తూంది. ఆ ముదుసలిగంభీరవదనంలో నింత శాంతి సహనా లున్నాయా అని తదేకదీక్షతో ఆయన ముఖంలోకి చూస్తున్నా మంత్రించబడ్డవానికిమల్లే.

'సంవత్సరాలు గడిచేయి' అని ప్రారంభించేరు శాంతిసాగర్లు. కర్షకజనంయొక్క హక్కులనుగురించి ఆందోళన చేయడం ప్రారంభించేడు దీనానాథుడు. ప్రభుత్వంతో తెగనిపోరాటం సాగించేడు. దేశానికి వెన్నెముకైన గ్రామజీవనాన్ని, రైతుజీవితాన్ని నీచంగా చూడొద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించుకూ వచ్చేడు. కర్షకప్రజ అంతా దీనానాథుని ఒక దైవం కింద పూజిస్తూవచ్చేరు. ఈ విషయం దీనానాథునికి విచారం కలిగిస్తూవచ్చేది. అతను యీ కర్షకఉద్యమంలో దిగినప్పటినుండీ మే మిద్దరం కలుసుకోవడం తరచు జరిగేది కాదు. కాని కలిసినప్పుడుమాత్రం తన హృదయం అంతా నా కర్పించేవాడు. 'డాక్టరుబాబూ, కర్షకప్రజ చాలా అమాయకంగా తరతరాల నుంచి పెరుగుతూవచ్చింది. వారికి సహాయంగా నిలబడ్డ ప్రతీవ్యక్తిని ఒక దైవంగా భావిస్తుంది. ఎంత పోరబాటని చెప్పినా వినదు. కర్షకుల్లో ఆత్మవిశ్వాసం కలిగితేనేకాని యిటువంటి మూఢనమ్మకం పోదు. ఇది ఉన్నంతకాలం కర్షకఅమాయకత్వాన్ని గ్రహించిన వ్యక్తులు తమ స్వలాభంగురించి కర్షకజనాన్ని ప్రభుత్వాహంకారానికి బలిగా చేస్తున్నారు, చేస్తారు. ఇది నన్ను చాలా బాధపెడుతూంది' అన్నాడు దీనానాథుడు. అతని నైతికబలం నాకు ద్యోతకమయింది ఆనాడు. అతని జీవితాన్ని అమరపదం అలంకరింపజేస్తుం దన్న దృఢనమ్మకం కలిగింది. కాని విధి అడ్డు తిరిగినప్పుడు మహాత్ములుకూడా లొంగవలసిందే. మొన్న ప్రభుత్వంపై జరిగిన దురాచారాలన్నీ ఒక పేరుగా గ్రుచ్చి దీనానాథునిమీద నిందగా ఆరోపింపబడింది. ఆ దురాచారాలకు కారణభూతులైన ప్రభుత్వోద్యోగులు తమ స్వేచ్ఛకు భంగం లేక విలాసంగా కాలం గడుపుతూనే ఉన్నారు. కాని అమాయకుడైన ఒక జీవిని బలిచేయడానికి సమకట్టి తమ కార్యాన్ని సాఫల్యంచేసుకున్నారు. అపరాధిఅపరాధం నిశ్చలమైన హృదయంతో ఒక నైతికరాజకీయసూత్రాన్ని అవలంబించడమే! శరీఫ్‌మహాశయా, అపరాధి నాతో ఒకనాడు చెప్పినట్లు, నైతికఆదర్శాన్ని మనం పొందాలంటే మన భౌతికజీవితం బలిగా చెయ్యాలి అన్న మాట సత్యం.

శాంతిసాగర్లు ముఖం తుడుచుకున్నారు. ఆ ముడుతలు పడిన చెక్కిళ్లనుండి రెండు కన్నీటిబిందువులు ముత్యాల్లా రాలేయి.

నేను మౌనం వహించేను. శాంతిసాగర్లు మాట్లాడలేదు. కాలం పరుగెడుతూంది. నా కుతూహలాన్ని అరికట్టలేక తక్కిన యిరువురు శిశువుల మాట ఏమైంది అన్నాను.

శాంతిసాగర్లు నా ముఖంలోకి చూచేరు. 'చెప్పడం మరచేను. సర్ మహమ్మద్‌కి యివ్వబడిన శిశువు వారింటనే వారి మతాచారాల్లో పెంచబడ్డాడు. ఆ దంపతులకు అతనిమీద అవ్యాజమైన ప్రేమ. నేడు అతడు మన న్యాయస్థానంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్' అన్నారు శాంతిసాగరులు. నాకు ఆశ్చర్యం కలిగింది. నేను నా ఆశ్చర్యం పట్టలేక "మహాత్మా, మహమ్మద్ మెహర్బానీ, అపరాధి సోదరుడా?" అన్నాను ఆవేశంతో. 'ఔనన్నట్లు తలూపేరు శాంతిసాగర్లు. 'ఇక మూడవవాడు' అన్నా ఇంకొక ఆశ్చర్యకరమైన వార్త వినడానికి. 'ఫాదర్ ఏండ్రూస్ తన స్వదేశం వెళ్లిపోతూ తన కిచ్చిన శిశువును ఇంగ్లండ్ తీసుకువెళ్లిపోయేడు. ఆ శిశువు ఆంగ్లదేశంలో పరీక్షలందు ఉత్తీర్ణుడై ఆంగ్లప్రభుత్వంచేత న్యాయపతిగా యీ దేశం పంపబడ్డాడు. అతడే మన న్యాయపతి.' అన్నారు శాంతిసాగర్లు. నా ఆశ్చర్యానికి మేర లేదు. వర్జిన్ ప్రెజంట్ అపరాధి రెండవసోదరుడు. నే నుండలేక అన్నా—'శాంతిసాగర్ మహాశయా, చివరకు సహోదరులే హంతకు లయ్యేరా!' అని. 'కాదు శిరీష్‌మహాశయా, ఎవరికి వారు వారివారి విధ్యుక్తధర్మాన్ని నిర్వర్తించేరు. అనాథయువతికి జన్మించిన సంతానం వారు. వారివారి జీవితగమ్యం ఏ విధంగా మారిందో చూచారా? ఏకోదరులైనా ఏకకాలజన్ములైనా జీవితంలో ఎటువంటి వేరువేరు మార్గాలు ఆదర్శంగా పెట్టుకొని నడుస్తున్నారో చూచేరుగదా? నే ననుకున్నట్లు ఆ కవలజంట ఒకరికి ఒకరు సహాయు లయ్యేరు. న్యాయపతి, పబ్లిక్ ప్రాసిక్యూటర్. ఇక మూడవ శిశువు నే ననుకున్నట్లు ఏకాకి అయ్యేడు. కాని ఆతని నైతికఆదర్శం ముందు తక్కినవారిద్దరి జీవితాలు అణుమాత్రాలు' అన్నారు శాంతిసాగర్లు.

గోడమీద ఉన్న గడియారం ఒంటిగంట కొట్టింది. నేను తొందరగా లేచి అన్నా—'మహాశయా, దీన్ని ప్రచురించడానికి అనుమతి యిస్తారా?' అని. శాంతిసాగర్లు మందహాసం చేసేరు. 'అభ్యంతరం లేదు. కాని శీర్షికమాత్రం! 'ఏకోదరు' లని పెట్టండి' అన్నారు. నేను సెలవు తీసుకుని ఒక నమస్కారం చేసి రెండడుగులు వేసేను. 'శిరీష్ మహాశయా, మీరు ఆ విధంగా ప్రచురిస్తే లాభం లేదు. మీమీద తరువాత చర్య తీసుకోవడానికి వీలుంది. కాబట్టి ఇదుగో యీ డైరీ తీసుకోండి. ఈ ఛాయాచిత్రాలను తీసుకోండి' అన్నారు. నేను ఆ మహాత్ముని ఆదరణకు ఏమి ప్రత్యుత్తరం చెప్పాలో తెలియలేదు. సంతోషంతో 'డైరీ తీసుకున్నా. ఛాయాచిత్రాలను తీసుకుంటూన్నప్పుడు అన్నారు ఆయన—'ఒక ఛాయాచిత్రం ముగ్గురు శిశువులు మరణించిన తల్లితో ఉన్న దృశ్యం; రెండవది ఏ బిడ్డ ఎవరికి ఇచ్చినప్పుడు బిడ్డతో సహా వారిని తీసిన ఛాయాచిత్రం. కవలజంటలో, ఎర్రటి పుట్టుమచ్చ చెక్కిలిమీద ఉన్న బిడ్డ ముస్లిందంపతులకు ఇవ్వబడ్డాడు. కంఠంమీద ఎర్రటిమచ్చ ఉన్నతను ఫాదర్ ఏండ్రూస్‌కు ఇవ్వబడ్డాడు. మూడో అతనికి మచ్చ ఎక్కడా లేదు.' అన్నారు శాంతిసాగర్లు. నేను ఆయనకు ఒకసారి నమస్కారం చేసి ఆయన అరచేతులను కళ్ల కద్దుకొని పైకి వచ్చేను.

కాలం శరవేగంతో నడుస్తూంది. ఆఫీసుకు పరుగెత్తేను. మర్నాడు పత్రికలో యీ చరిత్ర వెల్లడి చెయ్యాలి. ఛీఫ్ అనుమతిమీద ప్రచురించడం కష్టం లేకపోయింది. ఛీఫ్ నన్ను చూచి ఆనందం పట్టలేకపోయేడు. ఈ చరిత్ర విని తన్నే నమ్మలేకపోయేడు. డైరీ, చిత్రాలు చూచినతరువాత ఊపిరి తీసుకున్నాడు.

ఉదయం ఏడు గంటలకు శాంతిసాగర్లకు పత్రిక స్వయంగా చూపిద్దామని పరుగెత్తేను. ఆయన యింకా లేవలేదు. 'బాబుగారు ఇంకా పండుకున్నారు' అన్నాడు రఘు. 'అయినా లేపుదాము

లెండి' అన్నాడు. నేనూ, రఘూ ఇద్దరం శయనమందిరం ప్రవేశించేం. ఆ మహనీయుడు నిశ్చింతగా నిద్రపోతున్నాడు. దగ్గరగా వెళ్లేను లేపడానికని. నా కళ్లను నేను నమ్మలేకపోయేను. మహాత్ముడు శాంతిసాగర్ నిర్విచారమైన దీర్ఘసుషుప్తి చెందాడు. రఘువైపు తిరిగి అన్నాను: 'రఘూ, బాబు మన కిక లేడు.' ఏడున్నర వినిపించింది. దీనానాథుని ఊరి తీయబడింది. నేను నడవలేక హాల్లో కూర్చున్నాను-డాక్టరు శాంతి సాగర్ చిత్రం చూస్తూ. ఆ ప్రక్కనే యింకొక చిత్రం కూడా ఉంది. అది లచ్చి బిడ్డతో తీయించుకున్న చిత్రం. 'ఏకోదరులు' ఆ ముగ్గురు కారు; ఈ యిరువురే అని అప్రయత్నంగా అన్నా. రఘు వచ్చి 'బాబూ, ప్రయత్నం చెయ్యాలి' అన్నాడు. ఇద్దరం పోర్టికోలోకి వచ్చేం.

చిన్న పురుగు

శ్రీ నాళము కృష్ణరావు

అడుగు మోపకు మక్కటా! దుడుకు మీఱి,
దిక్కుమాలిన పురుగును ద్రొక్కెదు సుమి;
నీచముగ నీవు నిరతంబు చూచుచున్న
చిన్ని పురుగును దేవుడే సృష్టి చేసె.

జీవకోటుల నెల్ల సృజించినట్టి
సృష్టికర్తయె నిన్ను సృజించినాడు;
తన యనంతకృపామృతధార నతడు
పురుగుపైగూడ నాతడు దొరగజేసె.

చంద్రసూర్యుల తారకాసముదయముల
సకలజీవుల కాత డొసంగినాడు;
నీవు, పురుగులు నడవంగ నేలమీద
గరికిపోచ తివాచీల బఱచినాడు.

అల్పకాలము మాత్రమే యనుభవించు
చిన్నిసౌఖ్యము దానిని జెందనిమ్ము;
నీ వొసంగగ జాలని జీవములను
ఏల తీసెద వక్కటా! జాలి మాలి?


అది యొక శరద్రాత్రి

['వసిష్ఠుడు']

శ్రీమనోహరు సృష్టివైచిత్రి జాటు
నొక శరద్రాత్రి యది! కళ లుబికి పాఱ,
పండువెన్నెల దివి భువి నిండి నిగిడి
కింత పాలు పొనగూర నీ విశ్వమునకు
నాడు క్షీరాభిషేక మొనర్చుచుండె;
పాలవెల్లియై చిన్న స్రవంతి యొకటి
మృదులకలనాదమున బ్రవహించుచుండె;
తీరతరువారసుమగంధభార మూని
మందమారుత మంతంత సోలయుచుండె;
విహగసంతతి మేనుల విస్మరించి
తృప్తి దమ తమ గూండ్ల నిద్రించుచుండె;
తన్నదీతటలతికావితానవాటి
చెంత నొక పర్ణశాల రాజిల్లుచుండె;
అందు వసియించు తపసి యెడందవోలె
అది విశాలమై, నిర్మలమై, పవిత్ర
మై, ప్రశాంతగంభీరమై యలరుచుండె;
అయ్యది వసిష్ఠమునిచంద్రు నాశ్రమంబు.
ఆ తపసి యా కుటీరబాహ్యాంగణమున
అమరు దర్భాసనంబుపై నధివసించి
తాళపత్రపుస్తకము హస్తమున బూని
వెన్నెల యొసంగు నచ్చపు వెలుగులోన
చదువుకొనుచుండె నెల్లవిశ్వంబు మఱచి.
తన వసించిన తావు తీర్థస్థలంబొ
తన యొడలి గాలి పాపసంహారకంబొ
అన నెసంగుచునుండె నా మునివరుండు.
ఎంతసేపటు గడచెనో యెఱుగరాదు.
అంతలో నా మునీంద్రు నర్ధాంగలక్ష్మి
యగు నరుంధతీదేవి, పుణ్యముల దీవి,
సతుల సిగపూవు, సుగుణసంతతుల తావు,
తనువు కైకొన్న పావనత్వం బనంగ,
రూపమెత్తిన శీలప్రదీప మనగ,
వెలయు నాతల్లి, పరమసాధ్వీమతల్లి
అల్లనల్లన నచ్చోటి కరుగుదెంచె.
అట్లరుగుదెంచి యామె రవంతసేపు
ప్రాణవిభుని పిఱుంద దారాడుచుండి
తపము గైకొన్న యంబికాధవుని పగిది
అచ్చవెన్నెల మున్గి యేకాగ్రచిత్త
మున, నదేమో పఠించు నాథుని నొకింత
మేలుకొలుపంగ నెంచి సమీపమందు
నిలిచి, మెలమెల్ల దిన్నని యెలుగుతోడ
కొంత శంకయు జంకును గొంకు గదుర
ఇట్టు లనె ప్రేమ యెంతయు నుట్టిపడగ:
"నాథ, యిది యేమి చోద్య! మేనాడుగాని
మున్ను మీ రింత శ్రద్ధ నేపొత్తమేని
చొక్కి పఠియించుచుండుట చూచి యెఱుగ.
ఎవరు వ్రాసిరి దాని? నం దేమి కలదు?
ఇంతలో దాని నేడు చాలింత మనరె?
ఉదయమున ముందు మఱి చదువుదురుగాక.
అల్లదిగొ! నీలిమంబగు నాకసమున
మెఱుగుల వెలార్చు వెండిపళ్ళెమునుండి
పరమసమ్మోదభరమున బ్రకృతికాంత
తఱిగిపోవని జాజిక్రొవ్విరులవాన
ఉర్వి నెల్లెడ గురియుచు నున్నదనగ
నిర్మలమనోజ్ఞసాంద్రచంద్రికల గాయు
చా సుధాకరబింబ మెట్లలరుచుండె!
కనులు తనియంగ, హృదయాబ్ధి తొనకిపొంగ,

శిరము నొక్కింత యెత్తి వీక్షింపవలదె !"
అనిన నాతండు చలియింప కట్లె యుండి,
తన శిరము నెత్తకయె యామె కనియె నిట్లు:
"సాధ్వి, యీపుస్తకంబును జదువకున్న
బ్రతుకు నిక్కంబుగా నిరర్థకము సుమ్మ.
మనుజకోటులు తరియించి మహితపదము
అందుగావుత మని కృపాయతి దలిర్ప,
పరమతత్త్వార్థసారగుంఫనలు వెలయ
దీని వ్రాసె విశ్వామిత్రమౌనివరుడు.
మైమఱచియుంటి నిది నన్ను మగ్నఁ జేయ."
అనిన, నాశ్చర్యచకితయై యామె కొంత
సేపు నిశ్చేష్టయై యుండి, చెదరియున్న
మదిని గ్రమముగ నింతింత కుదుటపఱచి,
కంఠమున గద్గదిక సుంత కానబడగ,
అల్లనల్లన విభునితో ననియె నిట్లు :
"ప్రాణనాథ, విశ్వామిత్రురచన యేమి !
ఇంత శ్రద్ధతో మీరు పఠించు టేమి !
మున్న తడు మీకు గూర్చిన బన్నములను
తలచుకొనరాదు; నోటితో బలుకరాదు.
కటకట ! గణింపరాని సంకటము లుంచి,
నెలవుల గలంచి, యుండ రాములు ఘటించి,
ఉన్నదంతయు ద్రోసి, పెల్లుడుక జేసి,
నిస్సహాయత నొంటిమై నిలిపి, యిట్లు
కడకు జీవితశేషంబు గడపవిడిచె.
ముద్దుతనయుల నూర్గుర బొలియ జేసి,
ఆఱని దవాగ్ని దరికొల్పి, యాత డకట !
కడుపుకాల్చిన దెల్ల సీకరణి మఱచి,
అతని పుస్తక మని యిటు లాదరించి
చేకొని పఠింపగా మీకె చెల్లెగాక!
అదియు గా" కని యింకేమొ యనగనుండ,
పాణి చేచాపి వారించి మందహాస
కళలు మొగమున కొక వింత కాంతి యొసగ,
ఆత్మతేజము నొలికించు నతఁ డెత్తి
సుదతివంకకు గృప జిల్కు చూపు బఱపి,
స్వాంతమున నిండుకొనియున్న శాంతరసపు
పోడిమి యొకింతయును దొలుకాడకుండ,
మృదుగభీరస్వనంబున నిట్టు లనియె :
"దేవి, యాతనియెడ నిట్టి భావ మింక
ఎంతకాలంబుదాక వహింతు చెపుమ.
ఎన్నడో యాత డొనరించియున్న తప్పు
ఇన్ని నాళ్లయ్యు నింక గణింపవలెనె ?
నేర మొనరించు వారి మన్నింపజాలు
హృదయవైశాల్యమును గడియింపవలదె ?
అతనిమాత్రమె యూరకిట్లనగవలెనె ?
మన విధివిధాన మట్లుండె ననుట తగదె?
ఎవరికిని దీర్ఘవైరము హితము కాదు.
అనుభవము నేర్ప, దన నేరమును గ్రహించి
సోలి, యనుతాపవహ్నిచే శుద్ధుడైన
జనునికంటెను బరమపావనుడు గలడె ?
వ్యక్తికంటెను దద్గుణసత్త్వమునకె .
మనసు మ్రొగ్గగ జేయుటే మనుజు ఘనత.
ఇంత కెట్టివాడైన గాని మ్మతండు;
అతని సత్కృతి యొకటె గణ్యంబు మనకు.
మోహవశమున నజ్ఞానమున మునింగి,
ఘోరసంసృతి విసివడు దారి గనక,
బద్ధమై యుండు జీవాళి నుద్ధరింప
అతడు చేసిన ప్రబలప్రయత్నమునకు,
ఆర్తులై యుండు దీనజనాళి గాంచి
కృప గరంగిన యాతని హృదయమునకు,
ప్రతియె లేని తత్ప్రతిభాప్రభావమునకు
కాంతరో ! యిదె నా నమస్కారశతము !
ఆయతోజ్జ్వలచంద్రికల్ గాయు నిట్టి
కోటిశశిబింబములు దీని సాటి కావు."
అను నిజేశుప్రబోధంబు వినినయంత,
త్రుంచు పగవానినైన మన్నించి, యతని
గుణమును గణించి, ప్రతిభకు బ్రణతి చేయు

చెలువు శాంతతకును, క్షమాశీలమునకు,
విపులవిశ్వజనీనమా ప్రేమమునకు
మది మహాద్భుత మంది తన్మయత నొంద,
ప్రస్ఫుటంబుగ నానందరసము పొంగి
అంతరంగంబునంతయు నావరించి,
నిండి గళమున మాట రాకుండ నాపి,
నమ్మదాశ్రువులై కంట జాలువాఱ,
ఆ గరిత తన పూర్వపుణ్యంబుకతన
అట్టి యసమప్రభావు, మహానుభావు
పతిగ జేపట్ట గనిన ధన్యతకు నలరి,
ధవుని చరణములందు మస్తకము నుంచి
లేవకుండిన, గృప మీఱ లేవనెత్తి,
ఆత డామెను బ్రియమాఱ నాదరించె.
అంత నా చంద్రబింబము కాంతి తఱుగ
చదల భానూదయంపు సూచనలు దోచె.
మేలుకొనుమంచు జగతిని మేలుకొలుప
అపుడు సద్విజశ్రేణి కాలానుసరణి
మేలి మంగళగీతిక లాలపించె.



మరపు రాని ఆ వూరు

[కథానిక]

●

'జమదగ్ని'

"కొండ లెక్కడ మంటే జ్ఞాపకం వచ్చింది. అదొక విచిత్రసన్నివేశం.

ఆ సంగతి తలుచుకుంటే చాలు, నా కిప్పటికీ ఒళ్లు గగుర్పొడుస్తుంది. తక్కిన జీవితంతో సంబంధం లేకపోయినా, ఒక్కొక్క సన్నివేశం, అలా హృదయానికి హత్తుకుపోయి, చివరిదాకా అనుభవస్మృతి నిస్తూనే ఉంటుందినుమా!

ఇప్పటి మాటా? ఎన్నేళ్లయిందో అది జరిగి! అయితే ఏం, ఆ అనుభవం అల్లాటిది!

నువ్వు మదనపల్లి ఎరుగుదువా? ఎరగవూ? అదేమిటోయ్! పోనీ, దగ్గులాసుపత్రిని విన్నావా? అదా వూళ్లోనే ఉంది.

అక్కడికి పదిమైళ్లదూరంలో రెట్టని ఒక చిన్న పల్లెటూ రుందోయ్. ఆ వూళ్లో మా స్నేహితుడొక డుండేవాడు. వాడూ, నేనూ చిన్నప్పుడు ఏలూరులో చదువుకునేవాళ్లం.

అక్కడెక్కడో ఊరివాడు ఇందాకా ఎందుకు వచ్చా డనుకుంటావేమో! వాడికి పసితనంలోనే తల్లి పోయింది. అంచేత చిన్నప్పటినుంచీ అమ్మమ్మదగ్గిర మేనమామల ఇంట్లో పెరిగేవాడు. ఆ మేనమామ కేలూరులో ఉద్యోగ మయింది. అందుకోసం ఇందాకా రావలసివచ్చింది.

సరేనా? వాడి పేరు రామచంద్రమూర్తి. వాడికీ నాకూ ఎంత స్నేహం ఉండేదో చెప్పడానికే వీల్లేదు. చూచినవాళ్లంతా మే మిద్దరమూ అన్నదమ్ముల మనే అనుకునే వాళ్లు. అంత అప్యాయంగా ఉండే వాళ్ల మా రోజుల్లో!

నిజంగా ఆ రోజులే వేరోయ్! అప్పుడో రో జయిపోతే అయ్యో, ఎందు కయిపోయిందా అనిపించేది. ఇప్పుడలా కాదుగా! సంవత్సరాలు సంవత్సరాలు ఎల్లా దొర్లిపోతాయా అనుకుంటూ ఉంటే రోజులమాట లెక్కేమిటి! ఒక్క వ్యక్తులే కాదు, దేశం దేశమంతా ఇలాగే అనుకోవలసిన స్థితి వచ్చినట్టుంది. అవును గదూ!

సరే, దానికేం? అసలుసంగతి చెప్తా విను.

నన్ను మా రామం వాళ్లఊరు రమ్మంటూ ఉండడం, నేనేదో వీలుకాక ప్రతిసారీ వెళ్లకపోవడం, అల్లా మే మిద్దరమూ స్నేహితుల మయ్యాక మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. చివరికి మా రామానికి కోపం వచ్చే పర్యంత మయింది. 'పోనీ, రావడానికి ఇష్టం లేకపోతే రానని చెప్పేసెయ్యరాదూ?' అని కూడా అనేశాడు.

వాడికి నే నంటే అంత అభిమానం.

నన్ను వాళ్ల ఊరు తీసుకువెళ్లాలని వాడి కెంత ఉబలాటంగా ఉందో, వాళ్ల ఊరు వెళ్లాలని నాకూ అంత ఉబలాటంగానే ఉంది. అయినా అక్కడికి వెళ్లడం మాత్రం అంత తేలికగా పడింది కాదు.

దాని కనేక కారణా లున్నాయి. అప్పుడు నాకు పదహారేళ్లు. అన్నేళ్లు వచ్చినా అంతవరకూ మన వూరు విడిచి మరో వూరు వెళ్లిన పాపాన పోలేదు.

ఇల్లా అన్నానని నాకు భయం వేసి మా రామంతోను వెళ్లలే ననుకోకు.

అప్పుడు మానాన్న అదోరకంగా ఉండేవారు. శెలవుల్లో నేనింటిదగ్గర లేకపోతే ఆయన కేమీ తోచేది గాదు. అందుకనే నే నెప్పుడు వెళ్తానని అడిగినా చెల్లెలి పెళ్లో, తమ్ముడి వడుగో ఏదో ఒకవంక పెట్టి వెళ్లవద్దనేవారు. నిజాని కా సంవత్సరాల్లో అవీ జరిగాయనుకో! అయినా ఆయన కిష్టం ఉంటే నే నొక వారంరోజులపాటు స్నేహితునితోను వెళ్లిరావడం వీటికి ఏమిఅడ్డమయ్యేది?

ఆయనతత్త్వమే అంత! అడిగినప్పు డిష్టమయితే కొండమీది కోతినైనా దింపేవారు. లేకపోతే ఇవతల వాళ్లు ఏమనుకున్నా ఆయనపంతమే ఆయనది.

అదీ కాక మా నాన్న ఒప్పుకోకపోవడానికి మరో కారణం గూడా ఉన్నది. అది నా ప్రవర్తనలో ఆయనకు విశ్వాసం లేకపోవడం.

ఇప్పుడంటే ఇల్లా ఉన్నానుగాని, ఆరోజుల్లో నన్ను పట్టపగ్గాలుండేవా? చిలిపితనమూ, సాహసమూ కలిపి చేసిన చిచ్చుబుడ్డిలా ఉండేవాణ్ని. ఈ ఊళ్లో కాలవ నేను లేకుండా ఒక్కక్షణం ప్రవహించేది కాదుగదా! అంతటితో సరేనా? ఊళ్లో కుఱ్ఱకారంతా నేను చెప్పినట్లు వినేవాళ్లు. రమ్మంటే రావలసిందే, పొమ్మంటే పోవలసిందే! ఇం కెందుకు! ఆంజనేయుడటూ, నే నిటూ అనుకో! లంకాదహనాలేమిటి, సముద్రలంఘనాలేమిటి, ఓ—మా చిత్తంవచ్చినట్లు చేసేవాళ్లం. అందుకనే నే నెక్కడికైనా వెళ్లితే ఏ అఘాయిత్యం చేస్తానో అని మానాన్న ఊరికే భయపడిపోయేవారు.

అయితే ఏమాట కా మాట చెప్పాలి. అంత అల్లరి చేసినా నాలో ఒక గుణం ఉండేది. మా నాన్న కనబడితే చాలు, ఆయన ఏమీ అనకుండానే పక్కన పే నయిపోయేవాణ్ని.

అదీ పరిస్థితి! అల్లాంటి నేను, మా నాన్న లాంటివాణ్ని ఒప్పించి రామంతోను వెళ్లాలి. ఇదేం ఊరికే మాటలతో అయ్యే పనా?

అప్పు డేం చేశామో విను. ఇద్దరమూ కలిసి ఒక పెద్ద పన్నాగం పన్నాము. మా రామం ఊరువాడే సుబ్బారావని ఇంకోకుఱ్ఱాడు మాతో చదువుకుంటూ ఉండేవాడు. వాడికి మేమంటే బాగా చదివేవాళ్లమని గౌరవం ఉండేది గాని మాతో అంత చనువుగా తిరిగే వాడు కాదు. వాడి సరదాలన్నీ మరోరకంగా ఉండేవి. ఒక్కొక్క మాస్టర్ని అనుకరించి వాడు కబుర్లు చెప్తూఉంటే పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వు వచ్చేది. మేం వాడిదగ్గిరికి వెళ్లి ఉన్న విషయం చెప్పాము. వాడికి నిజంగానే మామీద జాలి వేసింది.

అప్పుడు సుబ్బారావు 'ఒరేయి, నువ్వు రామాన్ని తీసుకుని మీవూరు వెళ్లిపో! తర్వాత ఒకటి రెండు రోజుల్లో నే నక్కడికి వస్తాను. మనపని ఎందుకు కాదో చూద్దాం' అని నాతో అన్నాడు.

సరే అంటే సరే అనుకున్నాం. నేనూ, రామం మనవూరు వచ్చేశాము.

ప్రతి యేడాదీ అంటున్నట్లు స్నేహితుడి వూరు వెళ్తాననక వాణ్నే మనవూరు తీసుకువచ్చినందుకు మానాన్న చాలా సంతోషించారు.

రామం నాతో ఇదివరకే రెండుమూడు సార్లు రావడంవల్ల వాణ్ని మాయింట్లో అంతా ఎరుగుదురు. అంచేత మేమిద్దరమూ మావాళ్లందరితో కలిసి కులాసాగా కాలక్షేపం చెయ్యడంలో తెలియకుండానే నాలుగు రోజులు గడిచి పోయాయి.

అనుకున్నట్టు సుబ్బారా వింకా రాలేదు. ఇదేమిటిరా వీడు మోసం చేశాడా అని మా కనుమానం తగిలింది.

కాని ఆరోజుపోస్టులోనే రామంపేరుమీద వ్రాసిన ఉత్తరం ఒకటి వచ్చింది. వాళ్లింట్లో ఉండే రామం చదువుకుంటున్నాడు గనకా, వీ డిక్కడికి రావడం ఆయనకు తెలుసును గనకా, అల్లా ఉత్తరం వ్రాయడంలో తప్పు లేదుగాని వస్తుందని మే మనుకో లేదుగాబట్టి మొదట్లో మాకు భయమే వేసింది.

మానాన్న ఆ ఉత్తరం చదువుకుని సంగతి సందర్భాలు తెలుసుకున్నారు. రామానికిగూడా చూపించమని నాచేతి కిచ్చారు.

తీరా దాన్ని చూచాక మే మిద్దరమూ మా గదిలో కూర్చుని ఎంత సంతోషించామో చెప్పతరం కాదు. నామటుకు నాకు ఈసారి నేను రామంతోను వెళ్లడం అటు సూర్యు డిటు పొడిచినా తప్ప దని పించింది.

రామం మేనమామ వ్రాసినట్లు మూడోరోజు సాయంత్రానికల్లా రామంతండ్రి విశ్వనాథపాకయాజి గారు మావూరు వేంచేశారు.

ఆ బిళ్లగోచీ, ఆ కుండలాలూ, ఆ జారీచెంబూ-పీటితో పరమశ్రోత్రియుంగా ఉన్న ఆయన్ని చూచే సరికి మానాన్న పరవశు లయ్యారు. ప్రథమవీక్షణం లోనే వాళ్లిద్దరికీ అపరిమితమైన స్నేహం ఏర్పడింది. ఇక ఆయనమాటలు మానాన్న కమృతమే అయ్యాయి. పదిమాట లెందుకు! ఆయన ఇక్కడ ఉన్న ఒక్క రోజూ కావలసినవన్నీ మానాన్నే స్వయంగా కను క్కుంటూ ఒక్క క్షణంగూడా విడిచి పెట్టకుండా అంటిపెట్టుకుని ఉన్నారంటే నమ్మ.

మా రామం మాత్రం తండ్రి అంటే పరమభయ మున్నట్లు మొదట్లో ఏం పలకరించాడో ఏమో మళ్లీ ఆపూట కాయన్ని చూడలేదు.

ఆరాత్రి ఎల్లాగో గడిచిపోయింది.

మర్నాడు పొద్దున్న స్నానాలూ సంధ్యలూ అయింతర్వాత మే మిద్దరమూ సావిట్లో చాపమీద కూర్చుని కబుర్లాడుకుంటున్నాము. మానాన్నా, ఆయనా అప్పుడే వచ్చి కుర్చీల్లో కూర్చున్నారు. ఏ మవుతుందో ఏమో అని మాఇద్దరికీ మహాభయంగా ఉంది. లేచిపోదా మనిగూడా అనిపించింది కాని అదేం ప్రమాదానికి దారితీస్తుందో అని మళ్లీ అలాగే ప్రయత్న పూర్వకంగా చతికిలబడ్డాము.

‘ఏరా రామం!’ అన్నారు విశ్వనాథంగారు.

రామం ఆయనవంక మొహం బిగబట్టుకు చూచాడు.

అంతలో ఆయనే ‘అల్లా బెంబేలుపడతావేం! ఇల్లాంటి స్నేహితులతో సావాసం చేస్తే ఎవరుమాత్రం ఏమంటారు? స్నేహంకొద్దీ వచ్చారు, నాలుగురోజు లున్నారు, బాగానే వుంది. మరయితే ఎప్పుడూ నువ్వు వాళ్లింటికి వెళ్లడమేగాని అతన్నిగూడా ఒకసారి మనింటికి తీసుకురావడం అక్కర్లేదా ఏమిటి?’ అన్నారు.

నేనయినా, రామమయినా ఆయ నలా అంటుంటే ఏమనగలం! ఇంత ప్రయత్నమూ ఏదో వెకిలి మాటని పాడుచేసుకోవడం ఇష్టంలేక గుండెలు గుబుక్కు గుబుక్కు మంటుంటే అల్లాగే కూర్చున్నాము.

మళ్లీ ఆయనే మానాన్నవంక తిరిగి ‘ఏమండీ శాస్త్రిగారూ! ఏదో పసితనంకొద్దీ మావాడికి తోచ లేదు. నేను స్వయంగా అడుగుతున్నాగా, మీ వాణ్ని మాతో పంపించండి. ఒక వారంరోజులపాటు ఉండి వస్తాడు. అబ్బాయి క్షేమంవిషయంలో నేను జాగ్రత్త పడతాను. అందునిమిత్తమై ఈషణ్మాత్రమైనా మీరు సంకోచించవద్దు. నామాట నమ్మి మీరు ఊఁ అనండి, మీవాణ్ని మళ్లీ పువ్వుల్లోపెట్టి మీ కప్పగించేస్తాను’ అన్నారు.

మానాన్న ఏమీ మాట్లాడలేదు. కాని ఆయన ముఖంలో సౌమనస్యం గోచరించింది.

‘నాన్నగారు ఒప్పుకున్నట్టేనోయ్. నువ్వింక భయపడక్కరలేదు. లేచి కావలసినవన్నీ సర్దుకో. భోజన మవుతూనే బయలుదేరాలి’ అంటూ విశ్వనాథం గారు తొందరపెట్టేశారు.

అంతకుముందునుంచీ అవకాశంకోసం చూస్తున్న మేమిద్దరమూ వెంటనే లేచి వెళ్లిపోయాము.

పదింటికల్లా భోజనా లయ్యాయి.

మానాన్న నన్ను ఏకాంతంగా పిలిచి చెప్ప వలసినవన్నీ చెప్పి ఒక పాతికరూపాయ లిచ్చారు.

అప్పుడు నాకు కలిగిన సంతోషమూ, నేను పొందిన కృతజ్ఞతాభావమూ ఇంతా అంతా కాదు. అయినా ఆ సందర్భంలో అవి బయటికి రాలేక లోప ల్లోపలే అణిగిపోయాయి.

విశ్వనాథంగారు బయలుదేరుతూఉంటే ‘పోనీ. రేపు వెళ్లరాదా?’ అని మానాన్న అన్నారు గాని

'బాబ్బాబు! ఆ మాట మాత్రం అనకండి, సంసారంలో దిగాక ఒక్కరోజు ఇల్లు విడిచిపెట్టడమంటే ఎంత ఇబ్బందో మీకు తెలియందికాదు. అందులో నాకు లక్షాతొంభైపనులు. ఇప్పటికే నాలుగురోజు లయింది. ఈసారి కిలా కానివ్వండి. పరిచయాలు కావాలేగాని రాకపోతామా, ఉండకపోతామా? మరయితే నాపంతు ఇంతమాత్రమయినా అయింది. ఇక మీ అనుగ్రహం ఎప్పుడు కలుగుతుందో ఏమో! నాకు సెలవిప్పించండి' అని అంటూనే మావంక చూసి 'ఇంకా చూస్తారేమర్రా! పదండి, రైలు వేళవుతోంది' అని విశ్వనాథం గారు మమ్మల్ని హెచ్చరించారు.

నేనూ, రామం మావాళ్లందరితో వెళ్లొస్తామని చెప్పి వీథిలో అడుగుపెట్టాము. మానాన్న అదీ ఇదీ జ్ఞాపకంచేసుకుని హెచ్చరిస్తూ ఉంటే కొంచెం మెల్లగా నడుస్తున్నాము. అంతలోనే విశ్వనాథంగారు చాలాదూరం వెళ్లిపోయారు.

తర్వాత స్టేషను చేరుకున్నా ఆయన్ని అందుకోవడం మాకు చాలా కష్టమయింది. కాని మా సుబ్బారావుమాత్రం అక్కడ మాకోసం కాచుకు కూర్చుని ఉన్నాడు.

* * *

అల్లా వెళ్లా మా వూరు.

అందుకే ఆవూరంటే నా కింత అభిమానం.

నువ్వే ఇల్లాంటి పరిస్థితుల్లో ఏదయినా వూరు వెళ్లావనుకో! ఆ వూరు మరిచిపోగలవా?

నీకే కాదు, ఎవ్వడికీ సాధ్యం కాదు.

అవునా మరి, అల్లాంటప్పుడు ఆ వూళ్లో నే నున్నట్టే నాలుగురోజు లుండి, నాకు కలిగిన అనుభవాలలాంటివే నీకూ కలిగితే ఇంకెల్లా ఉంటుందో చూడు.

అయినా అభిమానంకొద్దీ అనుకోవడమేగాని నిజానికి మన వూళ్లల్లో అందమేముందోయ్. ఎంత దూరం చూసినా కన్ను నొప్పి పుట్టేటట్టు మాగాని చేలేగా! పంటఉన్న నాలుగు రోజులూ పైరుతో మిసమిసలాడుతూ పచ్చగా ఉన్నా అతర్వాత పెద్దబట్ట తలలాగా వట్టి బయలుప్రదేశమేనాయె. పుట్టింది మొదలు చచ్చేవరకూ తినడమూ కనడమూ తప్ప మరో అనుభూతే లేని మనిషిజీవితంలాగా అంతా సమతల ప్రదేశమే అయితే అందులో ఆకర్షించేందు కేముంటుంది? ఎత్తులూ, పల్లాలూ ఉండాలి; అగాధాల్లో పడి లేచి ఆకాశాన్నంటుకోవాలి. దేశంగాని, జీవితంగాని అప్పుడే హృదయంగమ మవుతాయి. ఏమంటావ్? అవునంటావా, కాదంటావా?

నిజంగా మన కా వూళ్లు దగ్గిరయితే ఎంత బాగుంటుంది? మన నదీజలాలతో ఆ కొండలు కలిసి సౌందర్యం పరమావధి అందుకోదూ?

అనుభవించే యోగ్యత లేక, రాకపోకలు మానేసి, ఆత్మవంచన చేసుకుంటూ సౌందర్యాన్ని చూడలేకపోతున్నాం గాని నిజాని కవిమాత్రం ఏమంత దూరం?

స్నేహితునిమీది అభిమానంచేతనేమో అప్పుడు నా కా వూరు దూరమే అనిపించలేదు.

వెళ్లాను, ఆ వూళ్లో అడుగుపెట్టాను. మళ్లీ ఇంటికి రా బుద్ధివెయ్యలేదంటే నమ్ము.

రకరకాల కొండలు, అడుగడుక్కీ ఊటవాగులు. మండు వేసవిలో గూడా మిసమిసలాడే పంటలు. ఎఱ్ఱని నేలా, పచ్చని చెట్లూ! చూపు పారించి చూస్తే అనంతమైన వైవిధ్యంలో అత్మికింపైన సామరస్యం.

ఆ ప్రాంతాలే అంత! అందులో ఆ వూరు మరీనీ!

వెళ్లిన దగ్గరనుంచీ ఒక్కక్షణంగూడా వృథా చెయ్యకూడ దనిపించింది నాకు. 'రెండు రోజులబట్టీ నిద్ర లేదు, ఇవాళ్టికి వద్దని మావాళ్లిద్దరూ మానేసినా నేమాత్రం ఊరుకో లేదు.

ఒంటరిగానే బయలుదేరి ఊళ్లోకి వచ్చిన దారె అనుసరించాను.

అవూరు నానుకునే చుట్టూ తిరిగి ఒక వూటవాగు పారుతోంది. అందులో అన్నికాలాల్లోనూ నీళ్లుంటాయి. అల్లాంటివే ఆ ప్రాంతాలవాళ్లకు కామధేనువుల్లా ఉపకరిస్తూంటాయి.

దానివెంబడి వెళ్ళామంటే పాదలూ గట్రా ఉండి పీల్లేక నీళ్ళల్లో నడుస్తూనే కొంతదూరం వెళ్ళాను. అక్కడ అది రెండు పాయలుగా చీలిపోయి మధ్యన యిసకమేట వేసి ఒక లంకగా ఏర్పడింది. చుట్టూరా బిలబిలమంటూ నీళ్లు పారుతూ ఉంటే ఆనందమయి అక్కడ కాసేపు కూర్చున్నాను.

అంతలో మావాళ్లు ఏమనుకున్నారో ఏమో నాకోసం వెతుక్కుంటూ అందాకా వచ్చారు.

అక్కడ కూర్చున్నంతసేపూ ఆ వాగు పుట్టిన చోటు దగ్గిరికి ఎల్లా వెళ్లడమా అని ఆలోచిస్తూనే ఉన్నాను. ఇదివరలో మా రామం చెప్పినదాన్ని బట్టి ఆ చోటు ఊరికి మూడుమైళ్లదూరంలో ఉంది. అందాకా వాగులోనే నడవాలంటే చాలా కష్టం. వాగువెంబడే పోదామన్నా బొత్తిగా దారిలేదు. కొండలమీదుగా వెళ్లే దారేదో ఉందన్నాడు గాని అది నాకు తెలియదు.

నీళ్లు రావడంతోటే నా ఉత్సాహం అధికమై 'పోదాం, రండర్రా' అన్నాను.

'మూడుమైళ్లు వెళ్లి, మూడుమైళ్లు రావాలి. రేపు పోదాం లేవోయ్' అన్నాడు సుబ్బారావు.

'రేపు మరోచోటికి వెళ్లవచ్చు, ఆరుమైళ్లు నడిచే ఓపిక లేదా ఏమిటి?' అన్నాను నేను.

'ఇప్పుడు మూడయింది. వెళ్తే ఒక గంట సేపన్నా అక్కడ కూర్చోవాలిగదా! వచ్చేటప్పుడు చీకటి పడిపోతుందేమో' అన్నాడు రామం.

అల్లా వాళ్లు ఎంత వెనక్కి తీసినా నేను ఊరుకోక చివరికి 'మీరు రాకపోతే పోనీలెండి. నాకు దారి చూపించండి. నేను వెళ్లివస్తాను' అన్నాను.

దాంతో తప్పనిసరై వాళ్లూ బయలుదేరారు.

అదంతా పట్టి కొండలదారి. అల్లాంటి చోట నడిచే అలవాటు నాకు లేదాయె. అందేత కొంత దూరంవరకూ, రావడానికి ఉత్సాహం లేని మా వాళ్లే ముందు నడిచారు. కాని ఆతర్వాత నాకూ అలవాటయి మావాళ్లే నాతో నడవలేకపోయారు.

అల్లా ఒక్క అరగంట నడిచాము. అంతసేపూ నేను మాత్రం నాలుగు పక్కలా చూస్తూ తన్మయు న్నవుతున్నాను.

అకస్మాత్తుగా 'అదిగో బుగ్గ!' అన్నాడు మా రామం. బుగ్గ అంటే భూగర్భం నుండి జలం వచ్చే చోటు.

నా డామాట అనేవరకూ నేనటుచూడనేలేదు.

ఎదురుగా పల్లంలో ఒక పెద్ద రావిచెట్టు ఆకు లాడిస్తూ ఆహ్వానిస్తోంది.

దానికి పదిగజాల దూరంలో సన్నని యేరు బిల బిలమంటూ ప్రవహిస్తోంది.

మేము దిగుతున్న కొండ ఇటు దక్షిణానికుంటే ఆ యేరు కటువైపు ఉత్తరంగా మరొక చిన్న కొండ ఉంది. ఈ రెంటి మధ్య ఆకాశాన్ని ఆరావిచెట్టు కొమ్మలే ఆక్రమిస్తున్నాయి.

ఆనందం పట్టలేక ఎన్నాళ్లబట్టో చూడా లను కుంటున్న తల్లికోసమన్నట్టు పరుగెత్తుకుపోయి ఆ చెట్టు మొదట చేరాను.

అక్కడ చూద్దునుకదా కొండమీదికి కనిపించిన పాయకు కొంచెం పైగా విశాలమైన సమప్రదేశంలో వందల కొలది నీటిపాయ లున్నాయి. అక్కడికి తూర్పుగా మళ్లీ అన్నీ గుట్టలే! ఆ గుట్టల్లో ఉన్నది బుగ్గ! అక్కడినుంచి నీళ్లు బయలుదేరి ఇలా పాయలు పాయలుగా వస్తున్నాయి.

ఆరావిచెట్టుక్రింద ఒక బండ ఉంటే ఆ బండ మీద కూర్చున్నాను.

అప్పటికి పొద్దు వాలి చెట్టుకొమ్మలకిందుగా నీటిపాయలమీద వెలుగు పడుతోంది.

కొన్ని పాడుతున్నాయి, కొన్ని నృత్యం చేస్తున్నాయి. కొన్ని పాముపడకలు పడుతున్నాయి, కొన్ని కొంటెపోకడలు పోతున్నాయి. ఉన్నట్టుండి బుసబుసా పొంగివి పొంగుతూ ఉంటే ఇదివరకునుంచీ సందడి చేస్తున్నవి ఉడిగిపోతున్నాయి. ఇవన్నీ వచ్చి వచ్చి నే కూర్చున్న బండదగ్గిరే ఏకమయి అసలు వాగుగా ముందుకు పోతున్నాయి.

సింహాసనంలాంటి ఆ బండమీద కూర్చుని ఎదురుగా చూస్తూఉంటే వరుణదేవుని సభలో కూర్చున్నట్లే ఉన్నది.

సూర్యకాంతి పడి ఆ పాయలన్నీ జలకన్యలలా కనిపించాయి. తళతళ మెరుస్తూ, గలగలమంటూ అవి పారుతూ ఉంటే నా గుండెల్లో ఆనందం జల పొడిచింది.

జలాధిదేవత ముగ్ధమోహనసౌందర్య వికాసం అంతా అక్కడే ఉంది.

సౌందర్యం, సంగీతం, కలకల నినాదం, వింత వింతసువాసనలు - ఏం లేదక్కడ? సృష్టిలో లోభనీయమైన వస్తుసముదాయమంతా అక్కడే వుంది.

అంతలో వేళయింది కాబోలు, మేతకు తిరుగుతున్న మంద సంతతినీ చేరదీయడానికి గొల్లకాపరి కుర్రాడొకడు పిల్లంగ్రోవి ఊదసాగాడు.

ఆ సందర్భానికి ఈ మధురధ్వని తోడయి నా హృదయాన్ని తన్మయం చేసేసింది. జీవితంలో ఒక్కమారైనా అల్లాంటి దృశ్యాన్ని చూచి ప్రకృతిరామణీయకంలో తన్మయుం కాకపోతే ఇంకా బ్రదుకెందుకనిపించింది!

అల్లా అక్కడ ఎంతసేపు కూర్చున్నానో ఏమో మా వాళ్ళు ఏం చేస్తున్నదీకూడా నాకు తెలియలేదు.

ప్రాపంచికవిషయాల్లో మునిగితేల్తూ ఉండే మనబోటివాళ్లకే ఇంత సంతృప్తి నిచ్చాయంటే మహర్షులిల్లాంటి చోట్లను తమ నివాసస్థలాలుగా చేసుకోవడంలో ఆశ్చర్యం ఏముంది?

సముద్రం ఉందనుకో-అదొక పెద్ద ప్రపంచ చరిత్ర. మహానదులున్నాయనుకో — అవి సుదీర్ఘకావ్యాలు. మరి యీ సెలయేళ్లో - ఇవి ఆపాతమధురాలైన గేయకావ్యాలు.

వీటి సొగసే వేరు — వీటి ఆనందమే వేరు.

మనిషయి ఉండి మనసప్పగిస్తే చాలు, ఎల్లాంటివాణ్నయినా స్వర్గలోకవిహారం చేయిస్తాయి.

'ఇక లేవయ్యా పోదాం' అని మా రామం వేసిన కేక ఎంతో ఎత్తున తిరుగుతున్నవాణ్ని అమాంతంగా కిందికి లాగినట్లు నా మనఃప్రశాంతికి భంగం కలిగింది.

'చీకటి పడుతోంది, ఇంటికి వెళ్లాలి' అన్న విషయం అప్పటికిగాని నాకు తోచింది కాదు.

* * *

ఇక ఆ వూళ్లో ఉన్నన్నాళ్ళూ అల్లాంటి దృశ్యాలెన్ని చూశానో లెక్కలేదు. ఏ కొండమీదికే సమయంలో వెళ్లినాసరే ఏదో అద్భుతం కనిపిస్తూనే ఉంటుంది.

మనం వెళ్లాలే గాని చూడదగినవెన్నున్నాయోయ్ అక్కడ!

నువ్వెప్పుడైనా ఎత్తిపోతలని విన్నావా? మనవైపున అల్లాంటి మాటే వినపడదు. ఎంత కమ్మని తెలుగో చూడది!

మనం జాగ్రఫీపుస్తకాల్లో చదువుతూ ఉంటామే జలపాతాలని-అవ్వన్నమాట, ఎత్తిపోతలంటే.

సూర్యోదయ సూర్యాస్తమయ సమయాల్లో అక్కడికిపోయి ఎదురుగ్గా కూర్చో — ఆనీళ్లలా కింద పడుతూఉంటే నీమనస్సలా ఊర్ధ్వలోకాల నందుకుంటుంది. ఒక వెయ్యి సూర్యబింబాలు వెచ్చదనం విడిచిపెట్టి కనుల కింపైన కాంతిప్రవాహంగా మారి నీముందు నృత్యం చేస్తాయి.

ఆ సంగతి తలుచుకుంటేనే నా కింత తన్మయత్వం కలుగుతోంది. ఇక వెళ్లినప్పుడెల్లా ఉన్నదో నువ్వే ఊహించుకో!

ఇంతకూ అసలు సంగతి చెప్పనేలేదు.

అది నే నా వూరు వెళ్లిన అయిదోరోజున జరిగింది.

ఆవేళ మధ్యాహ్నం నేనూ, రామంగూడా సుబ్బారావింటికే భోజనానికి వెళ్ళాం. భోజనాలయాక కబుర్లు చెప్పుకోవడంలో సినిమాప్రసక్తి వచ్చింది. నాకయితే దానిమీద ధ్యాస పోలేదుగాని మావాళ్ల సరదా చూచి నే నొక్కణ్ణే కాదనడం ఎందుకని సరే అన్నాను ముభావంగా.

సరిగ్గా ఆట ముందు బయలుదేరడానికి సినీమా ఆ వూళ్లో ఉంటేగా? అక్కడినుంచి మదనపల్లికి పది మైళ్లు నడిచి పోవాలి. మళ్లీ రాత్రికి తిరిగి రావడానికి వీల్లేదు. అక్కడే పడుకుని పొద్దున్నే రావాలి.

'రోజూ ఇన్ని కొండ లెక్కుతున్నాము. ఈ మాత్రం వెళ్లి రాలేమా ఏమిటి? అందులో ఎన్నడూ లేంది మంచి సినీమా వచ్చింది. శాంతారాం తీసిన రామరాజ్యంట. పోదా మంటే పోదా' మన్నారు మావాళ్లిద్దరూనూ.

నేను సరే అని పూర్తిగా ఒప్పుకున్నాక మే మిలా మదనపల్లి వెళుతున్నట్టూ, రాత్రికి రామన్నట్టూ రామం వాళ్లింటికి కబురంపించాడు.

ఇక మా సుబ్బారావు పొద్దున్నే స్నానాలు చేసేందుకని మూడు తుండుగుడ్డలూ, ఒక సబ్బుబిళ్లా వగైరాలు సంచీలో పెట్టి దారిలో ఫలహారానికని మసి తారకుండా కుండలో వేయించిన వేరుసెనక్కాయలూ, పటికిబెల్లంలాంటి గట్టి బెల్లపచ్చు కొంతా జాగ్రత్తచేసి బయలుదేరదీశాడు.

మేం ముగ్గురమూ ఇల్లా వాకిట్లో అడుగుపెట్టాము—ఎదురుగా పెద్ద కుంకుమబొట్టుతో లక్ష్మీదేవిలాంటి సుబ్బారావు తల్లి వచ్చి 'ఇంత ఎండలో బయలుదేరారేమర్రా ముగ్గురూనూ? ఇంకా ఎక్కవలసిన కొండలున్నాయా ఏమిటి?' అన్నది వేళాకోళంగా.

'కాదమ్మా! మదనపల్లికి పోతున్నాము. సినిమా చూసి పొద్దున్నే వస్తాము' అని ఆవిడకు సమాధానం చెప్పి 'మీరు ముందు వెళ్తూ ఉండండి. ఎందుకైనా మంచిది. నేను వెనకాలే వచ్చి కలుసుకుంటాను.' అంటూ సుబ్బారా వాగిపోయాడు.

వాడి అనుమానానికి నాకు నవ్వు వచ్చింది. ముగ్గురం బయలుదేరడం దోషమయితే ఆవిడ ఎదురు రావడం శుభమేగా! అదికాక దోష మేమన్నా వచ్చేటట్టయితే బయలుదేరాం కాబట్టి ఎల్లాగూ వస్తుంది. ఇప్పుడు ఒక్కడు కాసేపు పాగడంవల్ల ముగ్గురం బయలుదేరినట్లు కాకపోయి ఆ దోష మెలా పోతుందో నా కర్థం కాలేదు.

మేమిద్దరమూ పుంతవెంబడి ఒక ఫర్లాంగు నడిచే వరకూ మా సుబ్బారావు మమ్మల్ని కలుసుకోలేదు. వాడు గూడా మాతో కలిశాక కబుర్లాడుతూ కాళ్లకు చురుకెక్కించాము.

ఆ పుంత పొలాలలోంచీ, పల్లెల్లోంచీ పోయి పోయి మూడు మైళ్ల దూరంలో ఉన్న రోడ్డుతో కలుస్తుంది. అక్కడికి మేం వెళ్లేటప్పటికి రెండున్నరగూడా అయి ఉంటుంది. ఎండ, వేడి లేకపోయినా, మంచి వెలుగ్గా ఉంది. ఇంకా నీడలు గూడా పొడుగు పాగడంలేదు.

అక్కడ రోడ్డువానుకునే ఒక చిన్న చెరువుంది. దానికి రెండువైపులా ఒక చక్కని రాతిగట్టూ, ఒక వైపున ఒక పెద్దకొండా! నాలుగోవైపు పరవలువచ్చే ఎత్తైన ప్రదేశం! రోడ్డు కివతల ఉన్న చిన్న చిన్న గుట్టలూ, అటుపక్క కొండా, కొంచెందూరంలో ఎత్తుమీద ఉన్న తోటలో చెట్లూ, రకరకాల పింజె మబ్బులతో ఆకాశం అన్నీ ఆ నీళ్లల్లో ప్రతిఫలిస్తున్నాయి.

'ఇక్కడ కాసేపు కూర్చుని వేరుసెనక్కాయలు తిందా' మన్నాడు మా సుబ్బారావు. ఆ సూచన నాకు చాలా సంతోషం కలిగించింది. వీళ్ళు వెళ్లిపోదా మంటారేమో ఇక్కడ కాసేపు కూర్చోడం ఎల్లాగా అని నే ననుకుంటూ ఉంటే వాడే ఆ సూచన చేశాడు.

సరే అని అక్కడ కూర్చుని నోళ్లకు పని చెప్పాము.

నాలుగైదు కాయలు తిన్నా నేమో, ఆతర్వాత నేనుమాత్రం ఆ దృశ్యంవంక పారవశ్యంతో చూస్తూ ఉండిపోయాను. వాళ్లూ మాస్తున్నా వేరుసెనక్కాయలు గూడా తింటున్నారు.

అంత అందమైన చోట్లో ఉంటూగూడా ఆ అందం వాళ్లకేమీ తెలియడంలేదు. అవును మరి, పండితరాయ లన్నట్టు అతిపరిచయం అవజ్ఞకు హేతు వవుతుంది.

మన ప్రాంతాల్లో బెజవాడా, రాజమండ్రీ చూడు. అక్కడి కృష్ణలో, గోదావరిలో స్నానాలు

చేసి పవిత్రులు కావాలని యావద్భారత దేశంనుండీ ఎంతమందో వస్తూఉంటారు. ఆ వూళ్లల్లోవాళ్ళు మాత్రం వాటిని మంచినీళ్లగానైనా చూడరు. ఈ నిర్లక్ష్యం ఎందు కంటావ్ ? అతిపరిచయం వల్లనేగా ?

అయితే మన ప్రాంతాల్లో వాళ్ళకంటే ఆ ప్రాంతాల్లోవాళ్లే అనేకవిషయాల్లో చాలా మెరుగనిపిస్తారు. వాళ్లకు సౌందర్యం చూసే తీరిక లేకపోయినా ఉన్న సంపద నుపయోగించుకునే నైపుణ్యం ఎంతైనా ఉంది. మనవాళ్ల కదీ లేదు.

నిజంగా అక్కడా చెరువు కట్టడం ఎంత తెలివితేటలో మాను, ఎంత ఉపయోగమో ఆలోచించు. అంతగా ప్రకృతిని నమ్మి, తాము కష్టపడి, దానిచేత దాస్యంచేయించుకున్నారు కాబట్టే వాళ్ల పూర్వులు సామ్రాజ్యాలూ స్థాపించారు, దేశదేశాలూ ఆకర్షించారు. నీ వాళ్లూ, నా వాళ్లూ ఏం చేశారయ్యా, ఒళ్లో పడ్డ ఐశ్వర్యాన్నికూడా రక్షించుకోలేక వదులుకోవడం తప్ప విడిచి ?

ఎందాకా చెప్పానో జ్ఞాపకం లేదు. ఆ ప్రాంతం అంటే అభిమానంకొద్దీ ఇల్లాగే ఆవేశం వచ్చేస్తూ ఉంటుంది.

చెరువా ? — సరి సరి తెలిసిందిలే !

అక్కడలా కూర్చుని ఉండగా ఆకొండ ఎక్కి కింది చెరువులో నీడ చూచుకోవా లనిపించింది.

బాగుందా ? ఎల్లాంటి ఊహో చూడు.

ఆ వూహ తోచడం తడవుగా మావాళ్లతో అన్నాను. మా రామం ఏమనసుతో ఉన్నాడో ఏమో 'అంతకంటేనా ?' అని ఉత్సాహం ప్రకటించాడు. సుబ్బారావు మాత్రం 'మరిసినీమా ఎల్లాగ'' అని నసిగాడు. రామానికి కోపంవచ్చి 'నీమొహం నీమోరాను. వెనక వేషా లెయ్యక ముందు నడు. ఇవ్వాళ్టితో ఎగిరిపోవడం లేదుగా, రేపు చూడచ్చులే' అని వాణ్ని నానా మాటలూ అన్నాడు. వాడూ చేసేది లేక మాతో కలిశాడు.

నేను ముందూ, నా వెంబడే మా రామం, వాడి వెనక మా సుబ్బారావు. ఆ వరసలో పర్వతారోహణం చేస్తున్నాము.

ఇదివర కెక్కినవాటికంటే ఈ కొండ చాలా ఎత్తైంది. పైగా మార్గమధ్యంలో ఉన్నది కాకపోబట్టి మనుష్యులు తిరిగిన దారేమీ ఏర్పడినట్టు లేదు. పశువులూ, అందులో ముఖ్యంగా మేకలూ మేతకోసం పైదాకా తిరుగుతూ ఉంటే వాటివల్ల సన్నని దార్లు ఏర్పడుతూ ఉంటాయి. అల్లాంటి దార్లు ఈ కొండ మీదా ఉన్నాయి. కాని వీటిల్లో ఒక చిక్కు ఉంది. ఇవేవీకూడా కొండపైదాకా తీసుకుపోవు. మేత ఎక్కడ ఉంటే అక్కడికల్లా పోవడంవల్ల ఏర్పడ్డవి కాబట్టి ఒకదానిలో ఒకటి కలిసిపోయి వైకుంఠపాళీలో పాముల్లాగా కిందికీ, నిచ్చెనల్లాగ పైకీ దింపీ, ఎక్కించీ ఆడిస్తూ ఉంటాయి.

అల్లాగే శ్రమపడి అరగంటలో సగంకొండ ఎక్కాము.

అక్కడికి పోయాక మార్గం మునపటికంటే సులువైంది. మధ్యమధ్య కదిలిపోయిన పెద్దపెద్ద బండలు పడిఉన్నా వాటి సందుసుందా చక్కని దారి కనబడుతూ ఉంది.

ఎదురుగుండా సూర్యుడు జాజ్వల్యమానంగా వెలుగుతున్నాడు.

ఆదర్శం ముందుకు పిలుస్తోంది. వెనకబడ్డ సుబ్బారావుకూడా మాతో కలిసి రాగలుగుతున్నాడు. ఇంక మా కాలోచన ఎందుకు ? నిస్సంకోచంగా ముందడుగు వేస్తున్నాము.

మరో ఇరవై గజాలు వెళ్లామో లేదో అక్కడ ఒక పెద్ద చిక్కు వచ్చింది. ఇంతవరకూ మేం అనుసరించిన దారి అందాకా వచ్చి, అక్కడనుంచి రెండు వైపులా కొండ దిగిపోవడానికి వీలుగా ఉన్న అడ్డదారిలో కలిసిపోయింది. ఎక్కవలసిన వైపున ఎటు చూచినా దారిలేదు. తల ఎత్తి చూస్తే శిఖరం కనిపిస్తూ ఉంది. అక్కడికి మహా ఉంటే ఒక పందిగజా లుంటుంది. ఆ కాస్తా ఎక్కగలిగితే ఆదర్శం అందుకో

వచ్చు. ఎక్కాలంటే మార్గం కనపడడంలేదు. ఏమిటి చెయ్యడం?

వెనక్కి తిరిగి చూశాం. దక్షాధ్వరంలో వీరభద్రుడి కాలితన్ను తిని పళ్లూడగొట్టుకున్న సూర్యుడు గూడా మావంక చూచి పకపకా నవ్వుతున్నాడు.

నాకూ, రామానికీ మంచి పట్టుదల కలిగింది. సుబ్బారావుకు దిగిపోదా మనిపించినా రామం తోప్పుడతాడేమో అని బయటికి కనకుండా ఊరుకున్నాడు.

మే మిద్దరమూ ఎక్కవలసిన వైపు చూశాము.

ఎదురుగా ఏడెనిమిదడుగుల ఎత్తున్న విశాలమైన రాతిపలక కనిపిస్తోంది. మొదట్లో దారి కనిపించని ఆందోళనలో అదే చాలా ఎత్తున్నట్లు తోచిందిగాని ఇప్పుడుమాత్రం అంతకంటే ఎత్తుండడానికి ఎంత మాత్రమూ వీల్లేదని మా లెక్కల పరిజ్ఞానం మమ్మల్ని హెచ్చరించింది. అది దాటితే ఇంకేముంది, అపైన చివరిదాకా చక్కని దారి, స్పష్టంగా కనిపిస్తోంది.

అంతలో 'ఒరేయి! నువ్వు దీనికి జేర్లబడి నుంచో, నేను పైకి వెళ్లిపోతాను' అన్నాడు మారామం.

వాడి కా ఉపాయం తోచినందుకు నాకు మనసులో పరమానందం అయింది.

నేను నుంచున్నాను, వాడు ఎక్కేశాడు.

శిఖరం అందుకోవాలన్న ఆదుర్దాతో 'ఒరేయ్ సుబ్బారావ్! నువ్విక్కడ నుంచో, నేగూడా పైకి వెళ్లిపోతాను' అన్నాను నేను.

వాడు వెంటనే ఒప్పుగునేవాడులాగా ముందుకు వచ్చి, ఆ రాతిపలకకు జేర్లబడి, 'నువ్వు పైకి వెళ్తావు, బాగానే ఉంది. నన్నేం చెయ్యమంటావో చెప్పి మరీ వెళ్లు' అన్నాడు.

అప్పటికిగాని ఆ ఉపాయంలో ఆ చిక్కు ఉన్నట్లు నాకు తెలియలేదు.

రామంగూడా నా మాదిరిగానే అనుకున్నాడో ఏమో మాకోసం ఉండకుండానే చకచకా పైకెళ్లిపోతున్నాడు.

'ఒరేయి రామం!' అంటూ బిగ్గరగా కేకేశాము మేమిద్దరమూ.

వాడు వినిపించుకునిగూడా 'రండోయ్! రండి' అంటూ ముందుకు పోబోయాడు.

'ఎల్లాగోయ్ రావడం? నువ్వు వెనక్కి రా' అంటూ గట్టిగా అరిచాం.

మేం ఊరికే కేకేస్తున్నామని అనుకుని ఉంటాడే గాని నిజంగా అవసర మయిందని రామానికి తోచి ఉండదు. అల్లా తోచినా తమ పబ్బం గడుపుకొని తప్పించుకుపోయేవాళ్లు లోకంలో చాలామందే ఉండవచ్చు. కాని మా రామంమాత్రం అలాంటివాడెన్నడూ కాదు. వచ్చిన చిక్కేమిటో స్పష్టంగా తెలియకపోయినా తాను వెనక్కి తిరక్క తప్పదని మా రెండోకేక వాడికి తెలియజేసింది.

వాడు వెనక్కి తిరిగాడు. 'అందాకా వచ్చాక వాడుమాత్రం ఏం చేస్తాడు?' అన్న ఆలోచన పోనేలేదు.

ఈ ఆలోచనతో వాడలా వస్తూఉంటే, నేనిలా చూస్తూ నిల్చున్నాను. మా సుబ్బారావు నిశ్చింతగా వేరుసెనక్కాయలు తింటూ అడుగునున్న వాటికోసం సంచీ అంతా వెతుకుతున్నాడు.

రామం వచ్చి 'ఎందుకూ పిల్చింది? ఇంకా రారేం?' అంటూ చిందులు తొక్కసాగాడు.

'నీ కేం నువ్వు గట్టెక్కావు. ఎక్కాం గదా అని వెళ్లిపోయావు. అంతే గాని ఇవతలివాళ్ల సంగతి పట్టించుకున్నావా? నీ ఉపాయంతో మే మిద్దరమూ పైకి రావడం ఎలాగో చెప్పవోయ్, తర్వాత ఎగురుదుగాని' అంటూ మా సుబ్బారావు వాణ్ని దబాయించాడు.

ఆ సమయంలో నా కొక ఉపాయం తోచింది.

అప్పుడే రామానికీ అసలుసంగతి తెలిసింది.

వా డాగర్దాకొద్దీ 'నా చెయ్యి చాపుతాను. అందుకుం దేమో చూడం' టంటూ మావంక చూశాడు.

'నువ్వు జారిపడితే మేం చావాలి, అదిమాత్రం వద్దు బాబోయ్!' అన్నాడు సుబ్బారావు.

ఈలోగా నేను సంచీలో ఉన్న మూడు ఉండుగుడ్డలూ ముడేశాను. సుబ్బారావు పుణ్యమా అంటూ అవి కొంచెం పొడుగువి కాబట్టి కలిపికే, ముళ్లు పోను, నాలుగుగజాల తాడు తేలింది. దాన్ని పైకి గిరవాటేసి రాయాన్ని పట్టుకోనున్నాను. ఏదన్నా చెట్టూ గిట్టూ ఉన్నదేమో అని అటూ ఇటూ చూచాడు గాని ఏమీ కనబడక, చిట్టచివరికి తానే కూర్చుని, అంచున పీలుమానీ కాళ్లు తన్నిపట్టి, తాడు వదిలి సరే అన్నాడు.

నేను కొంచెం లఘువుమనిషిని కాబట్టి దాన్ని పట్టుకుని అలాగ్గా పాకిపోయాను. మొదట్లో భయమని మొండితనం చేసి 'మేం మిద్దరమూ పట్టుకుంటాంరా, రారా బాబూ' అని మాచేత ధైర్యం చెప్పించుకుని, బతిమిలాడించుకుని ఎల్లాగైతేనేం చిట్టచివరికి సుబ్బారావూ పైకెక్కాడు.

శ్రాంతో ఒక పెద్ద గండం గడిచినట్టే కాదు, స్వశక్తితో ఒక మహాసమస్యను పరిష్కరించుకున్నామన్నంత సంతోషం పొంది, పదినిమిషాల్లో శిఖరం చేరుకున్నాము.

అక్కడ ఒక పెద్ద బండ ఉంది. మేం చేరిన చోటుదగ్గిరినుంచి చూస్తే మామూలు డాబా ఇల్లంత ఎత్తుఉంది ఆ బండ. ఆ కాస్తమాత్రం ఎక్కకుండా ఎందు కుండా లని దారికోసం దానిచుట్టూ తిరిగాం.

చిత్రం చూడు! అద్భుతంగా మనుష్యులు పేర్చినట్లే ఒకదానికంటే మరొకటి కొంచెంకొంచెంగా ఎత్తైనబండలు దాని పక్కనే మెట్లలాగా అపతలివైపున ఉన్నాయి.

ఇంకేముంది? గబగబా ఎక్కేసి పైన కూర్చున్నాము.

ఇందాకా మమ్మల్ని ఉద్దేశించి నవ్వినట్లు ప్రకాశించిన సూర్యుణ్ని చూచి మేమే పగలబడి నవ్వి కసి తీర్చుకున్నాము.

అవును మరి! ఉత్సాహంకొద్దీ అంతకంతకు పైపైకి వెళ్లిపోతున్న మాతో రాలేక కాలవశాన దిగజారిపోతున్న ఆ నిరాలంబపథికుణ్ని చూస్తే మా కా వయస్సులో నవ్వు రాక జాలి కలుగుతుందా?

నవ్వినవ్వి శ్రమ తీర్చుకున్నాక మొదట్లో అనుకున్న విషయం జ్ఞాపకం వచ్చింది నాకు. అప్పు డంచుదాకా వెళ్లి కింది చెరువువంక చూచాను. నాదగ్గరకు మా వాళ్లూ వచ్చి చూచారు.

ఏటవాలుగా ఉన్న కొండ కదూ, అందుకని మనం ఎంత వెనక్కి వాలితే అంత ఎత్తుకొండ నీళ్లల్లో కనిపిస్తుంది.

అల్లా వాలి ఎంత వీలయితే అంతా చూశాము.

సూక్ష్మంగానే అనుకో, ఎక్కిన కొండా, కూర్చున్న బండా అన్నీ కనిపించాయి. కాని దూరమైపోయి మేంమాత్రం కనిపించలేదు.

ఆ కాస్త లోపమూ జరక్కపోతే నా కా క్షణం జగజ్జేతృసంతృప్తి నిచ్చేది. అంతతో హీనమైన ఆ తృప్తి అల్లాగే ఉన్నది; కాని ఆ లోపం అప్పటి నా పసి మనస్సును ఒక్క క్షణంసేపు ఎంతెంతో కల్లోలపరిచింది.

ఇప్పు డాలోచిస్తే ఆ కల్లోలానికి హేతువు తెలుస్తోంది. ఎంత కష్టపడి ఏం సాధించినా కర్త అయిన 'నేను' మిగల్లేదే అని ఆ క్షోభ. 'నేను' కర్త కానే కాదు, అసలు కర్త జీవు డంటుంది మన వేదాంతం. ఆ వేదాంతం అర్థమయినవాళ్లు 'తాము' మిగలకపోవడమే ఆదర్శంగా భావించి ఆత్మోద్ధరణ చేసుకుంటూ లోకాన్ని ఉద్ధరిస్తారు. తెలిసీ తెలియని వాళ్లు 'తాము' మిగలడమే అసంభవమైనప్పుడు జగమంతా మిథ్యగదా అని నేటి మన హైందవుల్లాగా ఏమీ చెయ్యకుండా ఊరుకుంటారు.

ఆ క్షణంలో నా మనసులోకి ఇల్లాంటి ఊహలేమీ రానేలేదు. అనుకున్నట్టు కాలేదన్న నిరుత్సాహంతో అవ్యక్తమైన ఆందోళనమాత్రం కలిగింది. అదైనా ఒక్క క్షణం మాత్రమే!

ఆ తర్వాత మళ్లీ ముస్తరమూ సరదాల్లో పడిపోయాము.

'మే మిదివర కెప్పుడూ ఈ కొండ ఎక్కనే లేదురా! నువ్వు రాకపోతే మేం ఎక్కేవాళ్లమే కాదు. ఎంత బాగుంది! ఎంత బాగుంది!' అంటూ మావాళ్లు తెగ మురిసిపోయారు.

ఇకప్పుడు మే మాడిన కబుర్లు ఇన్నీ అన్నీ కావు. మావూళ్లో నాటకం, బళ్లో మేష్టర్లు, ఊళ్లో పిల్లలూ, మొన్న చూచిన బుగ్గా వీటితో ఉత్సాహం అందుకుని మాకు తెలిసిన ప్రపంచాన్నంతటినీ కబుర్లలో దింపేశాము.

ఆ ఉత్సాహంలో ఆ విశాలమైన బండమీద పడి దొర్లుతూ మేమే రాజుల మనుకున్నామంటే నమ్ము!

అయిందా? అప్పటికీ సూర్యు డింకా వెలుగుతూనే ఉన్నాడు. మా ఉన్నతస్థితిని చూడలేక కాబోలు, ఈర్ష్యాకషాయితరోచిస్సులు కక్కుతూ వెనక్కి వెనక్కి పోతున్నాడు.

అయితే ఏం? కొండకొమ్ముమీద వెలుగు బాగానే ఉంది. అప్పుడు మహా అయితే నాలు గయి ఉంటుం దని మా ఉద్దేశం. వేసవిపొద్దాయె! ఇంకా గంటసేపు కూర్చున్నా కూర్చోవచ్చు. నా మటుకు నాకు కదులుదామనే అనిపించలేదు.

చూపు పారినంతమేరా చూస్తూనే కూర్చున్నాను.

వేరువేరు ప్రదేశాలకు వేరువేరు రంగులు వేసి తయారుచేసిన దేశపటంలా చుట్టూ ఉన్న ప్రదేశమంతా కనిపిస్తోంది. కాలిదార్లూ, వాగులూ, రోడ్లూ అంతకంతకు వెడల్పైన గీతల్లా కనిపిస్తున్నాయి. దేన్ని చూచినా చక్కగా దిద్ది తీర్చిన ట్లున్నది. దూరాన ఊళ్లల్లో ఉన్న మట్టిమిద్దెలు కొండపల్లి వాళ్ల బొమ్మల్లా ఉన్నాయ్. ఉత్తమసంస్కారవంతుణ్ణి ఇతరుల్లో ఉన్న లోపాలకంటె గుణాలే ఆకర్షించినట్లు ఆ ఎత్తుమీద ఉన్న నా కళ్లకు ఎటు చూచినా సౌందర్యమే కనిపిస్తోంది.

ఈ నేలకే ఇంత అందమూ అంటే ఆ ఆకాశం మరీ అందంగా ఉంది. అదిగో అదిగో అనిపిస్తూనే ఇంకా ఇంకా దూరమైపోయిన ఆకాశం ఆ ఎత్తు మీదికి అత్యద్భుతంగా ఉంది. ఒకమూల ఏ మార్పూ లేకుండా పట్టి నీలంగా ఉంటుంది. అటు చూస్తే ఎంతో ఉదాత్తమైన గాంభీర్యం స్ఫురిస్తుంది. మరో మూల పింజెమబ్బులు ఒకదానిమీద ఒకటి పడి దొర్లుతూ రకరకాల పంచాలాలు చేస్తూ ఉంటాయి. వాటివంక చూస్తే మాటలు రాని పసిపిల్లలతో ఆడుకున్నట్టే ఉంటుంది. తూర్పుకు తిరిగితే నల్ల మేఘాలు ఒత్తుగా సంచరిస్తూ ఉంటాయి. అవి కాసేపు ఓ లక్ష ఏనుగులు బారులుతీరి క్రమంగా నడుస్తున్నట్లూ, మరి కొంచెంసేపు ఆజానేయహయాలు కదం తొక్కుతున్నట్టూ అనిపిస్తాయి. ఇటు పశ్చిమానికి తిరిగితే నభోవలయందగ్గిర భూనభాల మిథ్యాసామరస్యం మంటతో కలిసిన పొగలు గ్రక్కుతూ ఉన్నట్టుంటుంది.

నువ్వు చూడాలే గాని ఆకాశం చూపలేని అద్భుతమంటూ లేదు. అల్లా దానివంక చూస్తూ తన్మయులమై ఎంతసేపైనా ఉండవచ్చు. పట్టి నేలమీది నుంచి చూచినదానికంటె ఆ ఎత్తుమీదినుంచి చూడడంలో మరింత ఆనంద ముంది. ఎందుకంటే, నువ్వక్కడనుంచి నేలనూ, ఆకాశాన్నీ రెంటినీ చూడగలవు. అప్పుడు నీ కళ్లకు పరస్పరభేదసాదృశ్యాలు స్పష్టంగా గోచరిస్తాయి. అందులో ఉన్న ఆనందం మనచుట్టూ ఉన్న దేమిటో చూడలేక అందని ఆకాశంలోకి మాత్రమే చూడడంలో ఏ ముంటుంది?

అల్లా చూస్తూ ఉండగానే మరో అరగంట గడిచింది.

మా రామం ఈలపాట పాడుతున్నాడు. సుబ్బారావు దానికి తాళం వేస్తున్నాడు.

నేను వాళ్లవంక చూసేసరికి ఇద్దరూ ఒక్కసారే 'ఇక దిగుదామా?' అన్నారు.

సరే అంటే సరే అని ముగ్గురమూ ఆ బండ దిగి 'అదెంత బాగుందిరా' అంటే, 'ఇదెంత బాగుందిరా' అనుకుంటూ కొంతదూరం ఉత్సాహంగానే నడిచాము.

కాని మేము ఎత్తుమీద ఉన్నంతసేపూ బాగానే కనిపించిన సూర్యుడు దిగినకొద్దీ కనిపించడం మానేశాడు.

దాంతో ముగ్గురం ముగ్గురమే—గుండెల్లో అధైర్యపడిపోయాము.

మే మున్నచోట అప్పటికే మసకచీకటిగా ఉన్నది. దిగలేకపోతా మేమో అన్న భయంతో స్పష్టంగా కనిపించకపోయినా వచ్చినదారివెంబడే తడుముకుంటూ చకచకా దిగుతున్నాము.

అల్లాగే వెళ్లివెళ్లి ఇందాకా ఎక్కేటప్పుడు కష్టం వేసిన చోటుదగ్గిరికి వచ్చేటప్పటికి ఒకరి కొకరం కనిపించడమే కష్ట మయింది.

వెనక్కి తిరిగి చూద్దుంకదా మేం కూర్చున్న బండమీదమాత్రం ఇంకా వెలుతురుగానే ఉంది.

కడచింది జ్యోతిష్మంతం—ముం దున్నది అగమ్యమైన అంధకారం! ఏమిటి చెయ్యడం?

మా ముగ్గురికీ భయంగానే ఉంది. ఎల్లాగైనా దిగిపోవా లని ఆదుర్దాగానే ఉన్నది.

ముచ్చెమటలు పోస్తున్న శరీరాలతో ముగ్గ రమూ మూడువైపులా చూచాము.

ఎటు చూచినా ఏం ప్రయోజనం? నిమిషం గడచినకొద్దీ పెరిగే అంధకారంగాని తగ్గేది కాదాయె. కొంతదూరం సాగనిచ్చినట్లే సాగి అక్కడితో ఆగి పోయి అగాధంగా కనిపించడం, దాంతో వెనక్కి రావడం. తక్కినవాళ్ళు కనబడరేమో అని ప్రతివాడికీ భయమే! చుట్టూరా నీళ్లు పోస్తే మధ్యనున్న చీమలు అంచుదాకా పోయి, దాటలేక వెనక్కి తిరిగి, దారి కోసం తహతహలాడేటట్టు ధైర్యంకోసం ఒకరినొకరం పిల్చుకుంటూ మేం ముగ్గురమూకూడా ఆందోళనతో ఆ పరిమితిలోనే తిరిగితిరిగి వేసారిపోయాము.

అప్పుడు నాకు మరో భయం కలిగింది. దిగి వెళ్లే దారి కనుక్కోవడం మాలో ఎవ్వరితరమూ కాదు. అది ముమ్మాటికీ నిశ్చయం. ఆ సంగతి తెలిసీకూడా ఇంకా కాసేపు అలాగే వృథా చేశామా పైకి వెళ్లే దారికూడా కనబడకుండా పోతుంది. ఏ మూల ఏం ఉంటుందో తెలియక రాళ్లతో రప్పలతో ఎగుడుదిగుడుగా ఉన్న అక్కడ ఉండిపోవడంకంటె పైకి వెళ్లి ఆ బండ చేరుకోవడం మంచిది కాదూ!

ఈ సంగతే మావాళ్లతో అన్నాను.

రాత్రంతా ఇక్కడే ఉండాల్సి వచ్చిం దన్న జ్ఞానం కలగక వా ళ్లింకా దిగగలమన్న మాయలోనే ఉన్నారు.

'మీఇష్టం. చేతనైతే ప్రయత్నించం' డని నేను మాత్రం వాళ్లకు త్వరగా జ్ఞానోదయం కలగాలని భగవత్ప్రార్థన చేస్తూ అక్కడే ఒక బండ నానుకుని నుంచున్నాను.

అయిదునిమిషా లైంది, పదినిమిషా లైంది.

ఇద్దరూ దిగులుపడ్డ ముఖాలతో నా దగ్గరకు వచ్చారు.

ఇంకాలస్యం చేస్తే లాభం లేదని నేను ముందు దారి తీశాను. వాళ్లూ నావెంబడే వచ్చారు.

అప్పటికి పైనకూడా చీకటి కమ్ముకొస్తోంది.

ఆచీకట్లో దారి కనుక్కోవడం కష్టమే అయింది. అయినా ఆదర్శం ఎదురుగా కనిపిస్తూ ఉండబట్టి ఇది కాదని అదీ, అది కాదని ఇదీ ప్రతి వైఫల్యంతోనూ మార్చుకుంటూ వేరువేరు మార్గాల ననుసరించి చివరి కెల్లాగో పైదాకా వెళ్లగలిగాము.

ఆ మెట్లెక్కి పైబండ చేరుకున్నాకగాని నా గుండె కుదుటపడలేదు.

దానిమీద చతికిలబడి 'అమ్మయ్య' అనుకున్నాను.

భగవంతుడి దయవల్ల ఆ బండ ఒక చిన్న గదంత విశాలంగా ఉంది. అదే అక్కడ లేకపోతే ఏమై పోయేవాళ్లమో అని ఇప్పటికీ అనిపిస్తుంది.

మావాళ్లుకూడా పైకి వచ్చారు గాని వాళ్ల కాందోళన తగ్గలేదు. నామాదిరి చతికిలబడక ఆ బండ మీదే భయంభయంగా అటూ ఇటూ తిరుగుతూ ఏమైనా దిగడానికి వీలుందేమో అని మహాజాగ్రత్తగా చూడటం మొదలుపెట్టారు.

ఆదుర్దా అట్లా చేయిస్తుందిగాని నిజాని కక్కడ నుంచి దా రెక్క డుంటుంది ?

'ఎందుకురా వృథా ప్రయాస ! నామాట విని కూర్చోండి' అన్నాను నేను.

మా సుబ్బారావు కేసుకు వచ్చేసింది.

రామానికి నన్ను మింగెయ్యా లన్నంత కోపం వచ్చింది.

నామూలాన్నే ఇంతపనీ అయిందని వాడి ఉద్దేశం. ఆ స్థితిలో వాడి కట్లా అనిపించింది గాని, నిజానికి నే నేం చేశాను ? నాధోరణిలో నే నుండిపోయి వాళ్లు పోదా మనేదాకా బయలుదేరలేదు. ఇంకా పెందరాళే వెళ్దామని వాళ్లు అనిఉండి నేను రా నన్నట్టయితేగా నామీద నేరం మోపాలిసింది ! కాకపోతే నా అంతట నేనే బయలుదేరదా మని అనాలిసింది. అలా నే ననలేదు. అదీ నా తప్పు.

రామం ఎన్ని అన్నా నేను ఊఁ ఆఁ అనకుండా ఊరుకున్నాను. కాసేపటికి విసుగుపుట్టి వాడిమటుకు వాడూ ఊరుకున్నాడు.

'ఉత్సాహంకొద్దీ వచ్చాము. ముందే జాగ్రత్త పడక ఇబ్బందిలో పడ్డాము. నిజమే ! ఇందుకోసం ఏడ్చి ఏం లాభంరా అబ్బాయి !' అంటూ నేను మహా పెద్దవా ణ్ణయినట్టు మా సుబ్బారావు నోదార్చాను.

'ఈరాత్రంతా ఇక్కడ పడిఉండడం ఎల్లారా ? ఏం మెకాలొస్తాయో ఏమో ! నా కేమీ తోచడం లేదురా' అంటూ వాడు గుమ్మటిల్లిపోయాడు.

ఆమాట వినేటప్పటికి నాకూ వణుకు పుట్టింది. పైకి నిబ్బరంగా ఉన్నానన్న మాటేగాని అంతకు ముందుమాత్రం లోపల భయం లేదనా ? అది దీంతో మరీ ఎక్కువైంది.

ప్రవరాఖ్యు డన్నట్టు మిన్నులంపడ్డచోట పడితి మాయ్ ! ఆయనకు మాదిరి ఏ అప్సరసో కనిపించి ఊరుకోక మాకు మేమే తోడయితిమాయ్ ! ఎంత భయంకర శైత్యమాత్రల ఏమిటి చేసెను ?

అప్రయత్నంగా నాకళ్లు తమంతట తామే మూసుకున్నాయి. మనసు తోచిన ధ్యానశ్లోకాల నన్నిటినీ చదవడం మొదలుపెట్టింది.

ఆ శ్లోకాల మాట లయితే కదులుతున్నాయి గాని లోపల మెదులుతున్న రూపాలన్నీ భయంకర వన్యమృగాలవే !

మేం కొండ లెక్కుతున్నామని తెలియడం తోటే ఊళ్లో ప్రతివాడూ మమ్మల్ని హెచ్చరించాడు. అడివిలో తిరిగేవాళ్లుకూడా వెలుగుండగానే వచ్చేస్తారట. చీకటిపడిం దంటే ఎలుగ్గొడ్లూ, పీగోలాలూ కొండలమీద చిత్తం వచ్చినట్లు తిరుగుతాయట ! అప్పు డప్పుడవి ఊళ్లోకి కూడా వచ్చి మేకల్నీ, దూడల్నీ గుంజుకుపోతూ ఉంటాయట !

ఇవన్నీ అప్పుడు జ్ఞాపకం వచ్చి కన్ను మూసుకునే ఉన్నా అవితప్ప మరొకటి కనిపించలేదు.

నే నలా అణువణువునా వణికిపోతూ కళ్లు మూసుకునే ఉన్నాను. ఆ స్థితిలో నా పొట్టమీదికి జుట్టులాంటి దేదో వచ్చి తగిలింది.

'అమ్మ బాబోయ్ ఎలుగ్గొడ్డు !' అంటూ అరిచేశాను. 'ఆఁ ఆఁ' అంటూ మావాళ్లు కూడా ఉలిక్కిపడి లేచి, నాలుగడుగులు వేసి, అంత భయంలోనూ తా మున్నది కొండచివరి బండమీ దని జ్ఞాపకం వచ్చి, చటుక్కున కూలబడి, కళ్లు మూసుకుని గొల్లు మన్నారు.

కాసే పున్నాక ఇందాకటి స్పర్శ లేనట్లయి నెమ్మదిగా కళ్లు తెరిచాను. భయంభయంగానే నాలుగు పక్కలా చూచాను. ఎక్కడా ఏమీ లేదు. మోకాళ్ల మధ్య తలలు పెట్టుకుని మావా ళ్లిద్దరూ మాత్రం రెండు పీడముద్దల్లా కూర్చున్నారు.

'ఏమిటో అల్లా అనిపించిందిగాని ఏమీ లేదురా' అన్నాను బిగ్గరగా !

'సరిగ్గా చూడరా బాబూ, ఏమూల దాక్కుంది' అంటూ మాసుబ్బారావు భయంలోనే గోల పెట్టాడు. 'ఏదీ! ఎక్కడా లేందే!' అని నే నంటూ

ఉండగా రామం కళ్లు మూసుకునే నెమ్మదిగా జరిగి వచ్చి నాఒళ్లో తలపెట్టి పడుకున్నాడు. సుబ్బారావూ జరిగివచ్చాడు. ముగ్గురమూ అలాగే ఒకరిమీద ఒకరం వాలి కొంచెంసేపు కూర్చున్నాము. మారామం తల నా పొట్టకు తగులుతోంది. సుబ్బారావు నా మెడమీద తన ముఖం పెట్టి చేతుల్తో మమ్మల్నిద్దర్నీ చుట్టేస్తున్నాడు.

రామంశిరస్పర్శ ననుభవించాక ఇందాక ఎలుగ్గొడ్డనుకోవడం వట్టి భ్రాంత నిపించింది. నేను కళ్లు మూసుకుని ఉండగా వాడు భయంకొద్దీ వంచిన తలతో నాదగ్గరకు జరిగాడు కాబోలు, ఆజుట్టు తగిలి ఎలుగ్గొడ్డే అనుకుని భయపడిఉంటాను. అంతేగాని ఆ బండమీది కవేం వస్తాయి?

అల్లా తోచడంతోటే ఆ ముక్క నిజమనిపించుకోవా లని 'ఏరా రామం' అంటూ ఏమో అనబోయాను. దానికే వాడు ఉలిక్కిపడిపోయాడు. భయం లేదురా అని వీపుమీద తట్టుతూనే నా సందేహం బయట పెట్టాను. 'బాబోయ్! ఆమాట ఎత్తబోకు' అంటూ మొదట్లో ముడుచుకుపోయాడుగాని తర్వాత నెమ్మదిగా జ్ఞాపకంచేసుకుని 'నిజమేరా' అంటూ నా ఒళ్లోనుంచి కదిలాడు.

అప్పటికి ఆ లుంగజుట్టుకోవడం అందరికీ కష్టమయింది. ఇందాకటి భయహేతువు వట్టిభ్రాంత ని నిర్ధారణ కావడం కొంత ధైర్యం ఇచ్చింది. దాంతో ఒకళ్లొకళ్లమే కొంచెంకొంచెం గాపడలి, విడివడిపోయి, ఒక్క ముద్దలాగా ఉన్న వాళ్లమల్లా ముగ్గురమూ మూడు మూర్తుల మయ్యాము.

అయ్యామే కాని భయం తగ్గిందా? అంతా గాఢాంధకారం! మా ఉచ్ఛ్వాసనిశ్వాసాలు కూడా వినిపించేటంత నిశ్శబ్దం.

ఆ చీకట్లో దూరంగా ఉన్న చిన్నచిన్న బండలన్నీ మాకోసమే పొంచి చూస్తున్న వన్యమృగాల లాగా కనిపించాయి. కదిలిన ప్రతిసారీ ఏ జంతువో వస్తోం దన్న భ్రాంతినే కలిపించింది.

నిశ్శబ్దంగా ఉండిఉండి ఏగాలికో ఎండాకులు గలగలలాడడం, దాంతో మా గుండెలు దడదడలాడడం, దూరాన ఏ బండనో అంటుకుని రెండు మిణుగురుపురుగులు మిలమిలలాడడం, అవి మా కళ్లకు ఏ చిరుతపులి కళ్లలాగానో కనిపించడం!

అల్లా ఉన్నకొద్దీ భయం ఎక్కువైందేగాని ఎంతమాత్రమూ తగ్గలేదు.

అకస్మాత్తుగా నా కెందుకో రామభజన చెయ్యాలనిపించింది. వెంటనేచప్పట్లు కొడ్తూ మొదలు పెట్టాను. మావాళ్లూ నాతో కలిశారు. అల్లా కాసేపు కాలక్షేపం చేసేటప్పటికి దైవమహిమవల్ల కాకపోయినా అన్యకార్యనిమగ్నతవల్ల మా మనస్సులు ఉన్న పరిస్థితిని విస్మరించి తాత్కాలికంగా భయాన్ని కోల్పోయాయి.

అందాకా ఎక్కడ దాక్కుందో ఏమో అప్పుడు మా కెక్కడలేని ఆకలీ వేసింది. నాలుగైదురోజులన్నం మానేసినా అల్లాంటి ఆకలి వేసిఉండదు.

అదృష్టంకొద్దీ సుబ్బారావు తెచ్చిన సంచీ వెతికాము. అందులో వేరుసెనక్కాయలు దారిలోనే అయిపోయాయి. తెల్లపచ్చుసంగతి 'నాకు తెలియ' దంటే 'నాకు తెలియ' దని వాళ్లిద్దరూ అన్నారు. ఎక్కడ పడిపోయిందో ఏమో సంచీలో కనపడలేదు.

ఆకలిమాత్రం ఏమీ తినని నా కెలా ఉన్నదో, అంతో ఇంతో తిన్నవాళ్లకూ అలాగే వుంది.

ఆకలిదారిన ఆకలిలా ఏడుస్తూనే ఉంది. ఇంతలో ఆయనచెల్లెలు దాహంకూడా వచ్చి గోలపెట్ట సాగింది.

ఎవ రెంత ఏడిస్తేమాత్రం ఆ స్థితిలో ఉన్న మే మేం చెయ్యగలం? ఉన్నది ఊరు కాదాయె! అందరికీ మానమే సమాధానంగా అలా కూర్చుండిపోయాం!

ఆకలి నణచడానికి మడతరొట్టెలూ, దాహం తీర్చడానికి చప్పరింపులూ - అవే మాకు గతి అయ్యాయి.

పోనీ అలా ఉండిపోయినా త్వరగా తెల్లారుతుందా అంటే అదీ లేదు.

గంట ఎంతయిందో తెలియదు!

మౌనంగా కూర్చుంటే భయం!

మాట్లాడితే ఆకలి!

ఇంట్లో ఉన్నప్పుడు ఊరికే వచ్చే నిద్ర ఆ సమయంలో ఎంత బతిమాలినా రానేలేదు. శరీరాలు వాల్చడమే కాని దొర్లి ఎక్కడ పడిపోతామో అని భయమేనాయె!

అప్పటికి కొంత అదృష్టవంతులం కాబట్టి ఆ చిక్కు వేసవికాలంలో వచ్చింది. అదే ఏ శీతాకాలంలోనో అయితే మా బతుకులు నిజంగా బండలపాలయ్యేవి.

త్వరగా తెల్లవార్చమని తెలిసిన దేవతల కందరికీ మొక్కులు మొక్కుకుంటూ అల్లాగే పడుకులు వాల్చాము.

ఆకాశంలో నక్షత్రాల కాంతీ, నల్లని ఆ బండమీద మా వంటి నన్న దుస్తుల తెలుపూ, అక్కడక్కడ మినుక్కు మినుక్కుమనే మిణుగురు పురుగుల మెరుగూ తప్ప, అంతా అంధకారమే! పొదల్లో ఎక్కడెక్కడో ఒకటొకటిగా ఉన్న కీచురాళ్ల ధ్వనీ, ఆ ఎత్తుమీదికి వేగంగా దూసుకువస్తున్న గాలి మా చెవులదగ్గర వినిపించిన బుసబుసా తప్ప అంతా నిశ్శబ్దమే!

ఆ అంధకారాన్నే చూస్తూ, ఆ నిశ్శబ్దాన్నే వింటూ క్రమక్రమంగా కొంతసేపటికి వాటికి అలవాటు పడిపోయాము.

మధ్యాహ్నంనుంచీ ఒకేవిధంగా తిరగడంలో అలిసిపోయిన మా శరీరాలు మాకు తెలియకుండానే నిద్రలో మునిగిపోయాయి.

ఆ వేసవికాలంలో కొంపల్లో ఉంటే ఎన్నడూ ఎరగని చల్లని గాలి అక్కడికి వచ్చి మమ్మల్ని హాయిగా జోకొట్టింది.

భయమూ, ఆకలీ, దప్పికా—ఏ మయ్యాయో వాటిదారి నవి మాయమయ్యాయి.

తెల్లవారేవరకూ ఒళ్లు తెలియకుండా నిద్రపోయాము. మేలుకున్నంతసేపూ ఏవేవో ఊహించుకుని భయపడ్డామే కాని ఆ రాత్రి, ఎన్నడూ మనిషిని చూడని ఆ ప్రదేశంలో, నిజాని కొక్క చీమైనా మా కపకారం చేసిన పాపాన పోలేదు.

మెలకువ వచ్చింది. నిజంగా ఉన్నామో లేమో అని ఒకరినొకరం చూచుకున్నాము. మా సంగతి మాకే ఆశ్చర్యం కలిగించింది!

ఎదురుగా ఉదయభానుడు మావంక చూస్తూ అనురాగంతో చిరునవ్వు నవ్వుతున్నాడు. ఎన్నెన్నో పక్షులు కిలకిలమంటూ ఆయన్ని ప్రశంసిస్తున్నాయి!

ఆ ఎత్తుమీద కూర్చుని క్రమంగా పైకి వస్తున్న సూర్యుణ్ని చూస్తూంటే కడచిన రాత్రి సంక్షోభమంతా అదృశ్యమయి మా మనస్సులు నూత్నచైతన్యాన్ని పొందాయి.

ఉదయసంధ్యారాగం అల్లాగే ఉన్నది. కాని సూర్యుడు సంపూర్ణబింబాకృతి ధరించాడు. అంత పెద్దబింబాన్ని ఇంకెప్పుడూ చూడలేదు మేము. అందులో ఎంత తేజస్సు, ఎంత సౌమ్యత! నేలమీదనుంచి చూస్తే ఇట్టే అయిపోయే ఆ పుణ్యసమయం అక్కడ ఒక అరగంట సేపున్నట్టుంది.

అప్రయత్నంగానే 'నమస్తే కర్మసాక్షీ' అనుకున్నాయి మా మనస్సులు.

* * *

ఆ రాత్రి, ఆ కొండమీద, అల్లా గడిపిన వాళ్లం ప్రభాతసూర్యుడికి ప్రత్యుత్థానం చేసి, నిన్న సాయంత్రం మాయమయి అంతచిక్కు పెట్టిన దారి స్పష్టంగా కనిపిస్తూఉంటే, రాత్రి పొందిన అనుభవాన్ని గూర్చీ, మాసంగతంతా విని ఎవరెవరేమే మనుకుంటారో వాటినిగూర్చీ కబుర్లాడుకుంటూ చకచకా కొండ దిగి పోయాము.

దారిలో మొహాలు కడుక్కునీ, తుందుగుడ్డలున్నాయి కదా అని వాగులో స్నానాలు చేసీ, ఎంత ఆలస్యం చేసినా ఊరుచేరుకోడానికి మా కప్పుడు ఒక్క గంటసేపుగూడా పట్టలేదు.

ఊళ్లో అడుగుపెట్టాము.

మొదట్లో మా రామం తండ్రే కనిపించాడు.

'అర్ధరాత్రే బయలుదేరారా ఏమిట్రా? పెందరాళే వస్తున్నారు' అన్నా డాయన.



కృష్ణదేవరాయలు

శ్రీ నేలటూరి వెంకటరమణయ్య

3. రాజ్యాభిషేకము

కృష్ణదేవరాయ లెప్పుడు జన్మించెనో తెలియదు[1]. కావలి వెంకట రామస్వామిగారు తమ దక్షిణహిందూదేశకవులచరిత్రలో కృష్ణరాయలు తన నలువదవయేట శాలివాహనశకాబ్దములు ౧౪౪౮ వ సంవత్సరమునం దనగా క్రీస్తుశకము ౧౫౨౬ వ సంవత్సరమున మృతి నొందినట్లు వ్రాసియున్నారు. దీని నాధారపఱచుకొని వీరేశలింగంపంతులుగారు 'రాయలవారు హూణశకము ౧౪౭౮ వ సంవత్సరమున బుట్టినట్లేర్పడుచున్నది. అల్లసాని పెద్దన్న చెప్పినట్లు చాటుధారగా వచ్చుచున్న 'భోరనయాచకప్రతతి' యను పద్యమునుబట్టి కూడ కృష్ణదేవరాయల మృతికాల మించుమించుగా దీనితో సరిపోవుచున్నది. గనుక మన కింతకంటె మంచి యాధారము దొరకువఱకును రాయలవారి జన్మకాలము ౧౪౭౮ వ సంవత్సర మని నమ్మవచ్చును[2]." అని వ్రాసినారు. ఇప్పటివఱకును దొరకిన శాసనములసాక్ష్యమునుబట్టి కృష్ణరాయలవారు శకాబ్దము ౧౪౫౨ అనగా, క్రీ.శ. ౧౫౩౦ వఱకును రాజ్యభారము వహించిరని నిశ్చయముగ తెలియవచ్చుచున్నది. కావున "భోరనయాచకప్రతతి" యను చాటువున చెప్పినట్లు శకాబ్దము ౧౪౪౮లో, నన గా క్రీ. శ. ౧౫౨౬వ సంవత్సరమున కృష్ణరాయలు మృతినందెననుట విశ్వాసపాత్రమైన విషయము గాదు. కావున నీ చాటువు నాధారపఱచుకొని గణించిన రాయల జన్మకాలమును నమ్మదగినది కాదు. మఱియు నతడు మరణకాలమప్పుడు నలువదియేండ్లవాడని తలచుట కేయాధారమును గానరాదు; ముసలివాడగునంతవఱకు జీవించియుండె ననుటకు గొంత యాధారము కలదు. రాయల వయస్సునుగూర్చిన ప్రస్తా

1. "కృష్ణరాయల జనన మొకరు ౧౪౮౫ వ సంవత్సరమునం దనియు, ఇంకొకరు ౧౪౬౭ వ సంవత్సరమునం దనియు వ్రాసియున్నారు. గాని యం దేది సత్య మయినదియు నిశ్చయించుట కాధారము లేవియు దొరకలేదు" అని కందుకూరు వీరేశలింగంపంతులుగారు వ్రాసియున్నారు. ఆంధ్రకవుల చరిత్రము. మధ్యకవులు. పుట. ౧౦. వీ రెవ్వరో పంతులుగారు పేర్కొనలేదు.

2. ఆం. క. చ. మధ్య కవులు. పుట. ౧౦.
భోరనయాచకప్రతతి భూరివిపద్దశనొందుచుండఁగా
నా రయశాలివాహనశకాబ్దములద్రియుగాబ్ధిసోములం
దారణ వత్సరంబున నిదాఘదినంబున శ్వేతశుద్ధ ష
ష్ఠీరవివాసరంబున నృసింహునికృష్ణుడుచేరె స్వర్గము
ద్వారకనున్న కృష్ణుడవతారసమాప్తమునొందుకైవడిన్॥

పన న్యూనిజు గ్రంథమున నొకటి రెండు తావుల గానవ చ్చుచున్నది. కృష్ణరాయల కుమారుని విషయము చెప్పుచు న్యూని పిట్లు వ్రాసి యున్నాడు:

"రాజు (కృష్ణరాయలు) దీనిని (కలుబరిగెదండ యాత్రను) ముగించి, తన శత్రులందఱిపై భూరివిజయములను బడసిన పిమ్మట, తాను అప్పటికే వృద్ధు డగుట చేత దన వార్ధక్యమునందు విశ్రాంతినందవలయు ననియు, దన మరణానంతరము దన పుత్రుడు రాజు గావలయు ననియు గోరి, యాత డాఱేండ్లబాలు డగుటవలన దాను గతించిన వెనక స్థితిగతు లెట్లుండునో యని శంకించి బ్రతికియుండగనే యతని రాజును జేయ నిశ్చయించుకొనెను. ఆ కారణమువలన నతడు దన సింహాసనమును, యావదధికారమును, (రాజ) నామమును ద్యజించి వాని దన కుమారుని కిచ్చి తా నతనికి బ్రధానిరైయుంతకుముందు తనకు బ్రధానిరైయుండిన సాల్వ తిమ్మనను దనకు మంత్రిని గావించుకొని యతని పుత్రులయం దొక్కని (రాజ్యమున) మహాసామంతుని గావించెను."3

ఇందువలన కృష్ణరాయలు దన కుమారునికి రాజ్యాధికార మొసగినపుడు ముసలివా డని తెలియు చున్నది. రాజ్యాధికార మొసగినది కలుబరిగెదండ యాత్ర రైనపిమ్మట. కలుబరిగెదండయాత్ర నడచినది రాయచూరువిజయానంతరము. రాయచూరువిజయము చేకూడినది క్రీ. శ. ౧౫౨౨ వ సంవత్సరమునకు సరిపోవు ౧౪౪౪ శకాబ్దమున. కావున కృష్ణరాయలు కుమారునికి రాజ్యాధికారము నిచ్చినది శకాబ్దము, ౧౪౪౪ నకు దరువాత నని నిశ్చయ మగుచున్నది. ఎంతకాలమునకు దరువాతనో సూక్ష్మముగ దెలియవలయునన్న కృష్ణరాయల శాసనములను బరిశీలింపవలసియున్నది మొదట పరిగణింపదగినది రాయసము కొండమరసయ్యగారి చోళసముద్రశిలాశాసనము. ఇది శకాబ్దము ౧౪౩౯ ఈశ్వరసంవత్సరమునాటిది. చోళసముద్ర చాడేశ్వరి యాలయమునకు కృష్ణరాయలవారికి సంతానము గలుగవలయు నని కొండమరసయ్యగారు చేసిన దానము నిది తెలియజేయుచున్నది4. ఇందువలన శకాబ్దము ౧౪౩౯ వఱకు కృష్ణరాయలకు బిడ్డలు లే రని నిశ్చయ మగుచున్నది. తరువాత పేర్కొనదగినది శకాబ్దము ౧౪౪౦ బహుధాన్యసంవత్సర కార్తిక శు. ౧౨ శనివారమునాడు కృష్ణదేవమహారాయలవారును, నతని పట్టపురాణి తిరుమలదేవిగారును దమ పుత్రుని మేలు గోరి యంజనగిరి తిరువెంగడనాథునికి జేసిన భూదానమును దెలియజేయు కమలాపురశిలాశాసనము5. ఇందువలన కృష్ణరాయలవారికి శకాబ్దము ౧౪౪౦ వ సంవత్సరమున తిరుమలరాయ లను కుమారుడు పుట్టె నని నిశ్చయ మగుచున్నది. కృష్ణరాయలు తన కుమారునికి రాజ్యాధికార మొప్పజెప్పినపు డాకుమారు డాఱేండ్లవా డని న్యూనిజు చెప్పియున్నాడు. కావున రాజ్యాధికార మొప్పజెప్పినది శకాబ్దము ౧౪౪౬ వ సంవత్సరమునం దై యుండవలయును. ఈ యూహ సరియైన దని శకాబ్దము ౧౪౪౬ వ సంవత్సరమున కృష్ణరాయలపుత్రుడు తిరుమలదేవరాయలు విజయనగర సామ్రాజ్యమును పాలించుచున్నట్లు తెలియజేయుశాసనము లనేకములు ఋజువు సేయుచున్నవి6. కావున కృష్ణరాయలు శకాబ్దము ౧౪౪౬ వ సంవత్సరమున కుమారునికి రాజ్యాధికార మొసగె ననియు, నప్పుడు రాయలు వృద్ధు డనియు దేలుచున్నది.

శకాబ్దము ౧౪౪౪ వ సంవత్సరమున కృష్ణరాయలు వృద్ధుడగుట సరి. ఎన్నియేండ్లవృద్ధుడో చెప్పుటకు వీలు గాదు. కాని న్యూనిజు తన గ్రంథమునం దొకచోట వీరనరసింహరాయల మరణసమయమున కృష్ణరాయల వయ స్సిరువదేండ్లకు పైబడియుండె నని వ్రాసియున్నాడు7. వీరనరసింహరాయలు శకాబ్దము ౧౪౩౧ వ సంవత్సరమున కాలధర్మము నందెను. అప్పుడు కృష్ణరాయలు ఇరువదియేండ్లకు పైబడిన

3. *Sewell : For. Emp. P. 359.*

4. *ARE. 87 of 1912.*

5. *ARE. 697 of 1922.*

6. *ARE.* 101, 115, 116, *of* 1918

7. *Sewell. For. Emp. p. 315.* *"Sallvatina hearing this and seeing that Crisnarao was a man of over twenty years......"*

వయసు గలవాడైనచో నతడు శకాబ్దము ౧౪౧౧ వ సంవత్సరమునకు ముందు పుట్టి యుండవలయును. ఎంత ముందో చెప్పుటకు వీలు లేదు. కావలి వెంకటరామస్వామిగారు చెప్పినట్లు కృష్ణరాయలు దన నలువదవ యేట పరలోకగతు డాయె నని యెంచుటకు వలనుపడదు. వీలన సమకాలికుడైన న్యూనిసు రాయలు తన పుత్రుని రాజును చేసినప్పుడే వృద్ధు డని చెప్పియున్నాడు. నలువదియేండ్ల వయసు గల మనుష్యు నెవ్వరును వృద్ధు డని చెప్పరు. ఏబదియేండ్ల వయసు గలవాని గూడ వృద్ధు డని చెప్పుట యరుదు. ఇంచుమించుగ నఱువది యేండ్ల ప్రాయము గలవానినే లోకులు వృద్ధు డందురు. శకము ౧౪౧౧ వ సంవత్సరమున న్యూనిసు కృష్ణరాయల వయస్సు ముప్పది యని చెప్పక ఇరువది యేండ్లకు పైబడియుండె నని చెప్పియుండుటవలన నతని వయ సప్పు డిరువదియేండ్ల కెక్కువగను, ముప్పదేండ్లకు దక్కువగను నుండె నని మనము గ్రహింపవచ్చును. అతని ప్రాయ మప్పు డిరువదితొమ్మిదేండ్లై యుండె నని యనుకొన్నను, కుమారునికి రాజ్యాధికార మొసగినపుడు, అనగా శకము ౧౪౪౬ వ సంవత్సరమున నతడు నలువదిరెం డేండ్లవాడై యుండును. అట్లయిన కృష్ణరాయల జననకాలము శకాబ్దము ౧౪౦౪ వ సంవత్సరము గావలయును. కాని నలువదిరెం డేండ్ల వయసు గల కృష్ణరాయలను న్యూనిసు వృద్ధు డని చెప్పుట యసంభవము; కావున ఇరువదియేండ్ల పైబడినవా డని చెప్పుటలో న్యూనిసు ఉద్దేశము అతని వయసును లెక్కింప వలయు ననికాదు; అతడు రాజ్యాధిపత్యమును వహించుట కర్హవయస్కు డని తెల్పుటయే. ఈ యభిప్రాయము సరియైనచో శకాబ్దము ౧౪౧౧ లో నిరువదేండ్లకు మించిన వయసుగల కృష్ణరాయలు మఱి పండ్రెండేండ్లు గడచిన తరువాత శకాబ్దము ౧౪౪౬ లో వృద్ధు డగుటలో వింత లేదు. అప్పు డతని వయ సేబదిసంవత్సరములని యెంచిన నతడు శకాబ్దము ౧౩౯౬ ప్రాంతమున బుట్టి యుండవచ్చును. కాని యిది కేవలము నిరాధారమైన యూహ. లభ్యమైన సాక్ష్యము నాధారపఱచుకొని ఇంతకంటె కచ్చితముగ నతని జన్మకాలమును నిర్ణయించి చెప్పుటకు వీలును లేదు.

రాజ్యాభిషేకమునకు పూర్వము రాయల స్థితి

రాజ్యాభిషేకమునకు ముందు కృష్ణదేవరాయల స్థితి ఇట్టి దని నిశ్చయించి చెప్పుటకు దగిన సాక్ష్యము లేదు. నరసానాయకుని పాలనక్రింద వీరనరసింహరాయునివలె నితడును రాజ్యపరిపాలనమున పాల్గొనెనేమో తెలియదు. ఒకానొక కన్నడశాసనమున కృష్ణరాయలు చంద్రగిరి పెనుగొండదుర్గములకు పాలకుడైనట్లు వ్రాసి యున్నది. కాని ఈ శాసనము కల్పన[8]. కావున నిది విశ్వాసపాత్రము గాదు. 'కొంగుదేశ రాజాక్కళ్ చరిత్రమ'ను నరవ ఇతిహాసగ్రంథమునందు వీరనరసింహరాయల యేలుబడిలో యున్నకు దన రాజ్యపాలనమున కృష్ణరాయలు దోడ్పడుచుండినట్లు చెప్పియున్నది[9]. దీనిని రుజువు సేయగల సాక్ష్య మేదియు

---

8. ఎపి. కర్ణా. సం. ౧౨. గుబ్బి. నెం. ౪౬. ఈ కల్పన యనుటకు ముఖ్యకారణములు రెండు. (౧) దాన కాలము: 'శాలివాహనశక వరుషంగళు ౧౩౨౬ నే సంద వర్తమానద స్వభానునామ సంవత్సరద చయిత్ర శు. ౯ రామెహోత్సవకాలదలూ'. ఇందువలన కృష్ణరాయల జననమునకు ముందే యీ దానశాసనము పుట్టినట్లు తేలుచున్నది. (౨) రాయలవంశావళి: "కాస్యపగోత్రద ఆపస్తంబసూత్రద యజుశ్శాఖాధ్యాయిగళాద శ్రీమన్మహామండలేశ్వర చంద్రగిరి సింహాసనాంక పెనుగొండపురవరాధీశ్వరరాద అనంతరాయర పౌత్రరాద అచ్యుతరాయర పుత్రరాద శ్రీకృష్ణరాయరవరు."

9. *Further Sources of Vijayanagara History*: *Vol. II. nos 97, 97-a.* "వీరనరసింగ మహారాయరెన్ను తమ్మనైయ తంబికళుడనే రాచ్చియం విహునీతికళుడనే రక్షిచ్చుకొణ్డు..." "తనక్కు తసింబియా యిరుక్కర కిష్ణరాయరై విజయనగరిపట్టణత్తిలే వైచ్చు తానుం అచ్చుతరాయర్ శ్రీరంగరాయర్ ఇన్నుం అనేకరాజకుమారర్గళుడనే ఉమ్మత్తూరు సమీపత్తిలే యెుణ్గికొణ్డు..." "విద్యానగరిక్కు వన్దు కిష్ణరాయరుడనే అన్ద ఉమ్మత్తూరు - శ్రీరఙ్గపట్టణం వెకు పేన్దోపస్తాయిరుక్కరపడియినాలే రొంబవుం సేనైకళ్ చేతుకొణ్డు...యెూచనై పణ్ణి..."

నింతవఱకు లభ్యపడక పోయినను ఇది కేవలము సంగతము గాదు. వీరనరసింహరాయల శాసనములు కృష్ణ రాయల యెడ సౌహార్దమును సూచింపుచున్నవి. మఱియు వీర నరసింహరాయల మరణ పర్యంతమును కృష్ణరాయాది సోదరు లందఱును విజయనగరమందు స్వేచ్ఛతో నున్నట్లు నూనిసు గ్రంథమువలన దెలియవచ్చు చున్నది[10]. కావున కొంచు దేశరాజాక్కతీక చరిత్ర యందు చెప్పినట్లు కృష్ణరాయలు రాష్ట్రపాలనయందు దనయన్న వీరనరసింహరాయలకు దోడ్పడుచుండినను నుండవచ్చును.

రాజ్యాభిషేకము-గాథలు

కృష్ణరాయల రాజ్యాభిషేకమునుగూర్చిన గాథ లనేకము లాంధ్రదేశమున బ్రచారమునం దున్నవి. ముఖ్యమైనవాని నిచట సంగ్రహముగ బొందుపఱచు చున్నాను.

౧. నృసింహదేవరాయలు వీరనరసింహ రాయనిపై జూపు ప్రేమకంటె కృష్ణరాయలపై నెక్కువ మక్కువ జూపెడివాడట. దానిగాంచి వీరనరసింహ రాయుని తల్లి తిప్పాజి కృష్ణరాయని జంపింప నుద్య మించెనట. ఆ సడి యెఱిగి తిమ్మరసు తాతని దాచి సంరక్షించుచుండెను. ఇట్లుండగా కొంతకాలమునకు నరసింహరాయలు వాపుజాడ్యముచే పీడితుడై మరణము నకు సిద్ధుడాయెను. ప్రాణావసానకాలమున గొడుకులను బిలిచి తన వ్రేలిముద్రికను జూపి దాని దీసికొనినవాడు రాజ్యార్హు డని చెప్పెను. వ్రేలు వాచియుండుటవలన ఉంగరమును దీసికొనుటకు సాధ్యపడలేదు. ఉంగరము దీసికొన నెర వేఱుగక తక్కిన కొడుకులు త్రొక్కట పడుచుండగా కృష్ణరాయలు ఖడ్గముచే దండ్రివ్రేలిని ఖండించి యుంగరమును గ్రహించెను. అతని సాహ సమునకు సంతసించి నృసింహదేవరాయ లతనిని బట్టా భిషిక్తుని జేయ నియమించి స్వర్గస్థు డాయెనట.

౨. నృసింహదేవరాయలు దన మరణకాల మప్పుడు దన కొడుకులలో నర్హునికి రాజ్య మీయ నిశ్చ యించి వారియం దర్హతము డెవ్వడో కనిపెట్టుట కొక యుక్తిని బన్నెను. మందిరాంగణమున నొక వెడ ల్పైన పెద్ద జముకాణమును బఱపించి దానిమధ్య నొక ఖడ్గమునుంచి పుత్రుల నందఱి నచటికి బిలిపించి జము కాణముపై నడుగుపెట్టక పోయి యా ఖడ్గమును గైకొన్నవానికి రాజ్య మిచ్చెదనని చెప్పెను. జముకాణ ముపై నడుగిడక పోయి దాని నడుమ నుంచియుండు ఖడ్గమునుగొను నుపాయము నెఱుగక దన యన్నదమ్ములు దిక్కుమాలి పడుచుండగా కృష్ణరాయలు నేలపై బరుండి పొరలుచు జముకాణమధ్యమునకు బోయి ఖడ్గమును గొని మరల దొరలుచు వెలుపలికి వచ్చెనట. అతని యుక్తికి మెచ్చి తండ్రి యతనికి రాజ్యము నొసగెనట.

౩. కుమారధూర్జటికృత కృష్ణరాయవిజయమం దిట్లు కలదు. (అ: ౩౬-౩౮.)

"ఇవ్విధంబున వసుంధరారమణచంద్రుం డు (వీరనరసింహరాయ పృథివీపతి) మహేంద్ర వైభ వంబున......సామ్రాజ్యసంపన్నుడైయుండి యొక్క నాడు."

"తమరు పెద్దలరైతి రితరిని కృష్ణ
రాయలను పేరి మత్పుత్రరత్నమునకు
దనర బట్టంబు గట్టెద ఘనత మీఱ
ననుచు నప్పాజితోన మంతనము జేసి."

౪. క్రీ. శ. ౧౬ వ శతాబ్దప్రారంభమున విర చింపబడిన రాయవాచకమునందు వీరనరసింహరాయలే కృష్ణరాయల పట్టాభిషేకము సేయ నాజ్ఞాపించిన ట్లున్నది:

"అని విన్నపం చేసి......యీ రాజ్యపట్టం కృష్ణరాయలవారికి కట్టవలె నని దళనాయకులతో పలక రించి, నందు...కృష్ణరాయలవారు[11] తాము పెద్దక

---

10. *For. Emp.* P. P. 315-16.

11. 'వీరనరసింహరాయలవారు' అనుటకు బదులు 'కృష్ణరాయలవారు' అని వ్రాయసకాడు తప్పు వ్రాసినాడు. కృష్ణరాయలవారు తమకు పట్టాభిషే కము చేయుటకొఱకు తమకు తామే ముద్దుటుంగరమిచ్చి రనుటలో నర్థము లేదు. కావున 'వీరనరసింహరాయల వారు' అనియే సరియైన పాఠము.

మఱి ఈ వీరనరసింహరాయ లెవ్వరు? ఈ ప్రశ్నకు సమాధానము రాయవాచకమునందే కలదు.

వయసు గలవాఁడైనచో నతఁడు శకాబ్దము ౧౪౧౧ వ సంవత్సరమునకు ముందు పుట్టి యుండవలయును. ఎంత ముందో చెప్పుటకు వీలు లేదు. కావలి వెంకటరామస్వామిగారు చెప్పినట్లు కృష్ణరాయలు దన నలువదవ యేట పరలోకగతుఁడాయె నని యెంచుటకు వలనుపడదు. ఏలన సమకాలికుఁడైన నూన్యునిసు రాయలు తన పుత్రుని రాజును చేసినప్పుడే వృద్ధుఁడని చెప్పియున్నాఁడు. నలువదియేండ్ల వయసు గల మనుష్యు నెవ్వరును వృద్ధుఁడని చెప్పరు. ఏబదియేండ్ల వయసు గలవాని గూడ వృద్ధుఁడని చెప్పుట యరుదు. ఇంచుమించుగ నఱువది యేండ్ల ప్రాయము గలవానినే లోకులు వృద్ధుఁడందురు. శకము ౧౪౪౬ వ సంవత్సరమున నూన్యునిసు కృష్ణరాయల వయస్సు ముప్పది యని చెప్పక ఇరువది యేండ్లకు పైబడియుండె నని చెప్పియుండుటవలన నతని వయసు నిరువదియేండ్ల కెక్కువగను, ముప్పదేండ్లకు దక్కువగను నుండె నని మనము గ్రహింపవచ్చును. అతని ప్రాయము నిరువదితొమ్మిదేండ్లై యుండె నని యనుకొన్నను, కుమారునికి రాజ్యాధికార మొసగినపుడు, అనగా శకము ౧౪౪౬ వ సంవత్సరమున నతఁడు నలువదిరెండేండ్లవాఁడై యుండును. అట్లయిన కృష్ణరాయల జననకాలము శకాబ్దము ౧౪౦౪ వ సంవత్సరము గావలయును. కాని నలువదిరెండేండ్ల వయసు గల కృష్ణరాయలను నూన్యునిసు వృద్ధుఁడని చెప్పుట యసంభవము; కావున ఇరువదియేండ్ల పైబడినవాఁడని చెప్పుటలో నూన్యునిసు ఉద్దేశము అతని వయసును లెక్కింపవలయు ననికాదు; అతఁడు రాజ్యాధిపత్యమును వహించుట కర్హవయస్కుఁడని తెల్పుటయే. ఈ యభిప్రాయము సరియైనచో శకాబ్దము ౧౪౧౧ లో నిరువదేండ్లకు మించిన వయసుగల కృష్ణరాయలు మఱి పంద్రెండేండ్లు గడచిన తరువాత శకాబ్దము ౧౪౪౬ లో వృద్ధుఁడగుటలో వింత లేదు. అప్పుడతని వయ సేబదిసంవత్సరములని యెంచిన నతఁడు శకాబ్దము ౧౩౯౬ ప్రాంతమున బుట్టి యుండవచ్చును. కాని యిది కేవలము నిరాధారమైన యూహ. లభ్యమైన సాక్ష్యము సాధారణముకాని ఇంతకంటె కచ్చితముగ నతని జన్మకాలమును నిర్ణయించి చెప్పుటకు వీలును లేదు.

రాజ్యాభిషేకమునకు పూర్వము రాయల స్థితి

రాజ్యాభిషేకమునకు ముందు కృష్ణదేవరాయల స్థితి యిట్టి దని నిశ్చయించి చెప్పుటకు దగిన సాక్ష్యము లేదు. నరసానాయకుని పాలనక్రింద వీరనరసింహరాయునివలె నితఁడును రాజ్యపరిపాలనమున పాల్గొనెనేమో తెలియదు. ఒకానొక కన్నడశాసనమున కృష్ణరాయలు చంద్రగిరి పెనుగొండదుర్గములకు పాలకుడైనట్లు వ్రాసి యున్నది. కాని ఈ శాసనము కల్పన [8]. కావున నిది విశ్వాసపాత్రము గాదు. 'కొంగుదేశ రాజాక్కళ్ చరిత్ర' యను నరవఇతిహాసగ్రంథమునందు వీరనరసింహరాయల యేలుబడిలో యున్నపు దన రాజ్యపాలనమున కృష్ణరాయలు తోడ్పడుచుండినట్లు చెప్పి యున్నది [9]. దీనిని రుజువు సేయగల సాక్ష్య మేదియు

---

8. ఎపి. కర్ణా. సం. ౧౨. గుబ్బి. నెం. ౪౬ రు. కల్పన యనుటకు ముఖ్యకారణములు రెండు. (౧) దానకాలము: 'శాలివాహనశకవరుషంగళు ౧౩౨౬ నే సంద వర్తమానద స్వభానునామ సంవత్సరద చయిత్ర శు. ౫ రామోత్సవకాలదలూ'. ఇందువలన కృష్ణరాయల జననమునకు ముందే యీ దానశాసనము పుట్టినట్లు తేలుచున్నది. (౨) రాయలవంశావళి: "కాశ్యపగోత్రద ఆపస్తంబసూత్రద యజుశ్శాఖాధ్యాయిగళాద శ్రీమన్మహామండలేశ్వర చంద్రగిరి సింహాసనాంక పెనుగొండపురవరాధీశ్వరరాద అనంతరాయర పౌత్రరాద అచ్యుతరాయర పుత్రరాద శ్రీకృష్ణరాయరవరు."

9. *Further Sources of Vijayanagara History: Vol. II. nos 97, 97-a.* "వీరనరసింగ మహారాయరెన్రు తమ్మ్నదైయ తంబిక్కళుడనే రాచ్చియం పెహునీతిక్కళుడనే రక్షిచ్చుక్కొండు..." "తనక్కు తసింబియా యిరుక్క్ర కిష్ణరాయరై విజయనగరిపట్టణత్తిలే వైచ్చు తానుం అచ్చుతరాయన్ శ్రీరంగరాయన్ ఇన్నుం అనేకరాజకుమారర్గళుడనే ఉమ్మత్తూరు సమీపత్తిలే యెఱిజ్ఞికొండు..." "విజ్యానగరిక్కు వన్దు కిష్ణరాయరుడనే అన్ద ఉమ్మత్తూరు- శ్రీరఙ్గపట్టణం జెకు పేన్దోపస్తాయిరుక్క్రపడియినాలే రొంబవుం సేనైకళ్ చేర్తుక్కొండు...యెహాచనైపణ్ణి..."

నింతవఱకు లభ్యపడక పోయినను ఇది కేవలము సంగతము గాదు. వీరనరసింహరాయల శాసనములు కృష్ణ రాయల యెడ సౌహార్దమును సూచింపుచున్నవి. మఱియు వీర నరసింహరాయల మరణ పర్యంతమును కృష్ణరాయాది సోదరు లందఱును విజయనగరమందు స్వేచ్ఛతో నున్నట్లు న్యూనిసు గ్రంథమువలన దెలియవచ్చు చున్నది[10]. కావున కొంగు దేశరాజాక్కళ్ చరిత్ర యందు చెప్పినట్లు కృష్ణరాయలు రాష్ట్రపాలనయందు దనయన్న వీరనరసింహరాయలకు దోడ్పడుచుండినను నుండవచ్చును.

రాజ్యాభిషేకము-గాథలు

కృష్ణరాయల రాజ్యాభిషేకమునుగూర్చిన గాథ లనేకము లాంధ్రదేశమున బ్రచారమునం దున్నవి. ముఖ్యమైనవాని నిచట సంగ్రహముగ బొందుపఱచు చున్నాము.

౧. నృసింహదేవరాయలు వీరనరసింహ రాయునిపై జూపు ప్రేమకంటె కృష్ణరాయలపై నెక్కువ మక్కువ జూపెడివాడట. దానిగాంచి వీరనరసింహ రాయుని తల్లి తిప్పాజి కృష్ణరాయని జంపింప నుద్యమించెనట. ఆ సడి యెఱిగి తిమ్మరసాతని దాచి సంరక్షించుచుండెను. ఇట్లుండగా కొంతకాలమునకు నరసింహరాయలు వాపుజాడ్యముచే పీడితుడై మరణమునకు సిద్ధుడాయెను. ప్రాణావసానకాలమున గొడుకులను బిలిచి తన వ్రేలిముద్రికను జూపి దాని దీసికొనినవాడు రాజ్యార్హు డని చెప్పెను. వ్రేలు వాచియుండుటవలన ఉంగరమును దీసికొనుటకు సాధ్యపడలేదు. ఉంగరము దీసికొన నెర వెఱుగక తక్కిన కొడుకులు త్రొక్కట పడుచుండగా కృష్ణరాయలు ఖడ్గముచే దండ్రి వ్రేలిని ఖండించి యుంగరమును గ్రహించెను. అతని సాహసమునకు సంతసించి నృసింహదేవరాయ లతనిని బట్టాభిషిక్తుని జేయ నియమించి స్వర్గస్థు డాయెనట.

౨. నృసింహదేవరాయలు దన మరణకాల మప్పుడు దన కొడుకులలో నర్హునికి రాజ్య మీయ నిశ్చయించి వారియం దర్హత మెవ్వడో కనిపెట్టుట కొక యుక్తిని బన్నెను. మందిరాంగణమున నొక వెడల్పైన పెద్ద జముకాణమును బఱపించి దానిమధ్య నొక ఖడ్గమునుంచి పుత్రుల నందఱి నచటికి బిలిపించి జముకాణముపై నడుగుపెట్టక పోయి యా ఖడ్గమును గైకొన్నవానికి రాజ్య మిచ్చెదనని చెప్పెను. జముకాణముపై నడుగిడక పోయి దాని నడుమ నుంచియుండు ఖడ్గమునుగొను నుపాయము నెఱుగక దన యన్నదమ్ములు దికమక పడుచుండగా కృష్ణరాయలు నేలపై బరుండి దొరలుచు జముకాణమధ్యమునకు బోయి ఖడ్గమును గొని మరల దొరలుచు వెలుపలికి వచ్చెనట. అతని యుక్తికి మెచ్చి తండ్రి యతనికి రాజ్యము నొసగెనట.

౩. కుమారధూర్జటికృత కృష్ణరాయవిజయమం దిట్లు కలదు. (౨: ౩౪-౩౮.)

"ఇవ్విధంబున నవ్వసుంధరారమణచంద్రుం డు (వీరనరసింహరాయ పృథివీపతి) మహేంద్ర వైభవంబున......సామ్రాజ్యసంపన్ను డైయుండి యొక్క నాడు."

"తమరు పెద్దల రైతి కీర్తిని కృష్ణ
రాయలను పేరి మత్పుత్రరత్నమునకు
దనర బట్టంబు గట్టెద ఘనత మీఱ
ననుచు నప్పాజితోన మంతనము చేసి."

౪. క్రీ. శ. ౧౬ వ శతాబ్దప్రారంభమున విరచింపబడిన రాయవాచకమునందు వీరనరసింహరాయలే కృష్ణరాయల పట్టాభిషేకము సేయ నాజ్ఞాపించిన ట్లున్నది :

"అని విన్నపం జేసి......యీ రాజ్యపట్టం కృష్ణరాయలవారికి కట్టవలె నని దళనాయకులతో పలకరించి, నందు...కృష్ణరాయలవారు[11] తాము పెద్దకి

10. *For. Emp. P. P. 315-16.*

11. 'వీరనరసింహరాయలవారు' అనుటకు బదులు 'కృష్ణరాయలవారు' అని వ్రాయసకాడు తప్పు వ్రాసినాడు. కృష్ణరాయలవారు తమకు పట్టాభిషేకము జేయుటకొఱకు తమకు తామే ముద్దుటుంగరమిచ్చి రనుటలో నర్థము లేదు. కావున 'వీరనరసింహరాయల వారు' అనియే సరియైన పాఠము.

మఱి ఈ వీరనరసింహరాయ లెవ్వరు? ఈ ప్రశ్నకు సమాధానము రాయవాచకమునందే కలదు.

మైతిమి తమ మర్యాదగా రాజ్యపరిపాలనం జేసేటందు లకు పట్టాభిషేకం అధిష్ఠానక ర్తలు సేతు మని మంచి వేళ జూచి ముద్దు టుంగర మిచ్చినారు."

౫. కృష్ణరాయలకాలమున విజయనగరము నకు వచ్చియుండిన పోర్చుగీసు అశ్వవ్యాపారి న్యూనిసు క్రీ. శ. ౧౫౩౭ వ సంవత్సరమున కించుక పూర్వము రచించిన చరిత్రయం దిట్లు వ్రాసి యున్నాడు—

"ఈ రాజు (బుస్బలరావు = వీరనరసింహ రాయలు) జాడ్యగ్రస్తుడై విస్నగపట్టణమున కాలధర్మము నందెను. అతడు తన మరణమునకు ముందు ప్రధాని సాల్వతిమ్మనను బిలువనంపి, యెనిమిదేండ్ల ప్రాయము వాడగు దనకుమారుని దన చెంతకు రప్పింపవలయు నని యుత్తరవు జేసి,—యతనికి రాజ్యాధిపత్యము సేయదగిన వయసు లేకపోయినను, ప్రాయశః రాజ్యము దనసోదరు డగు కృష్ణరావుకు జెందవలసి యుండినను—నా బాలుని రాజ్యమున బ్రతిష్ఠింపవలయు, ననియు; దన మరణా నంతరము రాజ్యమున గలహములు లేకుండుటకై యతడు దన తమ్మునికన్నులను బీకించి తనకడకు దెచ్చి చూప వలయు ననియు సాల్వతి(మ్మ)నకాజ్ఞాపించెను. సాల్వతి (మ్మ)నయట్లే చేసెద నని చెప్పి వెడలిపోయి,కృష్ణరావును బిలిపించి యేకాంతముగ నొక యశ్వశాలకు దోడ్కొని పోయి, యతని యన్న యతని కన్నుల నూడబెరికించి నిజపుత్రుని రాజ్యమున కభిషిక్తుని సేయ నాజ్ఞాపించె నని తెల్పెను. ఈ మాటలను వినగనె కృష్ణరావు హక్కు ప్రకారము దనకు రాజ్యము జెందవలసియుం డినను దనకు, రాజు గావలయు నని గాని, రాజ్యమున నెట్టి పదవినైన గావలయు నని గాని యిచ్ఛ లేదనియు, లోకమున జోగినై కాలక్షేపము సేయగోరుచున్నా డ ననియు, దన యన్నయెడ కన్నులు జెకలింపదగి నంతటి యపరాధము దాను సేయ లే దనియు జెప్పెను. దీనిని సాల్వతి(మ్మ)న విని, కృష్ణరావు ఇరువదేండ్లకు పై బడిన వాడగుటచేత నెనిమిదేండ్లప్రాయము గల బుస్బల రావు కుమారునికంటె నతడు రాజ్యాధిపత్యము వహిం చుట కతిశయార్హు డని గ్రహించి, యొక యాడుమేకను దెప్పించి దాని కన్నుల జెకలించి యప్పుడె ప్రాణములు విడువబోవుచుండిన రాజునకు జూపగొనిపోయి యతని ముందుంచెను. రాజు ప్రాణ ములు విసర్జించిన క్షణముననే, కీర్తికాయు డైన రా జెవ్వని కన్నులను జెకలింప నాజ్ఞాపించెనో యా సోద రుడు కృష్ణరావు రాజపదమున సుప్రతిష్ఠితు డాయెను12.

పైనవివరించిన గాథ లైదింటిలో మొదటి మూడును విశ్వాసపాత్రములు గావు. అందు నరసింహ రాయల (నరసానాయకుని) యనంతరము కృష్ణరాయలు

పట్టాభిషేక మైనపిమ్మట అప్పాజీ మొదలయినవారిచే రాజనీతులను వినిన తరువాత కృష్ణరాయ లిట్లు చెప్పె నని యున్నది. "ఈవరకున్ను యీశ్వరనాయడున్ను, నరసింహ్మనాయడున్ను, వీరనరసింహ రాయలవారు రాజ్యపరిపాలనం గావించినారు". (రాయ. పుట ౭౮) మఱియొకపట్టున దొండోపండితులు మొదలగు నియోగ్య గుల అభిప్రాయమును విని యాగ్రహపడి యేదులశాహు వారు, "కర్ణాటకంవారు తుంగభద్ర దాటి వచ్చి రా యీవరకున్ను? యీశ్వరనాయకుండున్ను నరసా నాయకుండున్ను, వీరనరసింహ్మరాయలవారున్ను యేలినందుకన్నా కృష్ణరాయలవారు యేలేది యే మున్నది?"అని యడిగిన ట్లున్నది (రాయ. పుట ౪౯)' ఇందువలన రాయవాచకరచయితకు నరసింహ, లేక నరసానాయకుడును వీరనరసింహ్మరాయలును భిన్న పురుషులని తెలియునని స్పష్టమగుచున్నది. గ్రంథమున కృష్ణరాయలకు పట్టాభిషేకము సేయ దలపెట్టినవాడు వీరనరసింహరాయ లని యున్నదికాని నరసింహ్మ లేక నరసానాయకు డని లేదు. మఱియు కృష్ణరాయలకు బూర్వము దుశువవంశాధీసులై యుండినవారిని ముగ్గురిని వరుసగ జేర్కొనియున్నాడు. (౧) ఈశ్వరనాయకుడు, —ఇతడు కృష్ణరాయలపితామహుడు. (౨) నరసింహ్మ లేక నరసానాయకుడు—ఇతడు కృష్ణరాయల తండ్రి. (౩) వీరనరసింహరాయలు— ఇతడు కృష్ణరాయల జ్యేష్ఠభ్రాత. కృష్ణరాయలపట్టాభిషేక మొనర్చినవాడు వీరనరసింహరాయ లని యుండుటవలన నతడు కృష్ణరా యల యగ్రజుడేకాని తండ్రి కాజాలడు.

12. *Sewell: For. Emp. pp. 314-15.*

రాజ్యాధిపత్యము వహించినట్లు చెప్పియున్నది. కృష్ణరాయవిజయమున వీరనరసింహరాయపృథ్వీపతియే కృష్ణరాయలకు రాజ్యాభిషేకము సేయ నాజ్ఞాపించినట్లు చెప్పియున్నను, 'కృష్ణరాయ లను పేరి మత్పుత్రరత్నమునకు' అని యుండుటచే నీ వీరనరసింహరాయ పృథివీపతి కృష్ణరాయల తండ్రియగు నరసానాయకుడే గాని అన్నయగు వీరనరసింహరాయలు గాజాలడు[13]. నరసానాయకు ననంతరము వీరనరసింహరాయలును, నతని వెనుక కృష్ణరాయలును రాజ్యమును బాలించినట్లు తుళువవంశశాసనములవల్లను, కృష్ణరాయల కంకితము సేయబడిన ఆంధ్రప్రబంధములవల్లను దెలియవచ్చుచుండుటవలన నరసానాయకుడు కృష్ణరాయలకు రాజ్యాభిషేకము సేయ నాజ్ఞ యిచ్చె ననుట విశ్వసింపదగిన విషయము గాదు. రాయవాచకమున జెప్పినట్లు వీరనరసింహరాయలే కృష్ణరాయలకు రాజ్యాభిషేకము సేయ నాజ్ఞాపించియుండవచ్చును; కాని దీని యాథార్థ్యము స్థిరపరచగల సాక్ష్యము విశ్వాసపాత్రమైనది లభ్యపడలేదు. మఱియు న్యూనిజాచరిత్ర దీనితో బ్రత్యక్షముగ బ్రతిఘటించుచున్నది. వీరనరసింహరాయలు దన మరణానంతర మెనిమిదేండ్ల బాలు డగు దన పుత్రుని పట్టబద్ధుని సేయ నిశ్చయించి, కృష్ణరాయలవలన నతని కాపద గలుగవచ్చు నని శంకించి కృష్ణరాయల కన్నుల దీకింప నిజప్రధాని తిమ్మరసున కాజ్ఞాపించె ననియు, నాప్రధాని కృష్ణరాయల పక్ష మవలంబించి తన యజమానుని మోసపుచ్చి యతనికి రాజ్యాభిషేక మొనర్చె ననియు న్యూనిజ గ్రంథమువలన విదిత మగుచున్నది. న్యూనిజ కృష్ణరాయలకు సమకాలికుడు. కృష్ణరాయల కాలమునను, దరువాతను నతడు పలుమారు విజయనగరమునకు వచ్చియుండెను. కృష్ణరాయల రాజ్యారంభకాలమున జరిగిన యంశములనుగూర్చి ప్రత్యక్షజ్ఞానముగల వారిని జక్కగ విచారించి సత్యమును గనుగొని గ్రంథస్థము జేసి యుండును; కావున వీరనరసింహరాయల కిష్టము లేక పోయినను మహాప్రధాని సాళువతిమ్మరసయ్యగారి సహాయమువలన కృష్ణరాయలు రాజ్యాధిపతి యాయె నని మనము నిశ్చయింపవచ్చును.

ఈ పట్టున విచారింపదగిన ముఖ్యాంశ మొకట్టి కలదు. వీరనరసింహరాయల యనంతరము రాజ్యాధిపత్యపు హక్కు కృష్ణరాయల దైనట్లు న్యూనిజ సూచించియున్నాడు. ఈ క్రింది వాక్యముల యర్థము పరిశీలింపదగినది. వీరనరసింహరాయలు కృష్ణరాయల కన్నుల బెకలింపమని తిమ్మరసున కాజ్ఞాపించుసందర్భమున 'రాజ్యము ప్రాయశః తన సోదరు డగు కృష్ణరావునకు జెందవలసియుండినను' అని చెప్పినట్లున్నది. దీని కనుగుణ్యముగ కృష్ణరాయలు వీరనరసింహరాయల యాజ్ఞను విన్నప్పుడు తిమ్మరుసుతో, 'హక్కు ప్రకారము దనకు రాజ్యము జెందవలసి యుండినను' అని యన్నట్లున్నది[14]. ఈ వాక్యములనుబట్టి చూడగా వీరనరసింహరాయల పుత్రునకు రాజ్యము నేలు హక్కు లేదనియు, హక్కుప్రకారము కృష్ణరాయలే రాజ్యాధిపతి కావలసియుండె ననియు విదిత మగుచున్నది. కృష్ణరాయల కీ హక్కెట్లుపలబ్ధ మైనదో తెలియదు. సంగమవంశజులను వెడలనడిచి క్రీ. శ. ౧౪౮౫ వ సంవత్సరమున సాళువనరసింగరాయలు విజయనగరసామ్రాజ్యము నాక్రమించుకొనెను. ఇతని తరువాత నితని పుత్రులు తిమ్మరాజును, ఇమ్మడినరసింహరాయలును క్రీ. శ. ౧౫౦౬ వ సంవత్సరము వఱకును బాలించిరి. బాలు రగుటచే నామకార్థము మాత్రమే వీరు ప్రభువులు; సర్వాధికారమును రాయ

---

13. క్రీ. శ. ౧౪౯౬ వ సంవత్సరము నాటి యొక శాసనమున (మైసూ. ఆర్కి. రిపో. ౧౯౪౪ సెం. ౪౪ రు) నరసానాయకుడు 'నృసింహో నృపః' అని పేర్కొనబడి యున్నాడు. ఆముక్తమాల్యదయను చరిత్ర పీఠికలందు 'నారసింహేశ్వరుండు' అనియు, వరదాంబికాపరిణయమందు 'నృసింహనామానం' అనియు కలదు. (సోర్సస్ ఆఫ్ విజయనగరహిస్టరీ. పుటలు ౧౧౦, ౧౩౨.) ఇత డర్వాచీన గ్రంథకర్తలచే నరసింహ, లేక వీరనరసింహరాయ లనియు బేర్కొనబడి యున్నాడు.

14. *For. Emp. p. 315.*

"Though the kingdom ought perhaps "o belong to his brother, Crisnarao.. ..." "Even though it (the kingdom) should come o him by right......"

లకును, సామ్రాజ్యమునకును రక్షకు డైన నరసానాయకునిచేత నుండెను. క్రీ. శ. ౧౫౦౩ వ సంవత్సరమున నరసానాయకుడు శివసాయుజ్యము నందిన పిమ్మట నతని జ్యేష్ఠపుత్రుడు ఇమ్మడి నరసానాయకుడు రక్షకు డాయెను. క్రీ. శ. ౧౫౦౬ వ సంవత్సరమున నితడు దన స్వామి యగు నిమ్మడి నరసింహరాయని జంపించి రాయసామ్రాజ్యము నాక్రమించుకొని వీరనరసింహ రాయ లను నామము వహించి క్రీ. శ. ౧౫౦౯ వ సంవత్సరముదనుక రాజ్యపరిపాలనము గావించెను. కావున వీరనరసింహరాయలు గతించిన తరువాత రాజ్యము క్రమప్రకార మతని పుత్రునికి జెందవలసి యుండెను. విషయ మి ట్లుండగా, 'హక్కు నుబట్టి' రాజ్యము కృష్ణ రాయలకు జెందవలసి యుండె నను న్యాయనిజావాక్యముల కర్థ మేమి? తండ్రిమూలమున గాకపోయిన కృష్ణరాయల కీ హక్కు తల్లి వలన సంక్రమించి యుండగూడదా? యను ప్రశ్న రావచ్చును. తల్లి సంగవంశముననో, సాళువ నరసింగరాయల వంశముననో పుట్టియుండిన న ట్లను కొనుట కవకాశము గలదు ? కాని కృష్ణరాయల తల్లిని గూర్చి మనకు దెలిసిన విషయ మల్పిష్ఠము. ఆమె నరసానాయకుని ద్వితీయపత్ని యని తెలియును; అంతకు మించి మఱి యేమియు దెలియదు. దీపాలవాగి కథ యొక్కటి కలదు; కాని యది సత్యము గాదు. సత్యమే యనుకొన్నను అందుమూలమున కృష్ణరాయ లకు రాజ్యాధిపత్యమున కెట్లు హక్కు గలిగెనో తెలియ రాదు. ప్రస్తుతము మనకు గల చరిత్రజ్ఞానము నాధార పఱచుకొని న్యాయనిజావాక్యముల గూఢార్థమును నిర్ణయించుటకు వీలు గాదు. అందలి వాస్తవార్థము భావి పరిశోధనలవలన బయల్పడవలసియున్నది.

రాజ్యాభిషేక కాలము

ఇంతవఱకును కృష్ణరాయల రాజ్యాభిషేకమును గూర్చిన గాథలు వివరింపబడినవి. వీరనరసింహరాయల కిష్టములేకపోయినను ప్రధాని తిమ్మరసయ్యగారి యను గ్రహమువలన కృష్ణరాయలకు రాజ్యోపలబ్ధి గలిగెను. కాని యతని పాలన యెప్పుడు ప్రారంభ మాయెనో, యెన్న డాతనికి పట్టాభిషేకము నడచెనో నిశ్చయముగ దెలియదు. శాసనముల నాధారపఱచుకొని వీనిని నిర్ధారింపవలసి యున్నది. అనంతపురమండలములోని తాడిపత్రియందలి శాసన మొకదానియందు శా. శ. ౧౪౩౧ పూర్తి యైనపిమ్మట శుక్ల నామసంవత్సర వైశాఖ శు. ౧౫ శుక్రవారము (అనగా క్రీ. శ. ౧౫౦౯. మే ౪ తేది) నాడు వీరనరసింహరాయలు విజయనగరమునందు పాలించుచున్నట్లు చెప్పియున్నది15. దక్షిణఆర్కాటు జిల్లాలోని విక్రవాండిగ్రామమందలి యొక శాసనమున శా. శ. ౧౪౩౧ శుక్ల నామసంవత్సర కర్కాటక శు. ౫ శుక్ర. హస్త (క్రీ. శ. ౧౫౦౯ జూలై ౨౨ తేది) నాడు వీరనరసింహరాయలు విజయనగరమందు పృథివీ సామ్రాజ్య మేలుచుండినట్లు చెప్పియున్నది16. ఈ రెండుశాసనములవల్లను వీరనరసింహరాయలు క్రీ. శ. ౧౫౦౯ జూలై ౨౨ తేదివఱకును రాజ్యము సేయుచుండె ననియు; నందాక కృష్ణరాయల పాలన ప్రారంభముగాలేదనియు దెల్లమగుచున్నది

బళ్లారిమండలమందలి గుర్లమూలో నొక శాసనమున శా. శ. ౧౪౩౧శుక్ల శ్రావణ శు. ౧౦ బృహస్పతి వారము (క్రీ. శ.౧౫౦౯ జూలై ౨౬ తేది) నాడు కృష్ణదేవరాయలు విజయనగరమున రత్నసింహాసనా సీనుడై పృథివీసామ్రాజ్యము పరిపాలించుచుండినట్లు చెప్పియున్నది17. మఱియు కడపమండలములోని పులివెందలయం దొక శాసనమున శా. శ. ౧౪౩౧ శుక్ల సంవత్సర కార్తికమాసమున (క్రీ. శ. ౧౫౦౯ ఆగస్టు-సెప్టెంబరు) కృష్ణరాయలు విజయనగరమున పృథివీ సామ్రాజ్యము సేయుచుండెనని యున్నది18. ఇందు వలన కృష్ణరాయలు క్రీ. శ. ౧౫౦౯ జూలై ౨౨-౨౬ తేదీలమధ్య నొకనాడు రాజ్యాధిపత్యమును వహించె నని తెల్లమగుచున్నది.

ఈ రెండుశాసనములందు కృష్ణరాయల పట్టాభిషేక ప్రస్తావన లేదు. పట్టాభిషేక ప్రస్తావము మొట్టమొదట శా. శ. ౧౪౩౦ సం. శుక్లసం॥ మాఘశు. ౧౪ కు సరియైన క్రీ. శ. ౧౫౧౦ జనవరి ౨౪ తేది నాడు నిలిపిన

15. 342 of 1892.
16. 289 of 1915,
17. 703 of 1999.
18. 498 of 1906

హంపిశాసనమున గాన వచ్చుచున్నది[19]. ఇందు కృష్ణరాయలు దన పట్టాభిషేకమహోత్సవకాలమున పంపావిరూపాక్షస్వామివారి యాలయమునకు రంగమంటపమును గోపురమును గట్టించె నని యున్నది. దీనినిబట్టి చూడగా రాజ్యాధిపత్యమును వహించిన వెనుక యాఱుమాసములవఱకు పట్టాభిషేకము జరుగలేదని చెప్పవలసియున్నది. కాని రాజ్యాధిపత్యము వహించుటకును, పట్టాభిషేకమహోత్సవమున కింత యెడము గల్గుటకును గారణ మేమియు గానరాదు. హంపిశాసనము కృష్ణరాయల పట్టాభిషేకమహోత్సవ సమయమున నిలిపినది కాదనియు, దరువాత నొక వార్షికోత్సవమునాడు నెలకొల్పిన దనియు కొందఱి యభిప్రాయము[20].

క్రీ. శ. ౧౫౦౯ జూలై ౨౬ తేది వఱకును కృష్ణదేవరాయల పాలన ప్రారంభము గాలేదని పై నుదహరించిన వీరనరసింహరాయల విక్రమాండి శాసనమువలన విశద మగుచున్నది. హంపిశాసనకాలమునకును దానికిని గల యెడ మాఱు మాసములే యగుటవలన హంపిశాసనము నిల్పినది పట్టాభిషేక వర్థంత్యుత్సవమప్పు డనుట సంగతముగాదు. కాని పట్టాభిషేక మంతకుకొన్ని మాసములకు పూర్వమే జరిగె ననుటకు గొంత యాధారము గలదు. శా. శ. ౧౭౪౭ పార్థివసంవత్సరమున వీరవేంకటపతిరాయలవారి యాజ్ఞప్రకారము వారి నగరి యుత్తరణీకర్తలు తయారుచేసిన 'విజయనగరసామ్రాజ్య' మను పాళ్యపట్టుకడితమునందు "శాలివాహనశకం ౧౪౩౨ అగు నేటి శుక్లసంవత్సరం ఆవణిమాసం శ్రీజయంతినాడు కృష్ణదేవరాయమహారాయలు విజయనగరమందు పట్టాభిషిక్తులై క్షేంచేసిరి." అని చెప్పియున్నది[21]. ఇందుదహరింపబడిన శకాబ్దము వర్తమానాబ్దము; గతాబ్దము గాదు. గతాబ్దము ౧౪౩౧. సామాన్యముగ గతాబ్దము నుదహరించుట వాడుకయైనను వర్తమానాబ్దముగూడ ప్రాచీన శాసనములందును, లెక్కలందును దఱచుగ గాన వచ్చుచున్నది. 'విజయనగరసామ్రాజ్యము' బడి కృష్ణదేవరాయల పట్టాభిషేకము క్రీ. శ. ౧౫౦౯ ఆగస్టునెల ౮ తేది మంగళవారమునాడు జరిగి యుండవలయును. కృష్ణదేవరాయలు శ్రీకృష్ణుని యవతార మని యప్పటివారి నమ్మకము. మఱియు నాతడు పరమ వైష్ణవుడు. కావున నతడు క్రీ. శ. ౧౫౦౯ జూలై ౨౬ తేది తరువాత రాజ్యభారము వహించినను బటుపిమ్మట నొక పక్షము రోజులలో వచ్చుచుండిన శ్రీకృష్ణజన్మాష్టమి వఱకును దన బట్టాభిషేకము నాపుదల జేసికొనుటయందు వింత యేమియు లేదు. కృష్ణరాయల పట్టాభిషేకము వాస్తవముగ క్రీ. శ. ౧౫౦౯ ఆగస్టు ౮ తేది నాడు జరిగె నని మనము విశ్వసింపవచ్చును.

౪. ఉమ్మత్తూరు

"సమ్మర్దక్షమ ధీ నిబంధనవిధాసంక్రందనాచార్య కూరమ్మన్యాచలవజ్రపాతజగతీరక్షాంబుజాక్షాశ్రిత రక్ష్యమార్గ్రసదశాస్యరాజ్యసమసహ్యప్రోద్భవాతీర భాగుమ్మత్తూరుశివంసముద్రపురవప్రోన్మూలనాపంబరా[1]."

కృష్ణదేవరాయలు రాజ్యాభిషేకము చేసికొనిన వెంటనే రాష్ట్రమున క్షుద్రశత్రువులను నిర్మూలము గావించి తనయాజ్ఞను నిర్వక్రముగ సామ్రాజ్యమునందంతటను జెల్లుబడి యగునట్లు చేయవలసి యుండెను. సంగమవంశ మంతరించినప్పటినుండియు దక్షిణకర్ణాటకమున రాయల యధికారము సన్నగిలినది. కావేరీతటమును బాలించుచుండిన ఉమ్మత్తూరు శివం సముద్ర శ్రీరంగపట్టణపాళెగాండ్రు కేంద్రప్రభుత్వమును సరకు సేయక స్వచ్ఛందమార్గమున బ్రవర్తించుచుండిరి. వీరు తాము ప్రాచీన కర్ణాటకరాజుల సంతతివార మనియు, విజయనగరప్రభువుల యధికారమునకు లొంగి వారికి గప్పము కట్టవలసిన యావశ్యకత లే దనియు బ్రకటించి, తమ స్వాతంత్ర్యమును స్థాపించుటకు బ్రయత్నము సల్పుచుండిరి. మహామండలేశ్వర, జవాదికోలాహల, సేవణీహనుమంత, అరసాంగమానెగాఱ, ఘేణాబ్కచక్రేశ్వర, గజబేటకాఱ, పెనుగొండచక్రేశ్వర యను బిరుదులు వీరి కుండినట్లు వీరి శాసనములవల్ల దెలియు

---

19. *A R I. 1907-8 p. 174.*
20. *Sewell. For. Em. P. 120.*
21. భారతి. సం. ౬, పుట ౬౧౨.
1. పారి. ౨ : ౧౦౪.

వచ్చుచున్నది. "తాము హొయ్సలరాజ్యాధిపతుల మని చెప్పుకొనెడివారు; ప్రాచీన కేరళకర్ణాటరాజ్యమును గొంతకాలము వీరు పాలించిన ట్లున్నది. మఱియు నీ యుమ్మత్తూరుప్రభువులు చిరకాలము నీలగిరిప్రాంతమును పాలించి రనుటకు సంశయము లేదు; ఆపత్సమయముల యందవట తలదాచుకొనెడివారు"2. పెనుగొండదుర్గము గూడ కొంతకాలము వీరి స్వాధీనమందుండినదేమో! వీరి బలమంతయు గావేరిద్వీపములయందుండిన యుమ్మత్తూరు శివసముద్ర శ్రీరంగపట్టణములను జలదుర్గత్రితయముపై నాధారపడియుండినది. ఇంతవఱకు లభించిన శాసనసాక్ష్యమునుబట్టి వీరి వంశావతరణ మిట్లేర్పడుచున్నది.

స్థించెను. అది మొదలు ఉమ్మత్తూరుప్రభువులు దమ స్వాతంత్ర్యము నెలకొల్పుటకై విజయనగర రాయలతో బోరాడ ప్రారంభించిరి. ఉమ్మత్తూరు ప్రభువుల పేరు చెప్పకున్నను సాళువనరసింగరాయలు వారి కిరవైన కొంగుదేశమును సాధించినట్లు సమకాలి కాంధ్రవాఙ్మయమువలన దెలియవచ్చుచున్నది. జైమిని భారతమునందు—

"...కొంగుధారాపురీ
పెనుగొండాద్యఖిలైకదుర్గహరణ
ప్రేంఖత్ప్రతాపోదయా." అనియు—

వంశవృక్షము

- హనుమప్ప ఉడయరు
  - సోమ లేక యిమ్మడిరాయ ఉడయరు
    - దేపణ్ణ లేక దేవరాజ ఉడయరు (క్రీ. శ. ౧౩౭౮-౧౪౮౪)
      - ఇమ్మడి దేపణ్ణఉడయరు (క్రీ. శ. ౧౪౯౨-౧౫౦౮)
        - గంగరాజ ఉడయరు (క్రీ. శ. ౧౫౧౧.)
        - నంజరాయ ఉడయరు (క్రీ. శ. ౧౫౧౨-౧౫౪౦)
      - చిక్కరాయ ఉడయరు (క్రీ. శ. ౧౫౦౫-?)
    - నంజరాయ ఉడయరు (క్రీ. శ. ౧౪౮౨-౧౪౯౪)
      - చన్న నంజరాయ ఉడయరు (క్రీ. శ. ౧౪౯౬-౧౫౦౪)

ఈ వంశావళియందు పేర్కొనినవారిలో మొదటి యిద్దరిని గూర్చి మన కేమియు దెలియదు. సంగమ వంశము క్రీ. శ. ౧౪౮౫ వ సంవత్సరముతో సమాప్తి యైనది. క్రీ. శ. ౧౪౮౫ వ సంవత్సరమున సాళువ నుండ నరసింహరాయలు సంగమవంశజులను విజయనగరమునుండి పాఱద్రోలి రత్నసింహాసనమును నధి

"పెనుగొంపెకడద్రావాలి పిక్కటిల్లు మొదలైన
ప్రతిపక్షులను హతాహతము జేసి."

అనియు జెప్పియున్నది. మఱియు వరాహ పురాణమున సాళువనరసింగరాయల సేనాధిపతియగు ఈశ్వరనాయకుడు 'పెనుగొండ సాధించె, బెంగ ళూరు హరించె' ననియు 'సీరంగపట్ణంబు జాఱిసమరె' ననియు జెప్పియున్నది3. నీలగిరిప్రాంతమువఱకును ఉమ్మత్తూరుదొరల యధికారము జెల్లుచుండినందున కొంగుధారాపురి వారి యేలుబడిక్రింద నుండియుండె

2. ఎపి. కర్ణా. సం. 3. పీఠిక పుట ౨౬.
3. సోర్నస్. పుటలు ౮౬, ౮౯.

వలయును. సీరంగపట్టణమువారి దుర్గత్రితయమునం దొక్కటియైన శ్రీరంగపట్టణమే. బెంగుళూరు వీరి పాలనయం దుండియుండవచ్చును. కావున సాళువనరసింగరాయల కాలముననే యుమ్మత్తూరుప్రభువులతో సమరము ప్రారంభమాయె నని నిశ్చయముగ జెప్పవచ్చును ; కాని యతని ప్రతిపక్షి యెవ్వడో తెలియదు. మొదటిదేవణ్ణయొక్క తమ్ముడు నంజరాజ ఉడయరు క్రీ. శ. ౧౪౫౨-౧౪౯౪ ల మధ్య రాజ్యపాలన మొనర్చినట్లు శాసనసాక్ష్యమువలన రుజువగుచుండుటవలన సాళువనరసింహరాయలతో పోరినవాడు ప్రాయశః యతడై యుండవచ్చును.

సాళువనరసింహరాయలు క్రీ. శ. ౧౪౯౦ వ సంవత్సరమున కాలధర్మము నొందెను. తదనంతర మతని కుమారుడగు నిమ్మడి నరసింహ - దమ్మరాయలు రాజ్యాధిపతియైనను నతడు బాలుడై నిర్వాహకత లేకపోవుటవలన సర్వాధికారములును రాజ్యమునకును, రాయలకును సంరక్షకుడైన నరసానాయకునిచేత నుండినవి. రాజ్యమునం దచటనచట పొడసూపిన క్షుద్రోపద్రవములను సందుచేసికొని ఉమ్మత్తూరుప్రభువులు మరల తలయెత్తిరి. కాని నరసానాయకుని ప్రతాపము నోర్వజాలక నమ్రులై కప్పము గట్ట నీయకొనవలసివచ్చెను. నరసానాయకుని విజయము అప్పటిశాసనములందును,సంస్కృతాంధ్రగ్రంథములందును వర్ణింపబడియున్నది.

"కావేరీ మాశు బద్ధ్వా బహుళజలధరాం
తాం విలంఘ్యైవ శత్రుం
జీవగ్రాహం గృహీత్వా సమితిభుజబలా
త్తంచ రాజ్యం తదీయం
కృత్వా శ్రీరంగపూర్వం తదపినిజవశే
పట్టణం యో బభాసే
కీర్తిస్తంభం నిధాయ త్రిభువనభవన
స్తూయమానాపదానః."[4]

అను సుప్రసిద్ధమైన శ్లోకము తుళువరాజుల తామ్రపట్టికలయం దన్నిటియందును గానవచ్చును. ఈ యంశమును రాజనాథడిండిముడును, తిరుమలాంబయును వర్ణించియున్నారు.

"ప్రాయోఽర్ణవే సేతుకృతోఽవతారః
ప్రాగ్జన్మసంస్కారవశా దివైషః
సేతుం విధాయాంభసి సహ్యజాయాః
శ్రీరంగపూర్వాం నగరీం జహార."[5]

"సముగ్రతరోత్స్యగ్రశౌర్యమూర్త్యుదయః సాగరాన్తరావాసదుర్లంఘాం లంకామివ రఘుపుంగవః కావేరీపరివేష్టితాం శ్రీరంగపట్టణాభిధాం ఆవరిష్టపురీమ్.

స్థిరే జలే సేతు రకారి పూర్వం
త దద్భుతం నేతి కవేరజాయాః
సేతుంప్రవాహేషు సుణాభిరామః
చిత్తే సతా మద్భుత మ ప్యబధ్నాత్.

..........ని స్తద్రియ స్త్రి శిలాచక్రనిఖాతనిపాత్యమానవిజయపార్థివ శృఙ్గసంఙ్కాశవిశంకట శృఙ్గసఙ్ఘాటాం పురీ మిమాం సమాక్రమ్య విత్రాసథరపుర స్థాపితసమ స్తవి త్తజాతమ్ అపత్యకలత్ర ది,మిత్రాదిభి స్సమాగత్య పదయో ర్నిపత్య ఆత్మనో గత్య న్తరభావం ఉదోౕతయ న్తం మహావీరం పార్థివం ప్రత్యగ్రకృపారసాభిషి క్తం తత్ర పురి స్థాపయిత్వా౯..."

మఱియు నీవిషయమునే ముక్కుతిమ్మన్నగారు "శ్రీరంగపట్టణసీమఖడ్గనటీవినోదంబు హొయ్సనేంద్రునకు జూపె[7]."

అను సీసపాదమున సూచించి యున్నారు.

కొంగుదేశరాజక్కళ్ చరిత్రయం దీ ప్రస్తావన కొంత కలదు.

"అందుమీదట కర్ణాటదేశములోనుండు పాళెగాండ్రును దండనాయకులును కప్ప మీయకపోయినందువలన నుద్దండుడను మంత్రి రాజుగారి యుత్తరవు

4. భారతి సం. ౯. భా. ౨. పుట ౪౨౩.
5. సోర్సస్. పుట ౧౦౯.
6. సోర్సస్. పుట ౧౬౪.
7. ఫర్దర్ సోర్సస్. సం. ౧ పుట ౧౬౦. ఆక్స్ఫర్డ్.

ప్రకారము చతురంగసేనలతో గూడ కర్ణాటదేశమునకు బోయి వారితో యుద్ధముచేసి జీవగ్రాహుని పట్టుకొని యాదేశములో దానే పట్టముగట్టికొని యాపాళెగాండ్రచేత కప్పమును గొని...8"


ఇందు ఉద్దండుడను విజయనగరమంత్రిచే జీవగ్రాహుడు పట్టుబడినట్లు చెప్పియున్నది. ఈ యుద్దండుడెవ్వడో తెలియదు. జీవగ్రాహుడు శ్రీరంగపట్టణాధిపతియగు హాయ్సళేంద్రుడే కాని యన్యుడు గాడు. 'జీవగ్రాహం గృహీత్వా' యను శాసన వాక్యమునకు సరియైన యర్థమును గ్రహింపజాలక కొంగుదేశరాజాక్కళ్ చరిత్రరచయిత యది యొక వ్యక్తియొక్క నామ మని తలచి 'జీవగ్రాహు' డని వ్రాసెను. ఒక శ్రీరంగపట్టణమునుమాత్రమే కాక ఉమ్మత్తూరునుగూడ జయించినట్లు ఈ గ్రంథమున మఱియొక సందర్భమున జెప్పియున్నది. 'అట్లావుండగా మీ తండ్రి నరసింగరాయడు బలంచాత జయించి కప్పం తీసుక్కొనిపోయెను' అని 'త్యాపరాజు' (ఇమ్మడి దేపణ్ణ) నుడివె నట9.

పై నుదాహరింపబడిన శాసనాద్యాధారముల వలన నరసానాయకుని కాలమునగూడ ఉమ్మత్తూరు దొరలు కప్పమీయక తిరుగబడిరనియు, వారిని బలముచే నిర్జించి నరసానాయకుడు కప్పముగొనెననియు దెల్లముగుచున్నది. నరసానాయకునిచే శ్రీరంగపట్టణమున బరాజయమంది జీవగ్రాహుడైన ప్రతిపక్షి పేరిందును జెప్పియుండలేదు; కాని క్రీ. శ. ౧౪౯౨ మొదలు క్రీ. శ. ౧౫౦౭ వఱకును ఇమ్మడిదేపణ్ణవొడయ రుమ్మత్తూరురాజ్యము నేలినట్లు శాసనములవలన దెలియవచ్చుచుండుటచేత నరసానాయకుని కోడి పాదాక్రాంతుడై కప్పమును గట్టినవా డతడే కావలయును.

(సశేషము)

8. ఫర్దర్ సోర్సెస్. సం. ౩. పెం. ౯౫౮.

9. ఫర్దర్ సోర్సెస్ సం. ౩. పెం ౯౬



ప్రాచీనఖగోళము

౧౨. జగదుత్పత్తి

●

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

ఇపుడు మనకు కనబడునట్టియు, కనబడనట్టియు బ్రహ్మాండప్రదేశ మెల్లయు చీకటికోణము. ఈ చిమ్మ చీకటిలో వాసుదేవుడును 1, పరబ్రహ్మమును 2, పరమపురుషుడును, అతీంద్రియుడును, నిర్గుణుడును, ఇరువదియిదింటికి 3 ఆవలివాడును, అవ్యయుడును నగు సంకర్షణుడు 4 తొలుత నీటిని (అప్) సృజించి ఆ నీటిలో శక్తిని నిక్షేపించెను. ఆ నీరును, ఆ శక్తియు కలిసి ఒక బంగారుగ్రుడ్డు (సువర్ణాండము) ఆయెను. అప్పటికిని ఆ గ్రుడ్డుచుట్టును కారుచీకటియే ఉండెను. నూవులనుండి నూనియపగిది ఆ గ్రుడ్డునుండి అనిరుద్ధుడు5 అభివ్యక్తి పొందెను. దానజేసి వేదము లితనిని హిరణ్యగర్భు డని చెప్పును. ఆదిలో ఆవిర్భవించిన వాడు గావున నితని కాదిత్యు డని యింకొక పేరు. జగత్తును బ్రసవించెగావున సవిత యని మరియొక పేరు. ఇత డంధకారనాశకుడు. ఉత్పత్తిస్థితిలయకర్త. భూతభావనుడు. మరియు నితడు భువనములను ప్రకాశింపజేయుచు ఎల్లప్పుడును తిరుగుచుండును. 6 ఇతడు జగత్సృష్టికి బ్రహ్మను సృజించెను. అతనినుండి చంద్రుడును, సూర్యుడును, ఐదు తారాగ్రహములును, నక్షత్రములును, భూమియును ఈ మొదలగుగాగల విశ్వమంతయు ఉత్పన్న మాయెను. ఆ బ్రహ్మ 7 ఈ యండమునందుండెగావున ఇది బ్రహ్మాండము. బ్రహ్మాండములోపల నున్న అవకాశమునందు భూర్భువరాదిలోకము లున్నవి. రెండు కటాహసంపుటముల నంటించినటు లిది సుంద్రముగా నున్నదని చెప్పి సూర్యసిద్ధాంతము వేదములను, పురాణములను, దర్శనములను అనుసరించెను.

నవ్యవిజ్ఞానదృష్టితో మాచు కొంద రీ పై విషయమునకు— "మొదటి సృష్టి నీరు. ఇది ద్రవరూపమగు

---

1. ఎవనియం దీ సమస్తమును, ఈ సమస్తమునం దెవడు నివసించునో అతడు 'వాసు'. 'దేవు'డన ప్రకాశించువాడు.

2. ఈ సమస్తము నయినవాడు.

3. పదునారు వికృతులును, ఏడు ప్రకృతివికృతులును, మూలప్రకృతియును, జీవుడును జేరసి యిరువదేను. వీని కీశ్వరుడు పరుడు.

4. ఆకర్షించువాడు.

5. నిరోధ మనగా అడ్డు. అది లేనివాడు అనిరుద్ధుడు. కల్పాదియందు సృష్టికి నారాయణు డెత్తిన యవతారము.

6. ఈ విశేషణము లన్నియు ఈ ప్రత్యక్షరవికిని సమపడుటజేసి నవ్యులు కొంద రీరవియే హిరణ్యగర్భు డని యందురు. ఈ సూర్యుడు పుట్టి ఎనిమిదిలక్షలకోట్ల యేండ్లకంటె ఎక్కుడైయుండునని సర్ జేమ్స్ జీన్స అనును. జ్యోతిషికులు నవ్యులు చెప్పుదురుకాని అది కాదు.

7. ఈక్రమ మిది: వాసుదేవు డనగా నిర్గుణబ్రహ్మమునుండి అనిరుద్ధుడు, వేక హిరణ్యగర్భుడును, హిరణ్యగర్భునుండి బ్రహ్మయు, బ్రహ్మనుండి యీ విశ్వమును ఉత్పన్న మాయెను. ఇచట వివరము తెలిసికొన గోరువారు మనుస్మృతి మొదటి యధ్యాయమున సృష్టిప్రకరణమును చూడగోరెదను.

నీకే యని అవసక్కరలేదు. దానికి ప్రమాణము లేదు. సాయణులిచట సలిలాదిపదముల కే యర్థమును చెప్పెనో మాడుడు. (చూ. 8 టీక) నీరిమయ మయిన ఆవిరిగాని, లేక ఆవిరిగాని ఈ నీరి కర్థము. అప్ శబ్దమునకు గాలి యనియు నర్థము కలదు. ధాత్వర్థమును తీసికొనినచో గాలి యనిగాని, ఆవిరి యనిగాని అర్థము చెప్పవచ్చును. ఇటులు కాగా: మునుమ్మొదట ఈ బ్రహ్మాండ మంతయు చీకటిమయము, 8 మరియు ఆవిరిమయము. దానియం దీశ్వరశక్తి సంచారిత మగుడు, ఒక బంగారుగ్రుడ్డు పుట్టెను. బంగారవగా ఇచట అసలుబంగారము గాదు. బంగారమువలె తలతలలాడునది యని యర్థము. గ్రుడ్డనగా గ్రుడ్డుకాదు, ఆకారముచే గ్రుడ్డునంటిదని యర్థము. సృష్టి అంతటికిని బ్రహ్మ యననది మారు పేరు. ఆ సృష్టి, అనగా విశ్వము అండాకారము. అనగా కనిపించు నీ జగత్తు సరిగా గోళాకారము కాదు. సంకర్షణప్రభావము వలన దానినుండి చంద్రసూర్యాదికము నీ సమస్త మును పుట్టెను. ఈ యండమధ్యమున సవిత రెల్లపుడును తిరుగుచుండును. అనగా మున్మొదటి ఆ యావిరియు (అప్), సంకర్షణశక్తియు క్షుభిత మగుటవలన విశ్వోత్పత్తి యాయెను" అని తాత్పర్యము చెప్పి ఇది సహజమగు నర్థ మనియు, ఆధునికులు చెప్పు నీ హారికా10 వాదమునకును, దీనికిని భేదా రేమి అనియు అడుగుచున్నారు. ప్రాచీనశ్రుతికిని, పురాణమునకును, జ్యోతిస్సంహితలకును ఈ యర్థ మభిప్రేత మగునో కాదో విమర్శకులగు పండితులకు వదలుదను.

వ్యోమకక్ష

కనబడు ఈ బ్రహ్మాండపు పరిధికి వ్యోమకక్ష యని పేరు. దానిలో గల ఆకాశమునందు నక్షత్రములును, వానిక్రింద క్రమముగా శనియు, బృహస్పతియు, అంగారకుడును, సూర్యుడును, శుక్రుడును, బుధుడును, చంద్రుడును పరిభ్రమించుచున్నారు. చంద్రునికింద సిద్ధగణమును, దానికింద విద్యాధరగణమును, దానికింద మేఘగణమును సంచరించెడిని. బ్రహ్మాండమున ఈ భూమి మధ్యబిందువు. ఇది ధారణాత్మకమగు బ్రహ్మశక్తిప్రభావముచే నిరాధారమయియు ఆకాశమున స్థిరముగా నున్నది అని సూర్యసిద్ధాంతము.

పురాణములును, తొల్లిటి జ్యోతిషికులును ఈ బ్రహ్మాండపరిధికి లెక్కకట్టక విడిచిపెట్టలేదు. "కొందఱు జ్యోతిశ్శాస్త్రవేత్తలు వ్యోమకక్ష ౧౮౭౧౨౦

---

8. తమ ఆసీ త్తమసా గూహ్ల మగ్రేఽప్రకేతం సలిలం సర్వ మా ఇదమ్
తుచ్ఛ్యే నాభ్వపిహితం యదాసీ త్తపస స్తన్మహినా జాయ తైకమ్. (ఋక్. ౧౦-౧౨౯-3)

'నమాత్ప్రకారేణ యది పూర్వ మిదం జగ న్నాసీ త్కథం తర్హి తస్య జన్మ? జాయమానస్య జనిక్రియాయాం కర్తృత్వేన కారకత్వాత్. కారకంచ కారణావాంతరవిశేష ఇతి కారకస్య సతో నియతపూర్వక్షణవర్తిత్వస్య అవశ్యంభావాత్. అతైతద్దోషపరిజిహీర్షయా జనిక్రియాయాః ప్రాగపి తద్విద్యత ఇ త్యుచ్యతే కథంతస్య జన్మ అత ఆహ - తమసాగూహ్ల మగ్ర ఇతి. అగ్రే సృష్టేః ప్రాక్ ప్రలయదశాయాం భూతభౌతికం సర్వం జగత్ తమసా గూఢం యథా నైశం తమః సర్వపదార్థజాత మావృణోతి తద్వత్ ఆత్మతత్త్వాచ్ఛాదకత్వా న్మాయాపరసంజ్ఞం భావరూపాజ్ఞాన మత్ర తమ ఇ త్యుచ్యతే...సలిలం-సల గతౌ : ఔణాదిక ఇలచ్, ఇదం దృశ్యమానం సర్వం జగత్, సలిలం. కారణేన సంగతం అవిభాగాపన్నం ఆః ఆసీత్...యద్వా—సలిల మితి లుప్తోపమం సలిలమివ. యథాక్షీరే ణావిభాగాపన్నం నీరం దుర్విజ్ఞానం తథా తమసా అవిభాగాపన్నం జగత్ న శక్యవిజ్ఞాన మి త్యర్థః' (సాయణభాష్యమ్.)

9. బృహత్సంహితలో ఉపనయనాధ్యాయము ఆరవశ్లోకమున ఉత్పలుడు సౌవర్ణాండమనగా తేజోమయమును, సహస్రాంశుసన్నిభము నగు అండాకార మని వ్రాసెను. మనుసంహితలో జగత్సృష్టిని వ్యాకరించు కుల్లూకుడు 'సుద్ధిగుణయోగవశమున హైమమము; వస్తుతః హైమము కాదు' అని వ్రాసెను.

10. ఈ సృష్టి వాయుపురాణమునందు మసకమసకగా కానిపించును.

౬౧౨౦౦౦౦౦౦౦౦౦౦ యోజనము లని చెప్పిరి. కొంద రిది బ్రహ్మాండసంపుటపరిమాణ మని యనిరి. పురాణము లిది లోకాలోకపరివేష్టనప్రమాణ మని చెప్పెను. కాని యిది రవికిరణము లెంతిదూరము చీకటిని ఛేదించునో అంతదూరపు లెక్క యని గోళగణితము గోళ్ల మీద నున్నవారు చెప్పగుదు. బ్రహ్మాండపరిధి యింత ఉండె; లేకుండె; నా కిందు చెప్పదగినది లేదుకాని ఒక కల్పమునం, దనగా ఒక బ్రాహ్మదినమున గ్రహము లెన్ని యోజనము లతిక్రమింపునో, ఆ యోజనముల లెక్క యిది యని నా మతము. దానకేసియే పూర్వాచార్యులు దీనిని ఖ-కక్ష అని వాడిరి" అని భాస్కరుడు.

దీనిని బట్టి భాస్కరునకు పై బ్రహ్మాండపరిధి లెక్కయందల విశ్వాసము లే దని తేలెను. అటు లని పురాణములను ఇతడు పేక్షింపక కష్టశబ్దసాహాయ్యమున గ్రహగణములు నవియూడు దారిలో బడి ఉభయకక్ష్యలను రక్షించెను.

నవీనులు కొంద రీ వ్యోమకక్ష్యాపరిమాణమును అత్యాధునికజ్యోతిష్కుల లెక్కతో ముడిపెట్టుటకెటులు ప్రయత్నించిరి. ఇది స్థూలముగా ౧౭ × ౧౦^౧౬ మైళ్లు. కాగా దీని వ్యాసార్ధము ౨౭ × ౧౦^౧౫ మైళ్లు. ఒక ఆలోకవర్షము[11] రమారమి ౫౯ × ౧౦౯ మైళ్లు. లేక స్థూలముగా ౬ × ౧౦^౧౦ మైళ్లు. కావున వ్యోమకక్ష్యావ్యాసార్ధము సుమారు ౫ × ౧౦^౪ ఆలోకవర్షములు! ఈ రీతిగా చూడ ప్రాచీనవిద్వాంసులు దృశ్యమగు నీ జగత్పరిమాణమును తక్కువగా లెక్కవేయలేదు!

సూర్యసిద్ధాంతమునందు ఖ-కక్ష లెక్కయున్నది[12]. ఈ కక్ష్యలో చుక్కలు తిరుగును. దీని పరిధి సూర్యపరిధికంటె అరువది రెట్లెక్కుడు. అనగా ౨౫౯౮౯౦౦౧౨ యోజనములు! తొమ్మిది మైళ్లొక యోజన మని అనుకొనినచో చుక్కల దవ్వు ౧౪ × ౧౦^౮ మైళ్లు. లేక ఒక ఆలోకవర్షముకంటె తక్కువ. ఈ చుక్కల దవ్వును నిరూపణ మొనరించుటలో ప్రాచీనజ్యోతిషికులు పొరపడుటలో అక్కజమేమియు లేదు.[13] కాని సూర్యుని దవ్వుకంటె ఆరురెట్లెక్కువ యని వా రెటులు లెక్కకట్టగలిగిరో? తారాబింబ మర్ధకల యని లెక్కించి సూర్యబింబవ్యాసములో అరువదవ పా లని ఊహించి యుందురా?

జగల్లయము

ఈ జగత్తు చిట్టచివర కే మగును? ఈ విషయము నందును జ్యోతిషికులకు పురాణములతోడను, దర్శనములతోడను ఏకవాక్యత కలదు. "ఒక బ్రాహ్మదినమున (సహస్రచతుర్యుగములు) భూమి గలుదిపలను ఒక యోజనము పెరుగును. అనగా దీని వ్యాస మొక యోజనము వృద్ధియగును. ఏలన దీనిమీద చెట్లు చేమలు పెరిగి విరుగుచున్నవి. బ్రాహ్మలయమున ఆ వృద్ధి మాత్రము నశించును. ప్రతిదినమునను భూతములు గిట్టుచున్నవి. అది దైనందినప్రలయము. బ్రాహ్మదినావసానమున భూతము లన్నియు బ్రహ్మశరీరమున జొచ్చును. అది బ్రాహ్మప్రలయము. బ్రహ్మక్షయమునం దిది యెల్లయు ప్రకృతిలో జొచ్చును. అది ప్రాకృతికప్రలయము. ఈ ప్రలయమున పృథివి యంతయు నశించును. అటుపిదప ప్రకృతివికారమున మరల నంతయు పుట్టుకొనుచువచ్చును. కాని జ్ఞానాగ్నిచే పుణ్యపాపములను

---

11. *Light-year.*

12. నవయోజనసాహస్రో విస్తారో భాస్కరస్య తు
విస్తారా త్త్రిగుణ శ్చాస్య పరిణాహోఽథ మండలమ్? (వాయు ౩౬-౫౦.౬౨)

13. ప్రాక్సిమా సెంటరీ అను నక్షత్రము నక్షత్రము లన్నిటిలో మనకు చేరువది. దీని దూరము ఇరువదియయిదులక్షల కోట్లమైళ్లు, లేక ౪.౨౭ ఆలోకవర్షములు. వెలుగు ఒక సెకండుకు సుమారు ౧౮౬౦౦౦ మైళ్లు పోవును. అది ఏకటాకీగా ౪.౨౭ ఏండ్లు పయనించుచేని దాని కడ కేగును. మనకు దూరముగా నున్న నీహారిక దవ్వు ౧౪ కోట్ల ఆలోకవర్షము లని సర్ జేమ్స్ జీన్స్.

దగ్ధముచేసినవారును, నివృత్తమనస్కులును, పరమేశ్వర సమాహితచిత్తులు నగువారును తిరిగి రాని స్థితిని పొందుదురు. ఇది ఆత్యంతికప్రలయము. నలుతెగలగు ప్రలయములివి యని భాస్కరుడు చెప్పెను.

"బ్రాహ్మదినమున సృష్టియును, బ్రాహ్మనిశీథమున నాశమును జరగును. బ్రాహ్మప్రలయమునందొక యోజనవృద్ధియా త్రిమునకే నాశము గాని సకల పృథ్వీనాశము కలుగదు. బ్రహ్మకు గూడ ఆయువు మూడుటో అపుడు మహాప్రలయ మగును. అపుడు బ్రహ్మ బ్రహ్మాండమునందును, బ్రహ్మాండము పంచభూతములందును, భూమి జలమునందును, జలము తేజమునందును, తేజము వాయువునందును, వాయు వాకాశమునందును, ఆకాశ మహంకారమునందును, అహంకారము మహత్తత్త్వమునందును, మహత్తత్త్వము ప్రకృతియందును, ప్రకృతి అవ్యక్తమునందును లయించును. భగవంతుడు సృష్టిచేయుటకు మరల మానసించుచో ప్రకృతిపురుషసంక్షోభ మొందని తొల్లి చేసిన పాపపుణ్యములు క్షయము చెందమి భూతములు మరల ప్రకృతినుండి నిస్సృతము లగును."

దీనినిబట్టి చూడగా ప్రాకృతికప్రలయమే విశ్వప్రలయ మని అనిపించుచున్నది. ఈ మహాప్రలయ మెంత కాలమునకో గాని సంభవింపదు. ఇది దార్శనికులు ఆలోచింపదగు విషయము. ఈ ప్రలయమున సకలభూతములును నశించును.

బ్రాహ్మదినమునందనగా ౪౩౨౦౦౦౦౦౦౦ సౌరవర్షములలో సృష్టి. మరల నన్నివర్షములలో నష్టి. సృష్టిసమయమున భూమి పెరుగుట అసంభవము కాదు. ఏలనగా, గాలి క్రమక్రమముగా మృణ్మయమగు భూమి నవగి పెనగి యుండును.

భూతస్థితిలయములనుగూర్చి పౌరాణికులు చెప్పినటులే నేటి పాశ్చాత్యపౌరాణికులును చెప్పుదురు. పృథివి అనాది కాదు; అజరయు నమరయును గాదు. దానికిని శైశవ కైశోరములు కలవు. జరామరణములును గలవు. మన దేశమునం దెవరును భూమి అనాదియనిగాని, అనంత మనిగాని అనలేదు. ఇంతియ కాక యిది పుట్టి అయిదారు వేల యేండ్లాయె నని మన దేశమున గాని, పరదేశమునగాని వైజ్ఞానికు లెవరును అనలేదు[14]. జగత్క్రమవికాసవాదమును, భూతాభివ్యక్తివాదమును మనకు క్రొత్తలు కావు. పురాణముల దశవిధమగు సృష్టిక్రమ మిందులకు పరిచాయకము.

౧౬౧౦ సంవత్సరమున గాలిలియో గాలిలాయి దుర్భిణి కనుగొనిననాటనుండి పాశ్చాత్యదేశమున కలిగిన ఖగోళశాస్త్రవికాసము పరమాశ్చర్యకరము. విశేషించి మూరుసంవత్సరములనుండి జరిగిన వికాసము చూచినచో ప్రాచీనవిజ్ఞానమంతయు దానిముందు మోకారించును. హిందూదేశమునందలి విజ్ఞానవేత్తలందరును ఆధునికవిజ్ఞానమునంతయు తమతమ మాతృభాషలలోనికి దెచ్చి ప్రజలకు విజ్ఞానభిక్ష పెట్టుదురు గాక!

---

14. 'ఈభూమివయస్సు సుమారు రెండువందలకోట్లయేండ్లు. భూమిమీద ప్రాణులు బ్రతుకగలిగిన స్థితికాలము సుమారు ముప్పదికోట్లయేండ్లు. మనుష్యులు పుట్టి మూడులక్షల యేండ్లు. జ్యోతిర్విజ్ఞాన మారంభమై మూడువేలయేండ్లు. దుర్భిణి పుట్టి సుమారు మున్నూరేండ్లు'అని సర్ జేమ్స్ జీన్స్.

మహాత్ముని జాతకము

శ్రీ రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు

మహాత్మాగాంధిజాతకములో లగ్నమునుగూర్చి దైవజ్ఞులకు భిన్నాభిప్రాయము లున్నవి. జన్మకాలము నికరముగా తెలియకపోవుటవలన వచ్చిన చిక్కిది. లగ్నము కటకమని కొందరు, తుల యని కొందరు వాదించుచున్నారు. ౧౮౬౯ వ సంవత్సరములో అక్టోబరుమాసమున ౨ వ తేదీనాడు ఆ మహనీయుడు జనతరించుట. ఆదినమున నిరయనపద్ధతిలో మేషములో గురువు, కటకములో చంద్రుడు, తులలో శుక్రబుధకుజులు ఉండిరి. స్వక్షేత్రమున ప్రబలుడగు చంద్రుడు లగ్నములో, మిత్రక్షేత్రమందున్న గురువు రాజ్యస్థానములో ఉండవిచో జగద్విఖ్యాతకీర్తిగను డగు నిట్టి మహాత్ముడు ఉదయించుచుండెనా యని వాదించువారు కటకలగ్నమని నిర్ధరించిరి. లగ్న, సప్తమ, భాగ్యాధిపతులగు శుక్రకుజబుధులు లగ్నములో నుండనిచో ఇంతటి శాంతిప్రియుడు, ఇంతటి ప్రపంచహితకాంక్షి, ఇంతటి మానవసేవానిరతుడు జనించియుండ డని వాదించువారు తులాలగ్నమును నిర్ణయించినారు. రాహువుతో చేరియున్న చంద్రుడు లగ్నమం దుండెనేని, అహింసాతత్త్వము మహాత్ముని కబ్బియుండ దని కటకలగ్నవాదులపై తులాలగ్నవాదుల ఆక్షేప మున్నది. కుజబుధశుక్రులు లగ్నములో నుండి రేని, హింసకుడు, దుష్టకార్యాసక్తుడు, వేశ్యాప్రియుడుగా మహాత్ముడు పరిణమించియుండడా యని తులాలగ్నవాదులపై కటకలగ్నాభిమానుల అధిక్షేపము కలదు. ఈ రకపు సిద్ధాంతములలో సామాన్యముగా యుక్తిబలమునకంటె అభిమానబలమునకే తూనిక హెచ్చుగా నుండును.

మహాత్ముని లగ్నము కాగోరి కటకతులలకు పరస్పరస్పర్ధ యుండగా, కొలంబో దైవజ్ఞులలో నొకరు సింహరాశిలో సింహనవాంశలో లగ్న ముండు నని తీర్మానించిరట! గ్రహరాజగు రవియొక్క రాశిలో వర్గోత్తమాంశలో కాక ఇతరలగ్నములలో నిట్టి మహారాజయోగము గల పుణ్యపురుషుడు పుట్టియుండ డని వీరి వాదము. ఈ లగ్నాధారమున మహాత్ముడు ౮౦ సంవత్సరములకు పైబడి జీవించు నని ఆ దైవజ్ఞుడు తీర్మానించెను. (అ) కాని, అంతటి పుణ్యమునకు నోచుకొనకపోవుట మన దురదృష్టమే.

పోనిండు. మొత్తముమీద పలువురు నిరయన తులాలగ్నమునే స్వీకరించిరి. ల్యూయిడిహాల్ అను పాశ్చాత్యపండితుడు సాయనతులలో ౨౫భాగ— అనగా, నిరయనతులారాశిలో ౩౧భాగలగ్నముగా అంగీకరించెను. (క) డాక్టరు బి. వి. రామన్ గారు తులలో ౧౩ భాగలు ౧౪ లిప్తలు లగ్నమనిరి. (చ) శ్రీ కె. వి. అప్పారావుగారు తులారాశిలో ౧౨ వ భాగమే లగ్నమనిరి. (ట) ఇంకెందరు ఎన్నివిధముల నిర్ధరించినారో?

మహాత్ముడు భౌతికదేహమును చాలించుకొన్న తరువాత ఇప్పు డీ అప్రస్తుతప్రశంస ఏల యనవచ్చును.

(అ) బెంగుళూరి అస్ట్రాలజికల్ మ్యాగజైన్ ౩౬ వ వాల్యుము ౧౯౪౭ వ సంవత్సరపు మే నెల సంచికలో ౩౪౪ వ పుట చూడుడు.

(క) *Vide "Secret Service of the Sky"* —*Page* 251.

(చ) బెంగుళూరి అస్ట్రాలజికల్ మ్యాగజైన్ ౩౬ వ వాల్యుము ౧౯౪౭ వ సంవత్సరపు అక్టోబరు నెల సంచికలో ౬౧౦ వ పుట చూడుడు.

(ట) ౪-౧౨-౧౯౩౭ నాటి 'హిందూ' వార పత్రిక చూడుడు.

ఆయన జాతకమందలి గ్రహయోగాదులకు ఫలాదేశము చేయవలె నని కాదు. అట్టిప్రయత్నము అధిక ప్రసంగమే యగును. అత డసామాన్య తేజస్సంపన్నుడు, మహాయోగి, అపారసంకల్పశక్తియుతుడు. సామాన్యుల వలె గ్రహములు సూచించు ఫలములకు లొంగిపోవువాడు కాడు. అగుటచే అతని జాతకమునందలి సామగ్రికి ఫలములు చెప్పుట సులభకార్యము కాదు. మరియు ఇప్పు డా పని అనవసరముకూడ.

కాని, ఇట్టి ఆదర్శపురుషుని జాతకము విద్యార్థుల కమూల్యమయినది. అయిన నేమి, లగ్నము ఫలానా రాశియనియో, ఫలానానవాంశయనియో తేల్చి వదలుటమాత్రము చాలదు. మహాపురుషయోగములో, రాజయోగములో కల వని సంతోషించుటకుగాని, ఉడు దశలు కట్టి ఇట్టి మహాదశలో ఇట్టి అంతర్దశ నడచుచున్న దని సూచించుటకుగాని పైపద్ధతి బహుశః చాలితే చాలవచ్చునేమో! కాని, శాస్త్రీయమైన సూక్ష్మవిచారము చేయుట, లగ్నచలనపద్ధతులతో దశా పరిపాకము నిర్ణయించుట, సహమములు మున్నగు సూక్ష్మబిందులను సాధించుట, దైనికగ్రహగతి జన్మకాలికగ్రహఫలముల నుద్బోధించు రీతులను గమనించుట—ఇత్యాదికార్యములకు లగ్నమును భాగకలలతో స్పష్టపరచుట అత్యవసరము.

మహాత్ముని అవతారసమాప్తికాలము మన కిపుడు లభించినది కదా! సంశయమున కొస్పదము లేని ఈ సామగ్రి నాధారముగా దీసికొని అతని జన్మలగ్నమును నికరముగా సాధించుట సాధ్యమా యని పరీక్షించి చూతముకాక.

౧౯౪౮ వ సంవత్సరమున జనవరి నెల ౩౦ వ తేదీన సాయంకాలము ౫-౫ *p. m.* (*I. S. T.*) కాలమున దేహళీనగరమునందు ప్రార్థనాసభలో తుపాకి గుండ్లపాలయి ౫-౪౦ *p. m.* (*I. S. T.*) గంటలకు మహాత్ము డస్తమించె నని వార్తాపత్రికలు ఘోషించుట చదువరులు మరచియుండరు. అప్పటి (౫-౪౦ *p. m.*) సాయనగ్రహభావకుండలి ఈక్రింద నున్నది:

గు ౧౫-౧౦		X ౦-౩౦ రా ౧౯-౧౬	వరుణ ౨౨-౩౦
బు ౨౬-౩౨ ర ౯-౩౧	సాయనకుండలి —— మహాత్ముని అవతారసమాప్తి		
			I ౬-౩౦ శ ౨౦-౧ (వ)
స ౨౧-౫ (వ)	కే ౧౯-౧౬	చం ౮-౮ ఇంద్ర ౧౨-౫౫(వ)	శు ౪-౨౪ (వ)

మారణాస్త్రప్రయోగకాలములో లగ్నము కర్కాటకరాశిలో ౨౯౪ భాగలో నుండును. హంతకు డెట్టి 'గండాంత' కాలము నుపయోగించినాడో! దీనికి తగినట్లే యున్నది ఫలము.

ప్రశంసలోనున్న విషయము ఘోరహత్య కదా? అనగా, కుండలిలో అష్టమ(మృత్యు)స్థానమునకు సంబంధించిన దనుట. వార్తాపత్రికలలో ప్రకటించబడిన పైరెండు కాలములలో దేహళీనగరమున అష్టమభావ మెట్లుండెనో చిత్తగింపుడు:—

౫-౫ *p. m.* (*IST*) గంటలకు...	కుంభములో ౨౬ ౭ భాగ
౫-౪౦ *p. m.* (*IST*) గంటలకు...	మీనములో ౪ ౭ భాగ

తుపాకిగుండ్లు తగిలినప్పుడు నాటి బుధునిపై నిలిచియుండిన అష్టమభావము ప్రాణాపసాన వేళకు ముందుకు జరిగి నికరముగా తాత్కాలికకుజుని కెదురుగా నిలిచిన దని గమనించితిమేని, దానిలో నొక వైశిష్ట్యము కానవచ్చుచున్నది. ఏమన, ఈ ఘోరసంఘటనలో బుధకుజుల కేదో తీరరాని సంబంధ ముండవలయు ననుట. అనగా, ఈ గ్రహముల ఇట్టి తాత్కాలికస్థితి వలన ఏ వ్యక్తిజీవితములో ఘోరపరిణామము సంభవించినదో, ఆ వ్యక్తిజాతకము ననుసరించి యని వేరుగా చెప్ప నవసరము లేదు. ——————

నిరయనపద్ధతిలో తులారాశిలో ౧౨-౧౩ భాగల ప్రాంతము లగ్నముగా నుండు నను పండితుల అభి

ప్రాయము మన కాధార మున్నది కదా! 'శ్రోత్రిగ్రణిత' రీత్యా ౧౯౪౮ వ సంవత్సరమునకు అయనాంశలు ౨౨ భాగల ౨ లిప్త లగుటచే, సాయనవృశ్చికరాశిలో లగ్నము వచ్చును. అగుటచే, మహాత్ముని జాతకమున లగ్నాధిపతి కుజు డగుటయు, అష్టమాధిపతి బుధు డగుటయు సిద్ధించుచున్నది. జాతకమందలి మృత్యుస్థానాధిపతి (బుధుడు) మారణాస్త్రప్రయోగవేళలో తాత్కాలికమృత్యుభావమందు యమధర్మరాజువలె సాక్షాత్కరించి "ఇదో! సిద్ధముగా నున్నాను. రమ్ము"అనుచున్నట్లు, కానవచ్చుచుండలేదా? అవసానకాలమందలి అష్టమభావబిందువు తాత్కాలిక కుజునికి (మహాత్ముని లగ్నాధిపతికి) ఎదురుగా వచ్చి నిలిచి, ఆహ్వానించి, ఆకర్షించుకొన్నట్లు చూపట్టుచున్నది కదా! ఇంతకంటె స్పష్టముగా గ్రహములు ఫలముల నెట్లు చూపగలవు!

అష్టమభావమునకు బుధకుజులతోటి సంబంధము సాయనకుండలియందువలె నిరయనకుండలియందు సయితము కానవచ్చునుకదా? అనవచ్చును. సత్యమే! అయితే, మహాత్ముని జాతకమున నిరయనముగా కుజునికి సప్తమాధిపత్యము, బుధునికి వ్యయాధిపత్యము వచ్చి దోష మున్నదనిపించినను, అష్టమస్థానాధిపత్యము బుధునికి, లగ్నాధిపత్యము కుజునికి సంపాదించి ఇచ్చు సాయనపద్ధతి సూచించునట్టి ఫలమునకే హెచ్చు విలువ కల దని సహృదయులగు పాఠకమహాశయులు సులభముగా గమనించగల్గుదు రనుకొందును. అది యట్లుండె.

ప్రకృత మనుసరింతము. జన్మకాలము నుపకరణముగా నుంచుకొని దైనికజాతకమును సాధించినచో, జీవితమున విశేషపరిణామములు జరిగిన దినములలో ఆయా ఫలములకు సరిపడునట్టి గ్రహకేంద్రసంబంధము కానరావలయు నను సూత్రమును పాఠకమహాశయులు మరచియుండరు (*). నిరయనతులారాశి ౧౩ వ భాగకు సరియగు సాయనలగ్నము వృశ్చికములో ౫ వ భాగ యగును. ఈ భాగ ఉదయించు కాలమునే ఉపకరణముగా దీసికొని ౩౦-౧-౧౯౪౮ నాటికి దైనికలగ్నమును సాధించగా కుంభములో ౨౯ వ భాగ రాగలదు. ఈ భాగకు గ్రహసంబంధ మేమియును కానరాదు. జన్మకాలికమృత్యుస్థానాధిపతి యగు బుధుడు సమీపమందే ఉన్నా డనుట చాలదు. రమారమి 3 భాగల దూరములో బుధు డుండుటచే, ఆ దినమందే ఈ ఘోరపరిణామము జరుగవలసిన ఆవశ్యకత యుండదు. కావున, ఏకాలమును ఇష్టకాలక్రమముగా ఉపయోగించినచో ఆనాటి దైనికలగ్నములో నికరముగా బుధు డుండునో, దానిని సాధించితిమేని, అదే మహాత్ముని స్పష్టజన్మకాలముగా నుండగల దనుటలో సందేహ ముండదు. విద్యార్థుల ఉపయోగార్థమై ఆ పద్ధతి ఇచట చూపబడినది:

	గం. ని. సెక.
౨౯-౧-౧౯౪౮ నాడు గ్రీనిచ్ మధ్యాహ్నమునకు నాక్షత్రకాలభుక్తి	౨౦-౩౦-౩౮
జన్మస్థానముయొక్క పూర్వ రేఖాంశా (౪-౪౩) కాలము వలన కలుగు ఋణ సంస్కారము.	౦-౦-౪౮
స్థానిక మధ్యాహ్నమునకు నాక్షత్రకాలభుక్తి... ...	౨౦-౨౯-౫౦
జన్మస్థానపు అక్షాంశలో (౨౧-౩౮ ఉత్తరము) తాత్కాలికబుధుడు (కుంభములో ౨౬ భాగ) ఉదయించు నాక్షత్రకాలము	౧౬-౧౬-౩౬
మండలము కలుపగా	౨౪--౦--౦
వచ్చిన మొత్తపుకాలములో...	౪౦-౧౬-౩౬
స్థానిక మధ్యాహ్న నాక్షత్ర కాలభుక్తిని	౨౦-౨౯-౫౦
తీసివేయగా నిలువ=ఇష్టనాక్షత్ర కాలము	౧౯-౪౬-౪౬

మరణకాలము (*5-19 p m. I. S. T.*) వరకు గడచిన కాలాంతరమునకు నాక్షత్ర

(*) తారణసంవత్సర ఫాల్గుణమాసపు 'భారతి'లో ౨౪౫-౨౫౫ పుటలను చూడుడు.

కాలభుక్తికి రావలసిన ఋణ
సంస్కారము. ౦-౧-౩౫

ఇష్టనాక్షత్రకాలధ్రువము
(స్పష్టము)... ... ... ౧౯-౪౫-౧౧
సావనకాల నిమిత్తమై ఋణ
సంస్కారము. ౦-౩-౧౭

ఇష్టసావనకాలము ... ౧౯-౪౧-౫౪
౧౨ గంటలు తీసివేయగా ... ౧౨-౦-౦

జన్మకాలము (స్పష్టము) ... ౭-౪౧-౫౪
(*A. M. L. M. T*)

ఈ స్పష్టజన్మకాలమునకు లగ్నమును సాధించినచో మహాత్ముని లగ్నము సాయనవృశ్చికరాశిలో ౩ భాగల ౨౬ కల లని తేలును. అనగా, సింహ నవాంశ యగును. మహాత్ముని సమగ్రసాయనజన్మ కుండలి ఇట చూపబడియున్నది:

భార్య(స) ౨౫-౫౪	ఇంద్ర ౧౮-౨౬ (వ)	గు ౨౦-౧౦ (వ)	
కే ౪-౧౧	మహాత్ముని సాయనజాతక కుండలి		వరుణ ౨౧-౪౬
మోక్ష (స) ౬-౩౩			X ౪-౧ రా ౪-౧౧ మృత్యు(స) ౧౬-౫౦ చ ౨౦-౧౪
శ ౧౨-౨౧	I ౩-౨౬ బు ౩-౪౬ శు ౧౬-౨౮ కు ౧౮-౨౪	ర ౮-౫౬ పాత్య(స) ౯-౪౯ శత్రు (స) ౯-౨౯	పుణ్య(స) ౧౪-౪౬ కారాగృహ (స) ౨౫-౫౪

సూచిక : ఈ కుండలిలో (స) అనగా సహమబిందువు.

మహాత్ముని జీవితమున విశేషఫలములు కానవచ్చిన కొన్ని దినములకు మనము సాధించిన జన్మకాలమాధారముగా దైనికజాతకములను గుణించినచో, దైనికకేంద్రము లీ క్రింది పట్టికలో చూపిన గ్రహ సంబంధాదులను చూపగలవు:

(౧) ౧౨-౧-౧౯౨౪	అప్పెండిసైటిస్సుకు శస్త్రచికిత్స	వృశ్చికము ౧౮ భాగలో దై. దశమము.	జన్మకాలికకుజ సంయోగము.
(౨) ౨౦-౯-౧౯౩౨	పూనాసంధికై ఉపవాసారంభము	కటకములో ౨౨-వ భాగలో దై. దశమము.	తాత్కాలిక వరుణ సంయోగము.
(౩) ౭-౮-౧౯౪౨	రాజకీయనిర్బంధ వాసము	మిథునములో ౧౨-వ భాగ దై. దశమము.	తాత్కాలిక శని సంయోగము.
(౪) ౨౨-౨-౧౯౪౪	కస్తూరీబాయిమృతి.	మీనములో ౨౫ భాగలో దై. లగ్నము.	జన్మకాలిక భార్యా సహామ సంయోగము.
(౫) ౧౦-౨-౧౯౪౩	౨౧ దినములఉపవాస వ్రతారంభము.	మీనములో ౧౧ భాగలో దై. లగ్నము.	తాత్కాలిక శుక్ర సంయోగము. జన్మశని కేంద్రవేధ.
(౬) ౩-౩-౧౯౪౩	ఉపవాసవ్రత సమాప్తి.	మేషములో ౯-వ భాగ దై. లగ్నము	తాత్కాలిక శుక్ర సంయోగము. జన్మరవితో సమసప్తకము.
(౭) ౧౩-౧-౧౯౪౮	పాకిస్థాన సౌకర్యార్థమై ఉపవాసారంభము.	వృషభములో ౨౦ భాగలో దై. చతుర్థము.	జన్మగురు సంయోగము. జన్మచంద్రునిపైనున్న తాత్కాలిక శనికేంద్రవేధ.
(౮) ౩౦-౧-౧౯౪౮	అవసానము	కుంభములో ౨౬ భాగ దై. లగ్నము.	తాత్కాలిక బుధ సంయోగము.

సాధించిన జన్మకాలపు విలువను పరీక్షించుటకై దిఙ్మాత్రముగా చూపిన పై నిదర్శనములు చాలు ననుకొందును.

పంచమహాపురుషయోగములలో నొక్కటియగు మాలవ్యయోగము నిరయనపద్ధతిలో తులాలగ్నమున కన్వయించుచుండెను. సాయనవృశ్చికము లగ్నమైనపుడు మహాత్ముని జాతకమునకు ఆ యోగము పట్టనందున లోపము కాదా? అనువా రుందురు. మాలవ్యయోగము లేకపోవుట సత్యమే. శుక్రుడు స్వక్షేత్రమందో, ఉచ్చక్షేత్రమందో, జాతకమున కేంద్రమందున్నచో మాలవ్యయోగ మందురు. తులారాశిలో శుక్రుడు లగ్నమున కెంత దూరములో నుండినను ఈ యోగము పట్టు నన్నచో, ఇట్టి యోగములుగల మహాపురుషులు మనకు బజారున సమృద్ధిగా దొరకుదురు. చూడుడు! ఒక సంవత్సరములో శుక్రుడు వృషభతులా మీనములలో సంచరించు కాలము సరాసరి మూడు నెల లగును. ఆ మూడు నెలలలో దిన మొక్కటికి ౮ గంటల కాలము శుక్రు డుండు రాశి కేంద్రములలో నుండగలదు గదా? అనుటచే, సంవత్సరమున జనించు వారిలో సరాసరి ౧౨ గురిలో నొకనికి మాలవ్య యోగము పట్టితీరు ననవలసియుండును. ఇంత సర్వసులభముగా లభించు యోగము గాంధిజాతకములో నుండుట వలననే అతడు మహాపురుషు డయినా డన్నచో, మహాత్ముని జాతకమున నది యొక లోపమే కాని గుణము కానేర దని నా మనవి.

ఇట్లనుటచే ఈయోగములు నిరుపయోగము లని నా ఆశయ మనుకొనరాదు. ఏ భాగకలలలో కేంద్ర ముండునో, అదే భాగకలలలో యోగప్రదగ్రహ మున్నప్పుడే ఈ యోగముల ఫలము పూర్ణముగా రావచ్చునే కాని, కేంద్ర మున్న రాశిలో ఏమూలలోనో ఆ గ్రహ మున్నచో ఆ ఫలము వచ్చు ననుకొనుటమాత్రము చాల ప్రమాదము.

"యోగా యథోక్తఫలదాః
కలార్ధభాగైకసంస్థితానాంచ
అప్రాప్తాతీతానాం
ఇచ్ఛామాత్రం ఫలం భవతి."

అనుట లల్లమహాశయుని మాత్రము.

పోనిండు! మహాపురుషయోగమే కావలె నన్నచో, సాయనకుండలిలో మాలవ్యయోగమునకు బదులు రుచకయోగము పట్టిన దనవచ్చును. స్వక్షేత్రములో నున్న కుజుడు లగ్నమం దున్నచో ఈ యోగ మగును. పంచమహాపురుషయోగములలో ఇది సయిత మొక్కటి. ఈ యోగమునకు 'సారావళి' చెప్పిన ఫలము లన్నియు రాకున్నమానెగాని, అతిముఖ్యమైన ఫల మొక్కటిమాత్రము స్పష్టముగా కానవచ్చుచున్నది.

"వింధ్యాచలసహ్యగిరీన్
భునక్తి సప్తతి సమా నగరదేశాన్
శస్త్రానలకృతమృత్యుః
ప్రయాతి దేవాలయం రుచకః." (సారావళి)

రుచకమహాపురుషుడు వింధ్యాచలసహ్యాద్రుల సీమను పాలించునట! అఖిలభారతపితామహు డను కీర్తి నార్జించిన మహాత్ముడు వింధ్యసహ్యాద్రుల మధ్యదేశముపై—అనగా దక్షిణాపథముపై—మాత్రమేల, ఆసేతుహిమాచలముగా అఖండభారతదేశముపై నైతికముగా నధికారమును వహించియుండెనుగదా? అది యట్లుండనిండు. శస్త్రమువలననో, అగ్నివలననో రుచకమహాపురుషుడు మృతినొంది దేవలోకమునకు బోవునట! మహాత్ముని మరణమునకు శస్త్రాగ్ని కారణ మయ్యె నని మన మెరుగుదుము. ఇక, అతని బోలిన స్వార్థత్యాగిని, లోకోపకారపరాయణుని, కర్మయోగిని దేవలోకము స్వాగత మిచ్చి గారవించదేని, అట్టి దేవలోకము పుణ్యపురుషులకు నివాసయోగ్య మగుట కల్ల!

పోనిండు. మహాత్ముని జాతకమునకు మాలవ్య యోగమును పోగొట్టుకొన్న నేమి, రుచకయోగమును సంపాదించుకొంటిమి. కాని, ఒక్క ఆక్షేప మున్నది. సాయనరవి తులారాశిలో ౯వ భాగలో నుండుటచే పరమనీచభాగ నభిలషించుచున్నాడు.

"జాతకస్య దశమే భాగే
స్థితః కమలబోధనః,

సహస్రం రాజయోగానాం
నాశమేవ కరోత్యహో."

అని సారావళి.

రవి పరమనీచస్థితిలో నుండెనేని, వేయిరాజయోగము లుండినను ఫలించవట! ఇట్టి దుష్టయోగములో మహాత్మునివంటి రాజపూజ్యుడు పుట్టగలడా? అనవా రుందురు. సత్యము విచారించితి మేని, అతనికీ రాజయోగము లేల? వృత్తిని పరిత్యజించి, సర్వత్యాగము చేసి, గోచిపాతరాయడై, పూరిగుడిసెలలోనో, భంగీకాలనీలలోనో, అరణ్యాశ్రమములలోనో నివసించుచు, ఆత్మసుద్ధికై కాని, ప్రజాహితమునకై కాని అనేకదినముల ఉపవాసవ్రతమును జీవితములో అనేకపర్యాయములు జయప్రదముగా జరిపిన మహాతపస్వికి రాజయోగములతో అవసర మున్నదా? ఆలోచింపుడు. మరి, ప్రపంచమందలి సర్వరాజ్యములు, రాజులు, పండితులు గౌరవించిన వ్యక్తి యతడు. గొప్ప రాజయోగము జాతకములో ఉండనిదే ఈ ఫలము కల్గునా యని శంకించువారు రవికి నీచభంగము కల్గుటచే రాజయోగమే లభించిన దనుకొని సమన్వయము చేసికొనవచ్చును. లేదా, రాజు కాదగినవాడే కాని రాజ్యాధికారమును తీసికొనని విరక్తు డనవచ్చును.

ఈరాజయోగముల మాట యట్లుంతము. ఈ జాతకమున గల ముఖ్యవిశేషములను గమనించుట లాభకారి. గ్రంథవిస్తరభీతిచే కొన్నింటినిమాత్రము చూపుచున్నాను:

(౧) లగ్న భాగలోనే ఉదయమగుచున్న తేజస్వి (రవికి ౨౫ భాగల దూరములో బుధు డుండుట) బుధునిపై పు చూచినచో సంతోష మగుచున్నది. అన్నింటిలో నిది మేరువుపూస.

"అనుపహతదేహబుద్ధిః
దేశకలాజ్ఞానకావ్యగణితజ్ఞః,
అతిమధురచతురవాక్యో
దీర్ఘాయు స్స్యాత్ బుధే లగ్నే."

అను 'సారావళీ'వర్ణన మెంతో రమ్యముగా మహాత్మునిపట్ల సార్థక మగుచుండలేదా? క్లేశములను సహించు నోపిక, కార్యములపట్ల గొప్ప పట్టుదల, ఆత్మగౌరవమును సడలుచేయక నీచకర్మలనైనను చేయు దాంతి, దండనార్హములగు దోషములపట్ల సారుష్యము ఇత్యాదిధర్మములు వృశ్చికరాశిలోని బుధుడు సంపాదించి ఇచ్చినవి. రాజకీయముగా, సాంఘికముగా, నైతికముగా, ధార్మికముగా, తాత్త్వికముగా కొమ్ములుతిరిగిన పండితులకు శిరఃకంపనము చేయించు సూత్రములను రచించి ఆచరణలో పెట్టు శక్తి మహాత్మునికిచ్చిన గ్రహ మీ బుధుడే.

(౨) దశమకేంద్రబిందువందే నిలిచియున్న రాహువుం జూడుడు. ప్రాపంచికముగా అనితరసాధ్యమైన మహాకార్యములు నిర్వహించు శక్తిసామర్థ్యములు ఈ రాహువుఫలము. లగ్నాధిపతియగు కుజునితో ప్రత్యక్షమిత్రదృష్టియు, బృహస్పతితో గుప్తమిత్రదృష్టియు ఆర్జించి రాజ్యభావమందే యున్న వరుణగ్రహము అసాధారణమైన ఉపజ్ఞతోటి నేతృత్వసామర్థ్యమును ప్రసాదించినాడు. భారతదేశమందలి రాజకీయవాతావరణమును కొనవ్రేలితో వాడించు ప్రభావ మీ గోచిపాతరాయని కెట్లు వచ్చెనా యని ఖండాంతరవాసులను భ్రాంతులను చేసిన శక్తి, సహాకారనిరాకరణరూపమయిన విచిత్రరాజకీయవిప్లవమును చెలరేగించి ఊపలుబారిన బ్రిటిషుప్రభుత్వమును 'ఉఫ్' అని భారతదేశమునుండి ఎగురగొట్టిన యుక్తి ఇవి దశమకేంద్రమందున్న రాహువరుణుల యనుగ్రహము.

(3) సింహరాశిలో నున్న చంద్రుడు గురువుతో పూర్ణకేంద్రమం దున్నాడు. దీనిని గజకేసరియోగ మని ప్రాచీను లనిరి. ఈ యోగము ౨-౩ దినములలో నాల్గుదినములు సిద్ధించును. ఇంత సర్వసామాన్యమైన యోగమువలన మహాత్మునికి ఘనత వచ్చిన దని నా అభిప్రాయము కాదు. సింహరాశిలో ౨౦ వ భాగ ఆస్తికధర్మము కల సాధుత్వముతోటి దైవభక్తిని తెలుపునని పాశ్చాత్యదైవజ్ఞుల మతము. అట్టి విశిష్టభాగలో మనఃకారకుడు, (నవమ) ధర్మస్థానాధిపతియు నగు చంద్రు డుండుట, అట్టి చంద్రునికి దశమకేంద్రమందు బృహస్పతి నిలుచుట. ఇది ఈ జాతకమందలి విశేషము. కీతాచార్యు లుపదేశించిన

కలసిరాని కాపురం

[౪౫]

శ్రీ పన్యాల రంగనాథరావు

తన భర్త పోయినాడని విన్న తక్షణం సుందరమ్మకు దుఃఖం ముంచుకురాలేదు. ఆ వార్త అందిన సమయంలో ఆమె పుట్టింట్లో వుంది. తన వాళ్లంతా రాగాలు పెట్టి, యింటి పెంకులు ఎగర గొడ్తూవుండడం చూసి, సుందరమ్మ బిత్తరపోయింది గాని, ఆపిల్ల కళ్లుకూడా చెమ్మగిల్లలేదు. పెట్టె సర్దుకుంటున్న వెంకటచలం, తన చెల్లెలి వైఖరి, ఓ కంటితో గమనించకపోలేదు. ఆ యింట్లో, ఆ సమయానికి ఎవరి స్థానంలో వారు కదలకుండా కూర్చున్నది—సుందరమ్మా, వెంకటచలమూనూ.

చెల్లెలు, కనీసం కంటతడి అయినా పెట్టక పోవటం చూసి, వెంకటచలం, ఏ మాత్రమూ ఆశ్చర్య పడకపోలేదు. చివరకు తనుకూడా ఉద్వేగాన్ని అణచుకోలేకపోయినాడు. అయితే తన అదుపు దాటి పొంగిస్తున్న దుఃఖం, తన బావ పోయినాడని కాదు. అది, తన చెల్లెలి భావినిగురించే అని తనకు బాగా తెలుసును.

ఒక్క అయిదునిమిషాలలో ఆయిల్లు యిల్లంతా హోరెత్తిపోసాగింది. ఇరుగుపొరుగులవాళ్లు వొక్కొక్కరే రావటంకూడా ప్రారంభమయింది. సుందరమ్మకు ఈ బహిరంగప్రదర్శనం నచ్చదు. ఆమె అటువంటి పిల్ల. తన అక్కచెల్లెళ్లందరిలోనూ వెంకటచలానికి సుందరమ్మ అంటే, చిన్నప్పట్నుంచీ పంచప్రాణాలుగా వుండేది. అతనిమూలంగా ఆమెకు చాలా వరకు సంస్కారమబ్బింది. సుందరమ్మ ఈ అసంఖ్యాకమైన జనరోదనం భరించలేక చప్పున లేచి, మేడమీదకు పోయింది. తన అన్న గదిలోనికి వెళ్లి, తలుపు చేర వేసుకుంది.

సుందరమ్మ లేచి, పైకి వెళ్లటం కనిపెట్టిన వెంకటచలం, తను సర్దుతున్న పెట్టె మూసేసి తను కూడా పైకి పోయినాడు.

సుందరమ్మభర్తకు క్షయ ఎక్కువైందని ఆ వుదయమే ఒక కార్డు అందింది. "ఇటువంటి సమయంలో ఒక టెలిగ్రా మివ్వటానిక్కూడా, ఈ పిసినారిగాళ్లకు చేతులు రాలేదేమో!" అని అగ్గిరాముడై వెంకటచలం సాయంత్రం బండిలో చెల్లెల్ని తీసుకు పోవటానికి సామాను సర్దుకుంటున్నాడు. అంతా అయిపోయినాక ఆ సమయంలోనే, ఈ శుభవార్త ఇప్పుడు టెలిగ్రాముద్వారా తెలిసింది.

చేర వేసివున్న తలుపు తీసి, తను గదిలోనికి వెళ్లటం మంచిదా కాదా అని వెంకటచలం కొంత ఆలోచించాడు. గదిలో దీపం వెలిగించినట్టు కనపడదు. సుందరమ్మ ఒక్కతే, ఏడుస్తున్న చప్పుడుకూడా లేదు. లోనికి వెళ్లటం విరమించుకుని, వెంకటచలం పక్క పిట్టడాబామీదకు పోయాడు. కొద్దిదూరంలో సముద్రపు హోరు వినిపిస్తోంది. ఆకాశం కలిసేచోట నీలిగా సముద్రపు నీరు కనిపిస్తోంది. చాలాదూరంలో, సముద్ర తీరమూ, తీరాన వున్న రాళ్లు, ఆ రాళ్లమీద చిన్న చిన్న కెరటాలూకూడా కనిపిస్తున్నవి.

వెంకటచలం ఒక సిగరెట్టు తీసి ముట్టించాడు. సరిగ్గా అదే చోటున అయిదేళ్ల క్రితం, తనూ, తన ప్రాణస్నేహితుడైన వెంకటరత్నమూ కూర్చుని, తమ భవిష్యత్తు చర్చించుకున్నారు.

తన చెల్లెలిమొగుడు బతికే వున్నప్పటికీ, ఆరోజుమాత్రం తను మరచిపోలేదు. అందులో, ఆ రోజో

పవిత్రమైన ఒక సెంటిమెంటు ఏర్పాటు చేసుకున్నాడు.

చదువైపోయాక అయిదేళ్లపాటు తను యింట్లో కూర్చున్నా వెంకటచలాన్ని అడిగేవారు లేరు. వెంకటరత్నం అట్లా వున్న పక్షంలో, ముసలి తల్లీ, తమ్ముడూ మాడిపోతారు. ఆ రోజులలో వెంకటరత్నం ట్యూషన్లు చెప్పుకునీ, రోజుకి రెండుగంటల పాటు ఏదో దిక్కుమాలిన దుకాణంలో వుత్తరాలు రాసిపెట్టీ, కథలు రాసి పత్రికలకు పంపుకునీ నెలకో వందరూపాయలు గిట్టుబాటు చేసుకుంటూ వుండేవాడు. అటువంటి అస్థిమితమైన ఆర్జన ఎన్నాళ్లు సాగుతుంది గనక? వెంకటరత్నానికి బొంబాయిలో, ఒక ఫాక్టరీలో ఫోర్‌మన్ ఉద్యోగం దొరికింది. దాన్ని అదృష్టమన్నా వెంకటరత్నానికి అభ్యంతరం లేదు. ఆనాడు, తన ఈ కొత్త ఉద్యోగంగురించి చెప్పటానికే వెంకటరత్నం వెంకటచలందగ్గరకు వచ్చాడు. అప్పటికి వెంకటచలం ఉద్యోగప్రయత్నం అంటూ ఏదీ ఇంకా చేయటం లేదు. సరిగ్గా అదే రోజున, తన చెల్లెల్ని "చూసుకోటానికి" ఒక సన్నటికుర్రాడు వచ్చాడు. ఆ కుర్రవానితో కొంత బంధుజనమున్నా వచ్చింది. కుర్రవాడంత అనాకారి కాడు. దేహంలో ఎక్కడా రక్తపుచుక్క లేనంత పాలిపోయివున్నాడు. అయితే అతనిలో దేహదౌర్బల్యం కనపడలేదు. బిళ్లకట్టుపంచ కట్టాడు. ఖద్దరులాల్చీ తొడిగాడు. ఉత్తరీయంకూడా వుంది.

"ఆ కుర్రవాణ్ణి కనిపెట్టావా?" అన్నాడు వెంకటచలం.

"లోనికి వస్తుండగా చూశాను. వీణతీగలు సరి చేస్తున్నాడు. ఎవరో సంగీతప్రవేత్త రనుకున్నాన్లే!" అన్నాడు వెంకటరత్నం నవ్వుతూ.

"ఆఁ. వీణ బాగా వాయిస్తాడులే. అంతా సంస్కృతమయం—" అన్నాడు వెంకటచలం అంత శ్రద్ధ లేకుండా.

"సుందరమ్మ వీణ నేర్చుకుంటుందా యేమిటి?" అన్నాడు వెంకటరత్నం.

"అతను వీణమేష్టారు కాదు. బహుశా సుందరమ్మను పెళ్లిచేసుకుంటా డనుకుంటాను." ఈ మాటలు వెంకటరత్నానికి చాలా అయోమయంగా వినిపించినై. దూరాన సముద్రపుహోరంతా తన్ను చుట్టుముట్టినట్టయింది. దప్పున అతనికి నోట మాటకూడా రాలేదు.

"సుందరికి వెంటనే పెళ్లిచేయాలని అమ్మ మొన్న చాలా గొడవచేసింది. వీ రెవరో మాకు అంత దగ్గర బంధువులుకూడా గాదు. ఎక్కడో వంశవృక్షం అంతా తిరగవేస్తే ఏకొసనో వున్నారు. నాకు బావ మరదివరస గోరువాసిలో సరిపడ్తుంది. అయితే బాగా పులిసిపులుసెక్కి వున్నవారు. చాలా ఛాందసం కూడాను. వాళ్లపులుపు చూసి అమ్మ పట్టు పట్టిందంటే పట్టదూ మరి? ఆడదానికి ఏం కావాలి? డబ్బు. ఆడది పుట్టకముందు డబ్బు పుట్టింది. ఆ డబ్బుతో కవలపిల్లల్లే ఆపది పుట్టింది. తరవాత జరగాల్సిందేదో జరిగిందే అనుకో. ఆ కుర్రవాడూ, తల్లీ, ఎవడో వాళ్లబంధువూ అంతా దిగబడ్డారు. వీళ్ల మొహానికి కతికితే అతకదుట. ఏదో ఏడిసిందిలే. వాళ్లవంటలు వాళ్లవి. అల్లా వుంది ప్రస్తుతం—" అని ముగించాడు వెంకటచలం. మరి కాస్తసేపు వెంకటరత్నం మౌనంగానే వుండి—

"పిల్ల నచ్చిందటనా?" అన్నాడు.

"ఆ విషయం ఇంకా కనుక్కోవాలి. నీ తెలివిగాని, అరటిపం డొలిచి నీనోటి కందిస్తే నీ కేం చేదా?" అన్నాడు వెంకటచలం.

"కట్నంకూడా వుందన్నమాటే!" అన్నాడు రత్నం సిగరెట్టు ముట్టిస్తూ.

"పోనిస్తూ, ఏదో తగలడ్తారు. అనుకున్నది అనుకున్నట్టు ఎన్నడూ జరగదు. ఎన్ని ఏమనుకుంటే లాభమేమి టుంటుందీ? దాని కేదో నేను కాస్త ప్రపంచం చూపించాను. అక్కడి కదే నా తృప్తి." అన్నాడు వెంకటచలం. అతనిమాటలో అస్పష్టంగా వున్న అసంతృప్తిని రత్నం గ్రహించకపోలేదు.

"నువ్వెప్పుడు ప్రయాణం కడ్తున్నావు?"

"వొచ్చే బుధవారంనాడు బయల్దేరితే చాలు. కాని, రేపే పోదామని ఇప్పుడే నిశ్చయం చేసుకున్నాను" అన్నాడు రత్నం దూరాన కెరటాలకేసి చూస్తూ.

"ఇవేళ ఈ యింట్లో కలుగుతున్న పరిణామాలు నీకు కొంత బాధ కలిగించి వుండవచ్చు." అన్నాడు వెంకటచలం—తనే బాధపడ్తున్నట్టు తనకు తెలిసీకూడా.

"ఒక్క విషయం గుర్తుంచుకో చలం! ఎవరి కష్టసుఖాలకు ఎవరు కర్త లంటావు? నువ్వేదో ఒక ఆదర్శాలతో నిండి వున్న ప్రపంచాన్నే వూహించుకుంటావు. నీ పద్యాలు చదివినా నాకదే కనిపిస్తుంది. కాని, యథార్థంగా చూస్తే కేవలం నీకు నువ్వే విరుద్ధంగా వుంటావు. ఈ ప్రపంచంలో ఏ ఖర్మం చాలకో పుట్టావు. చూస్తూచూస్తూ ఆత్మహత్య చేసుకోలేవుకదా! సహజంగా మృత్యువు ఎదురయ్యేవరకూ నువ్వు బతికి తీరాల్సిందే. ఆ బతుకు దుర్భరం చేసుకోటం దేనికి! మనుషులంగనక, కోరిక లుంటాయిగనక, ఏదో ఏదో వూహిస్తాము. ఆ వూహాలు ఫలించవు. విచారించటం ఎందుకూ? అక్కడి కది మరచిపోవటం ఉత్తమం. కొన్ని మరచిపోలేం—సులభంగా అసలు మరవలేం—ఆ మరవలేనివి జీవితాంతంకూడా ఒక్కొక్కప్పుడు బాధించటంకూడా కద్దు. నన్నడుగుతే బాధపడాల్సిందే అంటాను. అక్కడికంతే మరి. నా కేదో బాధ అని నువ్వు దిగులుపడకు. ఆ బాధ అనేది బాధే అయితే, సాధ్యమైనంత వరకూ అది శాశ్వతం కాకుండా చూసుకోడానికి ప్రయత్నిస్తాను.

ఈ కారణంచేతనే వెంకటచలం ఆరోజును సులభంగా మరచిపోలేదు.

రత్నం వెళ్ళిపోయి అయిదేళ్ళయింది. అతనికామధ్య పెళ్ళికూడా అయింది. కొడుకుకూడాను. బహుశా మూడేళ్ళుంటాయి. ఈమధ్య రత్నానికీ తనకూ ఉత్తరప్రత్యుత్తరాలుకూడా ఆట్టే నడవటం లేదు. రేపే రాయాలని అనుకున్నాడు వెంకటచలం.

సిగరెట్టు పూర్తిచేసి, వెంకటచలం తిరిగి తన గదిదగ్గరకు వచ్చాడు. చేరవేసిన తలుపులు చేరవేసినట్టే వున్నవి. కింద రణగణధ్వనులు కొద్దిగా తగ్గినై. సుందరమ్మను ఊరడించాలనే ఉద్దేశంతో బహుశా, అమ్మా వాళ్లూ ఎవరైనా పైకి రావచ్చునేమో అని అనుమానం కలిగింది వెంకటచలానికి. కాని, ఎవ్వరూ పైకి రాలేదు. వస్తూన్న అలికిడీ లేదు.

వెంకటచలం గదితలుపు చప్పుడుకాకుండా తీసి లోనికి అడుగుపెట్టాడు. గది అంతా చిమ్మన చీకటి. వెన్నెలరాత్రికూడా కాదు. తన కీ యేడాది లోనే పెళ్ళిచేయాలని తండ్రి కొత్తగా కట్టించిన గది. వెన్నెలరాత్రులు కిటికీలోంచి వెన్నెల మంచమంతా పడేటట్టు తనే ప్లాను వేసుకున్నాడు.

దీపం వెలిగించకుండానే, మంచందగ్గర కుర్చీలో కాస్సేపు కూర్చున్నాడు వెంకటచలం. సుందరమ్మ పడుకుని వుంది. ఆమె వొంటరిగా అంత దుఃఖించినట్టు ఎన్నడూ దుఃఖించలేదని వెంకటచలం గ్రహించాడు.

సుందరమ్మ అట్లా పడుకునే చాలా యేడ్చింది. దిండంతా తడిసిపోయిందికూడాను. కాస్సేపటికి ఒక్కసారి మతివచ్చినదానిలాగా లేచి, ఈ యేడుపంతా దేనికోసం అని ఆత్మపరీక్ష చేసుకోవటం ప్రారంభించింది.

తన ఈ అయిదేళ్ల వైవాహికజీవితంలోనూ సుందరమ్మ భర్తతో కాపరంచేసింది బహుశా కొన్ని నెలలు మాత్రమే వుంటుంది. వేళ్లమీద లెక్కపెట్ట వచ్చునుకూడా. తనకు పెళ్ళిఅయిన మూడు నెలల్లోపుగానే కార్య మవటమూ, వెంటనే అత్తవారింటికి పోవటమూ జరిగినై. అత్తవారిది పల్లెటూరు. ఆ వూరికి తమకే పెద్దిలు! ఇల్లు ఎంత పెద్దదో అంతమందీ యింట్లో లేకపోలేరు. ఇద్దరు వదినలు యింట్లోనే కాపరాలు పెట్టారు. అల్లుళ్లు యిల్లరికాలు వెలిగిస్తున్నారు. ఒక మరది, వేదపారాయణం అభ్యాసం చేస్తున్నది. మామగారు ముసలి తొక్క. తన మామగారికి ఈ అత్తగారు రెండో పెళ్లాం. తన అత్తగారికి

తన భర్తా, మరదీ మాత్రమే సంతానం. వదినలు మొదటి పెళ్లాం బాపతు. ధనధాన్యాదులు పుష్కలంగా వుండడం మూలాన్న తిండికి ఎవ్వరికీ లోటు లేదు. కాని, తనమాత్రం ఆ యింటికి వెళ్లి ఒక పనికత్తె అవడం ఆమెను చాలా బాధించింది. ఇంట్లో ఆడ వాళ్లకు లోటు లేదు. కాని చాకిరీ చెయ్యటానికి ఎవ్వరూ కూర్చున్న చోటునుంచి లేవరు. అందరి కిందా పక్కలుకూడా దులిపి వేయటానికే సుంద రమ్మ ఆ యింటికి కోడ లయింది. ఈ వ్యథలో, యింట్లో సవతిపోరు. వదినలకూ, సవత్తల్లికీ అర నిమిషం పడేది కాదు. వారిమధ్య నలిగిపోయేది సుందరమ్మ.

మొదట్లో సుందరమ్మభర్త సుందరమ్మతో చాలా ప్రేమ జెలిగించటం చూసి సుందరమ్మ ఫరవా లేదు అనుకోకపోలేదు. ఆ ప్రేమమాత్రం అంత మితి మీరి వుంటుం దనికూడా సుందరమ్మ ఎన్నడూ వూహించలేదు. మధ్యాహ్నం ఒంటిగంటవరకూ యింటిపని అంతా చేసి అలసి కాస్త నడుం వాల్చే సరికి, తన భర్త తన్ను గదిలోనికి రెక్కపట్టి లాక్కు పోవటం మొదట చూసి సుందరమ్మ వొణికిపోయింది. ముసిక్కించివున్న తన భర్తకు కామవాంఛ యింత ప్రబలంగా వుంటుం దని తెలుసుకుని ఆమెకు తన సంసారం అంటే యేమిటో కనువిప్పయింది. తను ఏవిధంగానూ, ఎవర్నీకూడా ఎదిరించటానికి శక్తి కూడా లేదు. భర్తే ఇటువంటి ప్రవర్తనలో వుంటే, కష్టసుఖాలు ఇం కెవరితో చెప్పుకోవడం?

కాపరానికి వెళ్లి రెండు నెలలు తిరక్కుండానే ఆమెకు కడుపులో నెప్పి ప్రారంభమయింది. ఆ నెప్పేమిటో తెలియటానికి ఆ గ్రామంలో వైద్యుడు కూడానా! నాటువైద్యుడు వచ్చి, ఏవో పొట్లా లిస్తే నెప్పి ఎక్కువైందే గాని, తగ్గలేదు. పెద్దవైద్యం చేయిస్తే, ఖర్చు జాస్తి అయ్యేటట్టు తోచింది యింటి వారికి. కోడల్ని పుట్టింటికి పంపేశారు.

వెంకటచలానికి ఈ విషయాలన్నీ తెలుసును. ఈ ప్రపంచంలో సుందరమ్మకు అన్న ఒక్కడే దిక్కు. ఆమె సిగ్గుపడకుండా అన్ని విషయాలూ అన్నతో చెప్పింది.

ఆ యేడాది సుందరమ్మ మళ్లీ అత్తవారింటికి పోలేదు. కొన్నాళ్లతర్వాత భర్త వచ్చి తిరిగి సుంద రమ్మను తీసుకుపోయాడు.

ఈ అయిదేళ్లూ యిట్లానే జరిగింది. చివరి రోజులలో, సుందరమ్మభర్త ఆమెను కొట్టడంకూడా అలవాటుచేశాడు. ఇంటిచాకిరీ చేయకపోతే, తేరకు పడి వుండి తింటున్న వాళ్ల అధికారం తట్టుకోటానికి లేకుండా వుంది. తీరిక వున్నప్పుడల్లా భర్తతో వుండక పోతే అతను కొట్టడం ప్రారంభించాడు.

మొదట్లో అతను దగ్గే దగ్గు ఎవరికీ పట్టలేదు. పొడిదగ్గు మాదిరిగానే వుండేది. అలవాటుగా సుంద రమ్మ కడుపునొప్పి జాస్తి అయి, పుట్టింటికి వచ్చాక, ఒకరోజున భర్తకు క్షయ వచ్చినట్టు వుత్తరం వచ్చింది. సుందరమ్మ గ్రామం వెళ్లే స్థితిలో లేదు. అల్లుణ్ణి పట్నం తీసుకురమ్మనీ, ఇక్కడే వైద్యం చేయిద్దా మనీ, కాకుంటే మదనపల్లి తీసుకువెడదామనీ వెంకట చలమే నాన్నగారితరఫున వుత్తరం వ్రాశాడు.

అత్తగారికి ఇంగ్లీషువైద్యంలోనూ, మదనపల్లి కాపరంలోనూ నమ్మకం లేదు. తెనుగువైద్యం బాగా వుందని సమాధానం వ్రాశారు. రోజూ దిష్టి తీయిస్తున్నా మన్నారు. మంత్రాలు వేస్తున్నామన్నారు. పట్నం రావటానికిమాత్రం వొప్పుకోలేదు. చివరకు మరో ముక్కకూడా వ్రాశారు. కోడలికి కాస్త నయమైన వెంటనే పంపమని వ్రాశారు.

"వెనక సంత, వెధవ సంబంధం!" అని అన్న అంటున్న మాటలు సుందరమ్మ వినకపోలేదు. ఆమె మనసులో కొద్దిగా చివుక్కుమనకపోలేదు. ఇం కేముంది? నెల్లాళ్లు తిరక్కుండానే అనుకున్నంతా అయింది. ఇప్పుడు తన కేం మిగిలింది? ఇరవైమూడే ళ్లయినా నిండకుండానే ఈ జీవితం పూర్తి అయి నట్టేనా?

తన భర్తను తను ప్రేమించిందీ, లేనిదీ ఆత్మపరీక్ష చేసుకోటానికి సుందరమ్మకు ఎన్నడూ తగిన సమయం

చిక్కలేదు. అసలా విషయమే జ్ఞాపకం రాలేదు. తనచేత తన భర్త యింటిల్లపాదికీ చాకిరీ చేయించాడు; తన్ను యిష్టం వచ్చినట్టు అనుభవించాడు. తన్ను తిట్టాడు; కొట్టాడు. అన్నింటికీ సుందరమ్మ వోర్చింది. ఈ వోర్పేనా ప్రేమ? ప్రేమ లేకుంటే వోర్చలేదా? వోర్పుకీ ప్రేమించటానికీ అసలు సంబంధం ఎక్కడా? వోర్పు వేరు. ప్రేమ వేరు. ప్రేమించుకునేవాళ్లుమాత్రం బాధలు ఓర్చుకోలేక విడిపోవటం లేదూ? కనీసం, ప్రేమలో తను తన భర్తతో ఎన్నడూ మాట్లాడినట్టుకూడా సుందరమ్మకు జ్ఞాపకం రాలేదు. అది ప్రేమ కాకపోవచ్చు. తను అసలు వాస్తవంగా తన భర్తను ప్రేమించలేదు. ప్రేమించటం అంటే సుందరమ్మకు అదొక ఆదర్శం—అది నిష్కారణంగా ఇక్కడ బూడిదలో పోసిన పన్నీరు కాలేదు—ఆ పన్నీరు తనహృదయంలోనే ఇంకా భద్రపరచుకుంది.

తనభర్త తన్ను ప్రేమించివుంటే వుండవచ్చు. కాని ఆ విషయం సుందరమ్మఅంతరాత్మ వొప్పుకోలేదు. అతను సుందరమ్మను కామించాడు. తన కామతృప్తిని అసహజంగా తీర్చుకున్నాడు సుందరమ్మమీద.

సుందరమ్మకు భగవంతు డంటూ వున్నాడు. తన కడుపున ఏ పండో పండితే ఆనందిద్దామని తల్లి వాంఛించినా సుందరమ్మపాలిట అటువంటిది లేకపోవటం, ఆ పుట్టవలసిన గుడ్డుకే ఎంతో మేలయినట్టు భావించింది. గతిలేనిపిల్ల పుట్టేకన్నా పుట్టకపోవటమే ఆ పిల్లకు తను చేసిన ఉపకారం అనుకున్నది సుందరమ్మ.

ఇక తను? తనకు ఇరవైమూడురేళ్లు నిండలేదు. ప్రపంచంఅంతా తన్ను 'ముండ' అంటారు. చిన్నతనంలోనే పాపం ముండమోసిం దని నలుగురూ నాలుగువిధాలా సానుభూతి చూపుతారు. పరామర్శిస్తారు. ఇంక మళ్లీ తల్లీ, తండ్రీచాటునే పడివుండాలి కదా! అన్నకు పెళ్లి కాకపోదు. అత్తింట్లో వెనక చాకిరీ చేసింది వదినలకింద. ఇప్పుడు పుట్టింట్లో వదినకు చాకిరీచేయటానికి తాను సిద్ధమయింద న్నమాట. ఎక్కడి కక్కడికే—అక్కడి చాకిరీకన్న యిదే నయం!

సుందరమ్మకు ఈ ఆత్మపరీక్షతో పూర్తిగా అసలు కన్నీళ్లు రావటం మానేసిసై. ఆమెకు మనసులో ఇంకా ఏ ఆలోచనలూ మిగలలేదు. ఆమె మెల్లగా పడుక్కునే తల యెత్తింది. పక్కనే పరుపుమీద చప్పుడయింది. చల్లనిచేయి వచ్చి ఆమెనొసటిమీద పడింది.

"చెల్లీ!"

ఆ పిలుపు అతిమెల్లగా ఆమెకు వినిపించింది ఆమెగొంతుకూడా పట్టుకుపోయి వుంది. ఇంతసేపూ ఆ మెగుండెలో అణగిపోయిన దుఃఖం యావత్తూ ఒక్క ఉప్పెనగా పైకి పొంగివచ్చింది.

"అన్నయ్యా!" అంటూ, వెంకటచలంవొళ్లో తల పెట్టి, తన జీవితంలో మొదటిసారిగా సుందరమ్మ ఘొరుమని యేడ్చింది. వెంకటచలానికి కళ్లు చెమ్మగిల్లిసై. అతనికి తెలియకుండానే రెండు చుక్కలు, సుందరమ్మ చెక్కిళ్ల మీద పడ్డైసై. అయిదునిమిషాలవరకూ ఎవరూ మాట్లాడుకోలేదు. ఆమెదుఃఖపు ఉప్పెన కొద్దిగా తగ్గింది.

ఎవరిఎదట తన కీ విధంగా ఆపుకోలేని దుఃఖం వచ్చింది? ఇంత దుఃఖం ఈ త్రుటికాలంలో రావటానికి కారణ మేమై వుండాలి? సుంధరమ్మప్రేమను పంచుకోటానికి వెంకటచలం తప్ప ఇం కెవరు? ఆ దుఃఖం అందుకే కదూ వచ్చింది? తనగతి చూసేది ఈ ఏకోదరుడుతప్ప ఇం కెవ రున్నారుగనక?

కావలసిన కర్మలన్నీ యథావిధిగానే జరిగిపోటానికి ఎవ్వరూ ఏ ఆటంకాలూ పెట్టలేదు. వెంకటచలం ఎటువంటి శోక్యమూ కలగజేసుకోలేదు. చేసుకునే హృదయపటుత్వమే తనకు వుంటే బహుశా ఈ పెళ్లే జరక్కుండా చేసేవా డేమో! వెంకటచలం అనుకున్నదీ అదే. దీనికి కారణం తనకు స్వేచ్ఛ లేకపోవటం. ఆర్థికస్వేచ్ఛ అనేది ఎంతైనా మనోబలాన్ని ఇస్తుంది—దాన్ని సక్రమంగా వినియోగించుకున్న

ట్లయితే. అప్పటివరకూ తను నిరుద్యోగి. తండ్రిచాటున బ్రతుకుతున్నవాడు. తనమాట చెల్లుతుం దనే విశ్వాసం అంతవరకూ కలగలేదు.

అయితే ఇప్పుడు చెల్లెలికి జరిగిన ఈ అన్యాయం వెంకటచలానికి కొంత నైతికబలాన్ని సమకూర్చింది. ఈమధ్య సుందరమ్మవిషయం ప్రస్తావనకు వచ్చినప్పుడల్లా, ఆ పిల్లకు జరిగిన అన్యాయాన్ని పురస్కరించుకుంటూ తల్లితోనూ, తండ్రితోనూ వాదించటం ప్రారంభించాడు. సుందరమ్మే అనేక సార్లు వాదించింది.

“చదు వెందుకురా?” అన్నది తల్లి.

“అది నీకు సంబంధించిన విషయం కాదు.” అని కేకలు వేశాడు వెంకటచలం. ఈ కేకలు విని తండ్రి మాట్లాడలేదు.

సుందరమ్మను హైస్కూలులో చేర్పించాడు వెంకటచలం. తనకు వ్యవధి వున్నప్పుడల్లా ఆమెకు పాఠాలు చెప్పటం ప్రారంభించాడు.

వెంకటచలం ఉన్నచోటనే ఇప్పుడు ఉద్యోగంలో ప్రవేశించాడు. కాని, అది తన ఆదర్శాలకు సరిపడేది ఎల్లా అవుతుంది? ఊరికే కూర్చోటం మంచిది కాదనే అభిప్రాయంతో ఏదో ఒకదానిలో ప్రవేశించాడు. ఏ ముహూర్తాన ప్రవేశించాడో గాని, వెంకటచలానికి ఈ ఉద్యోగంతో ఉన్న మనశ్శాంతికూడా పోయిం దనిపించింది.

సుందరమ్మ స్కూలుఫైనలు పాసయింది. అప్పటికి ఆమె భర్త పోయికూడా నాలుగైదేళ్లయింది. అంతా మరచిపోయారుకూడాను. కాని సుందరమ్మ మాత్రం, తను విధవ అనే విషయం ఎట్లా విస్మరిస్తుంది? మరపింపచేయటానికి వెంకటచలం శతవిధాలా ప్రయత్నించాడు. కాని ఆశే గెలవలేదు.

వెంకటచలానికి ఇంతవరకూ పెళ్లి కాకపోవటంలో ఆశ్చర్య మేమీ లేదు. అతని కిప్పుడు ముప్ఫయ్యేళ్లు వస్తున్నాయి. చెల్లెలివిషయం ఏదో పరిష్కరించాక, తనగురించి ఆలోచించుకోవా లని వెంకటచలం అనుకుంటున్నాడు. తన్నుగురించి యితరులు ఆలోచించటం అతని కిష్టం లేదు. “నా కిప్పట్లో పెళ్లి, పెడాకులా వద్దు. కావలసినప్పుడు నేనే చేసుకుంటాను. సద్యా నాకు ఢిల్లీలో వుద్యోగ మయింది. రేపే పోతున్నాను” అనేటప్పటికి అంతా ఆశ్చర్య పడ్డారు. పడరూ మరి?

ఢిల్లీలో వెంకటచలానికి అయిదువందల జీతం వచ్చే వుద్యోగం దొరికింది. అతను ఢిల్లీ పోతున్న ముందు, ఒక్క సుందరమ్మతోమాత్రమే గంటసేపు మాట్లాడాడు. ఏ మ్మాట్లాడేడో ఇంట్లో ఎవ్వరికీ తెలీదు.

ఢిల్లీలో వెంకటచలానికి వెంటనే యిల్లు దొరక లేదు. తను యింటికోసం ప్రయత్నంకూడా చేయ లేదు. హోటల్లోనే ఒక గది తీసుకుని ఉంటున్నాడు.

వెంకటచలం ఢిల్లీ వచ్చినతర్వాత, ఒకవారం రోజులు పోయినాక, సుందరమ్మకు వుత్తరం రాశాడు. ఆ వుత్తరం స్వయంగా పోస్టుచేయటానికి పోస్టాఫీసుకు పోయి, అక్కడ ఒక క్షణంపాటు ఒక వ్యక్తిని పరీక్షిస్తూ నిలపడ్డాడు.

“ఒరేయి! వెంకటచలం!” అన్నాడు రత్నం.

“ఎంచేతనో చూడగానే పోల్చలేకపోయానోయ్ వెంకటరత్నం!” అన్నాడు వెంకటచలం.

“నాబొజ్జగాని పెరిగిందా!”

“బొజ్జే లేనిదే ఎక్కడ పెరుగుతుందీ! పద— ఇక్క డేమిటి—హోటలుకు పోదాం.”

ఉభయులూ హోటలు చేరకోగానే పక్క గదిలో వున్నవా రొకరు వచ్చి—“మీ కొక జాబు వచ్చింది. బహుశా మీరు బోర్డులో చూడలే దని తెచ్చాను” అంటూ వుత్తరం ఇచ్చారు. ఆ వుత్తరం ఆఫీసుకు వస్తే, అక్కడివాళ్లు ఆఫీసులో ఇవ్వడం మరచి హోటలుకు పంపారు.

ఉత్తరం చదువుకుని, వెంకటచలం—“ఈ వుత్తరం నువ్వుకూడా చదవొచ్చు” అని రత్నానికి అందిచ్చాడు.

అది సుందరమ్మ రాసిన వుత్తరం. అన్నకు క్రొత్త పట్నంలో అధైర్యపడవద్దని ధైర్య మిచ్చింది. తనగురించి దిగులుపడవ ద్దని రాసింది. అంతే.

"సుందరమ్మ పుట్టింట్లో వుందా?" అన్నాడు ఉత్తరం ముగించి వెంకటరత్నం.

"ఈ అయిదేళ్లలోనూ, నువ్వు వెళ్లిపోయినాక జరిగిన అసలు కథేదో నీకు తెలియజేయకపోవటం నాదే పొరపాటు. సుందరమ్మభర్త పోయి అయిదేళ్లయింది..."

వెంకటరత్నం, ఆనాడు సుందరమ్మపెళ్లి కాబోతుం దని విని ఎంత విస్తుపోయినాడో, ఇప్పుడు మళ్లా, రెండోసారి అదేవిధంగా విస్తుపోయినాడు.

వెంకటచలం జరిగిన కథ యావత్తూ చెప్పాడు. అంతా విని నిట్టూర్చి, రత్నం—

"నన్నూ, సుందరమ్మనూ ఏదో ఒకే గ్రహం పీకుతున్నట్టుందిలే" అన్నాడు. వెంకటచలానికి అర్థం కాలేదు.

"నీ కర్థం కా దని నాకు ముందే తెలుసును. కాని, నేను నిజమే చెప్తున్నాను. నేనుకూడా అప్పట్లోనే పెళ్లి చేసుకున్నాను. చేసుకోవట మేమిటి! చేసుకోక తప్పలేదు. కాని, నాకు భార్య దక్కేరాతమాత్రం లేదు. ఆమెను ఏడాదిలోపునే పోగొట్టుకున్నాను. ఇప్పుడు నాకు ఏడేళ్ల కొడుకు."

ఇప్పుడు వెంకటచలం స్తబ్ధుడైనాడు. చిత్రవిచిత్ర జీవితాలు! మనుషులు కొందరు ఎంతలో జీవితాలు పూర్తి చేసుకుంటారు!

"నీకూడా నేను ఉత్తరం రాయక పెద్ద పొరపాటే చేశా నని ఎరుగుదును. ఇప్పుడు నే నీ వూరు వచ్చిం దెందు కనుకున్నావు?"

"చెప్పు!" అన్నాడు వెంకటచలం.

"నేను మళ్లీ వివాహం చేసుకోబోతున్నాను." అన్నాడు వెంకటరత్నం.

"ఎవర్ని?"

"ఇక్క డెవరో రేడియోఇంజనీ రున్నాట్టలే. అతనకు ఇద్దరు చెల్లెళ్లుట. ఎవర్నైనా చేసుకోవచ్చునట".

"నీ కోసమేనా, లేక నీవాళ్లకోసమా!"

"ఎవరికోసమూ కాదు. ముందు నా కొడుకోసం, తరువాత నాకోసం-" అన్నాడు వెంకటరత్నం.

వెంకటచలాని కనేకఆలోచనలు పోయినై కాని ఏం లాభం? ఒకటికూడా ఫలించకపోవచ్చు.

రత్నం ఈ యిద్దరిలోనూ ఎవర్నో వొకర్ని చేసుకోవచ్చు. అ ద్దేముంది?

కాని, రత్నానికి ఈ పిల్లలు ఎవ్వరూ నచ్చక పోయిన పక్షంలో, సుందరమ్మవిషయం ప్రస్తావనకు తెస్తే? తన కిది మంచి ఆలోచనే. రత్నానికూడా ఎటువంటి అభ్యంతరాలూ ఉండకపోవచ్చును.

మర్నాడు రత్నం వచ్చినప్పుడు వెంకటచలం ముందే అడిగాడు: "ఏం? ఎవరేనా నచ్చేరా?" అని.

"పోనిద్దూ. డబ్బుదండగవ్యవహారం. ఏదో చదువుకున్నారని విని వచ్చాను. ఏడిసినట్టుంది. చూడ్డానికి బయటకే రాకపోతే నే నేం చేసేదీ! ఎంత మాట్లాడినా ఆ లేఖ్యం ఇంజనీరూ, వాడి తల్లీ మాట్లాడతారేగాని ఓ పిల్లా బయటకు రాదు. వాళ్లతో మాట్లాడలేక అలసిపోయి వచ్చేశాను." అన్నాడు వెంకటరత్నం.

"అయితే మరి ఇక్కడికీ ప్రయత్నం సున్నా?" అన్నాడు వెంకటచలం.

"అన్నమాటే."

"నువ్వు నిన్న సుందరమ్మవుత్తరం చదివావు కదూ! ఆపిల్లగురించి నీ అభిప్రాయ మేమిటి?" అని కదిలించాడు వెంకటచలం.

"బుద్ధీ జ్ఞానమూ వున్న తల్లిదండ్రులు అటువంటి పిల్లకు తిరిగి వివాహం చేస్తారు. కనీసం నాదృష్టిలో" అన్నాడు రత్నం. రత్నం ఈ విధంగా సమాధానం ఇవ్వటంవల్ల తన కున్న సందేహంలో సగం పోయింది.

తనకు ఇప్పుడు ఉద్యోగ ముంది. తన తల్లిదండ్రుల కిష్టం లేకపోతే తనే సుందరమ్మను పెళ్లి చేయవచ్చును. ఈ నైతికబలమే అతని కెంతో ధైర్య మిచ్చింది.

"నీ కభ్యంతరం లేకపోతే, నా ప్రయత్నాలు నన్ను చేయమంటావా?" అన్నాడు వెంకటచలం.

వెంకటరత్నం చప్పున సమాధాన మివ్వలేక పోయినాడు. అతని కందనిపండు నోటిదాకా వచ్చే అవకాశాలు కనిపించినై. సుందరమ్మ తనకే మొదట కావలసింది. కాని, ఆ విషయం బయటపెట్టడానికి

అప్పట్లో ఎవరికీ ధైర్యం లేకపోయింది. అందుకు వారివారి పరిస్థితులే ముఖ్యంగా కారణాలు. ఇప్పుడు మాత్రం ఆ సుందరమ్మ కాళ్లదగ్గరకు వచ్చే అవకాశాలు కనిపించినై.

"బహుశా నా కంత అర్హత లేదేమోరా వెంకటచలం!"

"నువ్వు సరే అను. నాపాట్లు నేను పడ్తాను. మా యిద్దరికీ రాసిపెట్టి వుంది. అందుకే మాకు ఇతరత్రా వివాహాలు ఫలించలేదు." అన్నాడు వెంకటచలం.

మర్నాడు వెంకటరత్నం బొంబాయి వెళ్లిపోయినాడు. వెంకటచలం పదిహేనురోజులు శెలవు పెట్టి పట్నం వొచ్చేశాడు.

ఇంట్లో ఎంత యుద్ధం జరగాలో అంతా జరిగింది. జరగదూ మరీ! సుందరమ్మకు మళ్లీ వివాహం చేయటం తల్లికి ఏమాత్రం ఇష్టం లేదు. తండ్రి మాట్లాడనేలేదు. ఆయన పూర్తిగా ఈ విషయంలో జోక్యం కలిగించుకోవటమే మానేశాడు. పెళ్లే చేస్తే నేను నూతిలో పడ్తానని కూడా బెదిరించింది తల్లి. వెంకటచలానికి ఎక్కడా లేని ధైర్య మొచ్చి సుందరమ్మను బొంబాయి తీసుకుపోయినాడు.

రైలు బయల్దేరేముందు తండ్రి ఏ సందునో స్టేషనుకు వచ్చి, కొడుకుచేతికి వెయ్యి రూపాయలు వొప్పచెప్పాడు.

సుందరమ్మతల్లి అనుకున్నట్టు నూతిలో పడలేదు గాని, సుందరమ్మమొగుడు పోయినప్పుడు ఎంత రభస చేసిందో అంతకన్నా ఎక్కువే చేసింది. అ దెవరూ లక్ష్యపెట్టలేదు.

సుందరమ్మకూ, వెంకటరత్నానికీ బొంబాయిలో సివిల్ మేరేజి చట్టం ప్రకారం రిజిస్టరుపెళ్లి అయిపోయింది. తండ్రిపేర ఆ వెయ్యి రూపాయలకూ, వెంకటచలం సుందరమ్మకు ఒక ఆభరణం కొన్నాడు.

సుందరమ్మ తిరిగి పుట్టింటికి వెళ్లలేదు. పెళ్లితోనే బొంబాయిలో వుండిపోయింది. వెంకటచలం ఢిల్లీ వొచ్చేశాడు.

సుందరమ్మ చాలా అదృష్టవంతురాలు—అంతా అల్లానే అనుకున్నారు. తనూ ఒకసారి కాదు; లక్షసార్లు అనుకున్నది—భగవంతు డున్నాడనీ, కష్టాలు గట్టెక్కిస్తాడనీ. తాను మొదట్లో ఈ వెంకటరత్నాన్ని ప్రేమించినట్లు ఇప్పుడు హఠాత్తుగా స్ఫురించింది కూడా. ప్రేమ స్పర్శతోగాని బయటపడ దని ఇప్పుడు సుందరమ్మకు అర్థమైంది.

జీవితం సుఖంగా ఎందుకు గడవాలి? ఎవరికి గడిచింది గనక? కష్టాలన్నీ గట్టెక్కిపోయినై అని ఎందు కనుకోవాలి? అంతకన్నా తెలివితక్కువ వేరే వుండదు.

ఆయిదారు నెలలు గడిచినాక ఒకనాటి సాయంకాలం వెంకటచలానికి ఒక వుత్తరం అందింది. ఆ వుత్తరం వెంకటరత్నం రాసింది.

"—చాలా కష్టంలో ఈ వుత్తరం నీకు రాస్తున్నాను. ఉత్తరాలు రాసేటప్పుడు నే నెన్నడూ ఇంత కష్టపడలేదు; దుఃఖించలేదుకూడా. కాని, మనకీ ప్రపంచంలో ప్రతీక్షణమూ పరీక్షగానే వుంటుంది.

"సుందరమ్మ నిన్న అర్ధరాత్రి పోయింది—ఆస్పత్రిలో. ఆమెకు వేవిళ్లు ప్రారంభమైనై. దానితో కాంప్లికేష నేమొచ్చిందో తెలీదు. వెంటనే ఎబార్షనుమాత్రం అయింది. ఆస్పత్రిలో చేర్చాను. మొదట్లో ప్రమాద మేమీ లే దన్నాడు డాక్టరు. మూడోనాటే రాత్రి పోయింది. ఇదే మాయిద్దరికీ రాసిపెట్టి వుంది కాబోలు.

"నా కొక్కటే చింత— ఆ పిల్ల నన్ను పెళ్లిచేసుకోకుండా వుండివా దక్కునేమో! నాకు భార్యలు దక్కరని నే ననుకుంటూ వుండేవాణ్ణి. అదే నిజమైంది. నా సంగతి ఎల్లా వున్నా, నేను నిన్నూ, నీతల్లిదండ్రుల్నీ కూడా చాలా అన్యాయం చేశాను. సుందరమ్మని దక్కించుకోటం తెలీక నా చేతులారా పోగొట్టుకున్నా ననే నా బాధ. దానికి నేను నిన్ను ఏవిధంగా క్షమాపణ వేడుకోవాలోకూడా తెలీటం లేదు. నన్నుకూడా మరచిపోవటానికి ప్రయత్నిస్తావా? అదే మంచిదేమో! నావంటి పాపాత్ముడంటూ ఒకడు పుట్టనే లే దనుకుంటే నే నెంతో కృతజ్ఞుణ్ణి.

నీ, హతాశుడు

వెంకటరత్నం."



విమర్శనము

తానీషా: అక్కన్న, మాదన్నలు

గ్రంథకర్త: వేదము వేంకటరాయశాస్త్రి, ఎమ్. ఏ. ప్రకాశకులు: వేదము వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్, ౮, మల్లికేశ్వరస్వామిగుడి సందు, లింగిచెట్టివీథి, జి. టి. మద్రాసు. వెల రు. ౩ లు.

కాకతీయసామ్రాజ్య మంతరించినతరువాత హక్కన్నపంతులు, బుక్కన్నపంతులు విజయనగర సామ్రాజ్యానికి పునాదులు వేసినారు. మొగలాయి సామ్రాజ్య మస్తమింప నారంభమయిననాటికి గోలకొండ ప్రాంతములో అక్కన్నపంతులు, మాదన్నపంతులు బయలుదేరినారు. విజయనగరసామ్రాజ్యస్థాపకులే తిరిగి ఈ రీతిగా ఆంధ్రసామ్రాజ్యస్థాపనార్థ మవతరించినారా అనిపిస్తుంది. లేకుంటే అట్టి నామసాదృశ్యము గాని, ఉద్యమసాదృశ్యముగాని, కార్యసాదృశ్యముగాని ఎట్లా కనిపిస్తుంది? హక్కబుక్కన్నలవలె, గోవిందతిమ్మరుసులవలె అక్కన్నమాదన్న లాంధ్రులలో ఉదయించిన జంటమంత్రులు; మహామేధావులు. పేదలయినా బుద్ధి కొదువ లేదని తమ చర్యలతో ఆంధ్రయువకులకు మహోపదేశము చేసి అస్తమించిన అశ్వినులు వారు.

అట్టివారి అపూర్వచరిత్రమును చక్కగా పరిశోధించి, వారి సత్యకథను కథవలె ఆహ్లాదముతో చదువ వీలయినట్లు వేంకటరాయశాస్త్రిగారు తీర్చి ఈ గ్రంథ రూపమున ఆంధ్రుల కందించినారు. అక్కన్నమాదన్నల చరిత్రము విషాదాంతమే. కాని, లోకములో విషాదాంతము కాని దేది? కాని, మనము గమనింపవలసినది విషాదము కాదు. దానివెనుక నుండి, దానిని తాత్కాలికతుణికావస్థగా పరిణమింపజేసిన ఆ వ్యక్తుల సాహస, శౌర్య, మేధా, శ్రద్ధా, యశోభిలాషలు మనకు మననయోగ్యములు. అనుసరణయోగ్యములు.

ఆ కాలములో అక్కన్నమాదన్నలను చూచి ఓర్వలేనివా రనేకు లుండెడివారు. "అక్కన్నమాదన్న లందల మెక్కితే సాటికి సరవన్న చెరువుగట్టు ఎక్కినాడు" అని ఒక సామెత ఉన్నది. అతిదీనావస్థనుంచి స్వయంకృషితో స్వయంశక్తితో ఉచ్చస్థానములు చేరినవారి నా కాలములో చూచి ఓర్వలేనివా రుండినారనడ మొక వింత కాదు. "వాళ్లే అందల మెక్కితే నే నెందు కెక్కకూడదు?" అని ఆకాలనులో అనుకొనే సరవన్న లుండడము సహజమే. సమకాలమువారలు మెచ్చరే కదా! సమకాలమువారు గనుక సరవన్నలు మెచ్చి ఉండకపోవచ్చును. కాని, ఈనాటి యువకులకు అక్కన్నమాదన్నలు ఉజ్జ్వలతారలై నభోమార్గమునుండి "రండి, అభ్యుదయము పొందండి; ఎంత పేద అయినా కృషి చేస్తే గొప్పవా డవుతాడు. కృషి చేయండి!" అని ఉద్బోధిస్తున్నారు.

ఆ ఉద్బోధనయే శ్రీ వేంకటరాయశాస్త్రిగారి ఈ గ్రంథములో పొందుపరుపబడినది. ఆంధ్రు లందరున్నూ ఈ గ్రంథమును తప్పక చదవాలి.

చిలుకూరి నారాయణరావు.

గ్రంథ స్వీకారము

భారతీయతత్వశాస్త్రము

ప్రథమభాగము. రచయిత: శ్రీ నిర్వికల్పానందస్వామివారు. ప్రకాశకులు: సాధనగ్రంథ మండలి, తెనాలి. వెల ౨ రూ.

వేమన

రచయిత: బండ్ల సుబ్రహ్మణ్యకవిగారు. ప్రకాశకులు: విశ్వజ్ఞమండలి, తెనాలి. వెల ౧ రూ.

స్వాతంత్ర్యపథము

రచయిత: సురుజాడ రాఘవశర్మగారు. ప్రకాశకులు: బృందావన ప్రచురణములు, మచిలీపట్టణము. వెల ౧ రూ.

శ్రీ దేవీగీత

ఆంధ్రవ్యాఖ్యానసహితము. వ్యాఖ్యాత: వి. చంద్రమౌళిశాస్త్రి శతావధానులుగారు, గజల్లి.

శ్రీ లలితాలాపము

శ్రీ లీల

శ్రీ కామప్రబోధము

ఇవికూడ చంద్రమౌళిశాస్త్రిగారు రచించినవే.

మహాపురుషులు

గ్రంథకర్త: బులుసు వెంకటేశ్వర్లుగారు, బి.ఏ. ప్రకాశకులు: నేషనల్ పబ్లిషింగ్ కంపెనీ, 6, కొండి చెట్టివీధి, మద్రాసు 1. వెల ౧ రూ.

నిగ్రహం

చిన్న నాటిక. రచయిత: ముప్పన చిన అంకయ్యగారు. ప్రకాశకులు: కళాకేళీప్రచురణాలయము, పామర్లకోట. వెల ౬ అణాలు.

Forgotten Diamond Mines of Andhra Desa

ఆంగ్లము. రచయిత: పింగళి పరశురామయ్యగారు. ప్రాప్తిస్థానము: మ్యూజియం ఆఫ్ ప్రాక్టికల్ జియాలజీ, గూడూరు, నెల్లూరుజిల్లా. వెల ౮ అణాలు.

బాలసుందరము
లేక
బలియొక్క ఉపద్రవము

నాటకము. అరవమూలమునకు తెలుగు అనువాదము. అనువాదకులు: చనగానిపల్లె స్వస్తి ఆశ్రమ స్థాపకులు శ్రీ స్వామి హంసానందసరస్వతిగారు. ప్రకాశకులు: దక్షిణభారత జీవరక్షా ప్రచారసభ, మద్రాసు. వెల ౧౨ అణాలు.



Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press.
No. 7, Thambu Chetty St., G. T., Madras. Editor— S. Sambhu Prasad.